సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 175

ఆదివారం   15-9-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



టెక్కీ..
వెయిటెక్కీ

– 11లో




వంటరికి
విస్తరి

– 11లో



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 17
సంచిక: 175
SUNDAY Special
ఆదివారం 15-9-2024



హర్మన్‌ప్రీత్ అదరహో

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్ సాధించి భారత జట్టును గెలిపించాడు.

- వివరాలు 12లో




ప్రో'స్టేటస్' చూసుకోండి!

ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ నెలను ప్రొస్టేట్ కేన్సర్ అవగాహన మాసంగా పరిగణిస్తారు. ఈ సందర్భంగా ప్రొస్టేట్ కేన్సర్‌పై అవగాహన కోసం ప్రత్యేక కథనం.

- వివరాలు 11లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వారసత్వ రాజకీయాలే శాపం

జమ్మూకశ్మీర్‌ను వారసత్వ రాజకీయాలు దెబ్బతీశాయని, ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయని ప్రధాని మోదీ మండిపడ్డారు.

- వివరాలు 6లో▶



ఆధార్ అప్‌డేట్ గడువు పెంపు

ఆధార్ కార్డుల్లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకొనే గడువును యూఐడీఏఐ డిసెంబర్ 14 వరకు పొడిగించింది.

- వివరాలు 6లో▶



సాక్ష్యాలను నాశనం చేశారు

సాక్ష్యాధారాలను నాశనం చేశారంటూ అప్పట్లో ఆర్.జి.కర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రిన్సిపల్‌గా ఉన్న సందీప్ ఘోష్ సీబీఐ కేసు నమోదు చేసింది

- వివరాలు 6లో▶



అంతరిక్షం నుంచే ఓటు

ఐఎస్ఎస్‌లోనే ఉండిపోయిన అమెరికా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ అక్కడి నుంచే ఓటేయనున్నారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

ప్రధాని మోదీ ఇంట్లో కొత్త సభ్యురాలు 'దీప్‌జ్యోతి'



ఢిల్లీలోని ప్రధాని మోదీ నివాసమైన 7 లోక్‌కల్యాణ్ మార్గ్‌లో కొత్త సభ్యురాలు 'దీప్‌జ్యోతి' చేరింది. ఈ కొత్త సభ్యురాలు ఎవరో కాదు... ఒక ఆవుదూడ! ఈ విషయాన్ని ప్రధాని 'ఎక్స్'లో వెల్లడించారు.

- వివరాలు 6లో▶

నేడు పీసీసీ చీఫ్‌గా మహేశ్‌గౌడ్ బాధ్యతలు



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 2:45 గంటలకు బాధ్యతలు చేపట్టనున్నారు.

- వివరాలు 2లో▶

హైడ్రాకు చట్టబద్ధత!



రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు చట్టబద్ధత కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 20న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

- వివరాలు 2లో▶

కులగణనపై త్వరలో కార్యాచరణ ప్రణాళిక



కులగణనపై త్వరలో కార్యాచరణ ప్రణాళిక ప్రకటించేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. జిల్లాల పర్యటనల షెడ్యూల్ విడుదలకు కసరత్తు జరుగుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

- వివరాలు 5లో▶

ఇదండీ సంగతి



మళ్లీ ఎవరయ్యా... కమల హారిస్ పేరెత్తింది!!

ప్రాణం పోయినా.. పరిహాసమేనా?

పరిహారం అందక దయనీయ స్థితిలో రైతు కుటుంబాలు

- ఏళ్ల తరబడి ప్రభుత్వం నుంచి సాయం కోసం ఎదురుచూపులు
- ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం సున్నా
- ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం 2014–2022 మధ్య 5,112 మంది రైతుల ఆత్మహత్యలు
- రైతుబీమా లేని నాలుగేళ్లలో 4,125 మంది బలవన్మరణం.. కేవలం 1,600 కుటుంబాలకే ఎక్స్‌గ్రేషియా... పరిహారానికి ప్రతిబంధకంగా త్రిసభ్య కమిటీ నివేదికలు
- కూతురి పెళ్లి కోసమో, కుమారుడి చదువు కోసమో అప్పులు చేశారంటూ రిపోర్టులు!
- పరిహారం అందని కుటుంబాలకు న్యాయం చేస్తామని ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీ నెరవేర్చి న్యాయం చేయాలంటున్న రైతు సంఘాలు

సాక్షి ప్రతినిధి, వరంగల్:



అప్పులు తీసుకుని పంటలు సాగు చేసి, నష్టాల పాలై బలవన్మరణాలకు పాల్పడిన రైతుల కుటుంబాలను కనికరించే నాథుడే కన్పించడం లేదు. ఎప్పటికప్పుడు కాలం కలిసి రాకపోతుందా.. కష్టాల నుంచి బయట పడకపోతామా.. అనే ఆశతో సాగు చేస్తూ, పంటలు చేతికి రాక అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్న రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన రైతుల కుటుంబాలు సాయం కోసం ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. దీంతో రైతు బీమా అమలుకు ముందు, రైతు బీమా అమల్లోకి వచ్చిన తర్వాత తెలంగాణలో ఆత్మహత్యలకు పాల్పడిన వేలాది మంది రైతుల కుటుంబాల పరిస్థితి నేటికీ దయనీయంగానే ఉంది. నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2014 నుంచి 2022 వరకు 5,112 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో రైతు బీమా అమల్లో లేని 2014–2018 సంవత్సరాల మధ్య బలవన్మరణాలకు పాల్పడిన వారు 4,125 మంది ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రంలో 175 మంది రైతులు చనిపోయినట్లు రైతు స్వరాజ్య వేదిక (ఆర్ఎస్‌వీ) సర్వే చెబుతోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది మహబూబాబాద్ మండలంలోని గుండాలగడ్డ తండాకు చెందిన భూక్య సంత్రాలి, ఆమె కుమారుడు మహేష్. వీరి కుటుంబ పెద్ద భూక్య హసిరాం తనకున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిలో పత్తి, పెసర పంటలు సాగు చేసేవాడు. ఇందుకోసం బ్యాంకులో, ప్రైవేటుగా రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. పత్తి, పెసరకు తెగుళ్లు సోకడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు చేతికి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. అప్పులోళ్ల ఒత్తిడితో 2015 సెప్టెంబర్ 7న హసిరాం తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారించిన తర్వాత త్రిసభ్య కమిటీ అధికారులు వచ్చి హసిరాం కుటుంబానికి పరిహారం చెల్లిస్తామని చెప్పి వెళ్లారు. తొమ్మిదేళ్ల నుంచి ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటికీ పరిహారం అందలేదని సంత్రాలి, మహేష్ వాపోతున్నారు.

త్రిసభ్య కమిటీ నివేదికే ప్రామాణికం

రైతు బీమా అమల్లో లేని జూన్ 2, 2014 నుంచి ఆగస్టు 14, 2018 మధ్యకాలంలో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు 194 జీఓనే వర్తించేది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను విచారించేందుకు ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ

మిగతా 2వ పేజీలో ▶

వంటనూనెలు ప్రియం

ముడి నూనెల దిగుమతిపై సుంకం విధించిన కేంద్రం



- రిఫైన్డ్ ఆయిల్స్‌పై 20 శాతం పెంపు
- కొత్త స్టాక్ మీద ధరలు పెంచాల్సి ఉన్నా రిటైల్ మార్కెట్‌లో పెంచేసి విక్రయం
- ప్యాకెట్‌పై రూ.10 నుంచి 16 పెంపు
- కేంద్రం నిర్ణయంతో మన రైతులకు మేలు

న్యూఢిల్లీ/సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: వంట నూనెలు ప్రియం కానున్నాయి. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై 20 శాతం దిగుమతి సుంకం (బేసిక్ కస్టమ్స్ డ్యూటీ) విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వీటిపై ఎటువంటి సుంకం లేదు. అలాగే శుద్ధి చేసిన (రిఫైన్డ్) పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాన్ని ప్రస్తుతం ఉన్న 12.5 నుంచి 32.5 శాతానికి పెంచారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. దిగుమతి సుంకంతోపాటు అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ సెస్‌తోపాటు సోషల్ వెల్ఫేర్ సర్‌చార్జ్ అదనం. విదేశాల నుంచి తక్కువ ధరకు ముడి, శుద్ధి చేసిన నూనెల దిగుమతులతో భారత్‌లో నూనె గింజల ధరలు క్షీణిస్తున్న కారణంగా దేశీయ రైతులకు మేలు చేకూర్చే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ చర్యతో వంట నూనెల ధరలకు రెక్కలు రానున్నాయి. ఈ నేపథ్యంలో డిమాండ్ పడిపోయి విదేశాల నుంచి పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ ఆయిల్ కొనుగోళ్లు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. 'సోయా, నూనెగింజల రైతులకు ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఆసరాగా నిలుస్తుంది. ఈ నూనె గింజలు గణనీయంగా ఉత్పత్తి అవుతున్నందున మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రైతులు భారీగా ప్రయోజనం పొందుతారు' అని ఒక అధికారి తెలిపారు. ప్రపంచంలో వంట నూనెలను అత్యధికంగా భారత్ దిగుమతి చేసుకుంటోంది. మొత్తం వినియోగంలో దిగుమతుల వాటా ఏకంగా 70 శాతం ఉంటోంది. పామాయిల్ వాటా 50 శాతం పైనే. ఇండోనేసియా, మలేసియా, థాయ్‌లాండ్ నుంచి పామాయిల్, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ నుంచి సోయా, సన్‌ఫ్లవర్ భారత్‌కు సరఫరా అవుతున్నాయి. కాగా, బాస్మతి బియ్యం కనీస ఎగుమతి ధర పరిమితిని తొలగిస్తూ వాణిజ్య, పరిశ్రమల శాఖ శనివారం ఒక ప్రకటన వెలువరించింది. అలాగే ఉల్లి ఎగుమతులపై 40 శాతం ఉన్న సుంకాన్ని 20 శాతానికి తగ్గించింది.

రిటైల్ మార్కెట్‌లో పెంచేసి విక్రయం

విదేశాల నుంచి నూనెలు దిగుమతి అయిన తర్వాత రిఫైనరీలకు చేరుకుని అక్కడ శుద్ధి లేదా ప్యాకింగ్ పూర్తి అయి మార్కెట్లోకి రావడానికి కొన్ని రోజులు పడుతుంది. పెరిగిన పన్నుల ప్రకారం కొత్త స్టాక్ మీద మాత్రమే ధరలను సవరించాల్సి ఉన్నా.. మార్కెట్లో నిల్వ ఉన్న నూనెలపై వర్తకులు అప్పుడే ధరలను పెంచి అమ్మడం ప్రారంభించారు. కొన్ని చోట్ల నో స్టాక్ బోర్డులు కూడా

మిగతా 2వ పేజీలో ▶



శనివారం హైదరాబాద్‌లో ప్రొఫెట్ ఫర్ ద వరల్డ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు

పదేళ్లు అధికారంలో ఉంటాం

'ప్రొఫెట్ ఫర్ ద వరల్డ్' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజలు వరుసగా రెండుసార్లు అవకాశం కల్పిస్తూ వస్తున్నారని, తాము కూడా పదేళ్ల పాటు అధికారంలో ఉండి మంచి పాలనతో పేదల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రహ్మానీ రచించిన 'ప్రొఫెట్ ఫర్ ద వరల్డ్ (ప్రపంచానికి ప్రవక్త)'పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం

మిగతా 10వ పేజీలో ▶

విద్యుత్ ఉత్పత్తిలో రోల్‌మోడల్‌గా రాష్ట్రం



అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

- 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా చర్యలు
- వ్యవసాయ మోటార్లకు సోలార్ పంపుసెట్ల ఏర్పాటు
- పైలట్ ప్రాజెక్టుగా నందిమేడారం గ్రామం
- పెద్దపల్లి జిల్లా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

5లో

ఏ కాలేజీలో ఏ ర్యాంకు వరకు..

2023-24లో కాలేజీలవారీగా ఎంబీబీఎస్ సీట్ల కటాఫ్ ర్యాంకులు విడుదల

- కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన అధికారులు
- స్థానికత అంశం తేల్చిన తర్వాత కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇచ్చేందుకు సన్నద్ధం



2023-24లో కేటగిరీ వారీగా ఎంబీబీఎస్ చివరి జాతీయ ర్యాంకులు

కేటగిరీ	ర్యాంకు
ఓపెన్	1,60,979
ఈడబ్ల్యూఎస్	1,42,945
బీసీ-ఏ	2,58,239
బీసీ-బీ	1,82,579
బీసీ-సీ	2,66,945
బీసీ-డీ	1,75,555
బీసీ-ఈ	1,84,376
ఎస్సీ	2,45,043
ఎస్టీ	2,30,180
మైనార్టీ కాలేజీలో	1,84,179

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైద్య విద్య కళాశాలల్లో 2023–24 సంవత్సరంలో సీట్లు దక్కించుకున్న కటాఫ్ ర్యాంకు వివరాలను కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 54 మెడికల్ కాలేజీలుండగా... ఇందులో 8,715 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వ కాలేజీల్లోని సీట్లన్నీ ఆల్ ఇండియా కోటాలో 15 శాతం, మిగిలిన సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తుండగా... ప్రైవేటు కాలేజీల్లోని సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లలో బీ కేటగిరీ సీట్లు పోను ఎన్ఆర్ఐ, మేనేజ్‌మెంట్ కేటగిరీల్లో యాజమాన్యాలకు భర్తీ అవకాశాన్ని కల్పిస్తారు. 2023–24 విద్యా సంవత్సరంలో మాప్అప్ కౌన్సెలింగ్ ముగిసే నాటికి కాలేజీల వారీగా, కేటగిరీ వారీగా సీటు దక్కించుకున్న చివరి ర్యాంకు వివరాలతో కూడిన జాబితాను కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ శనివారం విడుదల చేసింది. ఈ జాబితాను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ విడుదల చేసిన చివరి ర్యాంకుల జాబితా కేవలం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కౌన్సెలింగ్‌లోనివి మాత్రమే. రాష్ట్రంలో కొత్తగా 8 వైద్య కళాశాలలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొత్తగా 4 వందల సీట్లు పెరిగే అవకాశం ఉంది. దీంతో గతేడాది కంటే ఎక్కువ ర్యాంకు వచ్చిన వారికి కూడా సీట్లు దక్కే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

స్థానికతపై తెగని పంచాయితీ...

యూజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ దేశవ్యాప్తంగా ప్రారంభమైనప్పటికీ రాష్ట్రంలో మాత్రం ఇప్పటికీ జాడలేదు. ఆల్ ఇండియా కోటా సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే తొలిరౌండ్ పూర్తి కాగా... రెండో రౌండ్ దరఖాస్తు, ఆప్షన్ల నమోదు ప్రక్రియ సైతం ముగిసింది. నేడో, రేపో రెండోరౌండ్ సీట్ల కేటాయింపు సైతం పూర్తి కానుంది. సాధారణంగా ఆలిండియా కోటా సీట్ల భర్తీ తొలి రౌండ్ పూర్తయిన వెంటనే రాష్ట్ర స్థాయిలో మొదటి రౌండ్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలయ్యేది. కానీ రాష్ట్రంలో విద్యార్థుల స్థానికత ఖరారుపై నెలకొన్న వివాదంతో కౌన్సెలింగ్ ప్రక్రియ చిక్కుల్లో పడింది. ఇప్పటికే హైకోర్టు తీర్పు వెల్లడించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్న విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి కాలేజీలో సీటు కోసం ఎదురు చూస్తున్నారు. కానీ రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్ ప్రారంభం కాకపోవడంతో ఎలాంటి కాలేజీలో సీటు వస్తుంది? ఎక్కడ చేరితే మేలు? అనే అంశంపై విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఈసారి 77,848 మంది నీట్ యూజీ పరీక్షకు హాజరు కాగా... 47,356 మంది అర్హత సాధించారు. పరీక్ష రాసిన వారిలో అత్యధికులు అర్హత సాధించడం ఇదే తొలిసారి. ఏపీకి 10 శాతం కోటా సీట్ల కేటాయింపును రద్దు చేయడంతో రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో నేషనల్ కోటా మినహా మిగిలిన కన్వీనర్ కోటా సీట్లన్నీ రాష్ట్ర విద్యార్థులకే దక్కనున్నాయి.

చేతకాని సీఎం వల్లే దౌర్భాగ్యం



గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే ఇంటిపై దాడులా?: కేటీఆర్

- ఇంతటి గూండాగిరీని ఎన్నడూ చూడలేదు..
- ఫిరాయింపులపై కోర్టు తీర్పు వచ్చిన రోజే అరికెపూడికి పీఏసీ పదవి ఎలా ఇచ్చారు?... రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని మండిపాటు
- అరికెపూడి ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్

3లో



ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

లాల్ సలాం.. లాల్ సలాం

సీతారాం ఏచూరికి ప్రముఖుల ఘన నివాళి

- బారులుతీరిన కామ్రేడ్లు, జనసంద్రమైన హస్తినలోని సీపీఎం కార్యాలయం... ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద నివాళులు అర్పించిన పార్టీల నేతలు
- పినరయి, సోనియా, శరద్ పవార్, ఉదయ్‌నిధి, చిదంబరం... వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి
- భౌతికకాయం ఎయిమ్స్‌కు అప్పగింత

- వివరాలు 5లో

మావోల మెరుపుదాడి

ఛత్తీస్‌గఢ్‌లో తమ అగ్రనేత హిడ్మా స్వగ్రామం పువర్తిలో సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై రాకెట్ లాంచర్లతో ఎటాక్

- క్యాంప్ వెలుపల పడటంతో జవాన్లకు తప్పిన ప్రాణనష్టం
- ఇరువైపులా గంటన్నరకుపైగా కొనసాగిన కాల్పులు
- భద్రతా దళాలను ఆత్మరక్షణలో నెట్టేందుకే దాడి?.. కొనసాగుతున్న కూంబింగ్

- వివరాలు 5లో

డీమ్డ్ మెడికల్ కాలేజీలపై సర్కారు గరం

యూజీసీ తీరును తప్పుబడుతున్న ప్రభుత్వం


- కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- అవసరమైతే కోర్టుకు వెళ్లే యోచన
- 'సాక్షి' కథనం నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ స్పందన

- వివరాలు 10లో

క్లుప్తంగా...

బలవంతపు చర్యలొద్దు

హైడ్రా ఫిర్యాదులో ఇద్దరు అధికారులకు హైకోర్టు ఊరట



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ అథారిటీ (హైడ్రా) ఫిర్యాదు మేరకు దాఖలైన కేసులో తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్ట వద్దని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగాన్ని ఆదేశిస్తూ ఇద్దరు అధికారులకు హైకోర్టు ఊరట కల్పించింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేయాలని, నిందితులైన అధికారుల వాదన వినాలని స్పష్టం చేసింది. సైబరాబాద్ కమిషనరేట్‌లోని వివిధ ప్రాంతాల్లోని చెరువుల్లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించినందుకు ఆరుగురు అధికారులపై ఆగస్టు 30న హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ఫిర్యాదు చేశారు. ఎర్రకుంట చెరువు విస్తీర్ణం 3.033 ఎకరాలు ఉండగా, తప్పుడు జియో కో-ఆర్డినేట్‌ల ఆధారంగా అనుమతులు మంజూరు చేశారన్నది ఫిర్యాదులోని సారాంశం. ఈ ఫిర్యాదు మేరకు ఆ అధికారులపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) కేసు నమోదు చేసింది. నేరపూరితకుట్ర, అధికార దుర్వినియోగం తదితర సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో మేడ్చల్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. ఈ విచారణకు పిటిషనర్ తరఫున న్యాయవాది టి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున ఏపీపీ హాజరయ్యారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. క్రిమినల్ ప్రొసీడింగ్‌లపై స్టే ఇచ్చేందుకు, అభియోగాల రద్దుకు నిరాకరించారు. అయితే, నిబంధనల మేరకు దర్యాప్తు కొనసాగించాలని, ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించారు.

ప్రభుత్వ సలహాదారుగా పోచారం బాధ్యతలు

హాజరైన మంత్రులు పొన్నం, తుమ్మల, జూపల్లి



పోచారం దంపతులను అభినందిస్తున్న మంత్రులు తుమ్మల, జూపల్లి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయం)గా మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం నాంపల్లిలోని హార్టికల్చర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన నేతలు హాజరై పోచారంను అభినందించారు. ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, దానం నాగేందర్, సుదర్శన్‌రెడ్డి, కాలె యాదయ్య, టీపీసీసీ కొత్త అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్‌అలీ, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులు పోచారంను కలిసి అభినందనలు తెలిపారు.

హైడ్రాకు చట్టబద్ధత!

- రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల్లోని పలు విశేష అధికారాలు దాని పరిధిలోకి
- 20న సీఎం అధ్యక్షతన కేబినెట్ భేటీలో తుది నిర్ణయం
- ఆ వెంటనే ఆర్డినెన్స్ జారీకి ఏర్పాట్లు.. శీతాకాల సమావేశాల్లో అసెంబ్లీలో బిల్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 'హైదరాబాద్ విపత్తు నిర్వహణ– ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ సంస్థ (హైడ్రా)'కు చట్టబద్ధత కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖలకు ఉన్న కొన్ని విశేష అధికారాలను హైడ్రాకు కల్పించబోతోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 20న సాయంత్రం సచివాలయంలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఆ వెంటనే ఆర్డినెన్స్ రూపంలో అత్యవసర ఉత్తర్వులను జారీ చేసి హైడ్రాకు చట్టబద్ధతను, విశేష అధికారాలను కల్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలో చెరువులు, నాలాల పరిరక్షణ కోసం రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖల చట్టాల్లోని కీలకమైన అధికారాలను హైడ్రాకు అప్పగించనున్నారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడం, కూల్చివేతలు నిర్వహించడం కోసం అవసరమైన అధికారాలు దానికి సమకూరనున్నాయి. శాసనసభ శీతాకాల సమావేశాల్లో హైడ్రా చట్టం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

వరద నష్టంపై కేబినెట్‌లో చర్చ..

ఇటీవలి భారీ వర్షాలు, వరదల నష్టంపై మంత్రివర్గం చర్చించనుంది. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లింపు, రోడ్లు, చెరువులు, సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది. కేంద్రం నుంచి అత్యవసరంగా విపత్తుల సహాయ నిధిని పొందడం కోసం తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించనుంది.

కొత్తగా రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీపైనా దృష్టి

అభయహస్తం కార్యక్రమం కింద రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి కొత్తకార్డుల జారీపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులను వేర్వేరుగా జారీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. రేషన్‌కార్డుల జారీకి సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదిక సమర్పించాల్సి ఉంది.

గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో హైడ్రా: రంగనాథ్



గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలోనే 'హైడ్రా'పనిచేస్తుందని.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రభుత్వం హైడ్రా బిల్లు తీసుకురానుందని 'హైడ్రా'కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో జరిగిన క్రెడాయ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా చట్టబద్ధతకు విధివిధానాల రూపకల్పనలో ప్రభుత్వం నిమగ్నమైందని తెలిపారు. జూలై 19న ఎగ్జిక్యూటివ్ రిజల్యూషన్‌తో జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్లానింగ్ కమిషన్, కేబినెట్ సెక్రటేరియెట్, లా కమిషన్, ఏసీబీ, విజిలెన్స్ వంటివెన్నో ఇలాగే ఏర్పాటయ్యాయన్నారు. త్వరలో రాబోయే ఆర్డినెన్స్‌తో వాల్టా, మున్సిపల్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల చట్టాల్లోని విశేష అధికారాలు హైడ్రాకు వస్తాయని తెలిపారు.

ప్రధాని వాకబుతో 'మనోహరాబాద్' రైల్వేలైన్ చకచకా!

రాష్ట్ర ప్రభుత్వం భూపరిహారం డబ్బులు ఇవ్వకపోవటంపై మోదీ అసంతృప్తి

- దీనిపై రైల్వే శాఖ పీఎంజీ సమావేశంలో చర్చ.. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు
- వెంటనే పరిహారం బకాయిలు రూ.137 కోట్లు విడుదల



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాకబు చేయటంతో మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టులో చకాచకా అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న పరిహారం సొమ్ము విడుదలైంది. ఈ ప్రాజెక్టులో చివరి స్టేషన్ అయిన కొత్తపల్లి వరకు భూసేకరణ అంశం కొలిక్కి వచ్చింది. ఒకేసారి రాష్ట్ర ప్రభుత్వం రూ.137 కోట్లు విడుదల చేసినట్టు సమాచారం. దీంతో ఈ మొత్తం భూమి త్వరలో రైల్వే అధీనంలోకి రానుంది. ఆమేరకు అన్ని భాగాలకు టెండర్లు పిలిచేందుకు రైల్వే ఏర్పాట్లు చేస్తోంది.

ప్రధానమంత్రి 'ప్రగతి'లో ఉండటంతోనే...

రైల్వే కీలక ప్రాజెక్టులు ప్రధానమంత్రి ఆధ్వర్యంలోని 'ప్రగతి'జాబితాలో ఉంటాయన్న విషయం తెలిసిందే. మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టుకు స్వయంగా ఆయన హాజరై భూమి పూజ చేసినందున దానిని కూడా అందులో చేర్చారు. దేశవ్యాప్తంగా ఆయన స్వయంగా హాజరై పనులు ప్రారంభించిన రైల్వే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించాలని ఇటీవల నిర్ణయించారు. ఇందులో భాగంగా మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టు వివరాలు కూడా వాకబు చేసినట్టు తెలిసింది. సిద్దిపేట వరకు రైలు సేవలు మొదలు కాగా, ఆ తర్వాత సిరిసిల్ల స్టేషన్‌కు ముందు నుంచి భూసేకరణలో సమస్య నెలకొందని ఆయన దృష్టికి వెళ్లింది. భూసేకరణకు సంబంధించి అన్నితంతులు పూర్తి అయినా.. పరిహారం డబ్బులు మాత్రం విడుదల కాలేదని స్పష్టమైంది. ఈ ప్రాజెక్టు భూసేకరణ భారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే. కీలక ప్రాజెక్టుల్లో కూడా ఇలా జాప్యం జరగటం ఏంటని ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీనిపై రైల్వే శాఖ నిర్వహించే ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ (పీఎంజీ)లో దీనిపై చర్చ జరిగింది. సమాచారం రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చేరవేయటంతో వెంటనే భూ పరిహారం నిధులు రూ.137 కోట్లు విడుదల చేసినట్టు రైల్వేవర్గాలు చెప్పాయి. వాటి పంపిణీకి చెక్కులు సిద్ధం చేస్తున్నారని, ఆ వెంటనే భూమి తమ స్వాధీనం అవుతుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

మరో 72 కిలోమీటర్ల పని

ఈ ప్రాజెక్టు పూర్తి నిడివి 151 కిలోమీటర్లు. ఇందులో సిద్దిపేట వరకు 79 కి.మీ. మేర ట్రాక్ సిద్ధమై గతేడాది నుంచి రైళ్లు తిరుగుతున్న విషయం తెలిసిందే. మిగిలిన 72 కి.మీ. పనులు ఇప్పుడు జరగాల్సి ఉంది. ఇందులో చివరి స్టేషన్ అయిన కొత్తపల్లిలో యార్డు, స్టేషన్ పనులు మరో మూడు నెలల్లో సిద్ధం కానున్నాయి. ఇందులో మానేరు నదిపై దాదాపు 2 కిలోమీటర్ల మేర వంతెన నిర్మించాల్సి ఉంది. ఈ పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉంది. దిగువ నీటి ప్రవాహం ఆధారంగా పనులు జరుగుతాయి. మిగతా పనులు వేగంగానే పూర్తి కానుండగా, ఈ వంతెన పనులు మాత్రమే నెమ్మది గా జరుగుతాయి. మరో మూడేళ్లలో ప్రాజెక్టు పను లన్నీ పూర్తవుతాయని భావిస్తున్నారు.

వ్యవసాయ విజయాలకు పురస్కారం

తెలంగాణకు అవార్డు ప్రదానం



కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ నుంచి అవార్డును అందుకుంటున్న అధికారులు

సాక్షి, న్యూఢిల్లీ: వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) పథకం అమల్లో అంకితభావం, విజయాలకు గుర్తింపుగా తెలంగాణకు అవార్డును అందజేశారు. న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్.. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌కు అవార్డును ప్రదానం చేశారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ స్కీమ్ అమల్లో అత్యుత్తమ పనితీరు కనబరచిన రాష్ట్రంగా తెలంగాణను గుర్తించారు. కాగా ఈ పథకం ద్వారా రాష్ట్రానికి మొత్తం రూ.2,836 కోట్ల మేర ప్రయోజనం లభించింది, ఈ నిధులతో 2,199 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లు నెలకొల్పామని రాష్ట్ర అగ్రికల్చర్ ప్రిన్సిపల్ కార్యదర్శి రఘునందన్ రావు తెలిపారు. రాష్ట్రంలో నెలకొల్పిన యూనిట్లలో ప్రధానంగా 1,322 వ్యవసాయ ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లు, 785 గిడ్డంగులు, 163 కస్టమ్ హైరింగ్ సెంటర్లు, 101 పోస్ట్–హార్వెస్ట్ సౌకర్యాలున్నాయి. వీటిద్వారా రాష్ట్ర రైతులు మెరుగైన వసతులతో అధిక ఆదాయం పొందుతున్నారని రఘునందన్ రావు తెలిపారు. ఈ స్కీమ్ కింద అత్యుత్తమ పనితీరున్న జిల్లాలుగా నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట గుర్తింపు పొందాయి. ఈ స్కీమ్ కింద రైతులకు 3% వడ్డీ సబ్సిడీ లభిస్తోంది. తద్వారా రైతులు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణానికి తీసుకునే రుణాలపై 6% వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. రూ.2 కోట్ల రుణం వరకు వేరే హామీ అవసరం లేదు.

హరియాణాకు పరిశీలకులుగా సీనియర్లు

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హరియాణాకు సీనియర్ నాయకులను పరిశీలకులుగా నియమిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం నిర్ణయం తీసుకున్నారు. హరియాణాకు ఏఐసీసీ పరిశీలకులుగా రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్‌తో పాటు అజయ్ మాకెన్, ప్రతాప్‌సింగ్ బజ్వాలకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇటీవల హరియాణా ఎన్నికల మీడియా కోఆర్డినేటర్‌గా తెలంగాణ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించిన విషయం తెలిసిందే.

వంటనూనెలు ప్రియం

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టడం గమనార్హం. రిటైల్‌లో రిఫైన్డ్ ఆయిల్ ప్యాకెట్ల ధరలు 10 శాతం నుంచి 15 శాతం దాకా పెరిగాయి. నిన్న మొన్నటి వరకు మార్కెట్‌లో లీటర్ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ ప్యాకెట్లను రూ.108 వరకు విక్రయించగా, శనివారం ఒక్కసారిగా రూ.124 కి చేరింది. అంటే ఒక్క ప్యాకెట్‌పై రూ.16 పెరిగింది. సూపర్‌మార్కెట్లు, దుకాణాల్లో పెరిగిన ధరలను చూసి వినియోగదారులు షాకయ్యారు. పామాయిల్ ధర మొన్నటి వరకు లీటర్‌కు రూ.95 ఉండగా, శనివారం మార్కెట్లో రూ.105కు అమ్మారు. అలాగే పల్లీ నూనె లీటర్‌కు రూ.155 ఉండగా, రూ.10 పెరిగి రూ.165కి చేరింది. స్థానికంగా తయారయ్యే సాధారణ పల్లీ నూనెలు లీటర్‌కు రూ.106 ఉండగా, శనివారం రూ.116కు అమ్మారు.

కేంద్రం నిర్ణయంపై మంత్రి తుమ్మల హర్షం

సాక్షి, హైదరాబాద్: ముడి పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆయిల్‌పామ్ రైతుల తరపున గతంలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్‌ను కలిసి ఆయన వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ వినతిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని.. తాజా నిర్ణయం వల్ల ప్రస్తుతం టన్నుకు రూ.14,392గా ఉన్న ఆయిల్‌పామ్ గెలల ధర రూ.16,500 దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిగా నేడు మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు

- మధ్యాహ్నం 2:45 గంటలకు ముహూర్తం.. గన్‌పార్కు నుంచి ర్యాలీగా రానున్న మహేశ్‌గౌడ్
- అనంతరం గాంధీభవన్‌లో సభ... హాజరుకానున్న మున్షీ, రాష్ట్ర మంత్రులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మా మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మధ్యాహ్నం 2:45 నిమిషాలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి నుంచి మహేశ్‌గౌడ్ బాధ్యతలు తీసుకుంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీ సమీపంలో గన్‌పార్కు వద్దకు రానున్న మహేశ్‌గౌడ్ అమరవీరులకు నివాళులర్పిస్తారని, అక్కడి నుంచి వేలాది మంది కార్యకర్తలతో ర్యాలీగా గాంధీభవన్‌కు చేరుకుంటారని తెలిపాయి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం గాంధీభవన్‌లో సభ జరగనుంది. ఈ సభలో టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, పెరుమాళ్‌లతో పాటు రాష్ట్ర కేబినెట్‌లోని మంత్రులు హాజరుకానున్నారు.

ముస్తాబైన గాంధీభవన్..

కాగా, పీసీసీ నూతన అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ కోసం గాంధీభవన్ ముస్తాబైంది. గత నాలుగు రోజులుగా గాంధీభవన్‌కు రంగులు వేసే కార్యక్రమం పూర్తయింది. సభ నిర్వహణ కోసం కూడా ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీసీసీ కొత్త అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పాల్గొంటుండటంతో పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంథనిలో స్కిల్స్ సెంటర్ ఏర్పాటు చేస్తాం

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

- మంథనిలో సెంటిలియన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్రాంచ్‌ను ప్రారంభించిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలో త్వరలో స్కిల్స్ సెంటర్‌ను స్థాపించి విద్యార్థులకు వివిధ రంగాల్లో అవసరమైన శిక్షణ అందిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం ఆయన పట్టణంలో సెంటిలియన్ నెట్‌వర్క్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారత్, అమెరికా, ఆస్ట్రేలియాతోపాటు మరో ఆరు దేశాల్లో వెయ్యి మంది ఉద్యోగులతో నడిచే ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్లు రాధాకిశోర్, వెంకట్ తనకు మంచి మిత్రులన్నారు. మంత్రిగా తాను ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారు అభినందించడానికి వచ్చారని, ఆ సమయంలో ఈ ప్రాంతానికి ఉపయోగపడేలా కంపెనీ బ్రాంచ్‌ను మంథనిలో ఏర్పాటు చేయాలని, అప్పుడే తనకు నిజమైన గౌరవం దక్కుతుందని సూచించానన్నారు. ఇక్కడ బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యాలయం ఇతర కంపెనీలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యాలయానికి అవసరమైన సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ రాధాకిశోర్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

ఇళ్లు కోల్పోయిన వారికి నెలాఖరులోగా మంజూరు: మంత్రి పొంగులేటి



పాలేరు కాల్వకు గండి పడిన చోట మరమ్మతులపై సూచనలిస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: గతనెల 31 నుంచి ఈనెల 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో రూ.10,300 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో శనివారం మంత్రి పర్యటించారు. పాలేరు ఎడమ కాల్వ గండి మరమ్మతులను త్వరగా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, గంటల వ్యవధిలో 37 నుంచి 38 సెం.మీ. మేర వర్షం కురవడంతో అన్ని విభాగాల్లో నష్టం ఎదురైందని చెప్పారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా, సీఎం వినతితో కేంద్ర బృందాలు పర్యటించాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వరద సాయం కోసం విన్నవించడమే కాక ప్రజలను ఆదుకునే దిశగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కేంద్రం నుంచి సాయం అందినా, అందకున్నా వరద బాధితులను ఆదుకుంటామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల పరిహారం త్వరలో అందిస్తామని, పూర్తిగా ఇళ్లు నష్టపోయిన ప్రజలకు నెలాఖరులోగా ఇందిరమ్మ పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రంలోని ఎనిమిది పోలీసు బెటాలియన్ల నుంచి 100 మంది సిబ్బందిని ఎంపిక చేసి వరద సహాయక చర్యలపై శిక్షణ ఇప్పించి కావాల్సిన పరికరాలు సమకూరుస్తామని తెలిపారు. వచ్చేవారం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన కలిసి విపత్తు సాయం కోసం ప్రతిపాదనలు అందిస్తామని వెల్లడించారు.

ప్రాణం పోయినా.. పరిహాసమేనా?



గజ్వేల్ మండలం రంగంపేటలో ఆత్మహత్య చేసుకున్న రైతు కరుణాకర్‌రెడ్డి ఫొటోతో భార్య మమత

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రంగంపేటకు చెందిన కరుణాకర్‌రెడ్డి అనే రైతు తనకున్న 30 గుంటల భూమితో పాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని వివిధ రకాల వంటలను సాగు చేసేవాడు. పంటల సాగుతో పాటు కుటుంబ పోషణకు సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటలు నష్టపోవడంతో అప్పులు తీర్చే మార్గంలేక 2017 జూలై 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరేళ్ల కూతురు సహస్ర, నాలుగేళ్ల కొడుకు రిషివర్ధన్‌రెడ్డితో కాలం వెల్లదీస్తున్న ఆయన భార్య మమత.. ప్రజాప్రతినిధులతో పాటు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చుట్టూ రెండేళ్ల పాటు తిరిగినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండాపోయింది. కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న మమత తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.



కూలీ చేసుకుంటూ పిల్లలను పోషిస్తున్న భూక్య మంగ్య భార్య భూక్య సావిత్రి

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ముఠాపురం గ్రామానికి చెందిన భూక్య మంగ్య (30) అనే రైతు తనకున్న రెండెకరాలతో పాటు గ్రామంలో మరో 13 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి, వరి, చెరుకు సాగు చేశాడు. ఇందు కోసం తెలిసిన వారివద్ద రూ.20 లక్షలకు పైగా అప్పులు చేశాడు. వ్యవసాయం కలిసి రాకపోవడం, అప్పులు ఇచ్చిన వారు వసూళ్ల కోసం ఇంటికి రావడంతో మనోవేదనతో ఈ ఏడాది జనవరి 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో 10 రోజులు మృత్యువుతో పోరాడి చివరకు చనిపోయాడు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు. పోలీసులు పోస్టుమార్టం చేసి నివేదికను అందించారు. కానీ నేటి వరకు ప్రభుత్వం ఇస్తానన్న పరిహారం అందకపోవడంతో భార్య భూక్య సావిత్రి, కుమారుడు ఏడేళ్ల రుత్విక్, ఆరేళ్ల మోక్షిత్ పరిస్థితి అధ్వానంగా మారింది.

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు ఇచ్చే నివేదికే పరిహారం ఇచ్చేందుకు ప్రామాణికం. అయితే ఆ కమిటీ పంపిన నివేదికలు పరిహారం అందించడానికి ప్రతిబంధకంగా మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. అనేక కేసుల్లో సరైన విధంగా విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారించకుండా, కూతురు పెళ్లి లేదా కొడుకు చదువు లేదా ఇంటి నిర్మాణం కోసం అప్పులు అయ్యాయంటూ నివేదికలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కౌలు రైతు అయితే కౌలు కాగితాలు లేవనో, మరో కారణమో పేర్కొంటూ నివేదికలు పంపినట్లు చెబుతున్నారు. ఈ కారణాలతోనే 4,125 మందిలో కేవలం 1,600 కుటుంబాలకు మాత్రమే ఎక్స్‌గ్రేషియా అందిందని, మిగతా వాటిని తిరస్కరించారని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఎక్స్‌గ్రేషియా రాని కుటుంబాలు ఏళ్ల తరబడి కార్యాలయాలు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండాపోతోంది. అయితే రైతు కుటుంబాలు ఇప్పటికీ ప్రభుత్వం ఆదుకోక పోతుందా, పరిహారం అందకపోతుందా అన్న ఆశతోనే ఎదురు చూస్తున్నాయి. ఇక 2018 ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో రైతు బీమా అమల్లోకి వచ్చాక అధికారులు ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబం దగ్గరికి వెళ్లడమే మానేశారు. దీంతో సొంత భూమి ఉన్న రైతుకు రైతు బీమా వస్తే వచ్చినట్టు లేదంటే లేదన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.

కౌలు రైతుల సంగతేంటి..?

సొంత భూమి లేని కౌలు రైతు ఆత్మహత్య చేసుకుంటే 194 జీఓ వర్తించక, రైతు బీమా రాక.. ఆ కుటుంబానికి ఎలాంటి సహాయం అందడం లేదు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కౌలు రైతులు, రైతు కూలీలకు బీమా అమలైతే వారికి కూడా 194 జీఓ వర్తిస్తుంది.

194 జీఓ ఏం చెబుతోంది?

జీవో 194 వర్తిస్తే ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.5 లక్షలు, అప్పుల వారందరికీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.లక్ష ఇచ్చే అవకాశం ఉంది. ఆ కుటుంబం అప్పుల నుంచి కొంత మేరకు బయట పడుతుంది. ప్రభుత్వం ఇల్లు, పెన్షన్ మొదలైన సౌకర్యాలు కల్పించనుండడంతో జీవితానికి భరోసా లభిస్తుంది. పిల్లల చదువులు కొనసాగించేందుకు వీలవుతుంది. అయితే 194 జీవో ప్రకారం రైతు కేవలం వ్యవసాయం కోసమే అప్పు చేసినట్లుగా త్రిసభ్య కమిటీ నిర్ధారించాల్సి ఉంటుంది. పరిహారానికి సిఫారసు చేయాల్సి ఉంటుంది. అయితే మెజారిటీ కేసుల్లో త్రిసభ్య కమిటీ నివేదికలు రైతుల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చేలా లేవని సమాచారం. కాగా పరిహారం అందని కుటుంబాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీయే ఇప్పుడు అధికారంలో ఉన్నందున తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.


హామీ ఇచ్చిన విధంగా ఆదుకోవాలి



బలవన్మరణాలకు పాల్పడిన రైతుల కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురు చూస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో పిల్లల చదువులు ఆగిపోతున్నాయి. కొందరికి కుటుంబం గడవటం కూడా కష్టంగా ఉంటోంది. కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఈ కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ కుటుంబాల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవటం చాలా అన్యాయం. సరైన విధంగా విచారణ జరిపించి ఆయా కుటుంబాలను వెంటనే ఆదుకోవాలి. కౌలు రైతులను, రైతు కూలీలను వెంటనే గుర్తించి బీమా పరిధిలోకి తీసుకురావాలి.

– బి.కొండల్‌రెడ్డి, రైతు స్వరాజ్య వేదిక

సాయం కోసం ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నా..



నా భర్త ఎలవేణి వెంకటయ్య మాకున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివించేవాడు. అయితే పత్తి పంటకు నీళ్లు లేవని అప్పు చేసి రెండు బోర్లు వేశాడు. కానీ చుక్క నీళ్లు రాలేదు. దీంతో పాటు వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి కోసం అప్పు చేశాడు. అసలు, వడ్డీ కలిపి రూ.6 లక్షలవడంతో వాటిని తీర్చలేననే బాధతో 2017 అక్టోబర్ 10న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడేళ్ల నుంచి పరిహారం కోసం ఎదురుచూస్తూనే ఉన్నా.

– ఎలవేణి స్వరూప, చౌటపల్లి, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

గత ప్రభుత్వంలో స్కాములు తప్ప అభివృద్ధి లేదు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



డైరెక్టర్లకు ధ్రువపత్రాలను అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

లింగోజిగూడ: గత ప్రభుత్వ పాలనలో స్కాములు తప్ప అభివృద్ధి జరగలేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం మదర్ డెయిరీ ఎన్నికల్లో ఆరు డైరెక్టర్ పోస్టులను కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న నేపథ్యంలో శనివారం నూతన చైర్మన్ ఎన్నిక కార్యక్రమాన్ని హయత్‌నగర్ మదర్ డెయిరీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నూతన చైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి మధుసూదన్‌రెడ్డితో పాటు గెలుపొందిన డైరెక్టర్లకు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు బినామీల పేరుతో మోసాలకు పాల్పడ్డారని, యాదగిరిగుట్ట, వేములవాడ దేవస్థానాలలో లడ్డూల తయారీకి హరీశ్‌రావు తన బినామీ కంపెనీల ద్వారా నెయ్యి సరఫరా చేశారని ఆరోపించారు. ఇక నుంచి దేవాలయాలకు అవసరమైన నెయ్యి, పాలను మదర్ డెయిరీ నుంచే కొనుగోలు చేయాలని మంత్రి కొండా సురేఖను కోరతానని ఆయన తెలిపారు.

గురుకుల ఉద్యోగుల వేతన వెతలు

"రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నాం"

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు కూడా పలు సందర్భాల్లో చెబుతున్న మాటలివి.

కానీ గురుకుల విద్యా సంస్థల్లో మాత్రం ఒకటో తేదీన వేతన చెల్లింపులు ఇప్పటివరకు జరగలేదు. ప్రధానంగా ఎస్సీ, మైనార్టీ గురుకులాల్లో ఒకటో తారీఖు దాటి రెండు వారాలైనా ఉద్యోగులు జీతం డబ్బుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది.



- ప్రతినెలా ఎస్సీ, మైనార్టీ సొసైటీల్లో వేతన చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- ఫస్ట్ తర్వాత రెండు వారాలు దాటినా ఉద్యోగులకు సరిగా అందని జీతాలు
- సకాలంలో వేతనాలు అందక గాడితప్పుతున్న రుణ చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల పరిధిలో దాదాపు నలభై వేల మంది ఉద్యోగులున్నారు. ఇందులో రెగ్యులర్ ఉద్యోగులు మూడింట రెండొంతులు ఉండగా.. మిగిలిన ఉద్యోగులు పార్ట్‌టైమ్, గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతమున్న ఉద్యోగుల్లో అత్యధికులు ఎస్సీ, మైనార్టీ గురుకుల సొసైటీల పరిధిలోని వారే. పెద్ద సంఖ్యలో ఉన్న ఈ రెండు సొసైటీల్లోని ఉద్యోగులకు నెలవారీ వేతన చెల్లింపులు గాడి తప్పాయి. ఇతర శాఖల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనో, ఆ మరుసటి రోజో వేతనాలు అందుతున్నప్పటికీ.. ఎస్సీ, మైనార్టీ గురుకులాల్లోని ఉద్యోగులకు మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రతి నెలా పది, పదిహేను రోజులు దాటే వరకు జీతాలు అందకపోవడంతో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

క్రమం తప్పుతున్న నెలవారీ చెల్లింపులు

సాధారణంగా నెలవారీ వేతనాలు పొందే ఉద్యోగులు కుటుంబ ఖర్చులు, పొదుపు అంశాల్లో అత్యంత ప్రణాళికతో ఉంటారు. వేతన డబ్బులు అందిన వెంటనే నెలవారీగా ఉండే చెల్లింపులు చేస్తూ మిగిలిన మొత్తాన్ని భవిష్యత్ అవసరాల కోసం దాచిపెట్టుకుంటారు. కానీ ఎస్సీ, మైనార్టీ గురుకులాల్లోని ఉద్యోగులకు వేతన చెల్లింపులపై స్పష్టత లేకపోవడం, ప్రతి నెలా నిర్దిష్ట సమయంలో కాకుండా ఇష్టానుసారంగా జీతాలు విడుదల చేస్తుండడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో వేతనాలు అందకపోవడంతో గృహ రుణాలు, వాహన రుణాలు, ఇతర వ్యక్తిగత రుణాలకు సంబంధించి నెలవారీ చెల్లింపులు గాడి తప్పుతున్నాయి. రుణ చెల్లింపుల్లో క్రమం తప్పడంతో తమ సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం పడుతోందంటూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేతనాల కోసం ఉద్యోగులు ప్రతి నెలా సొసైటీ కార్యదర్శి కార్యాలయంలో వినతులు ఇవ్వడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల మాదిరి గురుకుల ఉద్యోగులకు కూడా నెలవారీగా ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాల కుట్ర

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు: మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: 'హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా చెబుతున్నా. ఎక్కడో విజయనగరం నుంచి ఇక్కడికి వచ్చి పెత్తనం చెలాయిస్తామంటే నడవదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయి. శాంతిభద్రతల విషయంలో విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు' అని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించి పది నెలలు కూడా ఓపిక పట్టకపోతే దాన్ని అసమర్థత అంటారా? అసహనం అంటారా అని ప్రశ్నించారు. టీపీసీసీ కొత్త అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శనివారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అధికార ప్రతినిధి రవళిరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ భౌతిక దాడులు వ్యక్తిగతంగా, పార్టీలపరంగా మంచి పద్ధతి కాదని, హైదరాబాద్‌లో ఇబ్బందులు కలిగించే పరిస్థితులు ఎవరు తెచ్చినా కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫలానా వారిపై కేసులు పెట్టాలని తమకు తాముగా ఎవరికీ చెప్పబోమని, ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం వ్యవహరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి వచ్చి తన రాజకీయ అనుభవాన్ని ప్రజల కోసం ఉపయోగించాలని, పార్టీ నేతలను రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికారు.

చేతకాని సీఎం వల్లే దౌర్భాగ్యం

గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే ఇంటిపై దాడులా?: కేటీఆర్

- ఫిరాయింపులపై కోర్టు తీర్పు వచ్చిన రోజే అరికెపూడికి పీఏసీ పదవి ఎలా ఇచ్చారు?
- అరికెపూడి ఏ పార్టీలో ఉన్నారో నేరుగా స్పష్టం చేయాలని డిమాండ్



శనివారం కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసంలో కేటీఆర్. చిత్రంలో శంభీపూర్ రాజు, మాధవరం కృష్ణారావు, ఇతర పార్టీ నేతలు

గచ్చిబౌలి (హైదరాబాద్): చేతకాని ముఖ్యమంత్రి ఉండటం వల్ల రాష్ట్రానికి దౌర్భాగ్యం దాపురించిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు మండిపడ్డారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒక ఎమ్మెల్యే ఇంటిపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై సీఎం రేవంతే గూండాలను దాడికి పురిగొల్పారని ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులను బేఖాతరు చేస్తూ, రాజ్యాంగ విలువలకు, అసెంబ్లీ సాంప్రదాయాలు, పార్లమెంటరీ పద్ధతులకు తిలోదకాలు ఇస్తూ.. ఫిరాయింపులపై కోర్టు తీర్పు వచ్చిన రోజే స్పీకర్ కార్యాలయం అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించడం ఏమిటి? ఇది సాంప్రదాయాలకు విరుద్ధం కాదా? కోర్టు తీర్పుతో ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దయ్యే పరిస్థితి ఉండటంతోనే ఇలా చేస్తున్నారు. అసలు ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలి. కాంగ్రెస్ విధానాలు నచ్చి ఆ పార్టీలో చేరుతున్నానని ప్రకటించిన అరికెపూడి గాంధీ.. పీఏసీ చైర్మన్‌గా నియామకం కాగానే బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని చెప్పడం ఎంతవరకు సమంజసం? ఈ తీరును ప్రశ్నిస్తూ.. ఏ పార్టీలో ఉన్నావని మా వాళ్లు ప్రశ్నించడం తప్పా?" అని ప్రశ్నించారు.

ఇలాంటి గూండాగిరీ ఎన్నడూ లేదు

"ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటికి గాంధీ భారీగా గూండాలను వెంటేసుకుని.. డీసీపీ, అదనపు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, పోలీసుల ఎస్కార్టులో భారీ కాన్వాయ్‌గా రావడం.. గేటెడ్ కమ్యూనిటీలో దౌర్జన్యం చేయడం ఏమిటి? పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు ఒక్కటైనా చోటు చేసుకున్నాయా?.." అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యే దాడికి గూండాలను ఉసిగొల్పిన దౌర్భాగ్యపు, చరిత్ర హీనమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఇలా ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా.. హామీలపై నిలదీస్తూనే ఉంటామని చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్నవారంతా తమ వాళ్లేనని.. గత పదేళ్లలో ఒక్క ప్రాంతీయ విద్వేష ఘటన జరగలేదని గుర్తు చేశారు.

నీలాంటోళ్లను చాలామందిని చూశాం

రాష్ట్రంలో నెలలో 28 హత్యలు జరిగినట్టు పత్రికల్లో వచ్చిందని.. రాష్ట్రానికి ఏమయిందనే ఆందోళన వ్యక్తమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో హోంమంత్రి ఎవరో తెలియదని, సీఎం 22 సార్లు ఢిల్లీకి వెళ్లినా చేసిందేమీ లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ.. "చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి చాలా మంది పెద్ద నాయకులను చూశాం. వారి కంటే చాలా చిన్నోడివి. నీలాంటి బుల్లబ్బాయ్, చిట్టి నాయుళ్లను చాలా మందిని చూశాం.." అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మొన్న పోలీసులు హరీశ్‌రావు, ఇతర నాయకులను అరెస్టు చేసినప్పుడు బీఆర్‌ఎస్ కార్యకర్తలు తమ పవరేమిటో చూపించారని చెప్పారు. కార్యకర్తలకు ఏ చిన్న హాని జరిగినా పార్టీ మొత్తం అండగా ఉంటుందని చెప్పారు.

ఖబడ్దార్... కేటీఆర్

- మా సీఎంని, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం
- ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, భూపతిరెడ్డి





సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా నుంచి రాగానే ఏం ముఖం పెట్టుకుని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లాడని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. 'మహిళలను కించపర్చినందుకు ఆలింగనం చేసుకునేందుకా? అందరి మీదా ఎగబడుతున్నందుకు భుజం తట్టడానికా? ఆంధ్రా సెటిలర్లను అవమానపర్చినందుకు అలయ్‌బలయ్ ఇచ్చేందుకా? పోలీసులను బెదిరించడంలో ఇద్దరూ ఒకటేనని చెప్పడానికా?' అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆర్.భూపతిరెడ్డి ప్రశ్నించారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అచ్చోసిన ఆంబోతులా ఊరిమీద పడిన కౌశిక్‌రెడ్డిని మందలించాల్సింది పోయి పరామర్శించడం సిగ్గుచేటని, సెటిలర్లకు క్షమాపణలు చెప్పించాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. కేసీఆర్ లాగా తమ సీఎం రేవంత్ ఫాంహౌస్‌కు పరిమితం కాలేదని, రోజూ సచివాలయానికి వస్తున్నారని, 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నారని, ప్రతిపక్షాలు చెప్పేదీ వింటున్నారన్నారు. 'ఖబడ్దార్ కేటీఆర్. మా సీఎంని, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం. మాటలు జాగ్రత్తగా రానివ్వు. నీ తండ్రి కూడా చీఫ్ మినిస్టరేనా?' అని ఆది శ్రీనివాస్ దుయ్యబట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. అమెరికాలో జల్సాలు చేసి వచ్చిన కేటీఆర్ ఇప్పుడు తెగ హడావుడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్ ఆలోచనంతా రేవంత్‌రెడ్డి కుర్చీపైనే ఉందని, తెలంగాణలో అశాంతి సృష్టించాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. అనవసరంగా మాట్లాడితే కేసీఆర్ అయినా, కేటీఆర్ అయినా చూస్తూ ఊరుకునేది లేదని చెప్పారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతల తీరు ఊసరవెల్లిని తలపిస్తోందన్నారు. కేటీఆర్ ఇలానే మాట్లాడితే భవిష్యత్తులో పిచ్చాసుపత్రిలో చేర్పించాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

ఆన్‌లైన్‌లో మహిళా కాంగ్రెస్ సభ్యత్వం



శనివారం గాంధీభవన్‌లో సభ్యత్వ నమోదు పోస్టర్‌ను విడుదల చేస్తున్న సునీతారావు

సాక్షి, హైదరాబాద్: మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 15 నుంచి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్టు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు చెప్పారు. ఆమె శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రూ.100 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో సభ్యత్వాన్ని పొందాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సభ్యత్వం ఐదేళ్ల పాటు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సభ్యత్వ నమోదుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఆదివారం ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఇతర మహిళా కాంగ్రెస్ నేతలతో కలిసి ఆమె సభ్యత్వ నమోదు పోస్టర్‌ను విడుదల చేశారు.

ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు కుట్ర

టీపీసీసీ నేత రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఉన్న వ్యక్తిగత గొడవలను ప్రాంతీయ విభేదాలుగా సృష్టించేందుకు కుట్ర జరుగుతోందని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. అరికెపూడి గాంధీ, పాడి కౌశిక్‌రెడ్డి మధ్య ఉన్న వ్యక్తిగత విభేదాలను.. కాంగ్రెస్ పార్టీకి అంటగట్టేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు నిజాముద్దీన్, రవళిరెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తనకు పీఏసీ చైర్మన్ పదవి దక్కలేదనే అక్కసుతో కౌశిక్, గాంధీల మధ్య మాజీ మంత్రి హరీశ్‌రావు చిచ్చు పెట్టారని ఆరోపించారు. అమెరికా నుంచి వచ్చిన కేటీఆర్ నేరుగా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి బాధితులను పరామర్శిస్తారనుకుంటే.. కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి రెచ్చగొట్టేలా మాట్లాడడం శోచనీయమన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే కౌశిక్‌రెడ్డిని, ఆయనకు మద్దతు తెలిపిన హరీశ్, కేటీఆర్‌లను పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

17న ప్రధాని పుట్టినరోజు సందర్భంగా 'సేవాపక్షం'

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17న ప్రధాని మోదీ పుట్టినరోజు పురస్కరించుకుని.. బీజేపీ ఆధ్వర్యంలో 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పక్షం' పేరిట రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈనెల 17 నుంచి 19 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు, 18 నుంచి 24 వరకు, మళ్లీ అక్టోబర్ 2న అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో స్వచ్ఛత అభియాన్, సెప్టెంబర్ 18 నుంచి 25 వరకు అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో మెగా ఆరోగ్య శిబిరాలు, సెప్టెంబర్ 25న అన్ని పోలింగ్ బూత్‌లలో మెగా మెంబర్‌షిప్ డ్రైవ్, అక్టోబర్ 2న గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతుల సందర్భంగా హైదరాబాద్‌లో, జిల్లా, మండల కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు బీజేపీ కార్యాలయంలో శనివారం పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో పార్టీ నేతలు డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి, జయశ్రీ, అమర్నాథ్ గుండగోని భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీపై హత్యాయత్నం కేసు

- నిందితుల్లో గాంధీ సోదరుడు, కొడుకు, ఇద్దరు కార్పొరేటర్లు

గచ్చిబౌలి (హైదరాబాద్): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి కేసులో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై గచ్చిబౌలి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసులు సుమోటోగా నమోదు చేసిన కేసులో హత్యాయత్నం సెక్షన్లు లేవని బీఆర్‌ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ వెల్లడించడం తెలిసిందే. కౌశిక్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. గాంధీ కొడుకు పృథ్వీ, అరికెపూడి ప్రసాద్, ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లను హత్యాయత్నం కేసులో నిందితులుగా చేర్చారు.

గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు

- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గల్ఫ్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ప్రధానంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. గల్ఫ్‌కు ఎక్కువ మంది కార్మికులు వలస వెళ్లిన ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఈ కమిటీలో సభ్యులుగా నియమించాలని, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. శనివారం సచివాలయంలో పలువురు ప్రజాప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రవాసి ప్రజావాణి నిర్వహించేందుకు ప్రత్యేక కౌంటర్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. గురుకుల విద్యా సంస్థల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు నిర్వహించకుండా అడ్మిషన్లు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైనప్పటినుంచి గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విన్నవిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు సూచనలు చేశారు. రైతు బీమా మాదిరి గల్ఫ్ బీమా ఉండాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సూచించారు. గల్ఫ్‌లో మన కార్మికులు చనిపోతే 48 గంటల్లో ఇక్కడికి మృతదేహం వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేలు కోరారు.

కత్తితో పొడవడానికి వస్తే ఊరుకుంటామా?

రేవంత్‌ను ఏమైనా అంటే నాలుక కోస్తా: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయ ప్రత్యర్థి తనను కత్తితో పొడిచేందుకు వస్తే తాను ఊరుకోనని, కచ్చితంగా ఎదురుదాడి చేస్తానని, అదే రాజనీతి అని, అందుకే తనను కత్తితో పొడిచేందుకు వచ్చిన కేసీఆర్‌పై రేవంత్ ఎదురుదాడికి దిగారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కత్తితో పొడవడానికి వస్తే ఊరుకుంటామా? రేవంత్ ఊరుకుంటారా? అని ఆయన ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి రవళిరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో పార్టీ ఫిరాయింపులకు ఆద్యుడే కేసీఆర్ అని అన్నారు. 2014 నుంచి 2018 వరకు నలుగురు ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలను చేర్చుకున్నారని, 2018 తర్వాత ఏకంగా కాంగ్రెస్ శాసనసభా పక్షాన్నే విలీనం చేసుకున్నారని గుర్తు చేశారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రేవంత్‌దేనని, అందుకే ఆయన రాజకీయ దాడికి దిగుతున్నారని, ఇందులో తప్పేం లేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పనికిరాడని ఎవరైనా అంటే నాలుక కోస్తామని జగ్గారెడ్డి హెచ్చరించారు.

మజ్లిస్ ఒత్తిడికి తలొగ్గిన రేవంత్: కె.లక్ష్మణ్



పరేడ్ మైదానంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుక ఏర్పాట్లను పరిశీలిస్తున్న కె.లక్ష్మణ్

రసూల్‌పురా: మజ్లిస్ ఒత్తిడికి తలొగ్గి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ విమోచన వేడుకలకు హాజరు కావడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న పరేడ్ మైదానంలో జరగనున్న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా వివిధ దళాల కవాతు, సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాట్లను శనివారం లక్ష్మణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి రాకపోవడం విచారకరమని, గతంలో కేసీఆర్ కూడా ఇదే విధంగా వ్యవహరించారని ఆయనకు పట్టిన గతే రేవంత్‌కు కూడా పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల రామచంద్రారెడ్డి, మల్లారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, శ్యాంసుందర్ గౌడ్ ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వడ్ల టెండర్ల స్కాంపై సీబీఐ విచారణ జరిపించాలి

బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాక్షి, హైదరాబాద్: వడ్ల టెండర్లలో జరిగిన భారీ కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పిలిచిన 35 లక్షల టన్నుల వడ్ల టెండర్‌లో రూ.750 కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే నష్టాల్లో ఉన్న సివిల్ సప్లై కార్పొరేషన్‌ను మరింత పాతాళంలోకి తొక్కే కుట్రతో పాటు రూ.750 కోట్లు స్వాహా చేసే ప్రయత్నం జరుగుతోందని అనుమానం వ్యక్తంచేశారు. టెండర్లలో అవకతవకలపై న్యాయనిపుణులతో చర్చించి, పార్టీ అనుమతితో గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ భారీ కుంభకోణంపై సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేయాలని బీజేపీ నిర్ణయించిందని శంకర్ వెల్లడించారు. టెండర్ల ప్రక్రియ నిర్వహించిన విధానమే ఈ అనుమానాలకు తావిస్తోందన్నారు. టెండర్ ప్రక్రియలో పాల్గొన్నవారికి వేలకోట్ల రూపాయల సామర్థ్యం ఉండాలని కండిషన్లు పెట్టి.. తమ అనుయాయులకు మాత్రమే అవకాశం దక్కేలా చేశారని చెప్పారు.

బాలుడి ఆపరేషన్‌కు నిమ్స్ వైద్యుల భరోసా



బాలుడు లక్ష్మీనారాయణ

'సాక్షి' కథనానికి స్పందన

హైదరాబాద్: గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఓ బాలుడి దయనీయస్థితికి నిమ్స్ వైద్యులు చలించిపోయారు. కుత్బుల్లాపూర్ మండలం దూలపల్లి ప్రశాంత్ నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ పదో తరగతి చదువుతున్నాడు. గుండెకు సంబంధించిన నాళానికి రంధ్రం ఏర్పడటంతో ఆ బాలుడు కొంతకాలంగా అస్వస్థతకు గురయ్యాడు. ఈ విషయమై శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంజాగుట్టలోని నిమ్స్ వైద్యులు స్పందించారు. ఈ మేరకు బాలుడిని నిమ్స్ వైద్యులు శనివారం ఆస్పత్రిలోని ఐసీయూలో చేర్చుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బాలుడికి ఆపరేషన్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, కార్డియాలజీ హెచ్‌వోడీ అమరేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు బాలుడి అమ్మమ్మ సుబ్బలక్ష్మి ప్రభుత్వ పెద్దలకు, నిమ్స్ వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు.

లడ్డూ దక్కించుకున్న ముస్లిం

హైదరాబాద్: భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోని లడ్డూకు శనివారం వేలంపాట నిర్వహించారు. స్థానికంగా ఉండే ముస్లిం సోదరుడు మహ్మద్ బురాన్ (జిల్లా) వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సూరం రాంరెడ్డి, మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిస్కంల నష్టాలు రూ.57,448 కోట్లు

- ఒక్క టీజీఎస్పీడీసీఎల్ నష్టాలే రూ.39,692 కోట్లు
- మరో రూ.17,756 కోట్ల నష్టాల్లో టీజీఎన్పీడీసీఎల్
- 2023–24లో మరో రూ.6,299.29 కోట్లు
- డిస్కంల వార్షిక నివేదికల్లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి విద్యుత్ సరఫరాకు చేస్తున్న వ్యయంతో పోలిస్తే వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న బిల్లులు, సబ్సిడీల రూపంలో వచ్చే ఆదాయం తక్కువగా ఉండటంతో.. విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కం) నష్టాలు ఏటేటా పేరుకుపోతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్రంలోని రెండు డిస్కంల నష్టాలు కలిపి మొత్తం రూ.57,448 కోట్లకు ఎగబాకాయి. అందులో రూ.39,692 కోట్ల నష్టాలు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)వే కాగా, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) నష్టాలు రూ.17,756 కోట్లు ఉన్నాయి. 2023–24లో రెండు డిస్కంలు మరో రూ.6,299.29 కోట్ల నష్టాలను మూటగట్టుకున్నాయి. టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సంస్థలు 2023–24కి సంబంధించిన తమ చివరి త్రైమాసిక నివేదికల్లో ఈ విషయాన్ని వెల్లడించాయి.

ఏటేటా పెరుగుతున్న నష్టాలు: గృహాలు, వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం, ఇతర అన్ని కేటగిరీల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాలో కీలకమైన డిస్కంలు ఏటేటా భారీ నష్టాలు మూటగట్టుకోవడం ఆందోళన కలిగిస్తోంది. 2017–18 ముగిసే నాటికి రూ.28,209.26 కోట్లకు పెరిగిన డిస్కంల నష్టాలు, 2018–19 ముగిసే నాటికి రూ.36,231.47 కోట్లకు చేరాయి. 2020 మార్చి 31 నాటికి రూ.రూ.42,292 కోట్లకు ఎగబాకినట్టు తాజాగా డిస్కంలు బహిర్గతం చేసిన వార్షిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2022–23 నాటికి 51,149.98 కోట్లు ఉన్న నష్టాలు 2023–24 నాటికి రూ.57,448 కోట్లకు చేరాయి.

రూ.45,241 కోట్లకు చేరిన అప్పులు: రెండు డిస్కంల దీర్ఘకాలిక రుణాలు రూ.23,895.27 కోట్లకు, స్వల్ప కాలిక రుణాలు రూ.21,345.73 కోట్లకు పెరిగాయి. దీంతో డిస్కంల మొత్తం రుణాలు రూ.45,241 కోట్లకు చేరాయి. విద్యుదుత్పత్తి కంపెనీలకు బిల్లుల చెల్లింపులతోపాటు ఉద్యోగులకు జీతాల చెల్లింపుల కోసం డిస్కంలు ఎడాపెడా స్వల్పకాలిక రుణాలు తీసుకుంటున్నాయి. దీనికితోడు పంపిణీ వ్యవస్థ సామర్థ్యం పెంపుదల కోసం భారీగా దీర్ఘకాలిక రుణాలు పొందాయి.

బకాయిలు రూ.44,744 కోట్లు

తెలంగాణ జెన్‌కో, ఏపీ జెన్‌కో, సింగరేణి తదితర విద్యుదుత్పత్తి సంస్థల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కి సంబంధించిన బకాయిలతోపాటు ఇతర అన్ని బకాయిలు కలిపి రెండు డిస్కంలు చెల్లించాల్సిన బకాయిలు రూ.44,744.3 కోట్లను ఎగబాకాయి. ఇటు అప్పులు, అటు చెల్లించాల్సి ఉన్న బకాయిలు భారీగా పెరిగిపోవడంతో రెండు డిస్కంలు దివాళాబాటలో నడుస్తున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు వెంటిలేటర్‌గా మారి డిస్కంల దీపం ఆరిపోకుండా కాపాడుతున్నాయి.

ఉద్యోగ వేటకు వెళ్లి.. యుద్ధభూమిలో చిక్కి..

- సురక్షితంగా నగరానికి చేరుకున్న సూఫియాన్
- ఏజెంట్ మోసంతో రష్యా తరఫున ప్రైవేట్ ఆర్మీలోకి..



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగవేటలో వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయి ఉక్రెయిన్–రష్యా యుద్ధభూమిలో చిక్కుకున్న నగరానికి చెందిన సూఫియాన్ ఎట్టకేలకు తిరిగి వచ్చాడు. వివరాలు... 'బాబా వ్లాగ్స్' అనే యూట్యూబ్ ఛానెల్ లో దుబాయ్‌కి చెందిన ఏజెంట్ ఫైసల్‌ఖాన్ పరిచయమయ్యాడు. రష్యాలో సెక్యూరిటీగార్డులుగా అధికవేతనంతో కూడిన ఉద్యోగాలు ఇప్పిస్తానని ఫైసల్‌ఖాన్ నమ్మించి రూ.3 లక్షలు వసూలు చేశాడు. గతేడాది డిసెంబర్ 18న సుఫియాన్‌ను రష్యాకు పంపాడు. అయితే రష్యా– ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో సుఫియాన్‌ను అక్కడి ప్రభుత్వం రష్యా ప్రైవేట్ ఆర్మీ వాగ్నర్ గ్రూపులో చేర్పించింది. దీంతో ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న వార్‌లో సుఫియాన్ బలవంతంగా పాల్గొనాల్సి వచ్చింది. మోసం చేసి రష్యాకు తీసుకెళ్లి యుద్ధభూమిలో దింపారని అతడు తన కుటుంబసభ్యులతో గోడు వెళ్లబోసుకున్నాడు. సుఫియాన్‌ను వెనక్కి రప్పించాలని కుటుంబసభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సుఫియాన్ మాదిరిగా పలువురు భారతీయులు రష్యా తరఫున బలవంతంగా సైన్యంలో చేరారని, వారిని వెనక్కి తీసుకురావాలని ఆయా కుటుంబాలు భారత ప్రభుత్వానికి విన్నవించుకున్నాయి. ఈ క్రమంలో సూఫియాన్‌ను వెనక్కి తీసుకురావడానికి భారత ప్రభుత్వం రష్యాతో దౌత్యపరమైన సంప్రదింపులు జరిపింది. ఇటీవల రష్యా వెళ్లిన ప్రధాని మోదీ కూడా బలవంతంగా యుద్ధంలో పాల్గొంటున్న భారతీయులను వెనక్కి పంపేలా చర్యలు తీసుకోవాలని ఆ దేశ ప్రధాని పుతిన్‌ను అభ్యర్థించారు. ఈ పరిణామాలు సుఫియాన్ నగరానికి సురక్షితంగా రావడానికి మార్గం సుగమం చేశాయి. ఎట్టకేలకు భారత విదేశాంగ శాఖ చొరవతో 8 నెలల తర్వాత తాను నగరానికి చేరుకున్నట్లు సుఫియాన్ తెలిపాడు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలంగాణ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన ఆయనను శనివారం తూంకుంటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ ఉద్యోగులు, టెక్నికల్ టీం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా ఎన్నికల సమయంలో రాత్రీ పగలు అనే తేడా లేకుండా పనిచేస్తారని అన్నారు. కిందిస్థాయి ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా రావడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వ ఉగ్యోగులకు కూడా రాయితీలతో ఇళ్లస్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసి, అత్యవసర సమయంలో ఉద్యోగులను ఆదుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నిర్మల, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, అగ్రికల్చర్ డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ రాములు, సయ్యద్ షౌకత్ అలీతోపాటు పలు ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మన మెరిగిన యెడల మన మాయనను వేడుకొనినవి మనకు కలిగిన వని యెరుగుదుము.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.3.01 వరకు తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** శ్రవణం సా.4.56 వరకు తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.8.45 నుండి 10.16 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.23 నుండి 5.12 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.31 నుండి 8.25 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం : 6.02
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కమలా హ్యారిస్ (అధ్యక్ష అభ్యర్థి)

రాయని డైరీ


మాధవ్ శింగరాజు

ఇగోను ప్రదర్శించే వాళ్లను చూస్తే శిలాయుగం మనుషులు గుర్తొచ్చి చప్పున నాకు నవ్వొచ్చేస్తుంది. వాళ్ల ముఖాన్నే నవ్వేస్తాను. అందుకు వారికి నా ధన్యవాదాలు. వారిలా నన్నెవ్వరూ నవ్వించలేరు మరి!

కిచెన్ థ్రిల్లర్ 'ది బేర్' నుంచి, క్రైమ్ సాల్వింగ్ కామెడీ 'మూన్‌లైటింగ్' వరకు; డార్క్ హ్యూమర్ 'కర్బ్ యువర్ ఎంథూజియాజం' నుంచి కామెడీ క్లాసిక్ 'మార్టిన్' వరకు... ఏ ఒక్క ఆల్ టైమ్ బెస్ట్ టీవీ కామెడీ షో కూడా నన్నింత వరకూ డోనాల్డ్ ట్రంప్ నవ్వించినంతగా నవ్వించలేదు!

మంగళవారం రాత్రి ఫిలడెల్ఫియాలో ట్రంప్‌తో డిబేట్ కోసం స్టేజ్ పైకి వెళ్లక ముందు నుంచే నేను నవ్వాపుకోలేకుండా ఉన్నాను. నవ్వితే బాగుండదనుకున్న చోట నవ్వును బలవంతంగా ఆపుకోవటం ఎంత కష్టమో కడుపార నవ్వే అలవాటున్న వారందరికీ తెలిసే ఉంటుంది.

ట్రంప్‌ని చూడగానే నాకొచ్చే నవ్వు 'ఫేక్ స్మైల్' కాదు. 'సోషల్ స్మైల్' కాదు. ఆ రెండూ కాని 'డూషన్ స్మైల్'! కళ్ల నుంచి, నోటి నుంచి, దవడ కండరాల నుంచి ఏకకాలంలో దడేల్మని తన్నుకొచ్చే నవ్వు అది. ఇగోయిస్టు శిలాయుగ



పురుషులు స్త్రీల డూషన్ స్మైల్‌ను తట్టుకోలేరు.

నవ్వుతూ నేను స్టేజ్ పైకి వెళ్లటంతోనే, "హాయ్! నేను కమలా హ్యారిస్. ఈ వేళ మనిద్దరం చక్కగా చర్చించుకుందాం..." అన్నాను... ట్రంప్‌కి నా చేయి అందిస్తూ.

"మిమ్మల్ని కలవటం సంతోషం. సరదాగా మాట్లాడుకుందాం..." అన్నారాయన మూతి బిగించుకుని తన చేతిని ముందుకు చాస్తూ!

అయనకు నా నవ్వుతోనే ప్రాబ్లం తప్ప నా చేతితో ప్రాబ్లం కాదు కనుక నా నవ్వు ముఖాన్ని సీరియస్‌గా చూస్తూ, నా చేతి వంక నవ్వుతూ చూశారు!

డిబేట్ మొదలైంది. పూర్తయింది.

ఇగోయిస్టులు 'విషయం' ఏమిటో అది మాట్లాడరు. 'వ్యక్తి' ఎవరో వారి గురించి మాట్లాడతారు. ట్రంప్ డిబేట్‌లో అమెరికా లేదు. నేను మాత్రమే ఉన్నాను!

"ఈవిడ గారు యాంటీ ఇజ్రాయిల్. ఆ దేశ ప్రధాని మన సభలో ప్రసంగించటానికి ఇంత దూరం అమెరికా వస్తే ఈమె సభలో లేకుండా వెళ్లి ఆఫ్రికన్ సోదరీమణుల సంఘ సమావేశంలో కూర్చున్నారు. అందులో సభ్యురాలైనా కాకుండానే..." అన్నారు!

"ఈమె బ్లాక్ అని ఒక చోట చదివాను. బ్లాక్ కాదని ఇంకో చోట చదివాను. బ్లాక్ అయినా, కాకున్నా నాకేంటి..." అన్నారు!

"ఈమె కనుక అమెరికా ప్రెసిడెంట్ అయితే కడుపులోని పిండాన్నే కాదు, కడుపులోంచి బయటికి వచ్చేసిన శిశువును కూడా చంపేసే చట్టాన్ని తీసుకొచ్చేస్తారు..." అన్నారు!

ట్రంప్‌కు, నాకు మధ్య జరిగిన డిబేట్‌పై అమెరికా అంతటా డిబేట్‌లు జరుగుతున్నాయి. ఎవరిది పైచేయి? ట్రంప్‌దా, కమలా హ్యారిస్‌దా అని టీవీలు డిబేట్‌లు నడిపిస్తున్నాయి.

"ఇది చూశారా మిస్ హ్యారిస్..." అంటూ నవ్వుతూ వచ్చారు టిమ్ వాల్జ్! ఆయన చేతిలో 'ఫైనాన్షియల్ రివ్యూ' పత్రిక ఉంది. వాల్జ్ వైస్-ప్రెసిడెంట్‌గా నా రన్నింగ్ మేట్.

'కమలా హ్యారిస్ నవ్వు ట్రంప్‌ను ఓడించటానికి ఎలా ఉపయోగ పడుతుందంటే...' అంటూ ఆ పత్రిక నా నవ్వు గురించి పెద్ద వ్యాసమే రాసింది!

"వీళ్లకేం పనిలేదా వాల్జ్!" అన్నాను నవ్వుతూ.

"మిస్ హ్యారిస్... ట్రంప్‌తో మీ డిబేట్‌లో మనం స్కోరింగ్‌లో ఉన్నాం. కానీ అది ట్రంప్‌ని ఓడించగలిగేంత స్కోరింగ్ మాత్రం కాదని కూడా కొన్ని పత్రికలు రాస్తున్నాయి..." అన్నారు టిమ్ వాల్జ్.

"ట్రంప్‌ని మనం ఓడించాల్సిన అవసరం ఏముంది మిస్టర్ వాల్జ్! ఆ పని ఆయన చేసుకోలేరా?!" అన్నాను నవ్వుతూ.

సూటు, బూటు వేసుకున్న శిలాయుగం మనిషి ట్రంప్! ఒక మనిషిని శిలాయుగం నుంచి బయటికి రప్పించవచ్చు. మనిషిలోని శిలాయుగాన్ని బయటికి పంపించలేం.

ఎవరికోసం ఈ కృత్రిమ విపత్తు?



జనతంత్రం

వర్ధెల్లి మురళి



భోపాల్ దుర్ఘటనకు ఇప్పుడు సరిగ్గా నలభయ్యేళ్ల వయసు. భారత చరిత్రలోని విషాద ఉదంతాల్లో అదొకటి. నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించి ప్రజల ప్రాణాలు బలిగొన్నందుకు గాను కంపెనీ యాజమాన్యంపై ఐపీసీ 304 సెక్షన్ కింద కేసు నమోదైంది. తమ నిర్లక్ష్యం కారణంగా లేదా చర్యల కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఉండే అవకాశం ఉందని తెలిసి కూడా ముందుకు వెళ్లడాన్ని నేర శిక్షాస్మృతి 'culpable homicide'గా పరిగణిస్తుంది. ఐపీసీ స్థానంలో 'భారత న్యాయ సంహిత' (బీఎన్ఎస్) అమల్లోకి వచ్చిన తర్వాత, తీవ్రమైన నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రాణనష్టం సెక్షన్ 106 కిందకు వస్తుందని చెబుతున్నారు. కారకులకు పదేళ్ల జైలు, జరిమానా కూడా ఉండవచ్చు.

ప్రతి పౌరుడికీ జీవించే హక్కు ఉన్నది. భారత రాజ్యాంగం ఈ హక్కును ప్రాథమిక హక్కుగా (Article 21, Right to life) గుర్తించింది. దీన్ని ఉల్లంఘించే అధికారం ఏ వ్యక్తికి గానీ, వ్యవస్థకు గానీ, ప్రభుత్వానికి గానీ లేదు. నిర్లక్ష్యం వల్లనో, ఉద్దేశపూర్వకంగానో పౌరుల ప్రాణాలను బలిగొనే ప్రభుత్వాలు అధికారంలో కొనసాగడం రాజ్యాంగ విరుద్ధం. రెండు వారాల కింద విజయవాడ నగరం ఎదుర్కొన్న ఆకస్మిక వరదల కారణంగా డజన్లకొద్దీ ప్రాణాలు పోయాయి. మూడు లక్షల కుటుంబాలు తమ సమస్తాన్నీ కోల్పోయాయి. పదేళ్ల కష్టార్జితాన్ని కోల్పోయి, కట్టుబట్టలతో మిగిలామని ఆ కుటుంబాలు రోదిస్తున్నాయి.

విజయవాడ ఆకస్మిక వరదలను 'ప్రకృతి విపత్తు' కోటాలో వేసేయలేము. వీటిని నివారించడానికి ఉన్న అవకాశాలను బాధ్యులైన వారు వినియోగించలేదు. బహుశా అందువల్లనే ఈ వరదలను 'మ్యాన్ మేడ్ ఫ్లడ్స్'గా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అభివర్ణించారు. కచ్చితంగా ఈ విషాదం మానవ కల్పితమే! ఈ మానవ కల్పిత విషాదం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం ఉన్నది. పరిపాలనా వైఫల్యం ఉన్నది. పాలకుల దురుద్దేశం కూడా దాగున్నది. జరిగిన పరిణామాలను క్రమానుగతంగా పరిశీలిస్తే ఈ సంగతి ఎవరికైనా తేటతెల్లమవుతుంది.

ఆగస్టు 28వ తేదీ బుధవారం నాడు భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) వారు ఒక నివేదికను విడుదల చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో ఆంధ్ర, ఒడిషాలపై ప్రభావం చూపబోతున్నదనే అంశం కూడా ఈ నివేదికలో ఉన్నది. వాతావరణ నివేదికల్లో తుపాను సంబంధిత హెచ్చరికలు వెలువడగానే తీరప్రాంత రాష్ట్రాలు తక్షణం స్పందించి సమీక్ష జరపడం రివాజు. పైగా గుజరాత్ తర్వాత అత్యంత పొడవైన సముద్ర తీరం ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇక్కడ తుపాను హెచ్చరికలపై స్పందన వేగంగా ఉండాలి. కానీ ప్రభుత్వ పెద్దలు గానీ, అధికార యంత్రాంగం గానీ ఈ హెచ్చరికను పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు.

ఆ మరుసటిరోజు ఆగస్టు 29న ఐఎమ్‌డీ రెండో నివేదికను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు గురువారం రాత్రి నుంచి శనివారం వరకు పడతాయని నివేదిక హెచ్చరించింది. ఐఎమ్‌డీతోపాటు 'ఆంధ్రప్రదేశ్ వెదర్‌మ్యాన్', 'తెలంగాణ వెదర్‌మ్యాన్' కూడా ట్విట్టర్ వేదికగా హెచ్చరించారు. వాతావరణ శాస్త్రవేత్తలైన ఈ యువకులు 'వెదర్‌మ్యాన్' పేరుతో అత్యంత కచ్చితత్వంతో కూడిన హెచ్చరికలు జారీచేస్తూ ఇటీవలి కాలంలో సంచలనం సృష్టిస్తున్నారు. 'ఆంధ్రప్రదేశ్ వెదర్‌మ్యాన్' సాయి ప్రణీత్ 29న డిప్యూటీ సీఎంను ట్యాగ్ చేస్తూ నివేదికను విడుదల చేశారు. విజయనగరం నుంచి పల్నాడు జిల్లా వరకు అన్ని జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని, ముఖ్యంగా శనివారం నాడు అతి భారీ వర్షాలుంటాయి కనుక పాఠశాలలకు ముందుగానే సెలవు ప్రకటించాలని పవన్ కల్యాణ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

వరుస హెచ్చరికలున్నప్పటికీ ప్రభుత్వ పెద్దలు పెడచెవిన పెట్టారు. అధికార యంత్రాంగం చేష్టలుడిగి కూర్చున్నది. రాజకీయ – అధికార ముఖ్యులందరూ వీకెండ్ మూడ్‌లోకి, చలో హైదరాబాద్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. రిజర్వాయర్లలో 'ఫ్లడ్ కుషన్' మెయింటెయిన్ చేయలేదని జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే ఆరోపిస్తున్నట్టు నదుల్లో వరద నియంత్రణ చర్యలను యంత్రాంగం గాలికి వదిలేసింది. భారీ వర్ష సూచనలున్నప్పుడు నిండుగా ఉన్న రిజర్వాయర్ల నీటిని కొంత మేరకు దిగువకు విడుదల చేసి వచ్చే వరద ప్రవాహానికి కొంత కుషన్ ఏర్పాటు చేసుకుంటారు.

> ప్రొటోకాల్ ప్రకారం గేట్లు ఎత్తడానికి పన్నెండు గంటల ముందు ప్రజలను అప్రమత్తం చేయాలి. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఇవన్నీ జరగాలంటే వాతావరణ హెచ్చరికలు వెలువడినప్పుడే ఇరిగేషన్, రెవెన్యూ, హోంశాఖ ఉన్నతాధికారులతో ప్రభుత్వ పెద్దలు సమీక్షా సమావేశం జరిపి నిర్ణయాలు తీసుకోవాలి. అది జరగలేదు. తీరా కృష్ణానదిలో వరద పెరిగి చంద్రబాబు కరకట్ట నివాసంలోకి కూడా నీళ్లు రావడంతో ఆయన కలెక్టరేట్‌లోకి తన బసను మార్చుకున్నారు. అప్పటికే బుడమేరు పరిస్థితి భయానకంగా ఉన్నట్లు సమాచారం ఉన్నది. ఆ సమయంలో తీరిగ్గా మూడు శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. బుడమేరు గేట్లపై ఏం నిర్ణయం తీసుకున్నారో ఎవరికీ తెలియదు. ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. పునరావాస శిబిరాలు ఏర్పాటు కాలేదు. ప్రజలకు హెచ్చరికలు జారీ కాలేదు. వారిని తరలించే ప్రయత్నాలూ జరగలేదు.
>
> మూడు లక్షలమందిని వరద ముంచేసిన తర్వాత వారం రోజులకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ఒక భయంకరమైన విషయాన్ని బయట పెట్టారు. ఒక రోజు ముందుగానే వరద సంగతి తమకు తెలుసనీ, కానీ రెండు లక్షల కుటుంబాలను ఆ ప్రాంతం నుంచి తరలించడం సాధ్యమయ్యే పని కాదు కనుక ప్రజలను హెచ్చరించలేదని చెప్పారు. ఇంతకంటే దిగ్భ్రాంతికరమైన విషయం ఇంకోటి ఉంటుందా? ఇంతకన్నా బాధ్యతా రాహిత్యం ఉంటుందా? ఇదే కదా నేరపూరిత నిర్లక్ష్యం! ఇదే కదా ఉద్దేశపూర్వకంగా ప్రజల ప్రాణాలను బలిపెట్టడం! ఇది కేవలం ఆ ఉన్నతాధికారి నిర్ణయం మాత్రమే అనుకోలేము కదా!

ఈ ప్రోటోకాల్‌ను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ప్రకాశం బ్యారేజికి రికార్డు స్థాయి వరద చేరి పరిస్థితిని సంక్లిష్టం చేసింది. దీని ప్రభావం బుడమేరు మీద, రాజధాని ప్రాంతం మీద కూడా పడింది.

బుడమేరు అనే వాగుకు ఎప్పటినుంచో 'బెజవాడ దుఃఖదాయని' అనే పేరున్నది. విజయవాడకు ఉత్తర దిక్కున ఉన్న ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతం నుంచి ఈ వాగు దక్షిణాభిముఖంగా ప్రవహించి, నగరానికి వాయవ్య దిక్కున ఉన్న వెలగలేరు అనేచోట తూర్పు వైపు తిరిగి, పలు వంపులు తిరుగుతూ నగరం మీదుగా కొల్లేరు దాకా పారుతుంది. విజయవాడకు వరద ముప్పును నియంత్రించడం కోసం వెలగలేరు మలుపు దగ్గర బుడమేరుపై గేట్లు బిగించారు. వరద ప్రవాహాన్ని దక్షిణం వైపు మళ్లిస్తూ ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానదిలోకి పారేలా 'బుడమేరు డైవర్షన్ కెనాల్' (బీడీసీ) ఏర్పాటు చేశారు. దిగువన ఇబ్రహీంపట్నం దగ్గరున్న విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ కోసం ఏర్పాటైన కూలింగ్ కెనాల్‌తోనే ఈ బీడీసీని అనుసంధానించారు. పోలవరం కుడికాల్వను కూడా వెలగలేరు వద్ద బీడీసీతో కలిపేశారు.

ఈ బుడమేరు డైవర్షన్ కెనాల్ సామర్థ్యం 15 వేల క్యూసెక్కులని చెబుతారు. కానీ అంతకుముందే అక్కడ వీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌పై చంద్రబాబు ఓ యెల్లో మీడియా ప్రముఖునికి ఇచ్చిన పవర్ ప్లాంట్ కారణంగా ఐదు వేల క్యూసెక్కులకు మించి అక్కడ ప్రవహించే అవకాశం లేదని ఇరిగేషన్ నిపుణులు చెబుతున్నారు. బుడమేరు వరదెత్తిన రోజుల్లో గరిష్ఠ స్థాయిలో ఆ ప్రవాహాన్ని బీడీసీలోకి మళ్లిస్తే విజయవాడకు వరద ముప్పు తగ్గుతుంది. ఆ గరిష్ఠ స్థాయి మళ్లింపునకు అడ్డుగా ఉన్న పవర్ ప్లాంట్‌ను తొలగించడానికి గతంలో కొన్ని ప్రయత్నాలు జరిగినా కోర్టు స్టేల వల్ల సాధ్యం కాలేదు.

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బుడమేరులో 45 వేల క్యూసెక్కుల వరద రాబోతున్నదని శనివారం మధ్యాహ్నానికి ముందే స్థానిక ఇరిగేషన్ ఇంజనీర్లు అంచనా వేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు చెబుతున్నారు. బుడమేరు రెగ్యులేటర్ డీఈ మాధవనాయక్ 'సాక్షి' టీవీతో ఆన్ రికార్డు ఈ విషయాన్ని నిర్ధారించారు. బీడీఎస్ సామర్థ్యం 15 వేల క్యూసెక్కులే కనుక అనివార్యంగా బుడమేరు గేట్లను శనివారం సాయంత్రానికల్లా ఎత్తవలసి ఉంటుందని కూడా వారు ఉన్నతాధికారులకు చేరవేశారు. 'పైస్థాయి' వారు వెంటనే స్పందించి గేట్లు ఎత్తడంపై నిర్ణయం తీసుకొని ఉంటే విజయవాడలోని బుడమేరు ముంపు ప్రాంత ప్రజలను తరలించడానికి సరిపోయే సమయం ఉండేది. రాబోతున్న వరదను గురించి ప్రజలను అప్రమత్తం చేయడానికి అవకాశం ఉండేది. ప్రొటోకాల్ ప్రకారం గేట్లు ఎత్తడానికి పన్నెండు గంటల ముందు ప్రజలను అప్రమత్తం చేయాలి. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

ఇవన్నీ జరగాలంటే వాతావరణ హెచ్చరికలు వెలువడినప్పుడే ఇరిగేషన్, రెవెన్యూ, హోంశాఖ ఉన్నతాధికారులతో ప్రభుత్వ పెద్దలు సమీక్షా సమావేశం జరిపి నిర్ణయాలు తీసుకోవాలి. అది జరగలేదు. తీరా కృష్ణానదిలో వరద పెరిగి చంద్రబాబు కరకట్ట నివాసంలోకి కూడా నీళ్లు రావడంతో ఆయన కలెక్టరేట్‌లోకి తన బసను మార్చుకున్నారు. అప్పటికే బుడమేరు పరిస్థితి భయానకంగా ఉన్నట్లు సమాచారం ఉన్నది. ఆ సమయంలో తీరిగ్గా మూడు శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. బుడమేరు గేట్లపై ఏం నిర్ణయం తీసుకున్నారో ఎవరికీ తెలియదు. ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. పునరావాస శిబిరాలు ఏర్పాటు కాలేదు. ప్రజలకు హెచ్చరికలు జారీ కాలేదు. వారిని తరలించే ప్రయత్నాలూ జరగలేదు.

మూడు లక్షలమందిని వరద ముంచేసిన తర్వాత వారం రోజులకు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ఒక భయంకరమైన విషయాన్ని బయటపెట్టారు. ఒక రోజు ముందుగానే వరద సంగతి తమకు తెలుసనీ, కానీ రెండు లక్షల కుటుంబాలను ఆ ప్రాంతం నుంచి తరలించడం సాధ్యమయ్యే పని కాదు కనుక ప్రజలను హెచ్చరించలేదని చెప్పారు. ఇంతకంటే దిగ్భ్రాంతికరమైన విషయం ఇంకోటి ఉంటుందా? ఇంతకన్నా బాధ్యతా రాహిత్యం ఉంటుందా? ఇదే కదా నేరపూరిత నిర్లక్ష్యం! ఇదే కదా ఉద్దేశపూర్వకంగా ప్రజల ప్రాణాలను బలిపెట్టడం! ఇది కేవలం ఆ ఉన్నతాధికారి నిర్ణయం మాత్రమే అనుకోలేము కదా! అత్యున్నత స్థాయి నిర్ణయాన్నే ఆయన వెల్లడించి ఉంటారు కదా!

హెచ్చరికలు లేకుండా, ఏర్పాట్లు లేకుండా బుడమేరు గేట్లెత్తి లక్షలాదిమందిని వరదపాలు చేయాలనే నిర్ణయాన్ని తీసుకోవడానికి ప్రేరేపించిన పరిస్థితులేమిటి? శనివారం మధ్యాహ్నానికే ప్రకాశం బ్యారేజీలోకి దాదాపు 8 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుకున్నది. కరకట్ట మొదటి అంతస్తుల్లోకి ప్రవేశించింది. బ్యారేజీ దగ్గర కృష్ణానది బెడ్ లెవెల్ సముద్ర మట్టానికి 11.24 మీటర్లు. రాజధాని ప్రాంతం గుండా పారే కొండవీటి వాగు ఉండవల్లి దగ్గరున్న కృష్ణానది తూము ద్వారా నదిలో కలుస్తుంది. అక్కడ దాని బెడ్ లెవెల్ 11 మీటర్లు. ఐదారు లక్షల క్యూసెక్కుల ప్రవాహం గనుక బ్యారేజీ దగ్గర ఉన్నట్లయితే కొండవీడు వాగు కృష్ణలో కలవడానికి బదులు కృష్ణ నీళ్లు వాగులోకి ఎగదన్నుతాయి. కొండవీడు వాగు మోసుకొచ్చే వరదను రాజధాని ప్రాంతంలో నియంత్రించడం కోసం ఒక లిఫ్టును ఏర్పాటు చేశారు. దాని సామర్థ్యం ఐదువేల క్యూసెక్కులు మాత్రమే. కృష్ణాలో ప్రవాహం పెరిగి వాగులోకి ఎగదన్నడం ఎక్కువైతే అమరావతి డ్రీమ్ ప్రాజెక్టుకు కోలుకోలేని డ్యామేజ్ అవుతుంది. బ్యారేజీలో కొంచెం ఎగువన నదికి మరోవైపున బుడమేరు డైవర్షన్ కెనాల్ కృష్ణానదిలో కలుస్తున్నది. ఈ బుడమేరు నీళ్లనే కృష్ణలో కలిపి కృష్ణా-గోదావరి నదుల అనుసంధానాన్ని పూర్తి చేశానని గతంలో చంద్రబాబు ప్రకటించిన సంగతి చాలామందికి గుర్తుండే ఉంటుంది. దీనికే ఆయన 'పవిత్ర సంగమం' అనే నామకరణం చేశారు.

ఇక్కడ కృష్ణానది, బుడమేరు కాలువల బెడ్‌లెవెల్ సమానంగా ఉంటుంది. ఫలితంగా కృష్ణా ప్రవాహం వేగంగా కాల్వలోకి ఎగదన్నడం మొదలైంది. మరోపక్క బుడమేరు గేట్లు మూసి ఉన్నందువలన వరద మొత్తం డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణ వైపు పరుగెత్తుతున్నది. పవర్ ప్లాంట్ కారణంగా ఇరుకైన కాలువ తట్టుకోలేక గట్టుకు గండ్లు పడి కృష్ణా జలాలు పడమటి దిక్కు నుంచి విజయవాడ వైపు మళ్లాయి. శనివారం రాత్రి పడిన ఈ గండ్లనే జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పూడ్చలేకపోయిందని అధికార పార్టీ ప్రచారంలో పెట్టింది. గేట్లు ఎత్తితే బుడమేరు వరద ఎదురు రాకుండా కృష్ణా వరద స్వేచ్ఛగా ఎగదన్నడం వలన బ్యారేజీ నీటిమట్టం ప్రమాదకరంగా పెరగకుండా నియంత్రించవచ్చనే ఆలోచన కూడా కారణం కావచ్చు. రాత్రి పూట చెప్పాపెట్టకుండా గేట్లు ఎత్తేశారు. బుడమేరు వరద బెజవాడపై ఉత్తరం దిక్కు నుంచి విరుచుకుపడింది.

శనివారం మధ్యాహ్నానికే నిర్ణయం తీసుకొని, చాటింపు వేయించి ప్రజలను తరలించి ఉన్నట్లయితే పెను ఉత్పాతం నివారించడం సాధ్యమయ్యేది. కానీ ఈ ఏర్పాట్లు చేయడానికి యంత్రాంగం సన్నద్ధంగా లేదు. నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా కిమ్మనాస్తిగా స్తంభించిపోయింది. పెద్దల ఆయువుపట్టుకే దెబ్బ తగలబోతోందన్న ఆలోచన రాగానే విజయవాడను బలిపెట్టడానికి సిద్ధమైనట్టుగా ఈ పరిణామాలు కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఘోరవైఫల్యం, దూరదృష్టి లేకపోవడం, పాలనా యంత్రాంగ నిస్తేజం, ఆపైన పెద్దల సొంత ప్రయోజనాలు... వెరసి విజయవాడ వీధుల్లో కన్నీటి కెరటాలు ఎగసిపడ్డాయి. ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి వారం రోజుల పాటు ప్రభుత్వ పెద్దలు పడినపాట్లు అన్నీ ఇన్నీ కావు. విష్ణుమూర్తి అవతారాల మాదిరిగా కొన్నిసార్లు పడవల మీద, కొన్నిసార్లు బుల్డోజర్లపై, మరికొన్ని సార్లు కాలినడకన ప్రయాణిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు అభివాదాలు చేస్తూ కనిపించారు. వర్షంలోనే గండ్లు పూడ్చుతూ కనిపించే మంత్రుల ఫొటోలు, వీడియోలు దర్శనమిచ్చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించిన ఫొటోల్లో, డ్రోన్‌ల ద్వారా ఇంటింటికి ఆహారం సరఫరా దృశ్యాలు ప్రచారంలోకి వచ్చాయి.

ప్రవాహంలో కొట్టుకుపోయేవాడికి గడ్డిపోచ కనిపించినట్టుగా వైఫల్యాల సుడిలో కొట్టుమిట్టాడుతున్న సర్కార్‌కు ప్రకాశం బ్యారేజీ దగ్గరకు కొట్టుకొచ్చిన బోట్లు కనిపించాయి. ఈ బోట్లను వైసీపీ వాళ్లే ప్రయోగించారనీ, ఈ బోట్ల కారణంగానే బెజవాడ మునిగిందనే డైవర్షన్ స్కీమును ముందుకు తెచ్చారు. బురదను కడుక్కోవాలి కనుక అవతలి పక్షం వారు కూడా బోట్లు టీడీపీ వారివేననే సాక్ష్యాలను ముందుకు తెచ్చారు. ఈ బోట్ల కాట్లాట నడుమ అసలైన కారణాలను మరుగున పడేయడమే ప్రభుత్వ పెద్దల లక్ష్యం. వారి లక్ష్యం ఏదైనా కావచ్చు, ప్రజల ప్రాణాలను బలిగొనే నేరపూరిత నిర్లక్ష్యాలను ఉపేక్షించడం ప్రజాస్వామ్యానికి హితం కాదు. ప్రభుత్వాల చేతగానితనాన్ని సహించడం కూడా క్షేమం కాదు. జరిగిన విధ్వంసంపై కేసులు నమోదు కావాలి. ఈ విషాదానికి కేవలం నిర్లక్ష్యం, చేతగానితనాలే కారణాలా? మరేదైనా లోతైన కారణం ఉన్నదా అనే కోణంలో విచారణ జరగాలి.

vardhelli1959@gmail.com

మతం రంగు పులమడం జాతికి ద్రోహం చేయడమే!

సందర్భం




కూనంనేని సాంబశివరావు

నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభువుల అణచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిగింది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. మాతృ భాష కోసం, భూమి కోసం, భుక్తి కోసం మట్టి మనుషుల ధిక్కార స్వరం అది. ఏఐటీయూసీ తరఫున మఖ్దూం మొహియుద్దీన్, ఆంధ్ర మహాసభ తరఫున రావి నారాయణరెడ్డి, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ తరఫున బద్దం ఎల్లారెడ్డి త్రయం సాయుధ రైతాంగ పోరాటానికి 1947 సెప్టెంబర్ 11న పిలుపు నిచ్చారు. కమ్యూనిస్టులు, పేద ప్రజలు వీరోచితంగా పోరాటం చేయడంతో భూస్వాములు హైదరాబాద్ లాంటి నగరాలకు పలాయనం చిత్తగించారు. నిజాం ప్రభుత్వం పూర్తిగా బలహీన పడిపోయింది. హైదరాబాద్ సంస్థానం కమ్యూనిస్టులు ఆక్రమిస్తారనే భయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం నిజాం ప్రభువుతో లాలూచీ పడటం వలన కేంద్ర సైన్యం కేవలం మూడు రోజుల్లోనే హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసుకుంది. ఆనాటి మిలటరీ గవర్నర్ జనరల్ చౌదరి విలీనం తర్వాత కమ్యూనిస్టుల మీద దాడులు కొనసాగించాడు.

కేంద్ర బలగాల అండతో ఆనాడు కమ్యూనిస్టులు పేదలకు పంచిన 10 లక్షల ఎకరాల భూమిని భూస్వాములు తిరిగి బలవంతంగా లాక్కోవడం ప్రారంభించారు. దీంతో విలీనం తర్వాత కూడా కమ్యూనిస్టులు సాయుధపోరాటాన్ని 1951 చివరి వరకు కొనసాగించాల్సివచ్చింది. 1952లో నిషేధం తొలగిన తర్వాత ఎన్నికల్లో పాల్గొని తెలంగాణ ప్రాంతంలో అత్యధిక స్థానాలను గెలుపొందడం జరిగింది. ఈ పోరాటానికి మతం రంగు పులిమి చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ జాతి త్యాగాలను, పోరాట గాథలను చీకటి పొరల్లోకి నెట్టివేసి, విషపూరిత మత విద్వేషాలను ఈనాటి తరం మెదడులోకి ఎక్కించడం వలన జాతికి అపకారం జరుగుతుంది.

హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములు ఎక్కువ శాతం హిందువులే. దొడ్డి కొమరయ్య వంటి పేదలను బలితీసుకున్న 40 వేల ఎకరాల భూస్వామి విసునూరి రాంచంద్రారెడ్డి, దుష్ట మహిళగా పేరొందిన అతని తల్లి జానకమ్మ హిందువులే కదా! మరణించిన దొడ్డి కొమరయ్య కూడా హిందువే కదా! వరంగల్, నల్లగొండ జిల్లాల్లో



తెలంగాణ సాయుధ పోరాటంలో వీరమహిళలు

1.50 లక్షల ఎకరాలు కలిగినటువంటి జెన్నారెడ్డి ప్రతాపరెడ్డి కాని, లక్ష ఎకరాలు కలిగిన ఖమ్మం జిల్లాకు చెందిన కల్లూరి ప్రాంత కాళ్ళూరి దొర కాని హిందువులేకదా! 5 వేలు, 10 వేల ఎకరాలు కలిగిన హిందూ భూస్వాములు వందలాదిమంది ఉండేవారు. వీరు నిజాం నవాబుకు గులాములుగా వ్యవహరించడమే గాక నిజాంను మించిన దౌర్జన్యాలతో అనేక మందిని ఊచకోత కోశారు. మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపులు చేయడం, బతుకమ్మలు ఆడించడం, మానభంగాలు చేయడం లాంటి క్రూరమైన నేరాలు చేశారు. ఈ దోపిడీదారులైన జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లలో హిందువులున్నారు, ముస్లిములున్నారు. అదే విధంగా నిజాం రాజు ముస్లిం అయినప్పటికీ పేద ముస్లిముల జీవితాలలో ఎటువంటి మార్పూలేదు.

తెలంగాణలో భూస్వామ్య ముస్లింలు దాదాపు 2,000 కుటుంబాలు కాగా... పేద ముస్లింలు లక్షలాది మంది ఉన్నారు. అందులో 20 లక్షల మంది హైదరాబాద్ నగరంలో కడు పేదరికంలో ఉండేవారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా చిత్రహింసలకు గురయ్యారు. షేక్ బందగీని విసునూరు రామచంద్రారెడ్డికి చెందిన గుండాలు చంపివేశారు. ఖాసీం రజ్వీ అనే వ్యక్తి మజ్లిస్ పార్టీని స్థాపించి హైద్రాబాద్‌ను స్వతంత్ర ముస్లిం రాజ్యంగా ప్రకటన చేసి రజాకారుల సైన్యాన్ని ఏర్పాటు చేసి మానవ రాక్షసుడిలాగ హిందువులపైన దాడులకు పూనుకున్నాడు. తనను వ్యతిరేకించిన ముస్లింలను కూడా నిర్దాక్షిణ్యంగా చంపించాడు. ప్రఖ్యాత జర్నలిస్టు షోయబ్ ఉల్లాఖాన్‌ను హైద్రాబాద్ నడిబజార్‌లో రజాకార్లు క్రూరంగా చంపారు. ఆనాటి వరంగల్ జిల్లాలో రజబ్ అలీ లాంటి యోధులు నిజాం రాచరికానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్‌తో కలిసి మఖ్దూం మొహియుద్దీన్ ప్రొ॥ అల్లంకుంద్ మీరీ, జవ్వాది రజ్వీ, (సాలార్జంగ్ మ్యూజియం ఆనాటి లైబ్రేరియన్) ప్రొ॥ ఖయ్యూం ఖాన్ లాంటి అనేక మంది ముస్లిం విద్యావేత్తలు నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా 'కామ్రేడ్స్ అసోషియేషన్'ను ఏర్పాటు చేశారు. ఇలా ఎంతో మంది ముస్లింలు నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. చిత్రహింసలకు, హత్యలకు గురయ్యారు.

ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా పేద రైతాంగం జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముస్లింల-హిందువుల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం చరిత్రను అవమానపర్చడమే! ఇటువంటి మహోజ్జ్వల పోరాట చరిత్రకు మతం రంగు పులమడానికి ఆనాటి పోరాటంలో ఇసుమంత పాత్ర లేని ఆర్ఎస్ఎస్, ఈనాటి బీజేపీ తమ మత ఉన్మాదంతో ఓట్ల రాజకీయాల నేపథ్యంలో చరిత్రను వక్రీకరిస్తున్నాయి. ప్రజాకంటకులైన ఒక రాజును యుద్ధంలో ఓడిస్తే అతనిని యుద్ధ ఖైదీగా చూడాలి. అలా గాకుండా నిజాం నవాబుకు 'రాజ ప్రముఖ్'గా హోదా కల్పించడంతోపాటు సంవత్సరానికి కోటి రూపాయల రాజభరణాన్ని ఇస్తూ పటేల్ సైన్యం నిజాం రాజుతో ఒప్పందం చేసుకున్నది. వేలాది మందిని ఊచకోత కోసిన రజాకర్ల నాయకుడైన ఖాసీం రజ్వీని పాకిస్తాన్‌కి వెళ్ళిపోయే విధంగా అనుమతించడం లాంటి పరిణామాలు నిజాం రాజు, నెహ్రూ ఇద్దరూ కుమ్మక్కు అయిన్నట్లుగా సూచిస్తున్నాయి. అటువంటప్పుడు యుద్ధం జరిపి విమోచన చేసినట్లు వాళ్ళు ఎలా పేర్కొంటారు?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'ప్రజాపాలన' దినోత్సవంగా అన్ని నియోజక వర్గాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో జరుపుతామని ప్రకటించారు. ఇది కొంతమేరకు స్వాగతించవలసిన విషయమే. అయితే సాయుధ పోరాటానికి తగిన గౌరవం ఈ ప్రకటనలో లేదనిపిస్తుంది. సాయుధ పోరాట విలీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆ పేరుతో ధైర్యంగా ఎందుకు జరపలేక పోతున్నారో, అరకొరగా అర్ధమనస్సుతో ఎందుకు జరుపుతున్నారో సమాధానం చెప్పాలి.

ఆనాటి ఖాసీం రజ్వీ నాయకుడిగా ఉన్న ఈనాటి ఎం.ఐ.ఎం. నేతలకు ఆగ్రహం కలుగుతుందనా? లేక మరేదైనా కారణం ఉన్నదా అనే సమాధానం చెప్పాలి. దీన్ని అసరాగా తీసుకొని ఈనాటి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తాము రాజకీయంగా తెలంగాణలో బలపడటానికి ప్రయత్నిస్తున్నాయి.

ఆనాటి కమ్యూనిస్టులు త్యాగాలు, పోరాటాలు లేకుండా విలీనం జరిగేదా? ఆనాటి విలీనం లేకుండా నేటి తెలంగాణ ఉండేదా?

వ్యాసకర్త తెలంగాణ శాసనసభ్యులు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

క్లుప్తంగా...

సామాజిక స్పృహ.. స్వచ్ఛంద సేవ


గుంతలను పూడ్చుతున్న దుర్గయ్య

చొప్పదండి: గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో రోడ్లపై గుంతలు పూడ్చి గణనాథుల తరలింపు ప్రక్రియను మెరుగుపరచాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టడం లేదు. దీంతో తన ట్రాలీ ఆటో ద్వారా రోడ్లపై గుంతలను పూడ్చుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు డ్రైవర్ వడ్లూరి దుర్గయ్య. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని ప్రధాన రోడ్లలో వర్షాలమూలంగా గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతుండటంతో పాటు సోమవారం గణేశ్ నిమజ్జనం ఉండటంతో దుర్గయ్య శనివారం తన ట్రాలీ ఆటో ద్వారా కంకర, మట్టిని తరలించి పూడ్చివేశాడు. ఈసందర్భంగా పట్టణవాసులు దుర్గయ్య సేవలపై హర్షం వ్యక్తం చేశారు.

ఐద్వా నాయకురాలు లక్ష్మీ దేవమ్మ కన్నుమూత


లక్ష్మీ దేవమ్మ

రామంతాపూర్ (హైదరాబాద్): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు నీలి శ్రీహరి సతీమణి, రాష్ట్ర ఐద్వా నాయకురాలు నీలి లక్ష్మీ దేవమ్మ (85) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రామంతాపూర్ గోకుల్‌నగర్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. లక్ష్మీ దేవమ్మ ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రజా పోరాటాల్లో పాల్గొని ప్రజల సమస్యలు పరిష్కరించారు. లక్ష్మీ దేవమ్మ కోరిక మేరకు ఆమె భౌతిక కాయాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు.

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య


అంజయ్యగౌడ్

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని పాపయ్యపల్లెకు చెందిన బుర్ర అంజయ్యగౌడ్ అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అంజయ్యగౌడ్ (53)కు గ్రామంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉండేది. అది రైల్వేలైన్ కింద పోవడంతో మనస్తాపానికి గురై, మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కాసేపటికి గుర్తించిన కుటుంబసభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అంజయ్యగౌడ్ చనిపోయినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.


తేలు కుట్టి యువకుడి మృతి


కల్యాణ్

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని యైటింక్లయిన్ కాలనీ కుమారస్వామి నగర్‌కు చెందిన నల్లూరి కల్యాణ్ (28) తేలు కుట్టి మృతి చెందాడు. కుమారస్వామినగర్‌లోని నర్సరీలో ఈనెల 11న ఉదయం 10 గంటలకు స్థానిక వెంకట్రావుపల్లి నర్సరీలో కల్యాణ్ కుడికాలుకు తేలు కుట్టింది. స్థానికులు వెంటనే సమీపంలోని అల్లూరు గవర్నమెంట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స చేశాక డాక్టర్ల సూచన మేరకు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కల్యాణ్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద రావు తెలిపారు.

కాంగ్రెస్ సీనియర్ నేత సమ్మిరెడ్డి మృతి

- గుండెపోటుతో తుదిశ్వాస
- వైఎస్సార్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరు


సమ్మిరెడ్డి

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి (59) గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి ములుగులో శుభకార్యానికి వెళ్లి వచ్చిన ఆయన నరాత్రి 12 గంటల సమయంలో గుండెపోటుకు గురవ్వగా... కుటుంబ సభ్యులు సమీప ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన అత్యంత సన్నిహితుడిగా పేరుంది. కాగా, సమ్మిరెడ్డి డీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు.

'విద్యుత్'కు రోల్‌మోడల్‌గా రాష్ట్రం

- 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా చర్యలు
- వ్యవసాయ మోటార్లకు సోలార్ పంపుసెట్ల ఏర్పాటు
- పైలట్ ప్రాజెక్టుగా నందిమేడారం గ్రామం
- పెద్దపల్లి జిల్లా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


పెద్దపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, పెద్దపల్లి: విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ విషయంలో తెలంగాణను దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలుపుతామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. 2030 నాటికి ఉండే డిమాండ్‌ను అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా గ్రీన్ పవర్, సోలార్ పవర్, ఫ్లోటింగ్ సోలార్, పంప్ స్టోరేజీ తదితర రంగాల్లో దాదాపు 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శనివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం, పెద్దపల్లిలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి భట్టి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభల్లో భట్టి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టు కింద 30 గ్రామాలను ఎంపిక చేసి, అక్కడ వ్యవసాయ మోటార్లకు పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. తద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును రైతులు వ్యవసాయ రంగానికి ఉపయోగించుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని చెప్పారు. ఇందులో భాగంగా నందిమేడారం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సోలార్ పవర్‌ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పెద్దపల్లి జిల్లాలోని కాచాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని, అక్కడ అందుబాటులో ఉన్న 12 ఎకరాలు సేకరించి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను డిప్యూటీ సీఎం ఆదేశించారు. రామగుండంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని, త్వరలోనే భూమిపూజ చేస్తామని తెలిపారు. దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉన్న ఎల్లంపల్లి నిర్వాసితుల సమస్య పరిష్కారానికి ప్రజాప్రభుత్వం పరిష్కారం చూపించి, వారి ఖాతాల్లో రూ.18 కోట్లు జమ చేయడం సంతోషంగా ఉందన్నారు. పదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ చేయలేని బీఆర్‌ఎస్ నేతలు.. రుణమాఫీపై మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉందని విమర్శించారు.

ఎమ్మెల్యేలు బజారున పడటం బాధ కలిగించింది

ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ వ్యవహారంపై మీడియా ప్రశ్నలకు స్పందిస్తూ.. బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారునపడి కొట్లాడుకోవడం బాధ కలిగించిందని భట్టి అన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల తగాదా వెనుక కాంగ్రెస్ పెద్ద తలకాయ ఉందని బీజేపీ ఆరోపించడం అర్థరహితమని పేర్కొన్నారు. కాగా ఇద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకుంటే కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. ప్రభుత్వంపై అడ్డగోలుగా మాట్లాడుతూ ప్రతి అంశాన్ని బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు విజయ రమణరావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లాల్ సలాం.. లాల్ సలాం

- ఏచూరికి ప్రముఖుల ఘన నివాళి
- పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద నివాళులు అర్పించిన వివిధ పార్టీల నేతలు
- పినరయి, సోనియా, శరద్ పవార్, ఉదయనిధి, చిదంబరం తదితరులు
- వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ విజయసాయిరెడ్డి
- భౌతికకాయం ఎయిమ్స్‌కు అప్పగింత
- బారులుతీరిన కామ్రేడ్లు, జనసంద్రమైన హస్తినలోని సీపీఎం కార్యాలయం


సీతారాం ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అశ్రునయనాల మధ్య, కడసారి చూపు కోసం తరలివచ్చిన వేలాదిమంది అభిమానులు, కార్యకర్తల మధ్య కామ్రేడ్ సీతారాం ఏచూరి నివాళులు పూర్తి అయ్యాయి. దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు, నేతలు ఏచూరికి తుది వీడ్కోలు పలికారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్, బృందా కారత్, వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి, తదితర ప్రముఖులు ఏచూరి పార్థివ దేహానికి ఘన నివాళులు అర్పించారు. ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, సచిన్ పైలట్, డీఎంకే పార్టీ మంత్రి ఉదయనిధి స్టాలిన్, ఎంపీ కనిమొళి, టీఆర్ బాలు, దయానిధి మారన్, ఆప్ నేత మనీశ్ సిసోడియా, కాంగ్రెస్ నేతలు చిదంబరం, జైరాం రమేష్, అజయ్ మాకెన్, రాజీవ్ శుక్లా, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, చైనా, వియత్నాం రాయబారులు నివాళులర్పించారు. అనంతరం ఏచూరి భార్య సీమాచిస్తీ, కుమార్తె అఖిల, కుమారుడు దానిష్‌లను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఏచూరిని కడసారి చూసేందుకు దేశవ్యాప్తంగా ఉన్న ఎస్ఎఫ్ఐ బృందం, ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థి సంఘాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, విదేశాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఢిల్లీ గోల్‌మార్కెట్‌లోని సీపీఎం కేంద్ర కార్యాలయం నుంచి ఎయిమ్స్ వరకు అంతిమ యాత్ర నిర్వహించారు. జోరు వానను లెక్కచేయకుండా 'ఇక సెలవు కామ్రేడ్, రెడ్ సెల్యూట్ ఏచూరి'అంటూ నినాదాలు చేశారు. సాయంత్రం 6 గంటలకు వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం ఏచూరి పార్థివ దేహాన్ని కుటుంబీకులు, పార్టీ నేతలు ఎయిమ్స్‌కు అప్పగించారు.

సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్‌కు ఉద్వాసన

- ఆ బాధ్యతలు తాత్కాలికంగా ఇద్దరు డైరెక్టర్లకు అప్పగింత

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో కీలకమైన ఒక డైరెక్టర్‌కు యాజమాన్యం ఉద్వాసన పలికింది. సంస్థలో సీఎండీ తర్వాత ఐదుగురు డైరెక్టర్లదే అగ్రస్థానం. ఇందులో డైరెక్టర్ ఆపరేషన్స్ (ఓపీ), డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ (పీపీ)కు ఏరియాల్లోని గనుల యాజమాన్య హోదా లభిస్తుంది. దీంతో గనుల ఏర్పాటులో కీలక అనుమతుల కోసం వీరి కృషే అధికం. అలాగే, నూతన యంత్రాల కొనుగోలు, భారీ పెట్టుబడులు, కొత్త గనుల ఏర్పాటు తదితర ప్రక్రియలోనూ వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. ఇంతటి హోదాలోని డైరెక్టర్ ఆపరేషన్స్, డైరెక్టర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ వింగ్-పీఏ డబ్ల్యూ)గా కొనసాగుతున్న ఎన్‌వీకే శ్రీనివాస్‌ను యాజమాన్యం ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఆ బాధ్యతలను ఇద్దరు డైరెక్టర్లకు తాత్కాలికంగా అప్పగించింది. అలాగే రెస్క్యూ టూర్‌కు వెళ్లాల్సిన క్రమంలో ఆయనను పక్కకు తప్పించింది. ఆయనపై రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా లేదని తెలుస్తోంది. శ్రీనివాస్‌ను బాధ్యతల నుంచి తప్పించడంతో ఖాళీ అయిన డైరెక్టర్ ఆపరేషన్ పోస్టును సంస్థలో ఉన్న సీనియర్ మైనింగ్ జీఎం ద్వారా, డైరెక్టర్ (పీఏడబ్ల్యూ) పోస్టును ఐఏఎస్ అధికారి ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. త్వరలో నిర్ణయం వెలువరించే అవకాశముంది. శ్రీనివాస్‌ను డైరెక్టర్ హోదా నుంచి తప్పించడంతో ఆయన జీఎంగా కొనసాగుతారా లేదా రాజీనామా చేసి వెళ్లిపోతారా అనే చర్చ జరుగుతోంది.

బాలుడి దారుణ హత్య

- గుప్త నిధుల కోసమా?.. డబ్బుల కోసమా?
- బాల్కొండ ఖిల్లాలో ఘటన


రాకేశ్

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలో పన్నెండేళ్ల బాలుడు దారుణ హత్యకు గురయ్యాడు. బాలుడిని గుప్త నిధుల కోసం చంపారా? లేదా డబ్బుల కోసమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి. బాల్కొండకు చెందిన బండి నరేందర్.. నచ్చు రాకేశ్ మేనమామ అయిన నాగాపూర్‌కు చెందిన దశరథ్ మేకలను మేతకు తీసుకుని వెళ్తాడు. దీంతో రాకేశ్ కుటుంబ సభ్యులకు పరిచయమయ్యాడు. గణపతులను చూసి వద్దామని చెప్పి ఈ నెల 11న బండి నరేందర్ చిట్టాపూర్ గ్రామానికి చెందిన బాలుడు నచ్చు రాకేశ్‌ను.. బాల్కొండకు తీసుకొచ్చాడు. ఆ రోజు రాత్రి 11 గంటల వరకు కూడా రాకేశ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నరేందర్‌ను ప్రశ్నించారు. అతని నుంచి సరైన సమాధానం రాక పోవడంతో బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా శనివారం ఉదయం బాల్కొండలోని ఖిల్లా ప్రాంతంలో బాలుడి మృతదేహం ఉందని చిట్టాపూర్ గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఈ ఘోరం వెలుగుచూసింది. బాలుడి మృతదేహంపై దుస్తులు లేకపోగా.. ఎడమ కంటి భాగంపై బండరాయితో మోది హత్య చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. ఖిల్లాలోని ఓ గుహ ముందు హత్య చేసి మృతదేహాన్ని కొద్దిదూరంలో పారేశారు. ఘటన స్థలాన్ని సీఐ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. బాలుడిని నరేందర్ హత్య చేసి ఉంటాడని బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. నరేందర్‌తో వెళ్లేముందు బాలుడు తన అన్న మణికంఠకు ఫోను చేసి చెప్పాడని తెలిపారు. పోలీసులు నరేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే అనుమానితుడు నేరాన్ని అంగీకరించలేదని పోలీసులు పేర్కొన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకుంటామన్నారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని నరేందర్‌ను తమకు అప్పగించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. హత్య జరిగిన మర్నాడు కూడా నరేందర్ తన భార్య మొబైల్‌తో ఫోన్ చేసి.. రాకేశ్ ఖానాపూర్ వద్ద ఉన్నాడని అబద్ధం చెప్పాడని వివరించారు. హత్య జరిగిన రోజు ఉదయం నరేందర్.. మొదట బాలుడి అన్న మణికంఠకు ఫోన్‌చేసి ఖిల్లా వద్దకు రమ్మన్నాడని, మణికంఠ వెళ్లకపోవడంతో రాకేశ్‌ను తీసుకెళ్లినట్లు వివరించారు. న్యాయం చేస్తామని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి హామీ ఇవ్వడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనను విరమించారు. హతుని తండ్రి రెండేళ్ల క్రితమే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

పువర్తి క్యాంప్‌పై మావోల మెరుపుదాడి

- శుక్రవారం రాత్రి రాకెట్ లాంచర్లతో ఎటాక్
- ఇరువైపులా గంటన్నరకు పైగా కొనసాగిన కాల్పులు
- తప్పిన ప్రాణనష్టం, కొనసాగుతున్న కూంబింగ్


పువర్తిలోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్ (ఫైల్)


రాకెట్ లాంచర్ షెల్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టు అగ్రనేత మడకం హిడ్మా స్వగ్రామమైన పువర్తిలో సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టులు మెరుపుదాడి చేశారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో అడవిలో నక్కిన మావోయిస్టులు.. క్యాంప్‌పైకి రాకెట్ లాంచర్లు ప్రయోగించారు. అయితే ఇవి క్యాంప్ వెలుపల జవాన్ల సంచారం లేని చోట పడటంతో ప్రాణనష్టం తప్పింది. వెంటనే తేరుకున్న భద్రతా దళాలు ఎదురుకాల్పులు ప్రారంభించాయి. సుమారు గంటన్నరపాటు తుపాకులు, బాంబుల మోతతో పువర్తి అటవీ ప్రాంతం దద్దరిల్లింది. శుక్రవారం రాత్రంతా జవాన్లు అప్రమత్తంగా గడిపారు. శనివారం క్యాంప్ సమీప అడవుల్లో కూంబింగ్ చేపట్టారు.

చొచ్చుకుపోతున్న బలగాలు

దాడులు చేయడంలో దిట్టగా పేరొందిన హిడ్మా సొంతూరిలో గత ఫిబ్రవరి 18న భద్రతా దళాలు క్యాంప్ ఏర్పాటు చేశాయి. వివిధ దళాలకు చెందిన వేలాది మంది జవాన్లు కేవలం వారం రోజుల్లోనే యుద్ధప్రాతిపదికన ఈ క్యాంప్ ఏర్పాటు చేసి మావోయిస్టులకు గట్టి హెచ్చరిక పంపారు. అంతేకాక పువర్తిలో ఉన్న స్తూపాలను ధ్వంసం చేశారు. హిడ్మా సమావేశాలు నిర్వహించే ఇంటిని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆ తర్వాత బస్తర్ అడవుల్లో వరుసగా చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు 150 మందికి పైగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు కోవర్టు ఆరోపణలతో ఈ ఏడాది పది మందిని మావోయిస్టులు హతమార్చారు. ఈ తరుణంలో మావోయిస్టు పార్టీలో అభద్రతా భావం నెలకొందని, తెలంగాణ కేడర్‌కు చెందిన నేతలను హిడ్మా నమ్మడం లేదనే ప్రచారం మొదలైంది.

కవ్వింపు చర్య?: వరుస నష్టాల నుంచి తేరుకుని, భద్రతా దళాలను ఆత్మరక్షణలో నెట్టే లక్ష్యంతో మావోయిస్టులు పువర్తి క్యాంప్‌పై దాడికి పాల్పడినట్టుగా తెలుస్తోంది. రాత్రివేళ వ్యూహాత్మకంగా క్యాంప్‌పై దాడి చేసి, అక్కడున్న భద్రతా దళాలను చెదరగొట్టడంతోపాటు తమకు పట్టున్న అటవీ ప్రాంతంలోకి రప్పించి అంబుష్ దాడి చేసేందుకు యత్నించినట్టు సమాచారం. అందులోభాగంగానే భారీ సంఖ్యలో జవాన్లు మోహరించిన క్యాంప్‌పై రాకెట్ లాంచర్లు ప్రయోగించి కవ్వింపు చర్యలకు దిగారని తెలుస్తోంది. అయితే రాత్రంతా క్యాంప్ లోపలే ఉండడం ద్వారా మావోలు పన్నిన ఉచ్చులో జవాన్లు చిక్కుకోలేదని చెబుతున్నారు. జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో 8 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఇదే జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. ఘటనాస్థలి నుంచి బలగాలు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా సీఆర్‌పీఎఫ్ బెటాలియన్-226(గాదిరాస్, సుక్మా జిల్లా) క్యాంప్‌లో పనిచేస్తున్న అస్సాంకు చెందిన జవాన్ విపుల్ భయాన్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

కులగణనపై త్వరలో కార్యాచరణ

- క్షేత్రస్థాయి పరిశీలన కోసం జిల్లాల వారీ పర్యటనల షెడ్యూల్‌పై బీసీ కమిషన్ కసరత్తు
- విధివిధానాలపై బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులతో ఉన్నతాధికారుల భేటీ


అధికారులు, కమిషన్ సభ్యులతో చర్చిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

సాక్షి, హైదరాబాద్: కులగణనపై త్వరలో కార్యాచరణ ప్రణాళిక ప్రకటించేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి జిల్లాల పర్యటనల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు కసరత్తు జరుగుతోందని అధికార వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, విధానాలపై ప్రస్తుతం బీసీ కమిషన్ దృష్టి పెట్టింది. ఓటరు జాబితాలతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి బీసీ కమిషన్ నుంచి ఆదేశాలు రాగానే.. తాము శాఖాపరంగా కార్యాచరణ చేపడతామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించినట్టు తెలిసింది.

రెండు మార్గాలపై చర్చ: కులగణన, ఇతర అంశాలపై బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి, సభ్య కార్యదర్శి బాల మాయాదేవిలతో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, డిప్యూటీ కమిషనర్ సుధాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కులగణనకు సంబంధించి రెండు మార్గాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. అసెంబ్లీ ఓటర్ జాబితాల ఆధారంగా.. ఇళ్లకు వెళ్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల పరిశీలన చేపట్టడం.. లేదా నేరుగా ఇంటింటికీ వెళ్లి కులగణన చేపట్టడంతోపాటు ఈ రెండింటిలో ఏది మేలు? సాధకబాధకాలేమిటన్న దానిపై చర్చించినట్టు సమాచారం.

ప్రక్రియకు ఎంత సమయం పడుతుంది?: కులగణన ప్రక్రియ ముగిసేందుకు ఎంత సమయం పడుతుంది? ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయా? అన్న అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలోని దాదాపు లక్ష మంది సేవలను ఎన్యుమరేషన్‌కు ఉపయోగించుకుని 15 రోజుల్లోనే ప్రాథమిక సమాచార సేకరణ పూర్తి చేయొచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ ఆ డేటాను నమోదు చేయడానికి చాలా సమయం పడుతుందని అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. ఇక పంచాయతీరాజ్ శాఖ పరంగా బీసీ కమిషన్‌కు అవసరమైన వివరాలు తీసుకున్నట్టు సమాచారం. మరోవైపు బుధవారం బీసీ సంఘాల ముఖ్య నేతలు, మేధావులు, సంఘాలతో బీసీ కమిషన్ భేటీ కానున్నట్టు తెలిసింది. అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోనూ భేటీ కానున్నట్టు సమాచారం.

'సమగ్ర కులగణన విధివిధానాలు ప్రకటించాలి'


ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: హైకోర్టు తీర్పు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర కులగణన షెడ్యూల్, విధివిధానాలను ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. మూడు నెలల్లో కులగణనను పూర్తి చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం ఆ దిశగా ముందుకుసాగడం లేదని విమర్శించారు. సమగ్ర కులగణన, బీసీ రిజర్వేషన్ల పెంపు, రాజ్యాంగ రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42%కు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, డాక్టర్ వినయ్ జస్వంత్ (టీజేఎస్), గోవర్ధన్ (సీపీఐఎంఎల్), అబ్బాస్ (సీపీఎం), రామేశ్వర్ (టీడీపీ), గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, నీలం వెంకటేశ్, మల్లేశ్, నందగోపాల్, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బరాజ్‌లో నిలిచిన ఏడీసీపీ పరీక్షలు


అన్నారం బరాజ్‌పై డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న నిపుణుడు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ బరాజ్‌లో ఏడీసీపీ పరీక్షలు శనివారం నిలిచాయి. మూడు రోజులుగా పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు సంపత్, నాగరాజు ఆధ్వర్యంలో బరాజ్ నీటిలో బోటుతో తిరుగుతూ సర్వే పరీక్షలు జరిపారు. అయితే టీం సభ్యులు శని, ఆదివారాలు సెలవు కావడంతో పుణేకు వెళ్లారు. సోమవారం నుంచి అదే సంస్థకు చెందిన మరో బృందం ఏడీసీపీ సర్వే పరీక్షలు చేపడుతుందని ఇరిగేషన్ ఇంజనీర్లు తెలిపారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం బరాజ్‌లో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం శనివారం సర్ఫేస్ ట్రాకింగ్ ప్యాటర్న్‌పై డ్రోన్ వీడియో, ఫొటోలు తీశారు. బరాజ్‌లో కంటికి కనిపించని పగుళ్లను (క్రాక్స్) కనుగొనడానికి యూఏవీ అత్యాధునిక రిజల్యూషన్ కలిగిన డ్రోన్‌తో బరాజ్ పొడవునా, అప్, డౌన్ స్ట్రీమ్‌ల్లో చిత్రీకరణ చేశారు. మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో ఏర్పడిన పగుళ్ల, కుంగిన విషయమై సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల్లో కూడా ఈ పరీక్షలు చేపట్టారని తెలిసింది. ఈ నివేదికలు ఎన్‌డీఎస్ఏకు పంపనున్నారు. వారి వెంట ఈఈ యాదగిరి, డీఈఈ రవిచంద్ర తదితరులున్నారు.



సందీప్ ఘోష్

సాక్ష్యాలను నాశనం చేశారు

- మాజీ ప్రిన్సిపల్‌పై సీబీఐ అభియోగాలు
- సీఐ అభిజిత్ మండల్ అరెస్టు

కోల్‌కతా: దేశవ్యాప్త ఆగ్రహావేశాలకు, ఆందోళనలకు కారణమైన కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఉదంతం శనివారం కీలక మలుపు తిరిగింది. ఆర్.జీ.కర్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ఈ దారుణం జరిగిన సమయంలో ప్రిన్సిపల్‌గా ఉన్న సందీప్ ఘోష్ సాక్ష్యాధారాలను నాశనం చేశారని సీబీఐ కేసు నమోదు చేసింది. ఆస్పత్రి నిధుల దుర్వినియోగం కేసులో ఆయన ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. సాక్ష్యాలను నాశనం చేయడం, ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యంతో పాటు కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారని ఘోష్‌పై అభియోగాలు మోపింది. ఇవే అభియోగాలపై స్థానిక తలా పోలీసుస్టేషన్ సీఐ అభిజిత్ మండల్‌ను కూడా అరెస్టు చేసింది. ఆర్.జీ.కర్ ఆసుపత్రి తలా పోలీసుస్టేషన్ పరిధిలోకే వస్తుంది. అభిజిత్ మండల్‌ను శనివారం సీబీఐ తమ కార్యాలయంలో కొన్ని గంటల పాటు ప్రశ్నించింది. సంతృప్తికరమైన సమాధానాలు రాకపోవడంతో మండల్‌ను అరెస్టు చేసింది. అతన్ని ప్రశ్నించడం ఇది ఎనిమిదోసారి అని. ప్రతిసారీ మండల్ భిన్నమైన కథనం చెబుతున్నాడని సీబీఐ వర్గాలు తెలిపాయి. సందీప్ ఘోష్‌ను కస్టడీ కోరుతూ సీబీఐ న్యాయస్థానంలో దరఖాస్తు చేసింది. సీబీఐ కస్టడీ నిమిత్తం ఘోష్‌ను హాజరుపర్చాల్సిందిగా కోర్టు జైలు అధికారులను ఆదేశించిందని సీబీఐ అధికారి ఒకరు శనివారం తెలిపారు. 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్ ఆగస్టు 9న ఆస్పత్రి సెమినార్ హాల్లో శవమై కన్పించడం తెలిసిందే. ఆమెపై పాశవికంగా అత్యాచారం జరిపి దారుణంగా హతమార్చినట్లు పోస్టుమార్టంలో తేలింది. ఒక రోజు అనంతరం ఆస్పత్రిలో పౌర వాలంటీర్‌గా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దారుణంపై వైద్యలోకం భగ్గుమంది. దీనివెనుక చాలామంది ఉన్నారని, ఆ వాస్తవాలను తొక్కిపెట్టేందుకు మమత సర్కారు ప్రయత్నిస్తోందని డాక్టర్లు ఆరోపించారు. వైద్యశాఖ కీలక డైరెక్టర్లు, కోల్‌కతా పోలీసు కమిషనర్ తదితరుల రాజీనామా కోరుతూ పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా నిరసనలతో వైద్యులు హోరెత్తిస్తున్నారు. అనంతర పరిణామాల్లో కేసు దర్యాప్తును సీబీఐకి కలకత్తా హైకోర్టు అప్పగించింది. దర్యాప్తు పురోగతిపై మూడు వారాల్లోగా నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది. ఆ మేరకు సెప్టెంబర్ 17లోగా దర్యాప్తు సంస్థ నివేదిక సమర్పించనుందని సమాచారం.

ఘోష్‌కు నేరగాళ్లతో లింకులు

వైద్యురాలిపై దారుణం జరిగిన మర్నాడే సందీప్ ఘోష్ హడావుడిగా ఆస్పత్రిలో మరమ్మతులకు ఆదేశాలు జారీ చేసినట్టు సీబీఐ ఆరోపిస్తోంది. ఆ మేరకు ఘోష్ ఆదేశాలిచ్చిన లేఖను కూడా బెంగాల్ బీజేపీ చీఫ్, కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ కేసు నిందితులతో ఘోష్‌కు నేరపూరిత బంధం ఉందని, వారితో కలిసి పలు తప్పుడు పనులకు కూడా పాల్పడ్డారని సీబీఐ గత వారమే అభియోగాలు మోపింది.

కాంగోలో 37 మందికి మరణ శిక్ష

కిన్షాసా: ఆఫ్రికా దేశం కాంగోలో మే నెలలో జరిగిన విఫల తిరుగుబాటు యత్నం ఘటనలో పాలుపంచుకున్న ఆరోపణలపై అక్కడి కోర్టు ఏకంగా 37 మందికి మరణ దండన విధించింది. దోషుల్లో అమెరికాకు చెందిన ముగ్గురు, బెల్జియం, కెనడా, యూకేలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. అప్పీల్ చేసుకునేందుకు వీరికి కోర్టు ఐదు రోజుల గడువిచ్చింది. తిరుగుబాటుకు పాలుపంచుకున్నారంటూ మొత్తం 50 మందిపై ఆర్మీ అభియోగాలు మోపింది. కోర్టు వీరిలో 14 మందిని నిర్దోషులుగా పేర్కొంటూ విడుదల చేసింది. కోర్టు తీర్పుపై అప్పీలుకు వెళ్తామని ఆరుగురు విదేశీయుల తరఫు లాయర్ తెలిపారు.

మీరిక వెళ్లొచ్చు

అకస్మాత్తుగా పంపేశారు

- ప్రత్యక్షప్రసారం లేకుండా చర్చలకు సిద్ధపడ్డాం
- బెంగాల్ ప్రభుత్వానికి చర్చలపై ఆసక్తి లేనట్లుంది: జూడాలు
- రోజంతా హైడ్రామా
- జూడాల సమ్మెస్థలి వద్దకు వెళ్లిన మమత
- భీష్మించిన జూడాలు.. సాయంత్రానికి చర్చలకు అంగీకారం
- మమత నివాసానికి రాక.. ప్రత్యక్షప్రసారానికి పట్టు
- కుదరదన్న సర్కారు.. చర్చలకు రావాలని మమత అభ్యర్థన
- తగ్గిన జూడాలు.. 'లైవ్' లేకుండానే చర్చలకు సమ్మతి
- మూడు గంటలు వేచిచూశాం.. మీరిక వెళ్లొచ్చన్న ఆరోగ్యమంత్రి

కోల్‌కతా: రోజంతా హైడ్రామా తర్వాత బెంగాల్ ప్రభుత్వం, జూనియర్ డాక్టర్లకు మధ్య శనివారం చర్చలు అసలు ప్రారంభమే కాలేదు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభ్యర్థన మేరకు 'ప్రత్యక్ష ప్రసారం' డిమాండ్‌ను పక్కనబెట్టి చర్చలకు సిద్ధపడ్డ జూనియర్ డాక్టర్లను అకస్మాత్తుగా సీఎం నివాసం దగ్గర నుంచి పంపేశారు. చాలా మొరటుగా మీరికి వెళ్లిపోవచ్చని చెప్పారని జూడాలు ఆరోపించారు. 'చర్చలకు ఆహ్వానించడంతో సీఎం నివాసానికి వచ్చాం. ప్రత్యక్షప్రసారం లేదా వీడియో రికార్డింగు ఉండాలని డిమాండ్ చేశాం. సీఎం మమతా బెనర్జీ బయటకు వచ్చి చర్చలకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం మినిట్స్‌ను మాకు ఇస్తామని హామీ ఇచ్చారు. మాలో మేము చర్చించుకున్నాం. సీఎం విజ్ఞప్తి మేరకు ప్రత్యక్షప్రసారం, వీడియో రికార్డింగు లేకుండా చర్చలకు అంగీకరించాం. ఇదే విషయాన్ని ఆరోగ్యమంత్రి చంద్రిమ భట్టాచార్యకు తెలుపగా.. ఇక చాలు మీరు వెళ్లిపోండని ఆమె చెప్పారు. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది, మీకోసం మూడు గంటలుగా వేచిచూస్తున్నామని తెలిపారు. అర్ధంతరంగా మమ్మల్ని పంపేశారు' అని సీఎం నివాసం వద్ద జూనియర్ డాక్టర్లు మీడియాతో వాపోయారు. చర్చలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. 'ఈ ఉదంతం ప్రభుత్వం అసలు రంగును బయటపెట్టింది. చర్చలపై ఎవరికి చిత్తశుద్ధి లేదో తెలుపుతోంది' అని ఒక జూనియర్ డాక్టర్ కన్నీరుపెట్టుకుంటూ అన్నారు. 'ఈ రోజుకు ఇక ముగిసినట్లే. మూడు గంటలుగా మేం వేచి చూస్తున్నాం. మీరు సీఎం నివాసం లోపలికి రాలేదు. ఇప్పటికే బాగా ఆలస్యమైపోయింది (రాత్రి అయిందని)' అని ఆరోగ్యమంత్రి చంద్రిమ అంటున్న వీడియోను జూడాలు మీడియాకు షేర్ చేశారు. ఆర్.జీ.కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న పీజీ ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు నెలరోజులకు పైగా విధులను బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబరు 10న సాయంత్రానికల్లా విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ సమ్మె కొనసాగిస్తున్నారు. చర్చలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. జూడాల డిమాండ్ మేరకు స్వయంగా చర్చల్లో పాల్గొనడానికి మమత అంగీకరించారు. ప్రత్యక్షప్రసారంపై పీటముడి పడినా.. చివరకు శనివారం జూడాలు దానిపై వెనక్కితగ్గారు. అయినా సర్కారు వైఖరితో చర్చలు సాధ్యపడలేదు.

ఎన్నిసార్లు నన్నిలా అవమానిస్తారు: మమత

అంతకుముందు సీఎం నివాసం వద్దకు చేరుకొని జూనియర్ డాక్టర్లు చర్చల ప్రత్యక్షప్రసారం డిమాండ్‌తో బయటే నిలబడిపోయారు. వర్షంలో తడుస్తూ అలాగే నిలబడ్డారు. దాంతో సీఎం మమత బయటకు వచ్చి.. 'మీరందరూ లోపలికి వచ్చి చర్చల్లో పాల్గొనాల్సిందిగా అభ్యర్థిస్తున్నాను. వైద్యురాలి హత్యాచారం కేసు కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ప్రత్యక్షప్రసారం సాధ్యం కాదు. చర్చలను వీడియో రికార్డు చేసి.. సుప్రీంకోర్టు అనుమతితో మీకొక కాపీ అందజేస్తాం. ఈ రోజు సమావేశమవుదామని మీరే కోరారు. మీకోసం వేచిచూస్తున్నా. మీరెందుకు నన్నిలా అవమానిస్తున్నారు. దయచేసి నన్నిలా అవమానించొద్దు. ఇదివరకు కూడా మూడుసార్లు మీకోసం ఎదురుచూస్తూ కూర్చున్నా. కానీ మీరు రాలేదు' అని మమత జూడాలతో అన్నారు.

జూడాల శిబిరం వద్ద ప్రత్యక్షం

శనివారం ఉదయం అందరినీ ఆశ్చర్యపరుస్తూ సీఎం మమతా బెనర్జీ స్వయంగా జూనియర్ డాక్టర్ల వద్దకు వచ్చారు. ఐదురోజులుగా జూడాలు బైఠాయించిన స్వాస్థ్య భవన్ (ఆరోగ్యశాఖ కార్యాలయం) వద్దకు చేరుకున్నారు. జూడాల డిమాండ్లను పరిశీలిస్తానని, ఎవరైనా తప్పుచేశారని తేలితే వారిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మెడికోలు వర్షాలకు తడుస్తూ రోడ్లపై ఆందోళనలు కొనసాగిస్తుంటే తాను నిద్రలేని రాత్రులు గడుపుతున్నానని చెప్పారు. తానిక్కడి రావడం సమస్య పరిష్కారం దిశగా చివరి ప్రయత్నమని తెలిపారు. సమ్మె చేస్తున్న జూడాలపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలుండవని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యయుత ఆందోళనను అణిచివేయడానికి ఇది ఉత్తరప్రదేశ్ కాదు, బెంగాల్ అని సీఎం వ్యాఖ్యానించారు.



జూడాల ప్రతినిధి బృందం ఇంట్లోకి రాకపోవడంతో గుమ్మం వద్ద ఎదురుచూస్తున్న మమత



జూడాల ప్రతినిధి బృందం ఇంట్లోకి రాకపోవడంతో తానే బయటకు వచ్చి 'నన్ను మీరు అవమానించారంటూ' ఆక్షేపిస్తున్న మమత



మోదీ ఇంట్లో 'దీప్‌జ్యోతి'

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసమైన 7, లోక్‌కల్యాణ్ మార్గ్‌లో కొత్త సభ్యురాలు 'దీప్‌జ్యోతి' చేరింది. ఈ కొత్త సభ్యురాలు ఎవరో కాదు. ఒక ఆవుదూడ. ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్'లో వెల్లడించారు. తన నివాసంలో గోమాత ఒక దూడకు జన్మనిచ్చిందని తెలిపారు. దానికి దీప్‌జ్యోతి అని నామకరణం సైతం చేశారు. దూడతో తాను ఆడుకుంటున్న వీడియో, ఫొటోలను మోదీ 'ఎక్స్'లో షేర్ చేశారు. 'గా సర్వసుఖ్‌ప్రధ' అని మన పురాణాల్లో ప్రస్తావించారని పేర్కొన్నారు. గోమాతకు జన్మించిన దూడ నుదుటిన జ్యోతి(దీపం) లాంటి మచ్చ ఉందని, అందుకే దీప్‌జ్యోతి అని పేరు పెట్టినట్లు వివరించారు. ప్రధానమంత్రి షేర్ చేసిన వీడియోలో దూడను చేతుల్తో ఇంట్లోకి తీసుకెళ్తున్న దృశ్యాలు, ఆలయం వద్ద దూడను ఒడిలో పెట్టుకున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఆధార్ కార్డుల్లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకొనే గడువును కేంద్ర ప్రభుత్వం మరోసారి పొడగించింది. శనివారంతో గతంలో ఇచ్చిన గడువు ముగియడంతో ఉడాయ్ (యూఐడీఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 'ఎక్స్'లో ఈ వివరాలను వెల్లడించింది. పదేళ్ల కిందటి ఆధార్ కార్డులకు సంబంధించిన మార్పులు, చేర్పులకు సంబంధించిన అప్‌డేట్‌లను ఉచితంగా చేసుకొనేందుకు గడువును మరో మూడునెలల పాటు.. డిసెంబర్ 14 వరకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ పొడగించింది. ఆన్‌లైన్‌లో ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ ద్వారా మై ఆధార్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి మార్పులను ఉచితంగా చేసుకోవచ్చని ఉడాయ్ పేర్కొంది. ఇప్పటి వరకు వివరాలను అప్‌డేట్ చేసుకోలేకపోయిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఉడాయ్ సూచించింది. ఒకవేళ డిసెంబర్ 14లోగా ఉచితంగా అప్‌డేట్ చేసుకోలేని వారు... తర్వాత 50 రూపాయలు చెల్లించి ఆధార్ కేంద్రాల్లో వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చు.

వారణాసిలో జ్ఞానవాపీ విశ్వనాథ ఆలయం

దాన్ని మసీదు అనడం దురదృష్టకరం: యోగి ఆదిత్యనాథ్



గోరఖ్‌పూర్: వారణాసిలోని జ్ఞానవాపీని మసీదు అని పిలుస్తుండడం దురదృష్టకరమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. అది మసీదు కాదని చెప్పారు. జ్ఞానవాపీ ప్రాంగణమంతా విశ్వనాథుడి ఆలయమని స్పష్టంచేశారు. ఆ విషయం విశ్వనాథుడే స్వయంగా చెప్పాడని తెలిపారు. శనివారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గోరఖ్‌పూర్ యూనివర్సిటీలో 'సామరస్య సమాజ నిర్మాణంలో నాథ్‌పంత్ పాత్ర' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. జ్ఞానవాపీని మసీదుగా కొందరు పరిగణిస్తుండడం సరైంది కాదని పేర్కొన్నారు. పురాణాల ప్రకారం చూస్తే ఆది శంకరుడికి, కాశీ విశ్వనాథుడికి మధ్య సంవాదం జరిగిందని తెలిపారు. జ్ఞానవాపీ తన ప్రాంగణమేనని ఆది శంకరుడితో విశ్వనాథుడు చెప్పినట్లు వెల్లడించారు. జ్ఞానవాపీ వ్యవహారంపై హిందువులు, ముస్లింల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

హిందీ, ప్రాంతీయ భాషల మధ్య పోటీ ఉండదు

హిందీ దివస్ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ: అధికార భాష అనే కారణంగా హిందీ, ఇతర భారతీయ భాషల మధ్య పోటీ ఎన్నడూ ఉండదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హిందీ, ఇతర భాషల మధ్య మైత్రి ఉందని, అవి పరస్పరం ప్రోత్సహించుకుంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతిమంగా, హిందీ, ఇతర ప్రాంతీయ భాషల మధ్య బంధం బలోపేతమవుతుందని చెప్పారు. హిందీ దివస్ సందర్భంగా శనివారం జరిగిన అఖిల భారతీయ రాజ్యభాష నాలుగో సమ్మేళనంలో మంత్రి అమిత్ షా మాట్లాడారు. ప్రపంచంలోని అత్యుత్తమ భాషల్లో భారతీయ భాషలు కూడా ఉన్నాయన్నారు. హిందీ మన భాషలన్నిటికీ అనుసంధానకర్తగా ఉంటుందని చెప్పారు. ఇతర భారతీయ భాషలను బలోపేతం చేసే వరకు హిందీని అధికార భాషగా ప్రమోట్ చేయలేమని అన్నారు.

'సున్నితమైన సమాచారం' వల్లే ఆలస్యం

సీజేల నియామకం ఆలస్యంపై అటార్నీ జనరల్



న్యూఢిల్లీ: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల అమల్లో ఆలస్యానికి 'సున్నితమైన సమాచార'మే కారణమని కేంద్రం పేర్కొంది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనానికి అటార్నీ జనరల్ ఆర్.వెంకట రమణి శనివారం ఈ మేరకు నివేదించారు. 'ఆ సమాచారాన్ని బయటపెట్టడం న్యాయ వ్యవస్థకు గానీ, సదరు జడ్జీలకు గానీ మేలు చేయబోదు. కనుక సదరు సమాచారాన్ని నా సూచనలతో పాటుగా సీల్డ్ కవర్లో మీ ముందుంచుతా' అని విన్నవించారు. దాంతో తదుపరి విచారణను ధర్మాసనం సెప్టెంబర్ 20కి వాయిదా వేసింది. జడ్జీల నియామకం, పదోన్నతులకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల అమలుకు కేంద్రానికి నిర్దిష్ట కాలావధి ఖరారు చేయాలంటూ హర్ష్ సింఘాల్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరుపుతోంది. కొలీజియం సిఫార్సు చేసిన పేర్లపై కాలావధి లోపు కేంద్రం ఎలాంటి అభ్యంతరాలు తెలపకపోయినా, నిర్ణయం తీసుకోకపోయినా వాటికి ఆమోదముద్ర వేసినట్టుగానే భావించేలా పేర్కొంటూ తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు. కొలీజియం సిఫార్సులను కేంద్రం నిరవధికంగా తొక్కిపెట్టడం వల్ల న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికే భంగం కలుగుతోందని ఆరోపించారు.

తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం నుంచి నీరు లీకేజీ



ఆగ్రా: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షాలతో వీధులన్నీ జలమయమయ్యాయి. మరోవైపు తాజ్‌మహల్‌ను సైతం వరద నీరు చుట్టుముట్టింది. తాజ్‌మహల్ ప్రధాన డోమ్(గుమ్మటం) నుంచి నీరు లీకవుతున్నట్లు గుర్తించారు. అయితే, ఈ గుమ్మటం ఉన్న పైకప్పుకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, ఆందోళన అక్కర్లేదని భారత పురావస్తు పరిశోధన విభాగం (ఏఎస్ఐ) సూపరింటెండింగ్ చీఫ్ రాజ్‌కుమార్ పటేల్ శనివారం చెప్పారు. డ్రోన్ కెమెరాతో ప్రధాన డోమ్‌ను క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రపంచ వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్‌ను వరద నీరు చుట్టుముట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

కశ్మీర్‌లో ముగ్గురు ముష్కరులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. పట్టన్ ఏరియాలోని చక్ టప్పర్ క్రీరిలో ఉగ్రవాదులున్నారనే అనుమానంతో భద్రతా బలగాలు శుక్రవారం రాత్రి కార్డన్ సెర్చ్ చేపట్టాయి. శనివారం ఉదయం ఉగ్రమూకలు కాల్పులకు దిగడంతో బలగాలు దీటుగా స్పందించాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు చనిపోయారని పోలీసులు వివరించారు. భారీగా మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతులను గుర్తించాల్సి ఉందన్నారు. ఆ ప్రాంతంలో గాలింపు కొనసాగుతోందని చెప్పారు.



వారసత్వ రాజకీయాలే పెనుశాపం

అందమైన జమ్మూకశ్మీర్‌ను దారుణంగా దెబ్బతీశాయి

- ఇక్కడి ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయి
- మేము కేంద్రంలో అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది
- దోడా ఎన్నికల ప్రచార సభలో మోదీ

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం చివరి శ్వాస పీల్చుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రకృతి సౌందర్యానికి మారుపేరైన జమ్మూకశ్మీర్‌ను ఇక్కడి వారసత్వ రాజకీయాలు దారుణంగా దెబ్బతీశాయని, పెనుశాపంగా మారి ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయని మండిపడ్డారు. వారసత్వ రాజకీయ పార్టీలు సొంత బిడ్డల సంక్షేమమే తప్ప ప్రజల బాగోగులు ఏనాడూ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. నూతన నాయకత్వాన్ని పైకి ఎదగనివ్వలేదని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలకు పోటీగా నూతన నాయకత్వాన్ని ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. 2014లో తాము కేంద్రంలో అధికారంలోకి రాగానే ఇక్కడ నాయకత్వ నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు. శనివారం జమ్మూ ప్రాంతంలోని దోడా జిల్లాలో భారీ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాబోయయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అద్భుతమైన మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, కాంగ్రెస్ లాంటి పార్టీలు మళ్లీ అధికారంలోకి వస్తే అధోగతేనని తేల్చిచెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి జమ్మూకశ్మీర్ విదేశీ శక్తులకు టార్గెట్‌గా మారిందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ఈ ప్రాంత భవిష్యత్తును నిర్దేశించబోతున్నాయని స్పష్టంచేశారు. గత నాలుగు దశాబ్దాల్లో దోడా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మొట్టమొదటి ప్రధాని నరేంద్ర మోదీ కావడం విశేషం. సభలో ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

యువ నాయకత్వానికి పెద్దపీట వేశాం

''ఉగ్రవాద భూతం వల్ల జమ్మూకశ్మీర్ యువత తీవ్రంగా నష్టపోయారు. ఇక్కడ అధికారం వెలగబెట్టిన పార్టీలు ప్రజలను తప్పు దోవ పట్టిస్తూ కుటుంబ స్వామ్యాన్ని పెంచి పోషించాయి. యువతను రాజకీయాల్లో ప్రోత్సహించలేదు. 2000 సంవత్సరం నుంచి పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. 2014 తర్వాత బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, జిల్లా డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికలు జరగలేదు. మేము అధికారంలోకి వచ్చాక ఆయా ఎన్నికలు నిర్వహించాం. యువ నాయకత్వానికి పెద్దపీట వేశాం.

వెండితెరపై మళ్లీ జమ్మూకశ్మీర్ అందాలు

ఉగ్రవాద బాధితురాలు షగున్ పరిహార్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ కేటాయించాం. ఉగ్రవాదాన్ని పూర్తిగా పెకిలించాలన్న మా అంకితభావానికి ఇదొక ఉదాహరణ. 2018 నవంబర్‌లో షగున్ తండ్రిని, బంధువును ఉగ్రవాదులు కాల్చిచంపారు. జమ్మూకశ్మీర్‌ను ఉగ్రవాద రహితంగా, పర్యాటకుల స్వర్గధామంగా మార్చాలన్నదే మా లక్ష్యం. అంతర్జాతీయ సినిమా షూటింగ్‌లు ఇక్కడ జరిగే పరిస్థితి రావాలి. వెండితెరపై జమ్మూకశ్మీర్ అందాలు మళ్లీ కనిపించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్టికల్ 370ను మళ్లీ తీసుకొస్తారట!

కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ ఎన్నికల మేనిఫెస్టో, బీజేపీ హామీల మధ్య తేడాలను ప్రజలు గమనించాలి. ఆర్టికల్ 370ను మళ్లీ తీసుకొస్తామని ఆ మూడు పార్టీలు చెబుతున్నాయి. అంటే ప్రజల హక్కులను మళ్లీ దోచుకుంటారట! రిజర్వేషన్లు, ఓటు హక్కును రద్దు చేస్తారట! ఆర్టికల్ 370తోపాటు ఆర్టికల్ 35ఏ పునరుద్ధరిస్తే ఆడబిడ్డలను తీరని అన్యాయం జరుగుతుంది. మూడు పార్టీల మేనిఫెస్టో అమల్లోకి వస్తే పాఠశాలలు మళ్లీ అగ్నికి ఆహుతవుతాయి.

బీజేపీ నేతలను అరెస్టు చేయడమే కాంగ్రెస్ ఎజెండానా?

కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం నిజాయతీ లేదు. అధికారంలోకి రావడానికి అవినీతి, వారసత్వ రాజకీయాలు, ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడడం ఆ పార్టీకి అలవాటే. అమెరికాలో భారతీయ జర్నలిస్టుపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల గురించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నోరువిప్పుతారా? అని శామ్ పిట్రోడాను ప్రశ్నించినందుకు గదిలో బంధించి దారుణంగా కొట్టారు. ఇలా చేయడం మన దేశ గౌరవాన్ని పెంచుతుందా? కాంగ్రెస్ రాజకుటుంబం అత్యంత అవినీతిమయమైన కుటుంబం. వారసత్వ రాజకీయాలు చేస్తున్న ఆ కుటుంబం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి మరో 20 సీట్లు వచ్చి ఉంటే బీజేపీ నేతలను జైలుకు పంపించేవాళ్లమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అంటే వారి ఎజెండా అదేనా? మమ్మల్ని జైల్లో పెట్టడానికే కాంగ్రెస్‌కు అధికారం కావాలా? ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అక్కర్లేదా?'' అని ప్రశ్నించారు.

తీగ దొంగిలించాడని నగ్నంగా డ్యాన్స్ చేయించారు

రాజస్తాన్‌లో దళిత బాలుడిపై అమానుషం

కోటా: వైర్ దొంగతనం చేస్తూ దొరికిపోయాడంటూ 12 ఏళ్ల దళిత బాలుడి పట్ల కొందరు అమానుషంగా ప్రవర్తించారు. అతడి బట్టలు విప్పించి, డ్యాన్స్ చేయించారు. ఒక పాటకు స్టెప్పులేస్తుండగా వారు అతడి చుట్టూ చేరినట్లుగా ఉన్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. వెకిలిగా నవ్వుకుంటూ డ్యాన్స్ చేయాలని బాలుడిని బలవంతపెడుతున్నట్లుగా ఉంది. ఈ వీడియో పోలీసుల దృష్టికి రావడంతో ఆ ప్రాంతాన్ని గుర్తించారు. పోలీసుల సలహా మేరకు బాధితుడి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సంతకు బాలుడు వెళ్లాడు. మ్యూజిక్ సామగ్రిలోని వైర్‌ను దొంగిలిస్తుండగా అతడిని పట్టుకున్నామంటూ నలుగురైదుగురు వ్యక్తులు అర్ధరాత్రి ఒంటిగంట నుంచి తెల్లవారే దాకా తీవ్రంగా వేధించారు. ఈ మేరకు ఆరుగురిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐఎస్ఎస్‌లో ఇబ్బందేమీ లేదు

- సుదీర్ఘకాలం ఇక్కడే ఉండడానికి సిద్ధమయ్యాం
- పరిస్థితులకు తగ్గట్టుగా సర్దుకుపోవడానికి ప్రయత్నిస్తున్నాం
- అమెరికా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్

వాషింగ్టన్: భూమికి వందల కిలోమీటర్ల ఎగువన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో సుదీర్ఘకాలం సభ్యులుగా కొనసాగడానికి తాము పూర్తిస్థాయిలో సిద్ధమయ్యామని అమెరికా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ చెప్పారు. మానసికంగా, శారీరకంగా తమను తాము సిద్ధం చేసుకున్నామని, పరిస్థితులకు తగ్గట్టుగా సర్దుకుపోవడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన సీఎస్‌టీ-100 స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఈ ఏడాది జూన్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీతా విలియమ్స్, విల్‌మోర్ అక్కడే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. 8 రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, స్టార్‌లైనర్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో అది సాధ్యపడలేదు. స్టార్‌లైనర్ ఒంటరిగానే భూమిపైకి తిరిగివచ్చింది. ఇద్దరు వ్యోమగాములు వచ్చే ఏడాది ఫిబ్రవరి దాకా ఐఎస్ఎస్‌లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' తీసుకున్న నిర్ణయానికి మద్దతు ఇస్తున్నామని చెప్పారు. సునీతా విలిమమ్స్, విల్‌మోర్ శుక్రవారం ఐఎస్ఎస్ నుంచి ఫోన్‌లో మీడియాతో మాట్లాడారు. మనం నియంత్రించలేని పరిస్థితులు ఉన్నప్పుడు ఆందోళన చెందడం అనవసరమని విల్‌మోర్ అన్నారు. ఐఎస్ఎస్‌లో ఎక్కువ రోజులు కంటే ఉండడానికి తమకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇక్కడి పరిస్థితులకు పూర్తిగా అలవాటు పడ్డామని వివరించారు. తాము ప్రొఫెషనల్ వ్యోమగాములం కాబట్టి అంతరిక్ష ప్రయోగాల్లో కొత్త పనులు చేయడానికి, కొత్త విషయాలు నేర్చుకోవడం ఎల్లప్పుడు ఆసక్తికరంగానే ఉంటుందని సునీతా విలియమ్స్ వ్యాఖ్యానించారు. స్టార్‌లైనర్‌లో వెనక్కి వెళ్లలేకపోవడం పట్ల తమకు ఎలాంటి విచారం లేదన్నారు.



ఐఎస్ఎస్‌లో ఉన్న సునీతా విలియమ్స్, విల్‌మోర్

అంతరిక్షం నుంచే సునీతా విలియమ్స్, విల్‌మోర్ ఓటు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ అక్కడి నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పౌరులుగా ఎన్నికల్లో ఓటు వేయడం ముఖ్యమైన బాధ్యత అని సునీతా విలియమ్స్ చెప్పారు. ఓటు వేసే క్షణం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నానని తెలిపారు. నవంబరు 5న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తాము ఓటు వేయడానికి 'నాసా' తగిన ఏర్పాట్లు చేస్తోందని విల్‌మోర్ వెల్లడించారు.

సాక్షి
కరీంనగర్

ఆదివారం ׀ 15 ׀ సెప్టెంబర్ ׀ 2024

ఆదర్శ ఉపాధ్యాయుల బదిలీలు

- వివరాలు 8లో▸

బిట్ కాయిన్ హవాలా!

- ముగింపు దశకు దందా
- కేసులు నమోదవుతుండటంతో బిచాణా ఎత్తేసే పనిలో కింగ్‌పిన్
- మల్టీ లెవల్ మార్కెటింగ్ సిస్టమ్ ద్వారా రూ.కోట్లు వసూలు
- హవాలా రూపంలో విదేశాలకు తరలింపు
- వ్యాపారం విలువ కరీంనగర్‌లో రూ. 300 కోట్లు, జగిత్యాలలో రూ.100 కోట్లు
- పలువురు టీచర్లు, పోలీసులు, రియల్ వ్యాపారులు , మాజీ ఎమ్మెల్యేల పెట్టుబడి



సాక్షి పరిశీలన

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

బిట్‌కాయిన్ పేరిట జరుగుతున్న హవాలా దందా ముగింపు దశకు చేరుకుంది. విదేశాల నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఆపరేట్ చేస్తున్న నిర్వాహకులు చట్టపరంగా పలు ఇబ్బందుల్లో పడుతున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో ఈ రాకెట్ మీద కేసు నమోదైన దరిమిలా.. మిగిలిన ఏజెంట్లు ఆందోళనలో ఉన్నారు. ఒకరు చేరి మరింత మందిని చేర్పించే విధానంలో వచ్చే కమీషన్‌తో నడిచే మల్టీ లెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం) సిస్టమ్ ద్వారా రూ.కోట్లు వసూలు చేసి, హవాలా రూపంలో విదేశాలకు పంపుతున్నారు. అధిక లాభాల ఆశతో పలువురు టీచర్లు, రెవెన్యూ, పోలీసు అధికారులు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ స్కీంలో చక్రం తిప్పుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండా దేశాలు దాటుతున్న వేళ.. ఇది తీవ్ర వివాదంగా మారుతోంది. పథకం మీద నీలినీడలు కమ్ముకున్న నేపథ్యంలో ఇప్పటికే లాభాలు గడించినవారు నింపాదిగానే ఉన్నా.. ఇటీవల రూ.లక్షలు పోసి, చేరినవారు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

దుబాయ్, మలేషియా ట్రిప్పులతో ఎర?

బిట్‌కాయిన్ పేరిట రాష్ట్రంలో జరుగుతున్న వ్యాపారం విలువ రూ.1,000 కోట్ల పైమాటే అని అంచనా. నిర్మల్‌లో రూ.50 కోట్లు, జగిత్యాలలో రూ.100 కోట్లు, కరీంనగర్‌లో రూ.300 కోట్ల వరకు ఉంటుందని దళారులు చెబుతున్నారు. రాష్ట్రంలో గతేడాది అసెంబ్లీ ఎన్నికల సందడి మొదలైన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కాస్త నెమ్మదించింది. దీన్ని ఈ దందా చేసేవారు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. రూ.5 వేల నుంచి రూ.50 లక్షల వరకు ఎంతైనా ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు. ఆన్‌లైన్‌లో వీరికి ఒక యాప్ ఉంటుంది. స్థానిక నిర్వాహకులే వారికి డౌన్‌లోడ్ చేసి, ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. ఈ యాప్‌ను ఉపయోగించి, డాలర్లు కొనమని చెబుతారు. రూ.లక్ష పెడితే 1,000 డాలర్లతోపాటు ప్రతీ నెల రూ.12 వేలు ఖాతాలో వేస్తారు. దీనికి తోడు వీరు చేర్పించిన ప్రతీ ఖాతాదారు మీద రూ.లక్షకు రూ.6 వేల చొప్పున కమీషన్ వస్తుంది. అతని కింద ఎంత మంది చేరితే అంత కమీషన్ పెరుగుతుంది. అలా కరీంనగర్, పెద్దపల్లి, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు కమీషన్ పొందేవారున్నారంటే అతిశయోక్తి కాదు. 50,000 డాలర్లు చేస్తే వారికి ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇస్తారు. దుబాయ్ ట్రిప్పులు ఉంటాయి. ఒకేసారి రూ.కోటి పెట్టుబడి పెడితే మలేషియా, సింగపూర్, బ్యాంకాక్ విహారయాత్రలకు పంపుతున్నారు. ఖాతాదారుల నుంచి పోగుచేసిన డబ్బును హవాలాగా దుబాయ్‌కి పంపిస్తున్నారు.

ప్రభుత్వ టీచర్లు, పోలీసులే ఏజెంట్లు..

కరీంనగర్‌లో ఒకప్పుడు ప్రైవేటు స్కూల్ నడిపిన ఓ ప్రముఖుడు స్థానికంగా ఈ వ్యాపారానికి గుండెకాయ. ఇతనికి కరీంనగర్, సుల్తానాబాద్‌లో ప్రధాన అనుచరులున్నారు. జార్ఖండ్‌కు చెందిన సింగ్ వ్యాపారి దుబాయ్ కేంద్రంగా బిట్‌కాయిన్ పేరుతో పేర్లు మార్చి, దాదాపు డజను యాప్‌ల ద్వారా ఈ దందా నడుపుతున్నాడు. తెలుగు రాష్ట్రాలకు విజయవాడకు చెందిన లోకేశ్ బాధ్యుడిగా ఉన్నాడని సమాచారం. ఇతని సూచనలతో కరీంనగర్‌లో ప్రభుత్వ టీచర్లు, రెవెన్యూ అధికారులు, పోలీసులకు గాలం వేశారు. తొలుత వీరికి పార్టీలు ఇచ్చి, విదేశీ టూర్లు ఆశచూపి భారీగా పెట్టుబడులు పెట్టించారు. ఉద్యోగులు తమ సహోద్యోగులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, ఇతరులతో పెట్టుబడులు పెట్టించారు. ఈ డబ్బును హవాలా మార్గంలో దుబాయ్‌కి పంపుతుంటారు. చాపకింద నీరులా ఇది రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. పై ముగ్గురికి రోజుకు రూ.3 లక్షల ఆదాయం కమీషన్ రూపంలో యాప్‌లో పడుతోంది. ఇది సాగినంత సేపు బాగానే ఉంటుంది. యాప్ లో అనుకున్న టార్గెట్ చేరినా.. కొందరు తమ డబ్బును తిరిగి డ్రా చేసుకోలేకపోతున్నారు. తాజాగా పోలీసుల నిఘా పెరగడం, కేసులు నమోదవుతుండటంతో ఈ దందాను నడిపే డజను యాప్‌లలో కొన్నింటిని మెల్లిగా నిలిపివేసి, బిచాణా ఎత్తేసే పనిలో కింగ్‌పిన్ ఉన్నాడని తెలిసింది. దీన్ని ముందుగానే గ్రహించిన కరీంనగర్‌కు చెందిన సీనియర్లు తమ జాగ్రత్తలో తాము ఉన్నారని సమాచారం.

దుబాయ్‌కి హవాలా? అక్కడ నుంచి..?

రాష్ట్రంలో అందులోనూ ఉత్తర తెలంగాణ నుంచి రూ.వందల కోట్లు దుబాయ్‌కి పంపుతున్నారు. ఏజెంట్లు వసూలు చేసిన మొత్తాన్ని హవాలా దుబాయ్‌కి పంపిస్తున్నారు. అయితే, ఈ డబ్బు దుబాయ్‌లోని కింగ్‌పిన్‌కి చేరుతున్నాయి. అయితే, అక్కడ నుంచి ఎవరికి వెళ్తున్నాయి? అన్న విషయం తేల్చేందుకు నిర్మల్ పోలీసులు రంగంలోకి దిగారు. అయితే, ఆ డబ్బులు వ్యక్తిగత ఖాతాల్లోకే వెళ్తున్నాయా? లేదా ఉగ్రవాద సంస్థలకు వెళ్తున్నాయా? అన్న విషయంపై తెలంగాణ పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై లోతుగా దర్యాప్తు చేసే విషయంలో త్వరలోనే స్పష్టత రానుంది.

కింగ్‌పిన్‌ను పట్టుకుంటాం



నిర్మల్‌లో ఈ తరహా స్కాంలో దాదాపుగా రూ.50 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. నిందితులను అరెస్టు చేయకుండా ఉండేందుకు పెద్ద ఎత్తున ఒత్తిళ్లు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగులు చాలామంది కేసులో ఇన్వాల్వ్ అయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ టీచర్లు అందులోనూ ఎస్జీటీలు అమాయకుల నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. నిమజ్జనం అనంతరం కేసు స్పీడు పెంచుతాం. దుబాయ్‌లో ఉన్న కింగ్‌పిన్‌ను కచ్చితంగా పట్టుకుంటాం.

– జానకీ షర్మిల, ఐపీఎస్

న్యూస్‌రీల్

అర్బన్ బ్యాంకు సభ్యత్వ ఖాతాలకు ఆధార్‌లింక్



మాట్లాడుతున్న కో- ఆపరేటివ్ అధికారి రామానుజాచార్యులు

కరీంనగర్: అర్బన్ బ్యాంకు సభ్యత్వ ఖాతాకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయాలని కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శనివారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో బ్యాంక్ సర్వసభ్య సమావేశం జరిగింది. అసోసియేట్ అధ్యక్షుడు గడ్డం విలాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కో- ఆపరేటివ్ అధికారి రామానుజాచార్యులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలాస్‌రెడ్డి, రామానుజాచార్యులు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. గతంలో పాలకవర్గం తీసుకున్న డివిజన్ తీర్మాణానికి మరోసారి ఆమోదం తెలిపారు. త్వరలో గంగాధర బ్రాంచ్‌ను, బ్యాంకులో ఏర్పాటుచేసే ఏటీఎంను మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, బీరం ఆంజనేయులు, మహమ్మద్ ఖలీంఖాన్, రేగొండ సందీప్, మూల లక్ష్మి, ఏ.విద్యాసాగర్, లక్ష్మణ్‌రాజు, మహమ్మద్ సంయుద్దీన్, సీఈవో నునుగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులతో టీఎన్‌జీవోలు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కరీంనగర్: తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం జిల్లా కమిటీని శనివారం టీఎన్‌జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగం లక్ష్మణరావు అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎంపీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి వ్యవహరించారు. కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడిగా గోదారి అజయ్‌కుమార్, కార్యదర్శిగా భూక్య రమేశ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సుష్మితరెడ్డి, కోశాధికారిగా అబ్దుల్ వాహిజ్, వైస్ ప్రెసిడెంట్లుగా పవన్‌సాయి, మధుమితరెడ్డి, వెంకటేశ్, జాయింట్ సెక్రటరీగా రాకేశ్, శ్రీనివాస్, మౌనిక, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మీసా మల్లికార్జున్, పబ్లిసిటీ సెక్రటరీగా రాజేశ్, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మమతరెడ్డి, రవి, సుష్మ, చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.



లక్ష్మి.. గణపతి

- రూ.35.60 లక్షల కరెన్సీతో అలంకరణ

కరీంనగర్ విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. ప్యారీస్‌లైన్‌లో ఉమాపుత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుంచిన విఘ్నేశ్వరుడికి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రూ.35,60,000 కరెన్సీ, చిల్లర నాణేలతో అలంకరించారు. రూ.500, రూ.200, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లతో పాటు చిల్లర నాణేలతో మండపాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. గతేడాది సైతం రూ.20లక్షల నోట్లతో అలంకరించామని నిర్వాహకులు ఈ సందర్భంగా వెల్లడించారు. – కరీంనగర్‌కల్చరల్

జిల్లా కోర్టులో ఆన్‌లైన్ సిస్టం ప్రారంభం



ఆన్‌లైన్ సిస్టంను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి లక్ష్మణ్, పక్కన జిల్లా జడ్జి ప్రతిమ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాంకేతిక విభాగం (డిజిటలైజేషన్)ను హైకోర్టు జడ్జి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శనివారం జిల్లా జడ్జి బి.ప్రతిమతో కలిసి ప్రారంభించారు. ఈ ఆన్‌లైన్ కంప్యూటర్ విధానం ద్వారా అన్ని కోర్టుల్లో ఉన్న కేసుల రికార్డులు పొందుపర్చవచ్చు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ నమోదు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ హైకోర్టు జడ్జికి వీటి పనితీరును వివరించారు. అనంతరం న్యాయమూర్తులతో నిర్వహించిన జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌కు హాజరైన హైకోర్టు జడ్జి సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- సీపీ అభిషేక్ మహంతి



సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా సెప్టెంబర్ 16వ తేదీన జరిగే గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. శోభాయాత్ర రూట్లు, మానకొండూరు చెరువు, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శోభాయాత్రలో డీజేల వినియోగం, బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తులు ఎటువంటి ఆయుధాల ప్రదర్శన, ఇతరులను గాయపరిచే వస్తువులు కలిగి ఉండొద్దని హెచ్చరించారు. విద్వేషపూరిత నినాదాలు, ప్రసంగాలు చేయడం, పాటల వినియోగం వంటి చర్యలకు పాల్పడరాదని సూచించారు. ఈ నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు.

ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశామని మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ ఒక ప్రకటనలో తెలిపారు. మానకొండూరు చెరువు, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్ వద్ద నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ పాయింట్ల వద్ద నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో లైట్లు,సౌండ్స్‌తో పాటు, ఇతర సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి పాయింట్‌కు నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించామని పేర్కొన్నారు. శోభాయాత్ర ప్రారంభమయ్యే టవర్‌సర్కిల్ వద్ద స్వాగత వేదికతో పాటు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోమవారం నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భక్తులను ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ కోరారు.

దురద.. గాయం!

- జిల్లాలో భయపెడుతున్న సెల్యులైటిస్
- దురదతో మొదలై గాయంగా మారుతున్న వ్యాధి
- పెరుగుతున్న బాధితులు
- త్వరగా చికిత్స తీసుకుంటే మేలంటున్న వైద్యులు

సాక్షి స్పెషల్

కరీంనగర్‌టౌన్: జిల్లా వాసులను సెల్యులైటిస్ వ్యాధి భయపెడుతోంది. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే ఈ వ్యాధి ఎన్నడూ లేనంతగా నెల రోజులుగా వందలసంఖ్యలో బాధితులను ఆస్పత్రిపాలు చేస్తోంది. సెల్యులైటిస్ సాధారణ బాక్టీరియల్ ఇన్‌ఫెక్షనే అయినప్పటికీ వ్యాధి తీవ్రతతో ప్రమాదకరంగా మారుతుంది. ఈ చర్మ వ్యాధి ఎక్కువగా కాళ్లపై ప్రభావం చూపుతుంది. నిర్లక్ష్యం చేస్తే అన్ని శరీర భాగాలకు సోకే ప్రమాదముంది. దీనికారణంగా చర్మం ఎరుపు, వాపు, వెచ్చగా, నొప్పిగా ఉంటుంది. పుండు, గాట్లు పడినప్పుడు ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తుంది. మెల్లగా రక్తనాళాల్లోనికి వ్యాపిస్తుంది. ఒక దశలో ఇన్‌ఫెక్షన్ సోకిన అవయవాలను తొలగించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చర్మ వ్యాధులు, బోదకాలు, వెరికోస్‌వెయిన్స్, మధుమేహం, హెచ్‌ఐవీతో బాధపడే వారికి వచ్చే అవకాశముంది.

సెల్యులైటిస్‌కు కారణాలు

బాక్టీరియా (స్టెఫిలోకోకస్, స్ట్రెప్టోకోకస్) చర్మంలోనికి గాయం లేదా పగుళ్ల ద్వారా ప్రవేశించినప్పుడు సెల్యులైటిస్ సంక్రమిస్తుంది. సెల్యులైటిస్‌లో రెండు దశలు ఉన్నాయి. ఇది ప్రారంభమైన తర్వాత శరీరంలోని ఏ భాగానికైనా వ్యాపించవచ్చు. దీంతో చర్మం ఎర్రగా మారడం, ఉబ్బడం, దురుద, గాయపడడం జరుగుతుంది. రెండోదశలో ఇన్‌ఫెక్షన్‌గా మారితే చీము వస్తుంది. లుకేమియా, హెచ్ఐవీ/ఎయిడ్స్, మధుమేహంతో బాధపడుతూ రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి సెల్యులైటిస్ వచ్చే అవకాశముంది.

వందల సంఖ్యలో బాధితులు

సెల్యులైటిస్ ఎక్కువగా వర్షాకాలంలోనే వస్తుంది. ఏటా పదుల సంఖ్యలో ఉండే ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఈసారి వందల్లో పెరిగింది. జిల్లాలో దోమల కారణంగా ఈ వ్యాధి తీవ్రంగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పెద్ద ఎత్తున సెల్యులైటిస్ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దోమకాటుకు గురైన వ్యక్తులు ఆ ప్రాంతంలో దురుదగా అనిపించి గోకడం ద్వారా శరీరంపై గాట్లు, గాయపడిన ప్రాంతం నుంచి బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి సెల్యులైటిస్ సంభవిస్తుంది. సెల్యులైటిస్‌కు వైద్యం అందుబాటులో ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



సెల్యులైటిస్ బారిన పడిన పేషెంట్ కాలు

వెంటనే చికిత్స తీసుకోవాలి



సెల్యులైటిస్ ప్రమాదకరంగా మారుతోంది. దోమలు కుట్టి దురద వచ్చిన ప్రాంతంలో గోకినప్పుడు, చర్మం మీద పగుళ్లు, గాయం ఉన్నప్పుడు ఈ బాక్టీరియా చర్మం లోపలకు వెళ్లే అవకాశముంది. మధుమేహం ఉన్న రోగిలో సెల్యులైటిస్ గ్యాంగ్రీన్‌కు దారితీస్తుంది, ఇది ఒక అవయవాన్ని కోల్పోయేలా చేస్తుంది. ముఖ్యంగా కాళ్లు శుభ్రంగా ఉంచుకోవాలి. సెల్యులైటిస్ వ్యాధి ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఎక్కువగా కాళ్ల ద్వారానే సోకుతుంది. కాళ్లు ఉబ్బడం, నొప్పి, బొబ్బలు రావడం, జ్వరం వంటి సెల్యులైటిస్ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ దిలీప్‌రెడ్డి, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికవర్ ఆస్పత్రి,

పెద్దపల్లికి సోలార్ వెలుగులు

- కాచాపూర్‌లో పైలట్ ప్రాజెక్టుగా సౌరశక్తి ప్లాంట్
- పత్తిపాక రిజర్వాయర్, మానేరుపై వంతెన నిర్మిస్తాం
- పెద్దపల్లిలో బైపాస్ రోడ్డు
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పెద్దపల్లి, ధర్మపురి నియోజకవర్గాల్లో విస్తృత పర్యటన



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, తదితరులు

సాక్షి, పెద్దపల్లి/ధర్మారం/పెద్దపల్లిరూరల్: సోలార్ వెలుగులతో పెద్దపల్లి జిల్లాకు మహర్దశ పట్టించేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరాలజల్లు కురిపించారు. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ధర్మారం, పెద్దపల్లి మండలాల్లో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్లు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మారం, వెల్గటూరు, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గాలతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. భట్టి మాట్లాడుతూ.. హామీ మేరకు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఎల్లంపల్లి ఎత్తిపోతలకు అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పెద్దపల్లిలో బైపాస్ రోడ్డు, ఓదెల మండలంలో మానేరుపై వంతెన నిర్మాణాలు చేపట్టి సకాలంలో పూర్తిచేస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని అన్నారు. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, 12 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ శ్రీహర్షను ఆదేశించారు. పంటలతోపాటు పవర్‌తో కూడా కొంత ఆదాయం వచ్చేలా.. రైతులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇందు కోసం ధర్మారం మండలం నందిమేడారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నామని ప్రకటించారు. రూ.10వేల కోట్ల పెట్టుబడితో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ స్థాపిస్తామని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత గురుకుల భవన నిర్మాణాన్ని మంజూరు చేస్తామని వెల్లడించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి – సంక్షేమం రెండు కళ్లు

జిల్లాలో ఆయకట్టు స్థిరీకరణకు పత్తిపాక రిజర్వాయర్‌కు ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఓదెల మానేరుపై వంతెన, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో బైపాస్‌ల నిర్మాణానికి సీఎం ఆమోదం తెలిపారని అన్నారు.

పాలిటెక్నిక్ ఏర్పాటు చేయండి

ఎల్లంపల్లి నిర్వాసితుల సమస్య పరిష్కారానికి చెగ్యాంలో 126 ఇళ్లు కోల్పోయిన వారికి రూ.18 కోట్లు మంజూరు చేశామని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. బొమ్మిరెడ్డిపల్లి వద్ద కొత్తపల్లి కాల్వ పెండింగ్ పనులకు మరో రూ.7 కోట్లు అవసరమని, ఇది పూర్తయితే దాదాపు 10వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, తెలిపారు. ధర్మారం మండలంలో ఐటీఐ లేదా పాలిటెక్నిక్ మంజూరు చేయాలని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు.

ఐటీ టవర్ పూర్తిచేయండి

పెద్దపల్లికి బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్సు డిపో మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజయ రమణారావు మంత్రులను కోరారు. పెద్దపల్లి – జమ్మికుంట – పొత్కపల్లి మధ్య రోడ్డు నిర్మిస్తే 14 కి.మీ. దూరభారం తగ్గుతుందన్నారు. సుల్తానాబాద్‌కు మంజూరు చేసిన ఐటీ టవర్ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఖాళీ ప్లాట్లు.. ఏపుగా చెట్లు

- అనారోగ్యానికి గురవుతున్న స్థానికులు



కిసాన్‌నగర్ ఖాళీ ప్లాట్లలో పెరిగిన చెట్లు, పొదలు

“నగరంలోని 24వ డివిజన్ కిసాన్‌నగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో హనుమాన్ విగ్రహానికి సమీప ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్లు ఎక్కువగా ఉన్నాయి. తుమ్మలు, పిచ్చి మొక్కలు, పొదలు ఏపుగా పెరిగి, చిట్టడవిని తలపిస్తున్నాయి. స్థానికులు తమ ఇళ్లకు వెళ్లేందుకు దారి లేకుండా పోతోంది. వీధి దీపాలున్నా సరిగా వెలగడం లేదని అంటున్నారు. దోమలు, పందుల కారణంగా కంటి మీద కునుకు ఉండటం లేదని, రోగాల బారినపడుతున్నామని, పాముల సంచారంతో నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.”

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని జనావాసాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లు స్థానికులను భయపెడుతున్నాయి. వానాకాలం కావడంతో వరద, డ్రైనేజీ నీరు నిలుస్తోంది. చెట్లు, పొదలతో దోమలు, పందుల సంచారం ఎక్కువైంది. పాములు, ఇతర విష కీటకాలకు ఖాళీ ప్లాట్లు స్థావరంగా మారుతున్నాయని, ఇళ్లలో ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. పాములు ఇళ్లలోకి వస్తున్నాయని, విషజ్వరాలతో ఆస్పత్రులపాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి విశ్వకర్మ బ్రహ్మోత్సవాలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని కమాన్ చౌరస్తాలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం నుంచి విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం పతాకావిష్కరణ, బైక్ ర్యాలీ, పుణ్యహవచనం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, జరుగుతాయని, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గాయత్రీదేవి సామూహిక కుంకుమార్చన, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. సోమవారం ఉదయం మనుమయాది పంచబ్రహ్మలు, గాయత్రీ విశ్వకర్మ హవనం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, అల్పాహారం ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం గాయత్రీ విశ్వకర్మ సహస్ర కమలార్చన, పూర్ణాహుతి,అన్నదానం, అనంతరం విశ్వకర్మ భగవానుని ఉత్సవ మూర్తుల శోభాయాత్ర జరుగుతుందని తెలిపారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

క్లుప్తంగా

రాజన్న సేవలో మీనా రామనాథన్



కోడె మొక్కు చెల్లించుకుంటున్న కమిషన్ మెంబర్ మీనా రామనాథన్

వేములవాడ: వేములవాడ రాజన్నను రాష్ట్ర కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సల్ కమిషన్ మెంబర్ మీనా రామనాథన్ శనివారం దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ పర్యవేక్షకుడు నర్సయ్య, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు అశోక్ ఉన్నారు.

కుక్కల దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన చిన్నారులు

మంథని: మండలంలోని వెంకటాపూర్, స్వర్ణపల్లి గ్రామాల్లో శనివారం వీధి కుక్కల దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్వర్ణపల్లిలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారులు మానస, వేదాన్ష్, వెంకటాపూర్‌లో గడ్డం మల్లేశ్ అతని కూతురిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు మంథని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఆదర్శ పాఠశాలల్లో బదిలీలు

- టీచర్ల 11 ఏళ్ల నిరీక్షణకు తెర
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 800 మందికి స్థానచలనం

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 47 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో పని చేస్తున్న దాదాపు 800 మంది టీచర్ల చిరకాల వాంఛ నెరవేరింది. ఉద్యోగాల్లో చేరిన 11 ఏళ్ల తర్వాత తొలిసారి భారీగా బదిలీలు జరిగాయి. న్యాయపరమైన అవాంతరాలు తొలగిపోవడం, హైకోర్టు బదిలీలకు ఒకే చెప్పడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం ఒకేరోజు టీచర్లందరూ తాము పని చేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ అయ్యారు. ఆ వెంటనే తమకు కేటాయించిన స్కూళ్లలో చేరిపోయారు.



రుక్మాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నిమ్మల సుధాకర్

రెండు విడతల్లో నియామకం..

మోడల్ స్కూళ్లలోని ఉపాధ్యాయులు 2013, 2014 సంవత్సరాల్లో రెండు విడతల్లో నియమితులయ్యారు. మూడేళ్లుగా తమను బదిలీలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ గతేడాది జూలైలో బదిలీల షెడ్యూల్ విడుదల చేసింది. టీచర్లందరూ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. కానీ, సర్వీస్ పాయింట్ల కేటాయింపుపై కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం స్టే విధించడంతో బదిలీల ప్రక్రియ ఆగిపోయింది.



బెజ్జంకి ఆదర్శ పాఠశాల

మెరిట్ ప్రకారం..

2013, 2014లలో టీచర్లు ఉద్యోగాల్లో చేరినా మెరిట్ ప్రకారం సీనియారిటీ జాబితా తయారు చేసి, బదిలీలు చేపట్టవచ్చని హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. ఉద్యోగాల్లో చేరిన తేదీ ఆధారంగా ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు కేటాయించాలని చెప్పింది. దీనివల్ల అడ్డంకులు తొలగిపోయాయి. పాత జోన్ల(5, 6) ప్రకారమే బదిలీలు పూర్తయ్యాయి. ప్రిన్సిపాళ్లను రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ), ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ)ను జోన్ యూనిట్‌గా తీసుకొని, స్థానచలనం కల్పించారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని, తమ కల ఇప్పుడు తీరిందని టీచర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి గణనాథుని నిమజ్జనోత్సవం



తిమ్మాపూర్(మానకొండూరు): కరీంనగర్ 'సాక్షి' యూనిట్ ఆఫీస్‌లో శనివారం సాయంత్రం వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. శోభాయాత్రలో యూనిట్ మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్‌కుమార్, కరీంనగర్, ఆదిలాబాద్ ఎడిషన్ ఇన్‌చార్జులు ముజఫర్, గుర్రాల మహేశ్, డెస్క్ ఇన్‌చార్జులు బొగ్గుల సంతోష్‌కుమార్, కనకేశ్వర్, డి. రాజశేఖర్, పోలు సంపత్, ఏడీవీటీ డిప్యూటీ మేనేజర్ జి.వేణుగోపాల్, అసిస్టెంట్ మేనేజర్లు గంగుల మహేందర్‌రెడ్డి, ముస్కుల విద్యాసాగర్‌రెడ్డి, డీటీపీవో కోడూరు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలు విద్యాసంస్థల యజమానులు, సేవా సంస్థల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

హుజూరాబాద్: ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకి వస్తున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. శనివారం హుజూరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల ఎన్‌రోల్ కార్యక్రమం ప్రారంభించామని, డిగ్రీ పూర్తి చేసి, మూడేళ్లు గడిచిన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుమారు 20 లక్షల మంది పట్టభద్రుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌ను చూసి ఆకర్షితుడినై, కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏ చెల్లించేలా చూస్తానని, ప్రైవేట్ ఉద్యోగులకు 12 నెలల జీతం ఇచ్చేలా యాజమాన్యాలతో చర్చిస్తానన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఇచ్చేలా ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల భూములు కబ్జాకు గురయ్యాయని, తనను గెలిపిస్తే హైడ్రా తరహాలో చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

బూడిద వ్యాన్ బోల్తా



రోడ్డు పక్కన బోల్తా పడిన వ్యాన్

చందుర్తి(వేములవాడ): బూడిద లోడ్‌తో వెళ్తున్న ఓ వ్యాన్ బోల్తా పడింది. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని బండపల్లి నుంచి శనివారం సాయంత్రం ఓ వ్యాన్ బూడిద లోడ్‌తో వెళ్తోంది. ఆ సమయంలో ఎదురుగా ట్రాక్టర్ రావడంతో డ్రైవర్ వ్యాన్‌ను రోడ్డు కిందకు దించాడు. దీంతో అది బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఏం కాలేదని గ్రామస్తులు తెలిపారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట నుంచి చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి మీదుగా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట వరకు తారు రోడ్డు వేశారన్నారు. రెండేళ్లు గడుస్తున్నా దారికిరువైపులా మట్టి పోయడం లేదని పేర్కొన్నారు. భారీ వాహనాలు వచ్చి, రోడ్డు దిగితే బోల్తా పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, మట్టి పోయించాలని కోరుతున్నారు.

సమ్మిరెడ్డి మృతితో జమ్మికుంటలో విషాదం

జమ్మికుంట(హుజూరాబాద్): కాంగ్రెస్ నేత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి(59) శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటుతో మృతి చెందారు. ఈ సంఘటన జమ్మికుంటలో విషాదం నింపింది. ఆయనకు భార్య ఉషారమ, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా..

సమ్మిరెడ్డి స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెన్నంపల్లి. ఆయన జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్నారు. ఇక్కడే వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యారు. పీపుల్స్‌వార్ గ్రూప్ దళ నాయకుడు మాసాని రవీందర్ ప్రభావంతో విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారు. కొన్ని రోజులు దళ సభ్యుడిగా పని చేసి, బయటకు వచ్చాడు. ఆ తర్వాత ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా రాజకీయ రంగప్రవేశం చేసి, అంచెలంచెలుగా ఎదిగారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డికి సన్నిహితుడిగా ఉండేవారు. రెండు పర్యాయాలు జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి..

తుమ్మేటి సమ్మిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ పొన్నం ప్రభాకర్ గౌడ్ శనివారం జమ్మికుంటలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. సమ్మిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మంత్రి ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రముఖుల నివాళి..

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఆరెపల్లి మోహన్, వొడితల ప్రణవ్, దేశిని కోటి, పత్తి కృష్ణారెడ్డి, పాడి ఉదయనందన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు మాజీ ఎంపీ వినోద్‌కుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, నారదాసు లక్ష్మణ్‌రావు, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, ఓయూ విద్యార్థి సంఘం నేత హరిబాబు తదితరులు నివాళి అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీకి తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్ఎంపీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని తుమ్మనపల్లికి చెందిన గోడిశాల సదానందం అనే ఆర్ఎంపీ శుక్రవారం రాత్రి జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు బైక్‌పై వస్తున్నాడు. చెల్పూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సదానందం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కారు పార్కింగ్ విషయంలో గొడవ

- అడ్వకేట్‌పై కేసు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని ఓ షాపు ఎదుట కారు పార్కింగ్ విషయంలో గొడవతో ఓ అడ్వకేట్‌పై కేసు నమోదైంది. టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కైలాష్ అనే అడ్వకేట్ శనివారం తన కారును పట్టణంలోని మిట్టపల్లి శ్రీనివాస్–రాజేశ్వరి దుస్తుల షాపు ఎదుట నిలిపారు. కారు తీయాలని చెప్పడంతో గొడవ జరిగింది. కైలాష్ తనను దుర్భాషలాడాడని, చంపేస్తానని బెదిరించాడని రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అయనపై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

'మెడికవర్'లో ఓనం వేడుకలు

కరీంనగర్‌టౌన్: కేరళను తలపించేలా నిర్వహించిన ఓనం వేడుకలకు శనివారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రి వేదికైంది. ఉత్సవాలను వైద్యులు జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి ఎలాగో.. కేరళవాసులకు ఓనం పండుగ అలాగని తెలిపారు. ఆ రాష్ట్రానికి చెందిన యువత నర్సింగ్ విద్యనభ్యసించి, సేవాభావంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారని పేర్కొన్నారు. మెడికవర్‌లో పని చేస్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. మలయాళీల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే ఓనంను జాతీయ పండుగగా గుర్తించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఆస్పత్రి కేరళ సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో సందడి చేశారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వైద్యులు కొండపాక కిరణ్‌కుమార్, రామచందర్ తొర్రం, వెంకటేశ్ బోగ, రవి మల్లారెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, కేరళ నర్సింగ్ సిబ్బంది

రాఘవాచార్యులు జీవితం స్ఫూర్తిదాయకం

- సాహితీవేత్త గండ్ర లక్ష్మణరావు



పుస్తకం ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు, కవులు

కరీంనగర్ కల్చరల్: సంస్కృతాంధ్ర పండితుడు గోవర్ధన రాఘవాచార్యులు జీవితం స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త గండ్ర లక్ష్మణరావు అన్నారు. శనివారం కరీంనగర్‌లోని సిద్ధార్థ పాఠశాలలో ఆయన కుటుంబసభ్యుల సంపాదకీయంలో వచ్చిన రాఘవీయ స్మృతి సంచికను ఆవిష్కరించి, మాట్లాడారు. రాఘవాచార్యులు జీవిత కాల పాండిత్య సేవలను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. టీచర్ కృష్ణమాచార్యులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాఘవాచార్యులు కుటుంబసభ్యులు వెంకటశేషాచార్యులు, రాజా రామ్మోహన్, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇనుగంటి ప్రసాద్‌రావు, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్



పద్మ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మకాలనీ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ గుడి పద్మను సస్పెండ్ చేస్తూ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కె.సీతాలక్ష్మి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల పీఈటీ జ్యోత్స్న ఇటీవల బాలికలను వేధించడంతో వారు ఆందోళన చేపట్టారు. దీంతో పీఈటీని అదేరోజు సస్పెండ్ చేయగా.. విచారణ అనంతరం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకున్నారు.

మహిళా కండక్టర్‌పై లైంగిక వేధింపులు

- డ్రైవర్‌పై అట్రాసిటీ కేసు

జగిత్యాల క్రైం: ఆర్టీసీకి చెందిన ఓ మహిళా కండక్టర్‌ను లైంగిక వేధిస్తున్న డ్రైవర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల డిపో మహిళా కండక్టర్‌ను డ్రైవర్ గడ్డం రమేశ్ లైంగికంగా వేధిస్తూ కులం పేరుతో దూషిస్తున్నాడు. బాధితురాలు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు డ్రైవర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'సిమ్స్'లో మహిళా ఉద్యోగిపై వేధింపులు?

- పోలీసుల అదుపులో నిందితుడు!

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులపై వేధింపుల ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై, తాత్కాలిక ఉద్యోగి వేధింపులకు పాల్పడిన సంఘటన మరవకముందే, తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగిపై, ఓ పర్యవేక్షకుడు వేధింపులకు పాల్పడినట్లు షీటీంకు ఫిర్యాదు రావడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపుతున్నట్లు సమాచారం. దీనిపై మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్‌ను శనివారం వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని తెలిపారు.

విషజ్వరంతో బాలిక మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): విషజ్వరంతో ఓ బాలిక మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. హుస్నాబాద్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్ ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ హైస్కూల్లో పని చేస్తున్నారు. కుటుంబంతో కలిసి ఎల్లారెడ్డిపేటలోనే ఉంటున్నారు. ఆయన పెద్ద కూతురు హాస్య నక్షత్ర(13)కు తీవ్ర జ్వరం రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయింది. ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామం హుస్నాబాద్‌కు తరలించారు.

క్లుప్తంగా

గురుకుల ఉపాధ్యాయుల పనివేళలు మార్చాలి



సభ్యత్వ నమోదు చూపుతున్న ఉపాధ్యాయులు

కరీంనగర్‌కల్చరల్‌: గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, పాఠశాలల పనివేళల్లో మార్పు చేయాలని యూటీఎఫ్‌ ఎంజేపీ వింగ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లివింగ్‌ స్టన్‌ అన్నారు. టీఎస్‌ యూటీఎఫ్‌ సభ్యత్వ నమోదులో భాగంగా శనివారం జిల్లాలోని వివిధ మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలలను సందర్శించి మాట్లాడారు. ఆర్ట్‌ క్రాఫ్ట్‌ మ్యూజిక్‌, లైబ్రేరియన్స్‌, స్టాఫ్‌నర్స్‌ ప్రమోషన్‌ ఛానల్‌ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముల్కల కుమార్‌, జావేద్‌, యూటీఎఫ్‌ ఎంజేపీ వింగ్‌ రాష్ట్ర కమిటీ సభ్యులు సురేశ్‌కుమార్‌, సురేశ్‌, నాయకులు జాన్సన్‌, హరీశ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

విద్యానగర్‌(కరీంనగర్‌): అంబేద్కర్‌ స్టేడియంలో ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు జరిగిన 68వ ఎస్‌జీఎఫ్‌ కరీంనగర్‌ అర్బన్‌ మండల స్థాయి చాంపియన్‌ షిప్‌ పోటీల్లో వాణినికేతన్‌ పాఠశాల విద్యార్థులు అండర్‌ 17, అండర్‌ 14 విభాగాల్లో మొదటి బహుమతులు సాధించి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరిని శనివారం పాఠశాల ప్రిన్సిపాల్‌ లక్ష్మారెడ్డి, పీఈటీలు అనిల్‌, అనిత, రజిత, స్వప్నలు అభినందించారు.

నమూనా ఎన్నికలు



విద్యానగర్‌(కరీంనగర్‌): రాంనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్‌ స్కూల్‌లో శనివారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌ ఉప్పు లింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘వింధ్యావాలీ’లో గ్రీన్‌ డే



కరీంనగర్‌కల్చరల్‌: నగరంలోని వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రీన్‌ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఆకుపచ్చని దుస్తులు ధరించి వివిధ రకాలైన ఆకులు, ఫలాల ఆకుపచ్చని చిత్రాలను తయారు చేశారు. పాఠశాల చైర్మన్‌ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, హరితహారంపై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు గ్రీన్‌ డే వేడుకలు దోహదపడుతాయన్నారు. వైస్‌ చైర్మన్‌ పృథ్వీరాజ్‌, ప్రిన్సిపాల్‌ ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్స

కరీంనగర్‌రూరల్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ బొమ్మకల్‌ ఆధ్వర్యంలో నల్లగుంటపల్లికి చెందిన వద్దూరి ఓదమ్మకు శనివారం రేకుర్తి కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయించారు. ఆస్పత్రి చైర్మన్‌ కొండ వేణుమూర్తి, వైస్‌ చైర్మన్‌ చిదుర సురేశ్‌, ట్రస్టు బోర్డు సభ్యుడు కోల అన్నారెడ్డిల సహకారంతో 131వ కంటి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు లయన్స్‌ ఇంటర్నేషనల్‌ డిస్ట్రిక్ట్‌ 320జీ జోన్‌ చైర్‌పర్సన్‌ చింతల కిషన్‌ పటేల్‌ తెలిపారు.

ఏక దంతా.. ఏకో దేవ..

- ఏటా మట్టి వినాయకునికి పూజలు
- ఆదర్శం.. కలెక్టరేట్‌ ఉద్యోగులు



పూజల్లో కలెక్టర్‌ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్‌ ప్రఫుల్‌దేశాయ్‌ దంపతులు, డీఆర్వో పవన్‌కుమార్‌

కరీంనగర్‌ అర్బన్‌: ఒక్కొక్కరిది ఒక్కో ప్రాంతం.. రాష్ట్రాలు, జిల్లాలు వేరైనా విధి నిర్వహణకు ఒకే సముదాయం. జిల్లా పరిపాలన కేంద్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, డీఆర్వో, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా ఆధ్యాత్మిక చింతనలో తామంతా ఒకటే..నని చాటుతున్నారు. కుల, మతాలకతీతంగా ఒక్కటై అటు దైవసేవతో పాటు పర్యావరణ హితానికి పాటుపడుతున్నారు. ఏటా వినాయక చవితికి మట్టి గణేశున్ని ప్రతిష్ఠించి నవరాత్రులు ప్రత్యేక పూజలు, భజనలతో భక్తిపారవశ్యంలో ఒలలాడుతున్నారు. మట్టి ప్రతిమలే పర్యావరణానికి మేలని విగ్రహాలను పంచడమే కాకుండా కలెక్టరేట్‌లోనూ మట్టి ప్రతిమను ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం.

అన్నప్రసాదం.. ప్రత్యేక పూజలు

గణేశ్‌ నవరాత్రోత్సవాల్లో నిత్యం వివిధ రకాల పూజలు నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన విభాగంలో జూనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే వెల్ది దినేశ్‌శర్మ పురోహితుడు కావడంతో అటు విధులు నిర్వహిస్తూనే ఇటు పూజలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌ అర్బన్‌, కరీంనగర్‌ రూరల్‌, కొత్తపల్లి తహసీల్దార్లతో పాటు కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగం గణేశ్‌ నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. కలెక్టర్‌ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌ దేశాయ్‌, లక్ష్మీకిరణ్‌లు అధికారులుగా కాకుండా కుటుంబీకుల్లా వ్యవహరిస్తూ కార్యక్రమాలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తూ నిమజ్జనం రోజున అంతా ఒక్కటై ఆనందడోలికల్లో తేలియాడుతూ నృత్యాలతో ఉత్సాహాన్ని నింపుతున్నారు.



మట్టి వినాయకుని వద్ద అదనపు కలెక్టర్‌ లక్ష్మీకిరణ్‌, ఆర్డీవో మహేశ్వర్‌, మహిళా ఉద్యోగులు

ఏటా వేడుకగా నిర్వహణ



కలెక్టరేట్‌లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించా. పదేళ్లుగా మట్టి వినాయకున్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నాం. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే వారికి మట్టి ప్రతిమలపై అవగాహన కల్పిస్తున్నాం. ఇష్టదైవానికి అత్యంత నిష్ఠతో పూజలు చేస్తున్నాం.

– మడిపల్లి కాశిచరణ్‌, సూపరింటెండెంట్‌

పూజలో తరిస్తున్న



ఏటా వినాయక చవితి వచ్చిందంటే చాలు కలెక్టరేట్‌లో సందడి నెలకొంటుంది. వివిధ విభాగాల్లో విధులు నిర్వహించగా ప్రతీ సంవత్సరం గణనాథుని పూజలో తరిస్తున్నా. ప్రధాన ద్వారం వద్ద వినాయకున్ని ప్రతిష్ఠించగా ఉద్యోగానికి వచ్చేటప్పుడు, వెళ్లేటపుడు దైవాన్ని ప్రార్థిస్తున్నా.

– పాత భవానీ, సీనియర్‌ అసిస్టెంట్‌

ఉద్యోగుల ఐక్యత బాగుంది



కొన్ని నెలల క్రితం కలెక్టరేట్‌కు బదిలీపై వచ్చా. ఇక్కడ అధికారుల సహకారం, ఉద్యోగుల ఐక్యమత్యం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఉద్యోగులుగా కాకుండా కుటుంబసభ్యుల్లా వ్యవహరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– పాలకుర్తి సుమలత, సీనియర్‌ అసిస్టెంట్‌

ఆధ్యాత్మికత.. విధి నిర్వహణ



గణేశ్‌ నవరాత్రోత్సవాల్లో కలెక్టరేట్‌లో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. 15 ఏళ్ల క్రితం వినాయకున్ని ఏర్పాటు చేసేవారు కాదు. కలెక్టరేట్‌లో విధులంటే ఒక్కోసారి ఉదయం త్వరగా వచ్చి రాత్రి వరకు పనిచేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్‌లోనే వినాయక వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. 15ఏళ్లుగా సాంప్రదాయంగా సాగుతోంది.

– గద్దం సుధాకర్‌, కలెక్టరేట్‌ పరిపాలన అధికారి

ఇది నా అదృష్టం



ఉద్యోగానికి ముందు పురోహితం చేసేవాడిని. ఉద్యోగంలో చేరాక కలెక్టరేట్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే భాగ్యం కలిగింది. పురోహితం కావడంతో వినాయకునికి నిత్య పూజలు చేసే అదృష్టం కలిగింది. అటు పూజ.. ఇటు విధి నిర్వహణ 9 రోజులు ఇదే నా నిత్యకృత్యం

– వెల్ది దినేశ్‌శర్మ, జూనియర్‌ అసిస్టెంట్‌ (పురోహితుడు)

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములవ్వాలి. వాతావరణాన్ని కలుషితం చేసే ఆధునిక పోకడలకు పోకుండా సహజసిద్ధ ప్రతిమలనే పూజించడం ఉత్తమం. నీటిని కలుషితం చేసే రసాయనిక విగ్రహాలకు దూరంగా ఉండటం వల్ల భావితరాలకు మంచి సందేశమిచ్చినట్లవుతుంది.

– నేరెళ్ల కిషన్‌, నాయబ్‌ తహసీల్దార్‌



నగరంలోని 17వ డివిజన్‌ విద్యానగర్‌ పరిధిలో హరిహరనగర్‌ రోడ్‌నంబర్‌ 2లో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, చెట్లు విపరీతంగా పెరిగిపోయాయి. వర్షం పడితే నీళ్లు నిలిచి, దోమలు, పందులకు నిలయంగా మారుతున్నాయి. దీనివల్ల ఈ ప్రాంతంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. అధికారులు ఈ ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించాలి.

– స్తంభంకాడి గంగాధర్‌, హరిహరనగర్‌, విద్యానగర్‌

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కుమారస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌, 99085 23095

వాట్సప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్‌ : 94400 77555

వైభవంగా ఏకాదశి ఉత్సవం



స్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకులు

కరీంనగర్‌కల్చరల్‌:నగరంలోని తిరుమల్‌నగర్‌ శ్రీనిలయం మయూరగిరి పీఠంలో శనివారం భాద్రపద శుద్ధ ఏకాదశి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతులు జ్యోతిష్యవాస్తు పండితులు నమిలకొండ రమణాచారి ఆధ్వర్యంలో శ్రీరామ సేవా తరంగిణి ట్రస్ట్‌ నిర్వహణలో స్వామికి వివిధ రకాల అభిషేకాలు, పూజలు, అర్చనలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్‌ చాలీసా పారాయణాలు భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు, వివేకాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్‌ స్టోరేజీ

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ బ్లడ్‌ స్టోరేజీ సెంటర్‌లో శనివారం వరకు ఏ పాజిటివ్‌ 19, బీ పాజిటివ్‌ 15, ఓ పాజిటివ్‌ 20, ఏబీ పాజిటివ్‌ 04, ఓ నెగెటివ్‌ 01 యూనిట్ల రక్తం అందుబాటులో ఉందని రెడ్‌క్రాస్‌ సెక్రటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు ఫోన్‌: 9502502942లో సంప్రదించాలని కోరారు.

సమాచారం

15న టీడబ్ల్యూజేఎఫ్‌ జిల్లా మహాసభ

కరీంనగర్‌ అర్బన్‌: గణేశ్‌నగర్‌ బైపాస్‌లో గల ఎల్‌ఐసీ ఏజెంట్ల భవనంలో ఈనెల 15న తెలంగాణ వర్కింగ్‌ జర్నలిస్ట్‌ ఫెడరేషన్‌ (టీడబ్ల్యూజేఎఫ్‌) జిల్లా నాల్గో మహాసభ నిర్వహిస్తున్నట్లు జాతీయ కౌన్సిల్‌ సభ్యుడు బాపురావు తెలిపారు. మహాసభల్లో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలనే డిమాండ్‌తో పలు తీర్మానాలు చేసి రాష్ట్ర కమిటీ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

‘ఏచూరి’ మరణం తీరని లోటు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్‌: సీపీఎం జాతీయ కార్యదర్శి, ప్రముఖ ఆర్థికవేత్త, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శనివారం బస్టాండ్‌ చౌరస్తా నుంచి తెలంగాణ చౌక్‌ వరకు నివాళి అర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. భారత రాజకీయ వినీలాకాశం ఒక పోరాట యోధుడు అరుణతారను కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్‌, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్‌, ఎడ్ల రమేశ్‌, నరేశ్‌పటేల్‌, నాయకులు భూతం సారంగపాణి, కోనేటి నాగమణి, తిప్పారపు సురేష్‌, వడ్ల రాజు, రాయికంటి శ్రీనివాస్‌, పుల్లెల మల్లయ్య, గజ్జల శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

విద్యానగర్‌: విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. శనివారం కరీంనగర్‌ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ఉమ్మడి జాబితాలోని విద్యను కేంద్రీకరణ చేయాలని కుట్ర చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్‌ చేశారు. సమగ్ర ఫీజుల చట్టం చేయాలని, యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవడానికి ఉన్నత విద్యామండలికి అవకాశం కల్పించి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు ఉప్పుల రాహుల్‌, కార్యదర్శి సంద గణేశ్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాజేశ్‌, రాష్ట్ర కమిటి సభ్యులు కుమార్‌, నాయకులు ఉమామహేశ్వర్‌, హరీశ్‌, గణేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

జూడాల నిరసనకు మద్దతు



కరీంనగర్‌ టౌన్‌: కోల్‌కతాలోని వైద్య కళాశాలలో ఆగస్టు 9న యువ వైద్యురాలిపై హత్యాచారం చేసిన దోషులను శిక్షించి, బాధితురాలికి న్యాయం చేయాలని జూడాలు చేస్తున్న నిరసనకు తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌ సభ్యుడు రాజకుమార్‌ శనివారం వినాయక మండపాల వద్ద భక్తులతో కలిసి మద్దతు ప్రకటించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరీంనగర్‌లోని పలు గణేశ్‌ మండపాల వద్ద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విఘ్నేశ్వరుడికి ఫల పంచామృత అభిషేకాలు



కుంకుమార్చనలో మహిళలు



ప్రకాశ్‌గంజ్‌లో సహస్ర దీపాలంకరణ, ఉంజల్‌ సేవ

ఉండ్రాళ్లయ్యా.. దండాలయ్యా

వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని పలు గణేశ్‌ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, అన్నదానాలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వాయుపుత్ర ఫ్రెండ్స్‌ యూత్‌ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి ఫల పంచామృత అభిషేకాలు చేశారు. శివశక్తి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్వర్యంలో ఏర్పాటు వినాయకుడి వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రకాశం గంజ్‌లో సహస్త్ర దీపాలంకరణ, ఉంజల్‌ సేవ చేశారు. నగరంలోని పలు మండపల వద్ద మేయర్‌ సునీల్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొమ్మకల్‌ అంజనానగర్‌లో కుంకుమపూజ చేశారు.

– కరీంనగర్‌కల్చరల్‌/కరీంనగర్‌రూరల్‌



అంజనానగర్‌లో కుంకుమపూజలో మహిళలు



సరస్వతీనగర్‌లో దీపోత్సవం



అన్నదానంలో మేయర్‌ సునీల్‌రావు

ప్రథమ చికిత్స దినోత్సవం



కరీంనగర్‌సిటీ: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ సీహెచ్‌.శ్రీనివాస్‌ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ప్రాణాలు నిలబెట్టేది ప్రథమ చికిత్స అని అన్నారు. మెరుగైన వైద్యం అందే వరకు ఈ ప్రథమ చికిత్స మానవ జీవితాలకు ఓ వరమని తెలిపారు. అనంతరం కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు కళాశాల ఆవరణ నుంచి కోర్టు చౌరస్తా వరకు ప్రథమ చికిత్సపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి కిరణ్‌ జ్యోతి, ఏసీవోబీ సంపత్‌ కుమార్‌, ఏవోబి శ్రావణ్‌కుమార్‌, బి. రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అల్ఫోర్స్‌ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో..

ప్రథమ చికిత్సపై అవగాహన

కొత్తపల్లి: కరీంనగర్‌ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్‌ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో లియో క్లబ్‌ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శనివారం అవగాహన కల్పించారు. గుండె అకస్మాత్తుగా ఆగినప్పుడు చేయాల్సిన సీపీఆర్‌ పద్ధతిని డా.లతీష్‌రెడ్డి వివరించారు. అనుకోని దుర్ఘటన, ప్రమాదం జరిగినప్పుడు వ్యక్తి ప్రాణాలు నిలపడానికి ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో సత్వరమే చేయాల్సిన ఉపశమన చర్య ప్రథమ చికిత్స అని తెలిపారు. అల్ఫోర్స్‌ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్‌ వి.రవీందర్‌రెడ్డి, శాతవాహన లయన్స్‌ క్లబ్‌ సభ్యులు సత్యనారాయణరావు, సురేందర్‌, మహేందర్‌, కళాశాల లియో క్లబ్‌ సభ్యులు కనక్‌ ముందడా, ముస్కాన్‌ ఫాతిమా, రెనే ఆసుపత్రి ఏఓ అరవింద్‌, సీఈవో పవన్‌, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక అవుతా



మాట్లాడుతున్న రవీందర్‌ సింగ్‌

కరీంనగర్‌కల్చరల్‌: జరుగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే పట్టభద్రుల తరుపున ప్రశ్నించే గొంతుక అవుతానని రాష్ట్ర సివిల్‌ సప్లయ్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ సర్దార్‌ రవీందర్‌ సింగ్‌ అన్నారు. శనివారం నగరంలోని పలు ప్రయివేట్‌ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల మద్దతు కోరారు. కరీంనగర్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, మెదక్‌ నియోజకవర్గాల స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మీ ముందుకు వస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్సీగా నాకు అవకాశం కల్పించి గెలిపించాలని కోరారు.

డీలర్లకు గ్యాస్‌ లబ్ధిదారుల ప్రొసీడింగ్స్‌

కరీంనగర్‌ కార్పొరేషన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల జాబితా రేషన్‌ డీలర్ల వద్దకు చేరింది. గ్యాస్‌ రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను జిల్లా పౌరసరఫరాలశాఖ నగరపాలకసంస్థకు పంపించగా, నగరపాలకసంస్థ నుంచి శనివారం నగరంలోని రేషన్‌ డీలర్లకు చేరాయి. రేషన్‌ కార్డుల ఆధారంగా రేషన్‌ కోసం వచ్చే లబ్ధిదారులకు డీలర్లు ఈ ప్రొసీడింగ్స్‌ను అందజేయనున్నట్లు సమాచారం.

పర్స్‌ అందజేత

విద్యానగర్‌: కరీంనగర్‌ బస్‌స్టేషన్‌ గేట్‌ వద్ద పోగొట్టుకున్న పర్సును బెజ్జంకికి చెందిన ప్రయాణికురాలు బూరుగు శ్రీలతకు ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది శనివారం అందజేశారు. అందజేసిన వారిలో సెక్యూరిటీ ఏఎస్సై ఎం లక్‌పతి,, కానిస్టేబుళ్లు నారాయణ, రమణ, సెక్యూరిటీ గార్డులు తిరుపతి, ప్రభాకర్‌ ఉన్నారు.



పారమితలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



హిందీ దివస్‌ వేడుకల్లో ప్యారడైజ్‌ విద్యార్థులు

విద్యాసంస్థల్లో హిందీ భాషా దినోత్సవం

నగరంలోని పలు విద్యాసంస్థల్లో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హిందీలో వ్యాసరచన, ఉపన్యాస, సాంప్రదాయ నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హిందీ భాషా గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్‌, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. – కరీంనగర్‌కల్చరల్‌/విద్యానగర్‌/కొత్తపల్లి



వాణినికేతన్‌ ఇంగ్లీష్‌ మీడియం పాఠశాలలో..



ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో..



సెయింట్‌ పాల్స్‌లో విద్యార్థినుల నృత్యం



వరద బాధితుల సహాయార్థం సీఎం రేవంత్ రెడ్డికి రూ.5 కోట్ల చెక్ ఇస్తున్న దివిస్ ల్యాబొరేటరీ సీఈవో డాక్టర్ కిరణ్

టైమ్స్ ప్రాపర్టీ షో ప్రారంభం



మాదాపూర్ (హైదరాబాద్): మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న టైమ్స్ ప్రాపర్టీ ఎక్స్‌పో–2024 శనివారం ప్రారంభమైంది. అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ బ్రాండ్ మేనేజర్ వెంకట్ రవి, లాన్సన్ ఎన్ పాయింట్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కియా కార్వంకర్, రాజపుష్ప ప్రాపర్టీస్ కార్తీక్ తదితరులు ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఎక్స్‌పోలో 50 మంది ప్రసిద్ధ డెవలపర్‌లు.. 150కి పైగా ప్రాజెక్టులను అందుబాటులో ఉంచారు. నగరంలో ప్రముఖ ప్రాజెక్టులు, అందుబాటులోని విల్లాలు, ఆపార్ట్‌మెంట్ల ప్లాట్ల సమాచారాన్ని సందర్శకులకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో హానర్‌హోమ్స్ ఐశ్వర్య, అంకురా హోమ్స్ అవినాశ్, రాదేయ్ కన్‌స్ట్రక్షన్ మహమ్మద్‌గౌస్ అలీ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కేజ్రీవాల్ పూజలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ శనివారం కన్నాట్ ప్లేస్‌లోని ప్రఖ్యాత హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. భార్య సునీతతో పాటు వచ్చిన ఆయన ఆలయంలో పూజలు చేసి, ఆశీర్వచనం అందుకున్నారు. ఆప్ నేతలు, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ కూడా వారి వెంట ఉన్నారు. మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు బెయిలివ్వడంతో కేజ్రీవాల్ శుక్రవారం తీహార్ జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. అదేవిధంగా, కేజ్రీవాల్ తన నివాసంలో సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో చర్చలు జరిపారు.

డీమ్డ్ మెడికల్ కాలేజీలపై సర్కారు గరం

- యూజీసీ తీరును తప్పుబడుతున్న ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయం
- అవసరమైతే కోర్టుకు వెళ్లేలా యోచన
- 'సాక్షి' కథనం నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇస్తున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీరుపై రాష్ట్ర సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయా లని భావిస్తోంది. అవసరమైతే కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. శనివారం 'సాక్షి' లో 'వైద్య విద్య సీట్లపై ప్రైవేట్ కన్ను' శీర్షికతో ప్రచురితమైన కథనంపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో కన్వీనర్ కోటా, రిజర్వేషన్ కోటా సీట్లు తగ్గిపోయి మెరిట్, పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రికి ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి, ఈ అంశం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, డీమ్డ్ వర్సిటీలను అడ్డుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్టుగా విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనిపై కాళోజీ యూనివర్సిటీ అధికారులతోనూ మంత్రి సమీక్ష చేసినట్టు తెలిసింది. యూజీసీ తీరు బడుగు, బల హీన వర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు తీరని అన్యాయం చేసే విధంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించినట్టు అధికారులు చెబుతున్నారు.

'మల్లారెడ్డి' బాటలో మరికొన్ని కాలేజీలు!

మల్లారెడ్డి మెడికల్ కాలేజీలు, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ వర్సిటీ హోదాను ఇస్తూ ఇటీవలే యూజీసీ నిర్ణయం తీసుకుంది. ఫీజుల ఖరారు, పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల మూల్యాంకనం వంటివన్నీ వర్సిటీ హోదాలో సొంతంగా చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. తెలంగాణ స్థానిక కోటా అమలు చేయాల్సిన అవసరం లేకుండా మినహాయింపులు ఇచ్చింది. దీంతో మల్లారెడ్డి కాలేజీల్లో ఉన్న 400 ఎంబీబీఎస్ సీట్లు, సుమారు 150 బీడీఎస్ (డెంటల్) సీట్లు పూర్తిగా మేనేజ్‌మెంట్ కోటాలోకి వెళ్లిపోయాయి. గతేడాది వరకూ ఇందులో సగం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేసేవారు. నీట్‌లో మంచి ర్యాంక్ సాధించిన ప్రతిభగల విద్యార్థులకు ఈ సీట్లు దక్కేవి. ర్యాంకు సాధించిన పేద విద్యార్థులకు ఉచితంగా మెడిసిన్ చదివే అవకాశం దక్కేది. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలోనూ 85 శాతం తెలంగాణ విద్యార్థులకే కేటాయించేవారు. కానీ ఇకపై ఈ నిబంధనలు ఏవీ పాటించాల్సిన అవసరం లేకుండా యూజీసీ 'మల్లారెడ్డి'కి మినహాయింపులు ఇచ్చింది. 'మల్లారెడ్డి'చూపిన బాటలో అపోలో, సీఎంఆర్ కాలేజీలు కూడా డీమ్డ్ హోదా కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి దామోదర దీనిపై సీరియస్‌గా దృష్టి పెట్టారు.

కోట్లలో ఆదాయం!

డీమ్డ్ యూనివర్సిటీ హోదా తెచ్చుకుంటున్న మెడికల్ కాలేజీలకు రూ. వందల కోట్ల లబ్ధి చేకూరుతోంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీటు ఫీజు రూ. 60 వేలు మాత్రమే ఉండగా, మేనేజ్‌మెంట్ కోటా ఫీజు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రెగ్యులేటరీ కమిటీ ఫీజులను నిర్ణయిస్తోంది. అయితే డీమ్డ్ యూనివర్సిటీలు ఈ కమిటీతో సంబంధం లేకుండా, సొంతంగానే తమ ఫీజులను నిర్ణయించుకునే అధికారాన్ని యూజీసీ కల్పిస్తోంది. మల్లారెడ్డి మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ ఫీజు సంవత్సరానికి రూ.17.5 లక్షలుగా ఉన్నట్టు కాళోజీ అధికారులు చెబుతున్నారు. గతంలో కన్వీనర్ కోటా ఫీజు కింద 200 సీట్లకు ఏడాదికి రూ.1.2 కోట్లు వస్తే, ఇప్పుడు అవే 200 సీట్లకు ఏడాదికి రూ.35 కోట్ల ఆదాయం వస్తుంది. ఒక్క బ్యాచ్ పూర్తయ్యేసరికి ఏకంగా రూ.175 కోట్లు సమకూరుతుంది.

సీబీఎస్ఈకీ మంగళం!



ఏపీలో పేదల విద్యపై చంద్రబాబు ప్రభుత్వ కక్ష సాధింపు

- ఈ పరీక్షలు రద్దుచేస్తూ నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో తిరోగమనంలో పాఠశాల విద్య
- మాజీ సీఎం జగన్‌పై కోపాన్ని పేద పిల్లలపై చూపుతున్న సర్కారు

సాక్షి, అమరావతి: మొన్న టోఫెల్.. నిన్న ఐబీ.. నేడు సీబీఎస్ఈ.. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో ఉన్నతాశయంతో పేద విద్యార్థుల భవిష్యత్తుకు వీటి ద్వారా బంగారు బాటలు వేస్తే ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం వాటిని ఒక్కొక్కటిగా అటకెక్కిస్తోంది. రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలన్న సత్సంకల్పంతో విద్యారంగంలో జగన్ అనేక సంస్కరణలు అమలుచేస్తే.. ఆయన మీద అక్కసుతో చంద్రబాబు సర్కారు పేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తూ పాఠశాల విద్యను తిరోగమనం బాట పట్టిస్తోంది. ఇందులో భాగంగా.. జగన్ అమలుచేసిన ఒక్కో అంశానికీ స్వస్తి చెబుతోంది. టోఫెల్, ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) బోధనకు ఇప్పటికే చరమగీతం పాడిన ఈ ప్రభుత్వం అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన ఊసెత్తడంలేదు. తాజాగా.. సీబీఎస్ఈ బోధనకూ తూచ్ అంటూ పేద పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్యను దూరం చేస్తోంది. ప్రభుత్వబడుల పీక పిసికేస్తోంది.

విద్యా సంవత్సరంలో మధ్యలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ బడులను అద్భుతంగా తీర్చిదిద్ది తల్లిదండ్రుల్లోను, విద్యార్థుల్లోను వాటిపై పెంచిన నమ్మకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా గత విద్యా సంవత్సరంలో వైఎస్ జగన్ సర్కారు 1,000 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధనను అమల్లోకి తెస్తే.. చంద్రబాబు సర్కారు ఈ విద్యా సంవత్సరం మధ్యలో దానిని రద్దుచేసేసింది. అధికారంలోకి రాగానే ఇంగ్లిష్ మీడియం రద్దుచేస్తామని మొన్నటి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు బహిరంగంగా చేసిన ప్రకటనకు అనుగుణంగానే ఆయనిప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. అలాగే, విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన 'టోఫెల్'శిక్షణను అధికారంలోకి వచ్చీరాగానే జూన్‌లో రద్దుచేసి పారేశారు. ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు సీబీఎస్ఈ ప్రమాణాలను అందుకోలేకపోతున్నారని చెబుతూ 1,000 ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లోకి తెచ్చిన సీబీఎస్ఈ బోధనను రద్దుచేశారు. అలాగే, విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న సాకుతో అక్కడి ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో బదిలీ చేసింది. ఇలా ప్రభుత్వ నిరంకుశ విధానాల కారణంగా.. ఇంగ్లిష్ మీడియం కోరుకునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోతున్న పరిస్థితి రాష్ట్రంలో దాపురించింది.

జగన్‌పై కోపంతోనే విద్యపై అక్కసు..

'పేదలకు ఉచితంగా చదువు చెప్పడం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు ఉండవు, ప్రైవేటు బడులు బాగుంటాయి. డబ్బున్నవారు అక్కడ చదువుకుంటారు, మీరూ ఫీజులు కట్టి ప్రైవేటు స్కూళ్లకు వెళ్లండి'.. అని గతంలో సీఎం హోదాలో చంద్రబాబు బహిరంగంగా అన్నారు. దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం, రాష్ట్రానికి 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన ఆయనకు పేదలన్నా.. పేదల పిల్లల చదువులన్నా ఎంత చులకనో ఈ మాటలే చెబుతున్నాయి. ఆయన తన నైజాన్ని మరోసారి రుజువు చేసుకుంటూ పేదల విద్యను నిర్వీర్యం చేసే చర్యలకు పూనుకున్నారు. ఇందులో భాగంగానే కార్పొరేట్ విద్యా సంస్థలకు బాహాటంగా కొమ్ముకాస్తూ రాష్ట్రంలో పేద పిల్లల చదువును పూర్తిగా అంధకారంలోకి నెట్టేస్తున్నారు. ఉదా.. గతంలో తక్కువ మంది విద్యార్థులున్నారని 2014–19 మధ్య 1,785 పాఠశాలలను మూసివేసి అక్కడి విద్యార్థులను గాలికొదిలేశారు. అలాగే, 4,300 ప్రభుత్వ పాఠశాలలను ఆయన హయాంలోనే మూసివేశారు. ఇప్పుడు వైఎస్ జగన్‌పై కోపంతో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ బోధనకు సైతం అదే గతి పట్టించారు.

విద్యా సంస్కరణలకు జగన్ శ్రీకారం..

పిల్లలకు మనమిచ్చే ఆస్తి ఏదైనా ఉందంటే అది నాణ్యమైన విద్య మాత్రమేనని, పేదరికం పోవాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని బలంగా నమ్మిన వైఎస్ జగన్ తన పాలనలో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా రాణించాలంటే వారికి ఇంగ్లిష్ మీడియం బోధన ఉండాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాదికి ఒక తరగతి చొప్పున పెంచుతూ ఇంగ్లిష్ మీడియం అమలుచేశారు. మరోపక్క.. ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టోఫెల్'ను సిలబస్‌లో అంతర్భాగం చేశారు. మరోపక్క.. జాతీయ విద్యా విధానం–2020లో భాగంగా రాష్ట్రంలోని ఎక్కువమంది విద్యార్థులకు సీబీఎస్ఈ విద్యను అందించేందుకు 1,000 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో 2023–34 విద్యా సంవత్సరంలో 9వ తరగతి నుంచి సీబీఎస్ఈ బోధనను అందుబాటులోకి తెచ్చారు. దీంతో దాదాపు 84 లక్షల మంది విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఒక యూనిట్ పరీక్షలు కూడా ముగిసిన తర్వాత ఉన్నపళంగా రాష్ట్ర ప్రభుత్వం సీబీఎస్ఈ పరీక్షా విధానం రద్దు చేసి విద్యార్థులను గందరగోళంలోకి నెట్టేసింది.

పదేళ్లు అధికారంలో ఉంటాం

▶ మొదటి పేజీ తరువాయి

నిరంతరం విషం చిమ్ముతుంటారని.. ప్రజల పక్షాన మాట్లాడేవారి కంటే విషం చిమ్మేవారు ఎక్కువైపోయారని వ్యాఖ్యానించారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మజ్లిస్ కలిసి రావడం ఆనందంగా ఉంది

ప్రభుత్వాన్ని నడిపించడంలో కొన్ని తప్పిదాలు జరగవచ్చని, వాటిని ఎత్తి చూపేందుకు బలమైన ప్రతిపక్షం అవసరమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, తర్వాత అభివృద్ధి, సంక్షేమంలో అంతా కలిసి రావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ రాజకీయంగా విభేదించినా.. తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కలసి రావడం ఆనందంగా ఉందని చెప్పారు. మూసీ నది అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో కొందరు పేదలు నివాసాలు కోల్పోయే అవకాశం ఉందని, వారికి ప్రభుత్వపరంగా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని రేవంత్ ప్రకటించారు. అన్ని మతాలు చెప్పింది ఒక్కటేనని, అందరం కలసిమెలసి శాంతియుతంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని రేవంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీప్రిస్ వైస్‌చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, ఇస్లామిక్ స్కాలర్స్ పాల్గొన్నారు.

అతివ.. ఆర్థిక క్రాంతి

- జిల్లాకు రూ.122కోట్లు విడుదల
- ఇందిరా మహిళా శక్తి పేరుతో పథకం
- 14 రకాలుగా ఉపాధి మార్గాలు



కరీంనగర్ అర్బన్: ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందిరా మహిళా శక్తి పేరుతో పథకాన్ని రూపొందించగా 14రకాల ఉపాధి మార్గాలను నిర్దేశించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ తదనుగుణ చర్యలు ముమ్మరం చేశారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పలు సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయడమే పథకం ముఖ్య ఉద్దేశ్యం. ఆయా సంఘాల మహిళలు తమ నైపుణ్యాలకు తగిన వ్యాపారాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. తదనుగుణ శిక్షణనందించి ఉత్పత్తి చేసిన సరకును మార్కెటింగ్ చేసేందుకు సహకారం అందిస్తారు. ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నారు. వ్యాపారానికి అయ్యే పెట్టుబడిని రుణంగా ఇవ్వనున్నారు. కాగా.. సంఘాల ఎంపికలో పైరవీలకు ప్రాధాన్యమిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గ్రామైక్య సంఘాలకు రూ.కోటి వరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు అందజేయడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు రూ.5లక్షల బీమా సదుపాయం కల్పించనున్నారు.

14 రకాల వ్యాపారాలు.. రూ.122కోట్లు

14 రకాల వ్యాపారాలతో మహిళలు రాణించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఆసక్తి ఉన్న రంగంలో అధికారులు ప్రోత్సహించనుండగా ప్రభుత్వం జిల్లాకు రూ.122కోట్లు కేటాయించింది. 14రకాల వ్యాపారాల్లో కుట్టు కేంద్రాలు, పాడి గేదెలు, డెయిరీ పార్లర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాంటీన్లు, మీ సేవా కేంద్రాలు, ప్లాస్టిక్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, సంచార చేపల అవుట్‌లెట్, సాధారణ ప్రాసెసింగ్ యూనిట్, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, కోళ్లఫాం మదర్ యూనిట్లు, పెరటి కోళ్ల పెంపకం వంటి యూనిట్లకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ మేరకు డీఆర్డీఏ అధికారులు మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి, ఆసక్తిఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సాగుతున్న గ్రౌండింగ్ ప్రక్రియ


జిల్లాలో ఇందిరా మహిళా శక్తి పథకం అమలులో కొంత జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. పలువురు అధికారులు పైరవీలు, మామూలుగా వ్యవహరించేవారికి పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలున్నాయి. మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌కు 2,192 గ్రౌండింగ్ కాగా పాడి గేదెలకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించగా గ్రౌండింగ్ చేయాల్సి ఉంది. సంచార చేపల అవుట్ లెట్, డెయిరీ పార్లర్, మీ సేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ యూనిట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇంకా గ్రౌండింగ్ దశలోనే ఉన్నాయి.

జిల్లాకు కేటాయించిన యూనిట్ల వివరాలు

యూనిట్లు	మండలం	గ్రామైక్య సంఘాలు	ప్రతిపాదిత యూనిట్లు	పెట్టుబడి లక్షల్లో
మైక్రోఎంటర్‌ప్రైజెస్	15	529	7,772	8,851
కుట్టుకేంద్రాలు	15	529	63	352
పాడి గేదెలు	15	500	2,000	1,800
బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ	15	475	1,500	225
కోళ్లఫాం మదర్ యూనిట్లు	15	15	15	43.65
సంచార చేపల అవుట్‌లెట్	1	1	1	10
డెయిరీ పార్లర్	1	1	1	1.90
మీ సేవ కేంద్రాలు	10	15	15	37.50
ఈవెంట్ మేనేజ్‌మెంట్	1	1	1	31.20
మహిళాశక్తి క్యాంటీన్లు	5	5	5	100
సోలార్ యూనిట్లు	1	1	1	400
ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్	1	1	1	8
ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు	15	120	120	240
కస్టమ్ హైరింగ్ సెంటర్స్	4	126	4	100

జిల్లాలో మండలాలు (కరీంనగర్ అర్బన్ మినహా)	: 15
మొత్తం గ్రామైక్య సంఘాలు	: 529
మొత్తం మహిళా సంఘాలు	: 13,720
రుణ లక్ష్యం	: రూ.122కోట్లు

గ్రౌండింగ్ జరుగుతోంది



మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకానికి జిల్లాలో మహిళా సంఘాల ఎంపిక ప్రక్రియ చివరి దశలో ఉంది. ప్రస్తుతం ఎంపికైన యూనిట్ల పరిశీలన, గ్రౌండింగ్ కొనసాగుతోంది. వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేస్తాం.

– శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

సబ్సిడీ పేరిట రూ.2.70కోట్లు వసూలు

- రైతులకు ట్రాక్టర్లు ఇప్పిస్తామని మోసం
- అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్



నిందితుల అరెస్టు చూపిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, అధికారులు

మంచిర్యాలక్రైం: జిల్లాలోని పలువురు రైతులకు 50శాతం సబ్సిడీపై ట్రాక్టర్లు ఇప్పిస్తామని రూ.2.70కోట్లు వసూలు చేసి టోకరా వేశారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం స్థానిక ఏసీపీ కార్యాలయంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ వివరాలు వెల్లడించారు. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామానికి చెందిన బొడ్డు శేఖర్‌కు కార్తీక్ అనే వ్యక్తి తనను తాను మార్కెటింగ్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్నాడు. ఎన్‌పీఎస్(భారత్ కిసాన్ వెల్ఫేర్ ఫౌండేషన్) ద్వారా 50శాతం సబ్సిడీపై ట్రాక్టర్ ఇప్పిస్తానని చెప్పాడు. అవసరమైన పత్రాలతో తమ కార్యాలయానికి వెళ్లి మేనేజర్‌ను కలవాలని సూచించాడు. దీంతో శేఖర్ మంచిర్యాలలోని జన్మభూమి నగర్‌లో ఉన్న ఎన్‌పీఎస్ కార్యాలయానికి వెళ్లి చంద్రమౌళి, అకౌంటెంట్ రత్నం శ్రీకాంత్‌లను కలిశాడు. ఆధార్, పాన్‌కార్డు, పట్టాపాస్‌బుక్, బ్యాంకుపాస్ బుక్ జిరాక్స్ కాపీలు ఇచ్చాడు. అతడికి నమ్మబలికి రూ.6.40లక్షలు విలువైన ట్రాక్టర్ ధరలో సగం రూ.3.20లక్షలు, కమిషన్ రూ.35వేలు తీసుకున్నారు. స్వరాజ్ ట్రాక్టర్ షోరూంలో రూ.లక్షా ఆరు వేలు డౌన్ పేమెంట్ చెల్లించి ట్రాక్టర్‌ను అతడి పేరుపై ఇప్పించడమే కాకుండా, మహీంద్రా ఫైనాన్స్‌లో రూ.5.33లక్షలు లోన్ తీసుకుని మోసగించారని బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు బెల్లంపల్లికి చెందిన కామెర చంద్రమౌళి, రత్నం శ్రీకాంత్, గోలి కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా హైదరాబాద్‌లో మెయిన్ బ్రాంచి ఉందని నమ్మించి సుమారు 88 మంది రైతుల వద్ద రూ.2.70 కోట్లు వసూలు చేశారని వెల్లడైనట్లు ఏసీపీ తెలిపారు. ఆ డబ్బు రొటేషన్ చేస్తూ 82 మందికి ట్రాక్టర్లను అందించి మిగతా ఆరుగురికి ట్రాక్టర్లు అందించలేదని పేర్కొన్నారు. రూ.40 లక్షలు జల్సాలకు ఖర్చు చేసినట్లు ఒప్పుకున్నారని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ బన్సిలాల్, ఎస్సై సనత్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరునికి రూపమిచ్చి..



'మోక్షగుండం' ప్రతిమకు తుది మెరుగులు దిద్దుతున్న పోలీస్ భీమేశ్

నిర్మల్‌ఖిల్లా: భారతదేశ ప్రఖ్యాత తొలితరం ఇంజినీరు, భారతరత్న పురస్కార గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని ఏటా సెప్టెంబరు 15న 'జాతీయ ఇంజనీరింగు దినోత్సవం' నిర్వహిస్తుంటారు. నిర్మల్ జిల్లాకు చెందిన యువ కళాకారుడు, శిల్పి పోలీస్ భీమేశ్ తన కళతో మోక్షగుండం విశ్వేశ్వరయ్య రూపాన్ని తీర్చిదిద్దాడు. సాధారణ బంక మట్టి, సహజ సిద్ధ నీటిరంగులతో రూపొందించిన ఈ కళారూపం ఆకట్టుకుంటోంది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ ప్రతిభను నేటి తరానికి తెలియజేయాలని ఈ మట్టి విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు పోలీస్ భీమేశ్ తెలిపారు. 8 ఇంచుల ఈ మట్టి ప్రతిమను తయారుచేయడానికి తనకు మూడు గంటల సమయం పట్టిందని పేర్కొన్నారు.

నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తు

- మల్టీజోన్ వన్ ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి



వినాయకుని వద్ద ఐజీ, ఎస్పీ పూజలు

ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్టీజోన్ వన్ ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన ద్వారకనగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుని వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఆయన వెంట ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం, అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, హిందూ సమాజ ఉత్సవ సమితి సభ్యులు, ద్వారకా గణేశ్ మండలి నిర్వాహకులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత!



రెండు వైపులా ధ్వంసమై డివైడర్‌లా మారి



కంకరతేలి గుంతలతో ధ్వంసమైన రహదారి

ఆదిలాబాద్‌రూరల్ మండలం లోకారి నుంచి నార్నూర్ మండల కేంద్రానికి వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయమైంది. 25 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ రహదారిపై అడుగుకో గుంత అన్నట్లుగా అస్తవ్యస్తంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు జంకుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

భారీ వర్షాలతో కోల్పోయిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి

- ఓసీపీల్లో నిలిచిన నీటిని తొలగించాలి
- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న బలరాం

గోదావరిఖని: మూడు నెలలపాటు కురిసిన భారీవర్షాలతో కోల్పోయిన బొగ్గు ఉత్పత్తిని ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లి భర్తీ చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం కోరారు. శనివారం సంస్థ వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత లేకుండా ఒప్పందం ప్రకారం సరఫరా చేయాలని సూచించారు. ప్రతీరోజు 2లక్షల టన్నుల ఉత్పత్తి చేయాలని, అదేస్థాయిలో రవాణా చేయాలని అన్నారు. భారీవర్షాలతో ఓసీపీల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని, అవసరమైతే అదనపు పంపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీరోజు 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ తన బాధ్యతగా ముందుకు సాగాలని అన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. కొత్తగూడెంలోని వీకే వోసీపీకి తొలిదశ అటవీ అనుమతులు లభించిన నేపథ్యంలో రెండు నెలల్లో బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, కో ఆర్డినేషన్ జీఎం సుభాని, సీపీపీ జీఎం జక్కం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

ఓదెల(పెద్దపల్లి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ కాగజ్‌నగర్ – సికింద్రాబాద్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం రెండు గంటల పాటు ఆలస్యంగా నడిచింది. దీంతోపాటు సిర్పూర్ కాగజ్‌నగర్ – కాజీపేట మధ్య నడిచే రామగిరి ప్యాసింగ్ రైలు కూడా సుమారు రెండుగంటల పాటు ఆలస్యంగా నడిచింది. దీంతో ఓదెల, పొత్కపల్లి, కొలనూర్, పెద్దపల్లి రైల్వేస్టేషన్లలోని ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.



ఎక్కువ పనివేళలు టెకీలను ఊబకాయులుగా మారుస్తున్నాయా?! అనే సందేహానికి 'అవును' అనే సమాధానం సాఫ్ట్‌వేర్ రంగం నుంచి వస్తోంది. ఈ విషయంపైన 'చైనీస్ ఇన్‌స్టాగ్రామ్ జియాహోంగ్షులో వాపోతున్న యువతుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంద'ని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వెల్లడి చేసింది. టెకీ ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్ని దేశాల్లోనూ ఒకేలా ఉంటున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి నిపుణులు చెబుతున్న సూచనలు పాటిద్దాం..

టెక్కీ.. వెయిటెక్కీ

గంటలకొద్దీ పని.. కేజీల కొద్దీ బరువు

చైనాలోని ఓయాంగ్ వెన్టింగ్ అనే 24 ఏళ్ల యువతి ఉద్యోగంలో ఒత్తిడి కారణంగా గత ఏడాది కాలంలో 20 కేజీల బరువు పెరిగిందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వెల్లడించింది. 'నా శారీరక, మానసిక ఆరోగ్యానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఒక విపత్తుగా మారింది. ఎక్కువ పని గంటలు, మారుతూ ఉండే షిఫ్ట్ వేళల కారణంగా ఆహారం తీసుకోవడంలో అపసవ్యత చోటు చేసుకునేది. దీంతో ఏడాది కాలంలో 60 కేజీల నుంచి 80 కేజీల బరువు పెరిగాను. ఇలా అయితే నా ఆరోగ్య పరిస్థితి ఏమవుతుందో అని జూన్‌లో ఉద్యోగం మానేశాను. అప్పటి నుంచి నా ఆరోగ్యంలో మెరుగైన మార్పులు వచ్చాయి' అని ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది ఓయాంగ్. ఆమె ఇప్పుడు ఫ్రీలాన్స్ వెయిట్‌లాస్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారింది. తన ఆహారంలో కూరగాయలు, ధాన్యాలు, ప్రొటీన్లను చేర్చుతూ 6 కిలోల బరువు తగ్గానని తెలిపింది. ఓయాంగ్ అనుభవం చెప్పడంతో ఆమెలాంటి వ్యక్తులు తమ పని కష్టాలను పంచుకోవడానికి ముందుకు వచ్చారు. చైనాలోనే కాదు ఏ దేశంలోనైనా సాఫ్ట్‌వేర్ ప్రపంచంలో పనిచేసే టెకీలందరికీ ఇది వర్తిస్తుంది.

మానసికమైన అలసట

'పని ఒత్తిడి కారణంగా డిజర్ట్‌లను అతిగా తినడం వల్ల నెల రోజుల్లోనే 3 కిలోల బరువు పెరిగాను' అని తన అనుభవాన్ని ఇన్‌స్టా ద్వారా పంచుకుంది మరో టెక్ ఉద్యోగిని 33 ఏళ్ల షాంఘై..

అతిగా ఆకలి

ఎక్కువ గంటలు పనిచేయడం అనేది పని సంబంధిత ఒత్తిడికి ప్రధాన కారణాలలో ఒకటి. ఈ పరిస్థితి సందడిగా ఉండే నగరాల్లో ఆందోళనకరమైన ధోరణిగా మారుతోంది. వర్క్ షిఫ్ట్ వల్ల సరైన నిద్ర వేళలు ఉండవు. దీంతో కార్టిజోల్ హార్మోన్ పెరుగుతుంది. ఆరోగ్యానికి మేలు చేసే మెలటోనిన్ తగ్గిపోతుంది. లేట్‌నైట్స్ మేల్కొని ఉండటం వల్ల ఆకలి పెరగడంతో ఫుడ్ తెప్పించుకుని తింటారు. దీంతో కదలికలు ఉండవు. ఇక వర్క్‌ఫ్రమ్ హోమ్ వచ్చాక పడుకొని వర్క్ చేసే వారున్నారు. దీంతో వారి శరీరంలో ఏ ఆర్గాన్ అయితే బలహీనంగా ఉంటుందో దానిపైన త్వరగా ప్రభావం పడుతుంది.



ఉద్యోగంలో చేరి పని ఒత్తిడి కారణంగా ఏడాది కాలంలోనే 20 కేజీల బరువు పెరిగిన ఓయాంగ్ వెన్టింగ్

తినే వేళలు సరి చేసుకోవాలి

చైనాలో పని సంస్కృతి ముఖ్యంగా టెక్ పరిశ్రమలో వారానికి ఆరు రోజుల పాటు ఉదయం 9 నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది. న్యూట్రిషన్ విభాగానికి చెందిన డాక్టర్ జువో జియోక్సియా హెల్త్ టైమ్స్‌తో మాట్లాడుతూ 'ఆలస్యంగా భోజనం చేయడం, అతిగా తినడం, నిద్రలేమి, 'అధిక పని ఊబకాయానికి దారితీస్తుందని చెప్పారు. ఈ సమస్యను అధిగమించాలంటే ఎక్కువ కూరగాయలు, తక్కువ మాంసాహారం తీసుకోవాలి. అంతేకాదు, తినే వేళలను సక్రమంగా పాటించాలి. ఆరోగ్యంగా ఉండటానికి జీవనశైలిలో వ్యాయామాన్ని తప్పనిసరిగా చేర్చుకోవాలి' అని సూచిస్తోంది. ఈ సమాచారం టెకీలందరికీ వర్తిస్తుంది.

అరకేజీ ఫ్రూట్ -వెజ్ సలాడ్

వయసులో ఉన్నప్పుడు పని, జీతం అన్నీ బాగానే అనిపిస్తాయి. అయితే, సరైన జీవన శైలి పాటించకపోతే నలభై దాటిన దగ్గర నుంచి ప్రతి ఐదేళ్లకు ఆరోగ్యం దెబ్బతింటూ ఉంటుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో జుట్టు రాలే సమస్య ఎక్కువ చూస్తుంటాం. లుక్ కోసం అవసరం లేని కాస్మటిక్ ట్రీట్‌మెంట్లు చేయించుకుంటారు. లుక్ కాదు ఆరోగ్యమే ప్రధానమని గుర్తించాలి. పని ఒత్తిడిని అధిగమించడానికి మెడిటేషన్ ఔషధంలా పనిచేస్తుంది.

- నిద్ర వేళలు సరిగ్గా చూసుకోవాలి. 6–8 గంటలు నిద్రకు కేటాయించుకోవాలి.
- వ్యాయామం తప్పనిసరిగా ఉండాలి.
- టైమ్‌కి ఆహారం తీసుకోవాలి. దీంతో పాటు ఫ్రూట్ సలాడ్, వెజ్ సలాడ్ రోజు వారీ ఆహారంలో చేర్చుకోవాలి. దీనివల్ల కొవ్వు పెరగదు. అతిగా ఆకలి అవడం ఉండదు.



– డాక్టర్ జానకి, పోషకాహార నిపుణులు



'ఊళ్లో పేదరికం కనిపిస్తుంది' అనే మాట వినిపిస్తుంటుంది. అయితే గుజరాత్‌లోని కొన్ని గ్రామాల్లో 'పేదరికం' కంటే ఒంటరితనమే ఎక్కువ కనిపిస్తుంది. అలాంటి ఒక గ్రామం... చందనంకి. ఒంటరితనం బాధితులైన ఈ ఊరి వృద్ధులు 'కమ్యూనిటీ కిచెన్'లతో ఒంటరితనానికి దూరం కావడమే కాదు కొత్త ఉత్సాహాన్ని పొందుతున్నారు...

కమ్మటి కబుర్ల కమ్యూనిటీ కిచెన్

వంటరికి విస్తరి

గుజరాత్‌లోని మెహసానా జిల్లా చందనంకి గ్రామంలో... పిల్లల కేరింతలు కనిపించవు. యువకుల ఆకతాయి మాటలు వినిపించవు. వృద్ధులు తప్ప ఎవరూ కనిపించని ఆ ఊళ్లో నిశ్శబ్దం రాజ్యమేలుతున్నట్లుగా ఉంటుంది. ఊరే ఒక వృద్ధాశ్రమంగా మారినట్లు అనిపిస్తుంది.

అసలు ఈ ఊరి వాళ్లు ఎక్కడికి వెళ్లారు?

చాలామంది పట్టణాల్లో స్థిరపడ్డారు. వారి కొడుకులు, కూతుళ్లు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలలో చదువుకుంటున్నారు.

ఒకప్పుడు సందడికి చిరునామాగా ఉన్న ఆ ఊరు ఇప్పుడు నిశ్శబ్దానికి నిర్వచనంలా మారింది. కేవలం అయిదు వందల మంది మాత్రమే ఆ ఊళ్లో ఉంటున్నారు. వారిలో అత్యధికులు వృద్ధులే.

'మా అబ్బాయి ఎప్పుడోగానీ నన్ను చూడడానికి రాడు' అంటుంది ఒక బామ్మ.

'నన్ను నీతో పాటు తీసుకెళ్లరా అని మా అబ్బాయితో ఎన్నో సార్లు అంటాను. కాని నా మాట పట్టించుకోడు' అంటుంది కోపంగా మరో బామ్మ.

'నువ్వు ఇక్కడ ఉండి ఏం చేస్తావు. మాతోపాటు వచ్చేయ్ అంటారు పిల్లలు. కాని నేను ఆ పట్టణాల్లో ఉండలేను. ఇక్కడే పుట్టాను. ఇక్కడే చస్తాను' ఊరి మీద ప్రేమ వ్యక్త పరుస్తుంది ఇంకో బామ్మ.

ఒంటరి ద్వీపాలుగా మారిన బామ్మలకు ఊళ్లోనే ఉండిపోవడానికి వేరు వేరు కారణాలు ఉండవచ్చు. అయితే అందరినీ ఏకం చేసిన కారణం... ఒంటరితనం.

ఒంటరితనం మాట ఎలా ఉన్నా ఊళ్లో చాలామంది వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న పనులు కూడా చేసుకోలేకపోతున్నారు. అయినప్పటికీ వారిని పట్టించుకునే వారు లేరు. అనారోగ్యంతో వంట చేసుకోవడం వారికి ఇబ్బందిగా మారింది. ఒక్క పూట కోసం వంట వండుకున్న వాళ్లు ఓపిక లేక అదే భోజనాన్ని మరుసటి రోజు కూడా తినడం వల్ల మరిన్ని ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.... ఈ నేపథ్యంలోనే గ్రామస్తుల ఆలోచన నుంచి 'కమ్యూనిటీ కిచెన్' ఏర్పాటయింది.

నెలకు రెండు వేలు చెల్లిస్తే... ప్రతి పూటా వేడి వేడి భోజనం చేయవచ్చు. ఆరోగ్యకరమైన భోజనం మాట ఎలా ఉన్నా 'కమ్యూనిటీ కిచెన్' అనే పెద్ద ఫ్యామిలీలో వృద్ధులందరూ కుటుంబ సభ్యులుగా మారిపోయారు.

ఒకరితో ఒకరు ఎంతోసేపు మాట్లాడుకుంటున్నారు. దీని వల్ల తమలో తెలియని ఆత్మీయత పెరిగింది. గతంలో ఎవరి ఇంట్లో వారు ఉండడం వల్ల ఎవరు ఎలా ఉన్నారు అనేది తెలిసేదికాదు. ఇప్పుడు రోజు కలుసుకోవడం వల్ల అన్ని విషయాలు మాట్లాడుకోగలుగుతున్నారు. మనసులో భారం దించుకొని ఒంటరితనానికి దూరం అవుతున్నారు.

ఒకరి పక్కన ఒకరు కూర్చుని, కబుర్లు చెప్పుకుంటూ కలిసి తినడం అనేది భోజనానికి సంబంధించిన విషయమే కాదు మానసికంగా శక్తిని ఇచ్చే విషయం అని ఈ ఊరి 'కమ్యూనిటీ కిచెన్' నిరూపిస్తుంది. 'కమ్యూనిటీ కిచెన్' ఏర్పాటులో పూనమ్ భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించాడు. భార్యా, బిడ్డలు పట్టణంలో ఉన్నా సరే, తాను మాత్రం ఊరిను వెదుక్కుంటూ వచ్చాడు. ఎంతో మంది వృద్ధులకు బిడ్డగా మారాడు.



'కమ్యూనిటీ కిచెన్'ల కోసం గ్రామస్తులు నెల జీతంతో కుక్‌లను నియమించుకున్నారు. వారికి ఉచిత నివాసం కూడా ఏర్పాటు చేశారు. గ్రామంలో సందడి లేకపోయినా 'కమ్యూనిటీ కిచెన్'లో మాత్రం సందడి ఉంటుంది. నవ్వులకు దూరం అయిన వృద్ధుల నవ్వులు ఇప్పుడు వినిపిస్తున్నాయి. 'కమ్యూనిటీ కిచెన్' సాధించిన విజయం గురించి చెప్పుకోవడానికి ఈ నవ్వులే సాక్ష్యం.

భీమవరం గిన్నిస్ స్వరం



ఘనత సాధించిన రేడియో విష్ణు 90.4. వంద అంశాలపై 72 గంటల 30 నిముషాల 30 సెకన్ల పాటు నిరంతర ప్రసారం. గిన్నిస్ రికార్డు నెలకొల్పిన వంద మంది రేడియో జాకీల్లో 90 మంది విద్యార్థినులే. శ్రావ్యమైన గొంతుతో రేడియో జాకీలుగా అలరిస్తున్న విద్యార్థినులు.

'గుడ్ మార్నింగ్... భీమవరం. మీరు వింటున్నారు రేడియో విష్ణు 90.4. ఇది విజ్ఞాన వికాస వినోదాల సంగమం' అంటూ విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, వ్యాపారం, ఉపాధి, వాతావరణం.. ఇలా నిరంతర సమగ్ర సమాచారాన్ని శ్రావ్యమైన గొంతుతో ప్రజాపయోగకరమైన వంద అంశాలపై 72 గంటల 30 నిముషాల 30 సెకన్ల పాటు నిరంతర ప్రసారంలో అనర్గళంగా మాట్లాడి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు.

కమ్యూనిటీ రేడియో !

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విద్య కేంద్రీకృత, చర్చా ఆధారిత తొలి రేడియో స్టేషన్‌గా ఈ కమ్యూనిటీ రేడియో గుర్తింపు పొందింది. సమాచార, ప్రసార శాఖ మార్గదర్శకాల మేరకు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రసారాలను అందిస్తున్నారు. ఇప్పటివరకు సుదీర్ఘ రేడియో ప్రసారం 66 గంటల 6 నిముషాల 1 సెకనుగా నార్త్ ఆఫ్రికాలోని ట్యునీషియా పేరిట గిన్నిస్ రికార్డు ఉంది.

15 ఏళ్లుగా గొంతు వినిపిస్తోంది!

విద్యార్థుల్లో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, డిబేటింగ్ ఎబిలిటీస్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్ పెంపొందించడం లక్ష్యంగా భీమవరంలోని విష్ణు క్యాంపస్‌లో చైర్మన్ కేవీ విష్ణురాజు 2007 సంవత్సరంలో రేడియో విష్ణు ప్రారంభించారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు ఈ ఘనతను సొంతం చేసుకున్నారు.

– విజయ్‌కుమార్ పెనుపోతుల, సాక్షి, భీమవరం

హెల్త్

పురుషుల్లో వచ్చే అత్యంత సాధారణమైన క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ కూడా ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా పురుషుల్లో వచ్చే క్యాన్సర్లలో దీనిది రెండోస్థానం. వీలైనంత త్వరగా దీన్ని గుర్తించి, ప్రస్తుతం లభిస్తున్న అధునాతనమైన చికిత్స పద్ధతుల ద్వారా వైద్యం చేయించగలిగినట్లయితే చాలా మంచి ఫలితాలుంటాయి. ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబరు నెలను ప్రోస్టేట్ క్యాన్సర్ అవగాహన మాసంగా పరిగణిస్తారు. ఈ సందర్భంగా ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన కోసం ఈ కథనం.



బ్రో... ఫిఫ్టీ దాటారా?

ప్రో'స్టేటస్' చూసుకోండి!

ప్రోస్టేట్ గ్రంథిని తెలుగులో పౌరుష గ్రంథి అని పిలుస్తారు. ఇది మూత్రకోశం (యూరినరీ బ్లాడర్)కు దిగువన ఉండి, అక్కడ మొదలైన మూత్రనాళం (యురెత్రా) ఈ గ్రంథిలోంచే బయటకు వచ్చి, పురుషాంగం ద్వారా వెలుపలకు వస్తుంది. మూత్రనాళం చుట్టూ ప్రోస్టేట్ గ్రంథి ఉండటంతో మూత్రకోశం నుంచి మూత్రాన్ని బయటకు రాకుండా అది నిలువరిస్తుంది. కేవలం మూత్ర విసర్జన సమయంలో మాత్రమే ఇది తెరచుకుంటుంది. ఇది చేసే మరో ముఖ్యమైన పనేమిటంటే... ఇది స్రవించే స్రావం పురుషుల వీర్యకణాలకు పోషకపదార్థంగా పనిచేస్తుంది.

ప్రోస్టేట్ క్యాన్సర్ అంటే...?

ప్రోస్టేట్ గ్రంథి కణాలలోని జన్యువుల్లో మ్యూటేషన్ జరిగినప్పుడు అది క్యాన్సర్‌కు దారితీస్తుంది. సరైన సమయంలో వ్యాధిని నిర్ధారణ చేసి చికిత్స చేయించకపోతే, ఈ క్యాన్సరే ఇతర అవయవాలకు వ్యాపిస్తుంది.

ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే...

హార్మోన్ల అసమతౌల్యత వల్ల 50 ఏళ్లు పైబడిన కొందరిలో ఈ గ్రంథి పరిమాణం పెరగవచ్చు. దీన్నే బినైన్ ప్రోస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ అని పిలుస్తారు. ఇది క్యాన్సర్ కాదు.

ప్రమాద సూచికలు ఏమిటి?

ఈ క్యాన్సర్‌లో ప్రోస్టేట్ పరిమాణం పెరగడం వల్ల మూత్రవిసర్జన సమయంలో కొన్ని సమస్యలు వస్తాయి. ఉదాహరణకు... ● మూత్రధార సన్నబడటం, ముక్కాల్సి రావడం ● రాత్రుళ్లు మాటిమాటికీ నిద్రలేచి మూత్రవిసర్జనకు వెళ్లాల్సిరావడం ● మూత్ర విసర్జన తర్వాత కొంత లోపలే మిగిలిపోవడం ● అప్పుడప్పుడూ మూత్రంలో రక్తం కనిపించడం.

ఒకవేళ క్యాన్సర్ ఇతర అవయవాలకు వ్యాపించినప్పుడు ఎముకల్లో నొప్పులు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాల విషయంలో రెండు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. మొదటిది... తొలిదశలో ఎలాంటి లక్షణాలూ కనిపించవు. రెండో అంశమేమి టంటే... ఇవే లక్షణాలు హానికరం కాని బినైన్ ఎన్‌లార్జ్‌మెంట్‌లోనూ కనిపించవచ్చు.

రిస్క్ ఫ్యాక్టర్స్ ?

వయసు పెరుగుతుండటం : పెరిగే వయసు ఒక నివారించలేని ముప్పు. నాలుగింట మూడొంతుల మందిలో 65 ఏళ్లు దాటిన వారిలోనే ఈ సమస్య కనిపిస్తుంది.

వంశపారంపర్యంగా : కుటుంబాల్లో ఎవరైనా ప్రోస్టేట్ క్యాన్సర్ బారిన పడితే... వారి సంతానానికి / సోదరులకు ఈ క్యాన్సర్ వచ్చే అవకాశం నాలుగు రెట్లు ఎక్కువ.

మెటబాలిక్ సింద్రోమ్ : సింద్రోమ్ అంటే వివిధ రకాల శారీరక రుగ్మతల సమాహారం. అంటే... హై బ్లడ్ ప్రెషర్, అధిక కొలెస్ట్రాల్, ఉబకాయం, నియంత్రణ లేని మధుమేహం... ఈ అంశాల సమాహారం వేరువేరు క్యాన్సర్లతో పాటు ప్రోస్టేట్ క్యాన్సర్‌కూ కారణమయ్యే అవకాశాలు ఎక్కువ.

పొగతాగడం : ఇది పరోక్షంగా ప్రోస్టేట్ క్యాన్సర్ రిస్క్‌ను అధికం చేస్తుంది.

నివారణ ఎలా?

ప్రోస్టేట్ క్యాన్సర్‌కు నివారణ అంటూ ఏమీ లేదు. అయితే దీనికి కచ్చితమైన చికిత్స పొందవచ్చు. కొంతవరకు జీవనసరళిలో మార్పులూ, ఆహారపు అలవాట్లలో మార్పులు చేయడం ద్వారా కొంత నివారణ సాధ్యమవుతూ ఉండవచ్చు. ఉదాహరణకు ఆహారంలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్, ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారం తీసుకోవడం, అలాగే శరీర బరువును నియంత్రించడం, రోజూ వ్యాయామం చేయడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లతో కొంతవరకు నియంత్రించవచ్చు.

నిర్ధారణ ఎలా?

యాభై ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తగా ప్రోస్టేట్ స్క్రీనింగ్ చేయించుకోవాలి. దీని నిర్ధారణ కోసం యూరాలజిస్టులు పీఎస్‌ఏ (ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్) అనే రక్తపరీక్ష చేయిస్తారు. ఆ విలువ ఉండాల్సిన దానికంటే పెరిగినట్లయితే ప్రోస్టేట్ బయాప్సీ ద్వారా వ్యాధిని నిర్ధారణ చేస్తారు. ఆ తర్వాత ఎమ్మారై, పెట్‌స్కాన్ అనే పరీక్షలతో క్యాన్సర్ ఏ దశలో ఉన్నదో అంశాన్ని తెలుసుకుంటారు.

చికిత్స : క్యాన్సర్ కేవలం ప్రోస్టేట్ గ్రంథికే పరిమితమై ఉంటే, శస్త్రచికిత్స చేసి తొలగిస్తారు. దాంతో వ్యాధి పూర్తిగా మటుమాయమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్ సాంకేతికత ద్వారా ఈ శస్త్రచికిత్స చేస్తున్నారు. దీన్ని 'రోబోటిక్ రాడికల్ ప్రోస్టెక్టమీ' అంటారు. రోబోటిక్ శస్త్రచికిత్సలో పెద్ద గాట్లు అవసరం లేకుండా, కేవలం చిన్న చిన్న రంధ్రాలతో అధునాతమైన పరికరాల ద్వారా ఆపరేషన్ చేస్తారు. దీని వల్ల రక్తస్రావం, నొప్పి తక్కువ, కోలుకోవడమూ వేగంగా జరుగుతుంది. ప్రోస్టేట్ చుట్టూ ఉండే చిన్న చిన్న నరాలకు ఎలాంటి దెబ్బా తగలకుండా ఆపరేషన్ చేయవచ్చు. ఈ నరాలు అంగస్తంభనకు అవసరమవుతాయి. ఈ పద్ధతిని 'నర్వ్ స్పేరింగ్ ప్రోస్టెక్టమీ' అంటారు.

ఎవరైనా శస్త్రచికిత్స వద్దనుకున్నా లేదా వారికి ఫిట్‌నెస్ లేకపోయినా రేడియోథెరపీ మంచి ప్రత్యామ్నాయం. దురదృష్టవశాత్తూ ఈ జబ్బును లేట్ స్టేజెస్‌లో కనుగొన్నట్లయితే... అంటే క్యాన్సర్ ఇతర అవయవాలకు పాకినప్పుడు వారిలోని టెస్టోస్టెరాన్ హార్మోన్‌ను తగ్గించడం ద్వారా ఈ క్యాన్సర్‌ను తగ్గించవచ్చు. దీన్ని 'హార్మోన్ థెరపీ' అంటారు దీనికి అదనంగా ఇప్పుడు ఎబిరటారోన్ లేదా ఎంజాలుటమైడ్ వంటి అధునాతనమైన మందులూ, కీమోథెరపీ, ఇమ్యూనోథెరపీ, రేడియోన్యూక్లైడ్ థెరపీ ఉన్నాయి.



డా. రాజేశ్ కుమార్ రెడ్డి అడపాల, కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్

గుండెలా పంపింగ్‌లో కింగ్

పిక్కకూ ఓ లెక్కుంది!

మనిషికి శరీరం పైభాగంలో అంటే రొమ్ములో ఒక గుండె ఉంటుంది. అదే రీతిలో రెండు కాళ్లలో మరో రెండు గుండెలు ఉంటాయి. అవే... పిక్కలు. నిజానికి అవి అచ్చంగా గుండెలు కాకపోయిన ప్పటికీ గుండె చేసే పనినే పిక్కలూ కొంతవరకు చేస్తాయి. గుండె రక్తాన్ని అన్ని అవయవాలకూ పంప్ చేసినట్టే సరిగ్గా పిక్క కూడా రక్తాన్ని పైకి పంప్ చేయడంతో పాటు పైకెళ్లాల్సిన రక్తం భూమ్యాకర్షణకు లోనై కిందికి వెళ్లకుండా అక్కడి కవాటాలు ఆపుతాయి. అందుకే 'పిక్క'ను శరీరపు రెండో గుండె కాయగా కొందరు చెబుతుంటారు. గుండె చేసే పనిని పిక్కలు ఎలా చేస్తాయో చూద్దాం.



ప్రతీకాత్మక చిత్రం

పిక్కను పరిశీలనగా చూసినప్పుడు అది కూడా ఇంచుమించూ 'హార్ట్ షేపు'లోనే కనిపిస్తుంది. గుండె తన పంపింగ్ ద్వారా శరీరంలోని అన్ని భాగాలకూ రక్తాన్ని సరఫరా చేస్తుంటే... కాళ్లు, పాదాలకు చేరిన రక్తం మళ్లీ గుండెకు చేరాలంటే భూమ్యాకర్షణ శక్తికి వ్యతిరేకంగా పైకి వచ్చేలా చూస్తుంది. అందుకే దాన్ని 'కాఫ్ మజిల్ పంప్' (సీఎమ్‌పీ) అంటారు. అంతేకాదు... శరీరానికి రెండో గుండె అనీ, 'పెరిఫెరల్ హార్ట్' అని కూడా అంటారు.

గుండె డ్యూటీలను పిక్క ఎలా చేస్తుందంటే...

పిక్కలోని అన్ని కండరాలూ కలిసి ఇలా గుండె విధులు నిర్వహిస్తున్నప్పటికీ ముఖ్యంగా ఇక్కడి రెండు ప్రధాన కండరాలైన గ్యాస్ట్రోనెమియస్, సోలెయస్ అనే కండరాలు ఈ పనిలో కీలకంగా ఉంటాయి. ఈ కండరాలు క్రమబద్ధమైన రీతిలో స్పందిస్తూ... ముడుచుకోవడం (కాంట్రాక్ట్ కావడం), తెరచుకోవడం (రిలాక్స్‌కావడం)తో కాళ్లకు సరఫరా అయ్యే రక్తనాళాల్లోని రక్తాన్ని పైకి వెళ్లేలా చేస్తుంటాయి. రక్తం మళ్లీ కిందికి పడిపోకుండా వాల్వ్స్ (కవాటాల) సహాయంతో మూసుకుపోతూ పైపైపునకే ప్రవహించేలా చూస్తాయి. ఒకవేళ అలా పిక్కలు పనిచేయకపోతే రక్తం కాళ్లలో ఉండిపోతుంది. అప్పటికీ ఈ రక్తంలోని ఆక్సిజన్‌ను కండరాలు వినియోగించుకున్నందున తగినంత ఆక్సిజన్ అందక తీవ్రమైన అలసటకు గురవుతాయి.

పిక్క గుండెలా పనిచేయకపోతే...

● కాళ్ల చివరలకు రక్తసరఫరా తక్కువగా జరగడం ● వ్యాధి నిరోధకత ఏర్పరిచే లింఫ్ ప్రవాహం సరిగా జరగకపోవడం ● చెడు రక్తాన్ని తీసుకుపోయే సిరల కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యం తగ్గడంతో ఈ కింది పరిణామాలు జరగవచ్చు. అవి... ● కాళ్లు అలసిపోవడం ● కాళ్లు, పాదాలలో వాపు ● కాలిపై ఏర్పడే పుండ్లు చాలాకాలం పాటు తగ్గకపోవడం ● కాళ్లు రెండూ అదేపనిగా చకచకా కదిలిస్తూ ఉండే రెస్ట్‌లెస్ లెగ్ సింద్రోమ్ అనే కండిషన్‌తో బాధపడటం ● వేరికోస్ వెయిన్స్ (అంటే కాళ్లపై ఉండే చెడు రక్తాన్ని తీసుకెళ్లే సిరలు ఉబ్బి చర్మం నుంచి బయటకు కనిపించడం) ● కాళ్లలోని సిరల్లో రక్తం గడ్డకట్టడం (డీప్ వీన్ థ్రాంబోసిస్).

ఎవరిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందంటే...?

● చాలా ఎక్కువ సేపు కదలకుండా కూర్చుని పనిచేసేవారిలో ● ఎక్కువసేపు నిల్చొని పనిచేసే వృత్తుల్లో ఉండే లెక్చరర్లు, టీచర్లు, కండక్టర్లు, ట్రాఫిక్ పోలీసులు... మొ॥ వారిలో ● స్థూలకాయుల్లో ● గర్భవతులుగా ఉన్న సమయంలో కొందరు మహిళలల్లో ఈ సమస్య కనిపించవచ్చు.

సమస్యను అధిగమించడం కోసం...

● పాదాలను మడమ దగ్గర్నుంచి పైకీ కిందికీ (ఫ్లెక్స్ అండ్ పాయింట్) కదిలిస్తూ ఉండటం ● క్రమం తప్పకుండా నడవడం (రోజుకు 30 నుంచి 45 నిమిషాల చొప్పున వాకింగ్) ● బరువును / ఊబకాయాన్ని అదుపులో ఉంచుకోవడం.

కాళ్లపై రక్తనాళాలు బయటకు కనిపిస్తుంటే...

వాటిని అదిమిపెట్టేలా 'వీనస్ స్టాకింగ్స్' వంటి తొడుగులను ధరించాలి. అప్పటికీ అలాగే కనిపిస్తుంటే వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించాలి.



డా. నరేంద్రనాథ్ మేడ, సీనియర్ వాస్క్యులార్ & ఎండోవాస్క్యులార్ సర్జన్

మెనోపాజ్

ముందే వస్తే ముప్పే



మెనోపాజ్ సాధారణ వయసుకంటే చాలా ముందుగా వచ్చిన మహిళల్లో రొమ్ముక్యాన్సర్, ఒవేరియన్ క్యాన్సర్ వచ్చే ముప్పు ఉండే అవకాశముందంటూ బ్రిటన్‌కు చెందిన అధ్యయనవేత్తలు పేర్కొంటున్నారు. మామూలుగా మెనోపాజ్ రావాల్సిన వయసు కంటే కనీసం ఐదేళ్ల ముందుగా వచ్చినవారిలో క్యాన్సర్‌కు కారణమయ్యే కొన్ని జన్యువుల మార్పు ఉంటుందనీ, వీటిల్లో 'బీఆర్‌సీఏ1' జన్యువు ఒకటని వారు చెబుతున్నారు. ఈ జన్యువుల్లో మార్పులు (మ్యుటేషన్స్) చూశాకే ప్రముఖ హాలివుడ్ నటి ఏంజెలీనా జోలీ తనకు ముప్పు ఉందని గ్రహించి, దాన్ని నివారించుకోవడం కోసం 2013లో రొమ్ములను తొలగింపజేసుకుని (డబుల్ మాస్టెక్టమీ), మళ్లీ కృత్రిమంగా అమర్చుకుందన్న విషయం తెలిసిందే. సాధారణంగా బ్రిటన్ మహిళల్లో 45 నుంచి 55 ఏళ్ల మధ్య మెనోపాజ్ సంభవిస్తుంది. కానీ ప్రతి 20 మందిలోని ఒకరిలో మెనోపాజ్ అంతకంటే చాలా ముందుగానే వస్తుండటాన్ని పరిశోధకులు గమనించారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన కొందరు పరిశోధకులు కనీసం లక్షమందికి పైగా మహిళల జన్యుడేటాను పరిశీలించాక ఈ విషయాన్ని వెల్లడిస్తున్నారు. ఈ అంశం ఆధారంగా కొన్ని జన్యుపరమైన మార్పులు మహిళల్లోని అండాలను చాలా వేగంగా తగ్గిపోయేలా చేస్తున్నాయనీ, 'జడ్ఎన్ఎఫ్ 518ఏ' అనే లోపభూయిష్టమైన జన్యువు కారణంగా అండాలు మామూలు మహిళలతో పోలిస్తే చాలా వేగంగా తగ్గిపోతున్నాయనీ, ఆ కారణంగా మామూలుగా మెనోపాజ్ వచ్చే వయసు కంటే దాదాపు ఐదున్నరేళ్ల ముందటే మెనోపాజ్ వస్తోందని పరిశోధకులు పేర్కొంటున్నారు.

చక్కెరవ్యాధి బాధితులకు కూలింగ్ క్యారియర్!!

డయాబెటిస్ ఉన్న వారు తీసుకోవాల్సిన ఇన్సులిన్‌ను ఎప్పుడూ తక్కువ ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయాలి. కానీ ఇంట్లో ఫ్రిజ్ లేనివారికి ఇది కొంత ఇబ్బందికరమే. వాళ్ల విషయంలో దీనికి పరిష్కారమెలా?

ఈ అంశంపైనే పరిశోధనలు చేసి ఓ కూలింగ్ క్యారియర్‌ను రూపొందించిన ఒడిశా అమ్మాయి కోమల్ పాండాకు జేమ్స్ డైసన్ అవార్డు వరించింది. స్థానికంగా లభ్యమయ్యే సులభమైన సాంకేతికతతో కొత్త ఉపకరణాలను రూపొందించేవారికి ఈ అవార్డును ప్రకటిస్తారు. మన దేశం నుంచి కోమల్ పాండాకు ఈ అవార్డుతో పాటు రూ. 5 లక్షలు బహూకరిస్తారు. కోమల్ రూపొందించిన 'నోవోక్యారీస్' అనే ఈ ఉపకరణంతో ఇన్సులిన్‌ను చాలా సేపు చల్లదనంలో ఉంచవచ్చు. అంతే కాదు దూరప్రయాణాల్లో, విద్యుత్ సౌకర్యాలూ, బ్యాటరీ సౌలభ్యాలు లేనిచోట్ల కూడా ఇన్సులిన్‌తో పాటు చల్లదనంలోనే ఉంచాల్సిన చాలా రకాల మందుల్ని సుదీర్ఘకాలంపాటు నిల్వ చేయవచ్చు. 'నోవో క్యారీస్' రూపకల్పనకు తన తండ్రి నుంచే కోమల్‌కు స్ఫూర్తి లభించింది. ఆయన ఓ డయాబెటిస్ బాధితుడు. ఆఫీసులో ఫ్రిజ్ లేదు. దూర ప్రయాణాలప్పుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాడు. ఆయన మాత్రమే కాదు... ప్రపంచ ఆరోగ్య సంస్థ రిపోర్టుల ప్రకారం దాదాపు 20 శాతం మందులు ఇలా దూరప్రాంతాలకు ప్రయాణం చేసేవారి విషయంలో, రిఫ్రిజిరేటర్ సౌకర్యం లేకపోవడం వల్ల చెడిపోతున్నట్లు డబ్ల్యూహెచ్ఓ పేర్కొంటోంది. ఇలాంటి వారికి ఇదెంతో ప్రయోజనం.





అన్‌మోల్‌కు తొలి అంతర్జాతీయ టైటిల్

భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖరబ్ తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను సాధించింది. శనివారం ముగిసిన బెల్జియం ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో హరియాణాకు చెందిన 17 ఏళ్ల అన్‌మోల్ మహిళల సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా అవతరించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 222వ స్థానంలో ఉన్న అన్‌మోల్ 59 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో 24–22, 12–21, 21–10తో ఏడో సీడ్ అమెలీ మల్జ్ (డెన్మార్క్)పై గెలిచింది.

చెన్నైయిన్ ఎఫ్‌సీ శుభారంభం

ఇండియన్ సూపర్ లీగ్‌లో భాగంగా భువనేశ్వర్‌లో ఒడిశా ఎఫ్‌సీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నైయిన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు 3–2 గోల్స్ తేడాతో గెలిచింది. చెన్నైయిన్ తరఫున ఫారూఖ్ (48వ, 51వ ని.లో) రెండు గోల్స్... డేనియల్ (69వ ని.లో) ఒక గోల్ చేశారు. బెంగళూరులో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ 1–0 గోల్‌తో ఈస్ట్ బెంగాల్ క్లబ్ జట్టును ఓడించింది.



శభాష్ హృతిక్

ఆసియా అండర్–14 టెన్నిస్ చాంపియన్‌గా హైదరాబాద్ కుర్రాడు



సాక్షి, హైదరాబాద్: అంచనాలకు మించి రాణించి... తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను ఓడించి... హైదరాబాద్ కుర్రాడు హృతిక్ కటకం ఆసియా అండర్–14 టెన్నిస్ చాంపియన్‌షిప్ బాలుర సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా అవతరించాడు. కంబోడియాలో జరిగిన ఈ టోర్నీలో హృతిక్ టైటిల్ గెలిచే క్రమంలో టాప్ సీడ్, రెండో సీడ్, మూడో సీడ్ క్రీడాకారులను ఓడించడమే కాకుండా... తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఫైనల్లో హృతిక్ 6–3, 7–5తో రెండో సీడ్ డాంగ్‌జే కిమ్ (దక్షిణ కొరియా)ను ఓడించి టైటిల్ దక్కించుకున్నాడు. తొలి రౌండ్‌లో హృతిక్ 6–0, 6–0తో యితియన్ లూ (చైనా)పై, క్వార్టర్ ఫైనల్లో 6–1, 6–1తో మూడో సీడ్ రమ్తిన్ రఫీబొరుజెని (ఇరాన్)పై, సెమీఫైనల్లో 6–3, 6–4తో టాప్ సీడ్ ధర్మ పొంతారాటోర్న్ (థాయ్‌లాండ్)పై గెలుపొందాడు. హైదరాబాద్‌కే చెందిన డేవిస్‌కప్ ప్లేయర్, లండన్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ విష్ణువర్ధన్ దిశానిర్దేశనంలో హృతిక్ ముందుకు సాగుతున్నాడు. హైదరాబాద్ హబ్సిగూడలోని ట్రినిటీ చాలెంజర్స్ టెన్నిస్ అకాడమీలో కోచ్‌లు హెన్రీ ప్రవీణ్, రామకృష్ణ వద్ద హృతిక్ శిక్షణ తీసుకుంటున్నాడు. పుణేలోని ఆర్యన్ పంప్స్‌కు చెందిన ప్రశాంత్ సుతార్ హృతిక్‌కు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజా ఆసియా టైటిల్‌తో హృతిక్ ఈ ఏడాది డిసెంబర్‌లో అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగే ప్రతిష్టాత్మక ఎడ్డీ హెర్, ఆరెంజ్ బౌల్ చాంపియన్‌షిప్ పోటీలకు కూడా అర్హత సాధించాడు.


హారిక


తానియా

ఎదురులేని భారత్

చెస్ ఒలింపియాడ్‌లో వరుసగా నాలుగో విజయం

బుడాపెస్ట్ (హంగేరి): ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల, పురుషుల జట్లు వరుసగా నాలుగో విజయం నమోదు చేశాయి. శనివారం జరిగిన నాలుగో రౌండ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3.5–0.5తో ఫ్రాన్స్ జట్టుపై గెలుపొందింది. భారత పురుషుల జట్టు కూడా 3.5–0.5తో సెర్బియా జట్టుపై విజయం సాధించింది. ఫ్రాన్స్‌తో జరిగిన గేముల్లో భారత స్టార్ ద్రోణవల్లి హారిక 52 ఎత్తుల్లో డెమాంటి కార్నెపై, తానియా సచ్‌దేవ్ 50 ఎత్తుల్లో నటాషా బెన్‌మెస్బాపై, దివ్య దేశ్‌ముఖ్ 56 ఎత్తుల్లో మిత్రా హెజాజిపూర్‌పై గెలుపొందగా... సోఫీ మిలెట్‌తో జరిగిన గేమ్‌ను వైశాలి 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. వంతిక అగర్వాల్‌కు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు. సెర్బియాతో జరిగిన గేముల్లో భారత నంబర్‌వన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్ 40 ఎత్తుల్లో అలెగ్జాండర్ ఇందిక్‌పై, దొమ్మరాజు గుకేశ్ 85 ఎత్తుల్లో అలెగ్జాండర్ ప్రెడ్కిపై, విదిత్ సంతోష్ గుజరాతి 81 ఎత్తుల్లో వెలిమిర్ ఇవిచ్‌పై నెగ్గగా... అలెక్సీ సరానాతో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 23 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.

భారత్ 0 స్వీడన్ 2

సింగిల్స్ మ్యాచ్‌ల్లో ఓడిపోయిన శ్రీరామ్ బాలాజీ, రామ్‌కుమార్


శ్రీరామ్ బాలాజీ

స్టాక్‌హోమ్: డేవిస్‌కప్ టీమ్ టెన్నిస్ టోర్నీ వరల్డ్ గ్రూప్–1లో భాగంగా స్వీడన్ జట్టుతో శనివారం మొదలైన మ్యాచ్‌లో తొలి రోజు భారత్‌కు నిరాశ ఎదురైంది. ఆడిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత క్రీడాకారులకు ఓటమి ఎదురైంది. 2–0తో ఆధిక్యంలోకి వెళ్లిన స్వీడన్ నేడు జరిగే ఒక డబుల్స్ మ్యాచ్, రెండు రివర్స్ సింగిల్స్‌లలో ఒక విజయం సాధిస్తే గెలుపును ఖరారు చేసుకుంటుంది. వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు కూడా అర్హత సాధిస్తుంది. తొలి సింగిల్స్‌లో 'డబుల్స్ స్పెషలిస్ట్' శ్రీరామ్ బాలాజీ 4–6, 2–6తో ప్రపంచ 238వ ర్యాంకర్ ఇలియాస్ యెమెర్ చేతిలో ఓడిపోగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్ 3–6, 3–6తో లియో బోర్గ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ వెన్నునొప్పితో స్వీడన్‌తో పోరు నుంచి వైదొలిగాడు. దాంతో సుమిత్ స్థానంలో శ్రీరామ్‌ను ఆడించాల్సి వచ్చింది. నేడు జరిగే మూడు మ్యాచ్‌ల్లో భారత్ గెలిస్తేనే వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత పొందుతుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి... ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందడం రెండుసార్లు (2010లో బ్రెజిల్‌పై, 2018లో చైనాపై) మాత్రమే జరిగింది.


రామ్

హర్మన్‌ప్రీత్ అదరహో



- రెండు గోల్స్‌తో మెరిసిన భారత కెప్టెన్
- చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై భారత్ విజయం
- లీగ్ దశను అజేయంగా ముగించిన డిఫెండింగ్ చాంపియన్
- రేపు జరిగే సెమీఫైనల్లో కొరియాతో టీమిండియా పోరు

హులున్‌బుయిర్ (చైనా): పలువురు కీలక ఆటగాళ్లు లేకుండానే ఆసియా పురుషుల చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో బరిలోకి దిగిన భారత జట్టు లీగ్ దశను అజేయంగా ముగించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత కెప్టెన్, డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ (13వ, 19వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించి జట్టును గెలిపించాడు. పాకిస్తాన్ తరఫున అహ్మద్ నదీమ్ (8వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. శనివారమే జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో చైనా 2–0తో జపాన్ జట్టును ఓడించగా... మలేసియా, దక్షిణ కొరియా జట్ల మధ్య మ్యాచ్ 3–3తో 'డ్రా'గా ముగిసింది. వరుసగా ఐదో విజయం నమోదు చేసిన భారత జట్టు 15 పాయింట్లతో లీగ్ దశలో టాపర్‌గా నిలిచింది. 8 పాయింట్లతో పాకిస్తాన్ రెండో స్థానంలో, 6 పాయింట్లతో చైనా, దక్షిణ కొరియా వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఆదివారం విశ్రాంతి దినం. సోమవారం జరిగే సెమీఫైనల్స్‌లో దక్షిణ కొరియాతో భారత్; చైనాతో పాకిస్తాన్ తలపడతాయి. 5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచిన మలేసియా, ఒక పాయింట్‌తో ఆరో స్థానంలో నిలిచిన జపాన్ 5–6 స్థానాల కోసం పోటీపడతాయి. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు జరగ్గా... భారత జట్టు ఏడుసార్లు కనీసం సెమీఫైనల్‌కు చేరుకుంది. 2013లో మాత్రమే భారత జట్టు సెమీఫైనల్ చేరుకోలేకపోయింది.

ఆరంభంలో గోల్ ఇచ్చినా...

పాక్‌తో మ్యాచ్‌కు ముందు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత జట్టుకు చిరకాల ప్రత్యర్థి నుంచి గట్టిపోటీనే ఎదురైంది. ఆట ఎనిమిదో నిమిషంలో భారత డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ మిడ్‌ఫీల్డ్ నుంచి దూసుకొచ్చిన హన్నాన్ షాహిద్ అందించిన పాస్‌ను 'డి' ఏరియాలో అహ్మద్ నదీమ్ లక్ష్యానికి చేర్చాడు. ఆరంభంలోనే గోల్ సమర్పించుకున్నా భారత జట్టు ఆందోళనకు గురి కాలేదు. వెంటనే తేరుకొని తమ దాడుల్లో పదును పెంచింది. 13వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను... 19వ నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్స్‌గా మలిచాడు. దాంతో రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి భారత్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో క్వార్టర్‌లో పాకిస్తాన్ దూకుడుగా ఆడుతూ ఏకంగా 10 పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. అయితే ఈ 10 పెనాల్టీ కార్నర్‌లను భారత గోల్‌కీపర్, డిఫెండర్లు అడ్డుకోవడం విశేషం. చివరి క్వార్టర్‌లో భారత్ జోరు పెంచి పాక్‌ను కట్టడి చేసి విజయాన్ని ఖరారు చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు 10, పాకిస్తాన్‌కు 13 పెనాల్టీ కార్నర్‌లు వచ్చాయి.

17 గత ఎనిమిదేళ్ల కాలంలో అంతర్జాతీయ టోర్నీల్లో పాకిస్తాన్ జట్టుపై భారత్‌కిది 17వ విజయం కావడం విశేషం. చివరిసారి భారత్ 2016 దక్షిణాసియా క్రీడల ఫైనల్లో పాకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. దక్షిణాసియా క్రీడల ఫైనల్ అనంతరం భారత్, పాకిస్తాన్ జట్లు 18 సార్లు తలపడ్డాయి. 2018 ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఫలితం రాలేదు.

203 అంతర్జాతీయ హాకీలో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ చేసిన గోల్స్ సంఖ్య. ధ్యాన్‌చంద్, బల్బీర్ సింగ్ సీనియర్ తర్వాత భారత్ తరఫున 200 గోల్స్ మైలురాయి దాటిన మూడో ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్ గుర్తింపు పొందాడు. అంతర్జాతీయ హాకీలో 12 మంది క్రీడాకారులు 200 అంతకంటే ఎక్కువ గోల్స్ చేశారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

ఐఎఫ్‌ఎఫ్‌ఎస్‌ఏలో షబానా సినీ స్వర్ణోత్సవం



బాలీవుడ్ సీనియర్ నటి షబానా ఆజ్మీ కెరీర్‌లో గోల్డెన్ ఇయర్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 'ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ సౌత్ ఆసియా (ఐఎఫ్‌ఎఫ్‌ఎస్‌ఏ) టొరంటో' షబానా ఆజ్మీ సినీ స్వర్ణోత్సవాన్ని జరపనుంది. 13వ ఐఎఫ్‌ఎఫ్‌ఎస్‌ఏ–టొరంటో వేడుకలు కెనడాలో ఈ ఏడాది అక్టోబరు 10 నుంచి 20 వరకు జరగనున్నాయి. 22 భాషల్లోని 120 చిత్రాలు ఈ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శితమవుతాయని అలాగే సినిమా రంగానికి విశేష సేవలు అందించిన సీనియర్ నటి షబానా ఆజ్మీ స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొంటారని, 'ఐఎఫ్‌ఎఫ్‌ఎస్‌ఏ–టొరంటో ఫెస్టివల్' నిర్వాహక అధ్యక్షుడు సన్నీ గిల్ పేర్కొన్నారు. ఇక 1950 సెప్టెంబరు 18న కైఫీ ఆజ్మీ (దివంగత ప్రముఖ గీత రచయిత), దివంగత నటి షౌకత్ కైఫీ దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు షబానా ఆజ్మీ. 150పైగా చిత్రాల్లో నటించారామె. షబానా ఆజ్మీ తొలి చిత్రం 'అంకుర్' 1974లో విడుదలైంది. దాంతో నటిగా షబానా ఫిల్మ్ ఇండస్ట్రీలో 50 ఏళ్ల జర్నీని పూర్తి చేసుకున్నట్లయింది. 'అంకుర్, అర్థ్ (1982), కందార్ (1984), పార్ (1984), గాడ్ మదర్ (1999) వంటి సినిమాలకు గాను షబానా జాతీయ ఉత్తమ నటి అవార్డులను అందుకున్నారు. ఇంకా 'శత్రంజ్ కే ఖిలాడీ – 1977 (ది చెస్ ప్లేయర్స్), మండీ (1983), ఫైర్ (1996), మక్డీ (2002)' వంటి ఎన్నో హిట్ ఫిల్మ్స్‌లో నటించారామె. అంతేకాదు... అమెరికన్ మిలటరీ సైన్స్ ఫిక్షన్ టెలివిజన్ సిరీస్ 'హాలో' (2022–2024)లోనూ నటించి, హాలీవుడ్ ప్రేక్షకుల మెప్పు పొందారు. సినీ రంగానికి షబానా అందించిన సేవలకుగాను 1998లో పద్మశ్రీ, 2012లో పద్మ భూషణ్ పురస్కారాలు ఆమెను వరించాయి.

చివరి సినిమా ఫిక్స్

తమిళ స్టార్ హీరో విజయ్ కొత్త సినిమా ప్రకటన వచ్చేసింది. 'దళపతి 69' పేరుతో రూపొందనున్న ఈ చిత్రానికి హెచ్. వినోద్ దర్శకుడు. కేవీఎన్ ప్రొడక్షన్స్‌పై ఎన్‌కే, వెంకట్ కె. నారాయణ ఆధ్వర్యంలో తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం రూపొందనుంది. ''విజయ్‌తో మా మొదటి చిత్రం 'దళపతి 69'. ఈ సినిమా కోసం హెచ్. వినోద్ అద్భుతమైన కథని సిద్ధం చేశారు. మూడు దశాబ్దాల సినిమా ప్రయాణంలో తిరుగులేని స్టార్‌డమ్‌తో కథానాయకుడిగా రాణించారు విజయ్. ఆయన హీరోగా రూపొందుతోన్న చివరి చిత్రం 'దళపతి 69' కానుండటంతో భారతీయ సినీ చరిత్రలో నిలిచేపోయేలా తెరకెక్కిస్తాం. సరికొత్త రికార్డులను సృష్టించేలా ఈ సినిమాని రూపొందించనున్నాం. ఈ చితాన్ని 2025 అక్టోబర్‌లో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్.


విజయ్

ఓటీటీ ఇది చూడొచ్చు

ఆడది అబల కాదు సబల అని నిరూపించిన సినిమా

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'అకేలీ' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



పోరాట పటిమ కలిగి ఉన్న ఎంతో మంది స్త్రీమూర్తులను నాటి చరిత్ర నుండి నేటి వరకు వెండితెర పై చూస్తూనే ఉన్నాం. కానీ వర్తమాన స్థితిగతులకు అనుగుణంగా వాస్తవ ఘటనల ఆధారంగా వచ్చిన 'అకేలీ' సినిమా నేటి తరం స్త్రీ యోధురాలిని ప్రతిబింబించింది. 2014లో మిడిల్ ఈస్ట్‌లోని తీవ్రవాద సంస్థ ఐసిస్ చేసిన ఓ ఘాతుకానికి రూపమే ఈ 'అకేలీ' సినిమా. అప్పట్లో మొసూల్ నగరం నుండి దాదాపు 39 మంది భారతీయులతో పాటు 46 మంది నర్సులను బందీలుగా పట్టుకుంది ఐసిస్. ఆ తర్వాత ఎన్నో వ్యయ ప్రయాసలతో వారంతా క్షేమంగా విడుదలయ్యారు. ఈ ఘటనను నేపథ్యంగా తీసుకుని దర్శకులు ప్రణయ్ మిశ్రమ్ 'అకేలీ' సినిమాను తీర్చిదిద్దారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రను పోషించిన నుష్రత్ భరూచ కథలోని జ్యోతి పాత్రకు ప్రాణం పోశారు. కథాపరంగా పొట్టకూటి కోసం భారతదేశం నుండి మొసూల్ బయలుదేరిన జ్యోతి ఆ దేశంలో అడుగుపెట్టడంతోనే అక్కడి ఓ ఘటనతో చలించిపోతుంది. ఆ తర్వాత ఐసిస్ తీవ్రవాదులు జ్యోతి గ్రూప్‌ను బందీలుగా చేసుకుని తమ స్థావరాలకు తీసుకువెళతారు. శత్రు దుర్భేద్యమైన ఐసిస్ స్థావరం, క్రూరత్వం కోరలు కలిగిన తీవ్రవాదుల మధ్య జ్యోతి ఎటువంటి కష్టాలను అనుభవించింది? ఎలా తప్పించుకొని తిరిగి భారతదేశం చేరిందన్నదే మిగతా సినిమా. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే జ్యోతి పాత్ర ఈ సినిమాకి ఆయువుపట్టు. సినిమా నడుస్తున్నంతసేపు కుర్చీ నుంచి కదలకుండా చేస్తుంది స్క్రీన్ ప్లే. కొంత హింస, కొన్ని అశ్లీల సన్నివేశాలున్నాయి కాబట్టి పిల్లలను దూరంగా ఉంచి ఈ సినిమాని పెద్ద వాళ్లు మాత్రం చూడవచ్చు. 'జియోసినిమా' ఓటీటీలో ఈ చిత్రం స్ట్రీమ్ అవుతోంది.

– ఇంటూరు హరికృష్ణ

యాక్షన్‌కి సై


రాఘవా లారెన్స్, రమేశ్ వర్మ

రాఘవ లారెన్స్ హీరోగా రమేశ్ వర్మ దర్శకత్వంలో కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఏ స్టూడియోస్ ఎల్‌ఎల్‌పీ, నీలాద్రి ప్రొడక్షన్స్, హవీష్ ప్రొడక్షన్స్‌పై కోనేరు సత్యనారాయణ ఈ సినిమా నిర్మించనున్నారు. ''బిగ్ యాక్షన్ అడ్వంచరస్‌గా రూపొందనున్న చిత్రమిది. రాఘవా లారెన్స్ కెరీర్‌లో 25వ సినిమాగా తెరకెక్కనుంది. 'రాక్షసుడు, ఖిలాడీ' లాంటి బ్లాక్ బస్టర్ సినిమాల తర్వాత రమేశ్ వర్మ, కోనేరు సత్యనారాయణ కాంబినేషన్‌లో రానున్న మూడో సినిమా ఇది. భారీ వ్యయంతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందనుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ గురించి మరిన్ని విషయాలు త్వరలోనే ప్రకటిస్తాం. నవంబర్‌లో షూటింగ్‌ను ప్రారంభించి 2025 వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని మేకర్స్ తెలిపారు.

స్టైలిష్ లుక్‌లో తెలుసు కదా!

'డీజే టిల్లు, 'టిల్లు స్క్వేర్' వంటి హిట్ సినిమాల తర్వాత సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. ''తెలుసు కదా' చిత్రంలో సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు సిద్ధు జొన్నలగడ్డ . హైదరాబాద్‌లో నెల పాటు జరిగిన మొదటి షెడ్యూల్ పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో సిద్ధు, రాశీ ఖన్నా, శ్రీనిధి, వైవా హర్షలపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. అలాగే సిద్ధు, రాశీ ఖన్నాపై ఓ పాట కూడా తెరకెక్కించాం. ఇప్పటికే 50 శాతం షూటింగ్ పూర్తయింది. ఈ అవుట్‌పుట్‌తో సంతోషంగా ఉన్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: జ్ఞానశేఖర్ బాబా.



సిద్ధు జొన్నలగడ్డ

భయం ఎందుకు?

హీరోయిన్ వేదిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఫియర్'. ఈట హరిత గోగినేని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నటుడు అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నటుడు, డైరెక్టర్, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేసి, ''పోస్టర్ ఆసక్తికరంగా ఉంది.. సినిమా విజయం సాధించాలి'' అని ఆకాంక్షించారు. ''వైవిధ్యమైన సస్పెన్స్ థ్రిల్లర్ కథతో రూపొందిన చిత్రం 'ఫియర్'. చీకటి గదిలో భయపడుతూ చూస్తున్న వేదిక స్టిల్‌తో డిజైన్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తి పెంచుతోంది. ఈ చిత్రం విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై 60కి పైగా అవార్డులను సొంతం చేసుకుని రికార్డ్ సృష్టించింది. ఈ సినిమాని త్వరలోనే రిలీజ్ చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: ఐ ఆండ్రూ.


వేదిక


మాస్ హరుడు


వెంకట్

'శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు' వంటి సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న వెంకట్ కమ్ బ్యాక్ ఇస్తున్న చిత్రం 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో హెబ్బా పటేల్, సలోని, శ్రీహరి, నటాషా, అలీ, సుమన్, రవి వర్మ, సుభశ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈట ప్రవీణ్ రెడ్డి, ఈట దిక్కల లక్ష్మణరావు నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా రాజ్ తాళ్లూరి మాట్లాడుతూ– ''కంప్లీట్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'హరుడు' రూపొందుతోంది. వెంకట్‌గారికి ఇది మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుంది. నవంబర్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మని జీన్న, కెమెరా: డి, సన్నీ, ఆనంద్.

వాస్తవ ఘటనలతో...

'ఓనమాలు, మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు, వరల్డ్ ఫేమస్ లవర్' వంటి చిత్రాలను తెరకెక్కించిన డైరెక్టర్ కె. క్రాంతి మాధవ్ కొత్త సినిమాని ప్రకటించారు. 'డీజీఎల్' పేరుతో ఈ చిత్రాన్ని గంటా కార్తీక్ రెడ్డి నిర్మించనున్నారు. శనివారం ఈ సినిమా టైటిల్ పోస్టర్ లాంచ్ చేశారు. ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమా కోసం క్రాంతి మాధవ్ ఓ ఆసక్తికరమైన కథని సిద్ధం చేశారు. 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' వంటి క్లాసిక్ సినిమా తర్వాత క్రాంతి మాధవ్, కెమెరామేన్ జ్ఞానశేఖర్ కలిసి చేయనున్న రెండో చిత్రం 'డీజీఎల్'. ఈ చిత్రానికి సంబంధించిన ప్రధాన తారాగణం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తాం. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది'' అని మేకర్స్ తెలిపారు.


క్రాంతి మాధవ్

సాక్షి
13
పెళ్ళిచూపులు
ఆదివారం 15-9-2024

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

రజక/కట్నం ప్రసక్తి లేదు/M.Tech/C. Govt. Asst. ఇంజనీర్/ ట్రాన్స్‌కో/ 1.20 Lakhs PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15206]

పద్మశాలి/B.Tech / C.Govt. Asst. ఇంజనీర్/రైల్వేస్/80,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15206]

యాదవ/B.E / M.Tech / C.Govt. సైంటిఫిక్ ఆఫీసర్/(NPCIL)/1 Lakh PM/ 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15206]

రజక/కట్నప్రసక్తి లేదు / B.Tech/ C. Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15206]

SC హిందూ మాదిగ/కట్న ప్రసక్తి లేదు/ B.Tech/C.Govt.ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్/టాక్స్ & కస్టమ్స్ Dept/10Lakhs.PA/5'10"ఎత్తు/30సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-15206]

గౌడ/కట్నప్రసక్తి లేదు / M.Tech/ Govt. Asst. Exq. ఇంజనీర్/ఇరిగేషన్ Dept/ 90,000/-PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15205]

క్రిస్టియన్ మాల/కట్నప్రసక్తి లేదు/28/5'8"/ B.Tech/ Govt. బ్యాంక్ మేనేజర్/ యూనియన్ బ్యాంక్/1 Lakh.PM/ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-15205]

తెలుగు, క్షత్రియ (CNB) / 26Y/6'/MA, ఫ్యాక్టరీ, సొంత ఇల్లు గల అందమైన సాంప్రదాయ కుటుంబపు వరునికి Graduate వధువు కావలెను. Ph: 9845134062 [H-796636]

SC మాల/కట్నప్రసక్తి లేదు/29/5'10"/ B.Tech(IIT)/Incometax Officer Govt. 1.50 Lakhs PM వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9966775425 [H-796636]

CNB/కమ్మ/49సం॥/5'10"/ఆదాయం, ఆస్తి లేని వరునికి సంతోషంగా జీవించడానికి మంచి మనస్సు గల వధువు కావలెను. సంప్ర: 8639618117 [H-783351]

యాదవ: కట్న ప్రసక్తి లేదు/ B.Tech (సివిల్)/Govt.AEE ట్రాన్స్‌కో/14 Lakhs PA/5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-15210]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy / B.Tech / MS / USA / Very Handsome Boy/1998/6'/300Cr. * Cont : K.C. Reddy- Mar-Bureau-Pvt Ltd-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/IIT/B.Tech/SWE/Hyd/1994/ 5'11"/1Cr/yr/ 10Cr/ * Cont : K.C. Reddy-Mar-Bureau-Pvt Ltd-Hyd. Ph: 9849321309/ 9347807015/

Reddy / Divorcee / B.Tech/MS/H1/ USA/Very Handsome Boy/ 1990/ 5'9"/300K/40Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/(Christian) Business / B.Tech /MBA/1995/5'11"/100Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau Pvt. Ltd-Hyd-Ph: 9849321309 / 9347807015

Reddy/Australian PR/ B.Tech/ MS/ 1993/6'/102K/10Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Pvt. Ltd-Hyd.Ph: 9347807015/9849321309

Reddy/Very Good Business/ B.Tech /1990/5'10"/ 30Lakh / Month / 25Cr. *Cont: K.C.Reddy- Mar-Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/MD/Very Handsome Boy/ 1995/ 5'10"/ 400Cr/Parents Doctor/Own Hospital Hyd. * Cont: K.C.Reddy- Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/Business/1995/5'10"/300 Cr *MBA/1989/5'11"/400Cr *1990/6'/ 1000 Cr *1995/6'/100Cr. *Cont : K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/ MS / Swedan/Very Handsome Boy/1997/5'9"/ 100K/ 60Cr/ 3L/M rental income *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/USA-Citizen/ B.Tech/ MS/ Very Handsome Boy/ 1995/ 5'10"/ 230K/70Cr. * Cont. K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/Australian Citizen / Most Beautiful/BE/MS/SWE/1994/5'4"/ Rich Family. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech / OU Campus/Most Beautiful/1997/5'4"/ SWE/ 25L/yr/ Rich Family. * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/ USA Citizen / B.Tech/ MS/ 1996/5'3"/115K/30Cr * Cont: K.C. Reddy-Mar-Bureau Pvt. Ltd-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/MBBS/ Most Beautiful / 2000 /5'6"/100Cr Needs any good Business boy. * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/Newzealand Citizen / 2000 /5'5"/30Cr/SWE/Most Beautiful/ * Cont : K.C.Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/MBBS/PG/1997 / 5'6"/400Cr *1994/5'6"/ 100Cr *1995/5'5"/100Cr *1998/5'7"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/IIT/B.Tech/SWE/ *2000/5'7" / 45L/yr/10Cr *1998/5'3½"/70L/yr 1997 / 5'4"/200K/ * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015/ 9849321309

Reddy/ B.Tech(CBIT) SWE-Hyd/ Most Beautiful /1999/ 5'7"/ 100Cr. * Cont. K.C. Reddy-Mar-Bur-Pvt. Ltd. Hyd. Ph: 9849321309 /9347807015

Reddy/Divorcee / MBBS/PG *1994/ 5'5"/50Cr *1993/5'8"/40Cr *1992/ 5'3"/ 9Cr *1986/5'6"/50Cr. * Cont : K.C. Reddy -Hyd-Ph: 9347807015/ 9849321309

Reddy/Divorcee/ B.Tech/1993/5'4"/ 10Cr *1988/5'6"/30Cr *1991/5'4"/10Cr *1985/ 5'5"/400Cr *1987/5'6"/15Cr. *Cont: K.C. Reddy-Hyd.Ph: 9849321309/9347807015 [D-553]

SC మాల & క్రిస్టియన్ : కట్న ప్రసక్తి లేదు/ B.Tech/IT/C.Govt/ కస్టమ్స్ ఆఫీసర్/18 Lakhs PA/5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15210]

మాల: 30/ 5'9"/ B.Tech. IIT కాన్పూర్ SWE JOB 30-L P/A నెలకు, (2,50,000) Well Settled in Hyd వరుడికి వధువు కావలెను (కట్న ప్రసక్తి లేదు) Ph: 9390933661 [HA-15209]

పద్మశాలి (పట్టుశాలి): 29/5'8", B.Tech /MBA, SWE JOB TCS కంపెని జీతం 2-L P/M బాగా స్థిరపడిన వరుడుకి తగిన వధువు కావలెను. Ph: 8897091964 [HA-15209]

క్రిస్టియన్ : 29/5'8"/M.Tech Govt Job Railway Engineer 1-L P/M Well Settled Family వరునికి వధువు కావలెను. Ph: 9391646037 [HA-15209]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BS (USA), MBA (ISB), 27, 5' 8", Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 6', Infosys, 25 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 10", SWE, 140 K, 35 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 9", Engineer, 110 K, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Bengaluru, BE, MBA, 25, 5' 5", Analyst, 12 L P/A, 25 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Business Analyst, 90 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 5", Sr. SWE, 120 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 30, 5' 7", 40 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Sr. Cloud DevOps, 170 K, 5 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 31, 6' 1", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS (USA), 35, 5' 11", Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 33, 5' 3", 100 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MBA (IIM), 28, 5' 7", Sr. Associate, 30 L P/A, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 5", PG Doctor, 5 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE (NIT), MS, 28, 5' 2", SWE, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

IInd Match కాపు: CNBడైవర్సీ 45/5'8"/Govt Job(Income Tax) 12-L P/A B.Tech, MBA 8 ఎకరాల పొలము+ సొంత ఇల్లు కలదు. (పిల్లలు లేరు) (No. Issues) 9966260233 Well Settled వరునికి వధువు కావలెను (కట్న ప్రసక్తి లేదు) [HA-15209]

★

SC మాల (హిందూ)/2nd మ్యారేజ్/ 40y/PG/Own Visa Consultancy/ 1,60,000/-PM/గల వరునికి తగిన అందమైన వధువు కావలెను (డైరెక్ట్) Ph: 8187861989 [H-782777]

రెడ్డి / లేట్ మ్యారేజ్/34y/1L PM ఆదాయం/Hydలో సొంత ఇల్లు, ఏరియాలో 5 ఎకరాల వ్యవసాయ భూమి గల హైదరాబాద్ వరుడికి ఆంధ్ర తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-782713]

2వ వివాహం : 36 years, /ఎత్తు 5.4/కుల పట్టింపు లేదు/Handicapped also. Interier Furniture Marketing in Hyderabad. వివరాలకు సంప్ర. 98665 02064. [M-1185288]

ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. 1వ ఆర్యవైశ్య అబ్బాయి 36Y. M.Sc., పార్ట్‌టైమ్ లెక్చరర్, 28 వేలు, ఆస్తి 1 కోటి నల్లగొండ. వీరయ్య M9HB మునుగోడ్ రోడ్. సంప్ర॥ 9121325068 [Y-798341]

గౌడ వృత్తి: ప్రభుత్వ ఉద్యోగి, ఆస్తి 1 కోటి, జీతం నెలకు రూ॥ 75,000, రంగు: ఫెయిర్, ఫెయిర్ గౌడ కులం అమ్మాయి కావలెను. సంప్ర॥ సెల్ : 9963736463 [Y-1124629]

వరుడు కావలెను

రెడ్డి/2nd (విడో)/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/32Y, డిగ్రీ/బిజినెస్‌లు గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికముOK) అన్ని కులాల 1వ/2వ సంబంధములు మా వద్ద కలవు. Ph: 9063623252 [H-796636]

కాపు/35Y/ కులపట్టింపులేదు/ ఫెయిర్/Govt. ఎంప్లాయ్/35,000/- pm / వెల్‌సెటిల్డ్ 2 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st & 2nd మ్యారేజ్ & ఇల్లరికం Ok). సంప్ర: 8374802603 [H-796342]

విశ్వబ్రాహ్మణ/ B.Tech / Govt.Jr.Asst / రెవెన్యూ Dept / 45000/-PM / 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15206]

వెలమ/C.A / చార్టెడ్ అకౌంటెంట్ / 6 Lakhs. PA / / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15206]

బెస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/B.Tech/ C.Govt.Asst. మేనేజర్/ గ్రామీణ బ్యాంక్/1 Lakh. PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15206]

SC మాల/ B.Tech / C.Govt. Asst. మేనేజర్ / ఆంధ్రాబ్యాంక్ / 55000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15206]

క్రిస్టియన్ మాదిగ/M.Sc/Hart./Govt. Jr. Asst./Harticulture Dept/ 50,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15206]

రెండో పెళ్ళి/విడో/45y/State Road ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్/2 L PM/Own హౌస్/45 ఎ॥ ల్యాండ్/ కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన వధువుకు కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9573960642 [H-782776]

రెడ్డి/విడో/50y/Fair/Nellore Govt.Job/Own House Rents Well Settled/ఏ బాదర బందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నాOK) Ph: 8519803423 [H-782776]

రెడ్డి/విడో/48y/C.Govt.Job/VRS/90K PM/ Finance Business/2 L PM/Own House/15 ఎ॥ పొలాలు ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నాOK) Ph:7286858149 [H-782776]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/MBA *30/ 5'2"/B.Sc *32/5'2"/ఇంటర్. వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్/పురోహితులకు మ్యాచెస్ త్వరగా కుదుర్చబడును. వాట్సాప్ : 7842635086 [HA-15205]

ముదిరాజ్/ఏకైక కుమార్తె/M.Sc/ Govt. AEO/ అగ్రికల్చర్ Dept/60,000/-PM/5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15205]

క్రిస్టియన్ మాల/ 24/5'5" / B.Tech/ Govt. బ్యాంక్ PO/ గ్రామీణ బ్యాంక్/ 40,000/-PM అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-15205]

రెడ్డి/2nd మ్యారేజ్/(కుల/ఆస్తి) ప్రసక్తి లేదు/ 31Y/డిగ్రీ/సొంత ఇల్లు/ప్రాపర్టీస్ & బిజినెస్/ వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికము OK) అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9030062353 [H-796636]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35, B.Com/Pvt.Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) All Cast marriages Available. Ph: 8121347478 [H-796636]

2వ పెళ్లి: 4,00,000/- PM బాగా స్థిరపడి, కోట్ల ప్రాపర్టీ కల్గిన ఎలాంటి కులప్రసక్తి లేని అందమైన వధువుకు అందమైన వరుడు కావలెను. పిల్లలున్నా పర్వాలేదు, ఇల్లరికం. Ph: 9381696641 [HA-15210]

క్రిస్టియన్ మాల : 28/ 5'4"/ B.Tech, MBA/Govt ఎంప్లాయి అందమైన వధువుకు తగిన Govt వరుడు కావలెను. Ph: 8919759359 [HA-15210]

యాదవ/50Y/ 5'3"/ Govt. లెక్చరర్/ 80,000/-pm/ 2 సొంత ఇళ్ళు/ కోచింగ్ సెంటర్/1 L pm/ కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. పిల్లలులేరు. Ph: 6301595126 [H-796342]

కమ్మ/50Y/ విడో/Govt. Job/ Own 3 Star Hotel/ 26 Acres Land/ 10 Lac Income గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 7075194750 [H-796342]

BC/విడో/5'3"/ V. Fair/ Staff Nurse/ Own Medical Shop/ సొంత ఇల్లు గల వధువుకు స్నేహపూర్వకమైన వరుడు కావలెను. Ph: 9391272485 [H-796342]

యాదవ/ఎర్రశాఖ/అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4"ఎత్తు/M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥PM ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్: 9989597799 [H-796623]

మాల : 25/5'4", B.Tech, Govt.Job DRDO, Sal 12-L P/A వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ అందమైన సాంప్రదాయపు వధువుకు తగిన వరుడు కావలెను. Ph:7702195227 [HA-15209]

వేదికలు

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 9885144375, 8555980066 [H-782776]

కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. ఫోన్: 7702528428 [H-782776]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15210]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd లేట్/విడోస్ సంబంధాలకై సం॥ S.రామలు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-796342]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph : 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15207]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15207]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15207]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15207]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15207]

పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా! Software, డాక్టర్స్, NRI, Govt., అన్ని ప్రాంతాల వారికి ప్రత్యేక శ్రద్ధతో పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి ✆ 7093722724 [T-3486]

కరీంనగర్ కథలతోనే సమాజావిష్కరణ

పుస్తకావిష్కరణ గోష్ఠిలో వక్తలు

సిరిసిల్ల కల్చరల్: భారతీయ సమాజంలోని జీవ నాంశాలను తాత్విక శోధనతో ఆవిష్కరించింది కరీంనగర్ కథలేనని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రగుడులోని రంగినేని ట్రస్టులో శనివారం 'కరీంనగర్ కథలు' పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కార్యదర్శి కన్వీనర్ ఆచార్య సి.మృణాళిని, విశిష్ట అతిథిగా కథా రచయిత అల్లం రాజయ్య, ప్రధాన వక్తగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కాశీం మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని సుమారు 63 మంది విశిష్ట రచయితల కథలకు చోటు కల్పించి.. కథా సంకలనం రూపొందించిన రంగినేని ట్రస్టు నిర్వాహకులను అభినందించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు సభాధ్యక్షత వహించగా.. సంపాదక మండలి ప్రతినిధులు డాక్టర్ నలిమెల భాస్కర్, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్ కుమార్, మద్దికుంట లక్ష్మణ్ తదితరులు పుస్తక రూపకల్పన నేపథ్యాన్ని వివరించారు.

పౌర హక్కుల నేతలను విడుదల చేయాలి

సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం .. ఎన్‌కౌంటర్లపై నిజనిర్ధారణ కోసం వెళ్తున్న పౌర హక్కుల సంఘం కార్యకర్తలను అమానుషంగా అరెస్టు చేయడం ఏమిటని పౌర హక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, శ్రీనివాస్ ప్రశ్నించారు. అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

17 నుంచి గురుకుల విద్య జేఏసీ నిరసనలు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని గురుకుల విద్య జేఏసీ నిర్ణయించింది. ఈనెల 17, 18 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని, 19వ తేదీ నుంచి ఉపాధ్యాయుల సంతకాలతో గురుకుల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు వినతుల సమర్పణ, 28వ తేదీన గురుకుల విద్యా సంస్థల్లోని ఉద్యోగుల విధుల బహిష్కరణ, పెన్‌డౌన్, చాక్‌డౌన్ నిర్వహించాలని నిర్ణయించినట్టు జేఏసీ ప్రతినిధులు సీహెచ్.బాలరాజు, కూకుట్ల యాదయ్య, వి.ప్రభుదాస్, డి.బాలస్వామి తదితరులు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

పౌరహక్కుల సంఘం నేతల అరెస్ట్

- ఎన్‌కౌంటర్ స్థలం పరిశీలనకు వెళ్తుండగా అదుపులోకి
- ఎన్‌కౌంటర్లను ఆపాలి: పౌరహక్కుల సంఘం నేతల డిమాండ్
- పౌరహక్కుల నేతలను విడుదల చేయాలి: ప్రొఫెసర్ హరగోపాల్


ఖమ్మంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు


అశ్వాపురం/ఖమ్మం మయూరిసెంటర్/సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో ఈనెల 5న జరిగిన ఎన్‌కౌంటర్ స్థలానికి నిజనిర్ధారణ కోసం వెళుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులను అశ్వాపురం, మణుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మణుగూరు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో కొందరిని, హనుమాన్ ఆలయం వద్ద ఇంకొందరిని, అశ్వాపురం మండలం గొల్లగూడెంలో మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, ఉపాధ్యక్షుడు రవి, సహాయ కార్యదర్శులు కుమారస్వామి, తిరుమలయ్యతో పాటు మరో 11 మందిని అరెస్ట్ చేసి అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు భారీగా చేరుకోగా, గేట్‌కు తాళం వేసి మీడియాను కూడా లోపలికి అనుమతించలేదు. విచారణ అనంతరం పౌరహక్కుల సంఘం నాయకులను ఓ స్కూల్ బస్సులో ఖమ్మం తరలించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న ఎన్‌కౌంటర్లను ఆపాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు, ఉపాధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవనంలో, అంతకుముందు అశ్వాపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్లు చేస్తూ వందలాది మందిని హత్య చేస్తున్నారని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై నిజనిర్ధారణ చేసే అవకాశం లేకుండా పోయిందని, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కూడా తమను అడ్డుకోవడం శోచనీయమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌కౌంటర్లు పెరిగాయన్నారు. ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తమను అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు.

ఎన్‌కౌంటర్లపై నిజాలు తెలుసుకునే స్వేచ్ఛను కాపాడాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనను అమలు చేయాలని పౌర హక్కుల సంఘం నేతలు ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఎం.రాఘవాచారి, కె.రవిచందర్ శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోలీసు ఎన్‌కౌంటర్లపై నిజాలు తెలుసుకునే స్వేచ్ఛను కాపాడాలని సూచించారు. కరకగూడెం, రఘునాథపాలెం అడవులలో ఈనెల 5వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజాలు తెలుసుకునేందుకు వెళుతున్న 16 మంది పౌర హక్కుల సంఘం నాయకులను అరెస్టు చేయడం సరికాదని అన్నారు. జీవించే హక్కులో భాగంగా నిజానిజాలను తెలుసుకుని వాస్తవాలను సమాజం ముందు పౌరహక్కుల సంఘం ఉంచుతుందన్నారు. గత ప్రభుత్వం నిర్బంధ విధానాలను మానకపోవడం వల్లనే పౌర సమాజం ఆ ప్రభుత్వాన్ని ఓడించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించిన ఏడవ గ్యారంటీకి కట్టుబడి ప్రజాస్వామ్య పాలనను అమలు చేయాలని, నిర్బంధంలోకి తీసుకున్న నిజనిర్ధారణ బృందాన్ని విడుదల చేయాలని కోరారు.


పచ్చని లోయ
నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని మొత్తా తండాలో గుట్టల మధ్య వాగునీటితో సాగవుతున్న పొలాలు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ


ఆలయ అంతరాళం మెట్టుగా కాకతీయ శాసనం

సాక్షి, హైదరాబాద్: ఆలయ అంతరాళం మెట్టుగా ఉన్న కాకతీయ శాసనాన్ని చరిత్ర పరిశోధకులు గుర్తించారు. కొలనుపాక సోమేశ్వరాలయ ప్రాంగణంలోని చండికాంబ గుడి అంతరాళం మెట్టు మీద కనిపిస్తున్న అక్షరాలను ఇటీవల కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుర్తించారు. దాన్ని పరిశీలించగా.. అది కాకతీయ కాలం నాటి శాసనరాయిగా తేలింది. 13వ శతాబ్దంలో తెలుగు లిపిలో ఈ శాసనం చెక్కినట్టు ఆ బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఇందులో వరంగల్ స్వయంభూ దేవుడిని ఆరాధించే కాకతీయ మహారాజు గణపతిదేవుడిని అనుమకొండపురవరేశ్వరుడిగా కీర్తించినట్టు వివరించారు. కానీ మెట్టులాగా వాడుతున్నందున శాసనం మిగతా పక్కల ఉన్న అక్షరాలు చదివే పరిస్థితి లేదని, దాన్ని వెలికితీసి చూస్తేనే పూర్తి పాఠం అవగతమవుతుందని స్పష్టం చేశారు. వెంటనే దాన్ని మెట్టు నుంచి తొలగించి కొలనుపాక ప్రదర్శనశాలకు తరలించాలని ఆయన రాష్ట్ర వారసత్వ శాఖ అధికారులను కోరారు.


దేవాలయ అంతరాళం మెట్టుగా ఉన్న శాసనం

సేంద్రియ సేద్యంలో ఎకరాకు ప్రతి నెలా రూ.లక్ష


ఆర్గానిక్ మాండ్య ఫార్మర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధు చందన వెల్లడి



సాక్షి, హైదరాబాద్: చిన్న, సన్నకారు రైతు దంపతులు చిన్న కమతాల్లో స్వయంగా చేసే సేంద్రియ వ్యవసాయం ద్వారా ఎకరానికి ప్రతి నెలా రూ.లక్ష ఆదాయం పొందవచ్చని ఆర్గానిక్ మాండ్య రైతుల సహకార సంఘం వ్యవస్థాపకుడు మధు చందన స్పష్టం చేశారు. గత ఎనిమిదేళ్లుగా కర్ణాటకలోని మాండ్య జిల్లాలో 12 వేలమంది రైతులతో కలసి పనిచేస్తున్న తమ అనుభవాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో శనివారం జరిగిన సేంద్రియ రైతుల సదస్సులో మధు చందన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి అమెరికాలో స్థిరపడిన తనకు స్వస్థలం మాండ్యలో రైతుల ఆత్మహత్యలు తీవ్రంగా కలచివేసిందని దీంతో ఇక్కడకు తిరిగి వచ్చేశానని చెప్పారు. కేవలం 50 ఏళ్లలో మన రైతులను రసాయనిక వ్యవసాయం అన్నివిధాలుగా నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలంటే సేంద్రియ వ్యవసాయం ఒక్కటే మార్గమని గ్రహించి ఆ దిశగా కృషి చేస్తున్నానన్నారు. ఆర్గానిక్ మాండ్య ఫార్మర్స్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో కూడా రైతులకు శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐఎస్‌బీ సెంటర్ ఫర్ బిజినెస్ మార్కెట్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.శేషాద్రి మాట్లాడుతూ..రసాయనిక ఆహారం తీసుకున్నవారు రోగాల పుట్టగా మారుతున్నారని, సేంద్రియ ఆహారం తీసుకుంటే కొద్ది నెలల్లోనే రోగాలన్నీ మాయమవుతాయని స్వానుభవంతో చెబుతున్నానన్నారు. ఈ సమావేశంలో పలువురు సేంద్రియ వ్యవసాయ అభిమానులు, రైతులు పాల్గొన్నారు.


నంబర్ ప్లేట్ లేకుంటే చీటింగ్ కేసా?

పోలీసుల తీరుపై హైకోర్టు విస్మయం



సాక్షి, హైదరాబాద్: నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపిన ఓ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసుల తీరుపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఇష్టం వచ్చిన సెక్షన్ల కింద కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించింది. చార్మినార్ పోలీసులు తనపై తప్పుడు సెక్షన్ల కింద దాఖలు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో వసుందర్‌చారి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి..'పిటిషనర్‌పై ఉన్న ఒకే ఒక ఆరోపణ నంబర్ ప్లేట్ లేకుండా వాహనాన్ని నడపటం. ఆ వాహనాన్ని కూడా సీజ్ చేశారు. ఈ నేరం ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) సెక్షన్ 420 పరిధిలోకి రాదు. అంతేకాకుండా, సెక్షన్ 80(ఏ) కింద శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తూ అభియోగాలు మోపారు. వాహనాల పర్మిట్ కోసం దరఖాస్తు చేయడం, మంజూరు విధానం గురించి ఈ సెక్షన్ చెబుతుంది. కాబట్టి, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపినా సెక్షన్ 80(ఏ)కి వర్తించదు. పిటిషనర్ నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే నిబంధనల ప్రకారం పోలీసులు జరిమానా విధించాలి లేదా కేసు నమోదు చేయాలి. ఈ కారణంగా పిటిషనర్‌పై నమోదు చేసిన సెక్షన్లను రద్దు చేస్తున్నాం'అని పేర్కొన్నారు.

అర్చకులకు 010 పద్దు వేతనాలివ్వాలి



సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖలో ఒకే శాఖ.. ఒకే వేతనం విధానం అమలు చేసి అర్చకులకు అధికారుల తరహాలో 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయంలో జేఏసీ సమావేశమైంది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలోని 686 దేవాలయాల్లో పని చేస్తున్న 5,625 మంది అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని జీవో ద్వారా ప్రభుత్వం పేర్కొందని గుర్తు చేశారు. కానీ కొందరికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా, ఇంకొందరికి దేవాలయ ఆదాయం ద్వారా చెల్లిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. 1,128 మంది అర్చక ఉద్యోగులు చాలీచాలని వేతనాలను అందుకుంటున్నారని జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు 010 పద్దు ద్వారా చెల్లిస్తున్నట్టే.. అర్చకులకు కూడా చెల్లించాలని, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అర్చక ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

'రాష్ట్ర సమాచార కమిషన్‌లో ఒక్కరంటే ఒక్క కమిషనర్ కూడా లేరా? ఒక్క కమిషనర్ కూడా లేకుంటే అప్పీళ్లను సిబ్బంది విచారిస్తారా? ఇలాగైతే సమాచార హక్కు చట్టం చేసి ఏం ప్రయోజనం? కౌంటర్లు అక్కర్లేదు..ఎప్పుడు నియమిస్తారో చెప్పండి?'
- పిల్ విచారణ సందర్భంగా హైకోర్టు ఆగ్రహం

'ప్రధాన సమాచార కమిషనర్ కోసం 40 దరఖాస్తులు, రాష్ట్ర సమాచార కమిషనర్ పోస్టుల కోసం 273 దరఖాస్తులొచ్చాయి. త్వరలో సమాచార కమిషనర్ల నియామకం కోసం ఎంపిక కమిటీని ఏర్పాటు చేస్తాం. దీని కోసం నాలుగు వారాల గడువు ఇవ్వాలి'
- 2023 ఆగస్టులో హైకోర్టుకు సర్కారు నివేదన



కమిషనర్లు లేక.. సమాచారం రాక..

సమాచార కమిషనర్ల నియామకంలో సర్కారు నిర్లిప్తత..

ప్రధాన సమాచార కమిషనర్ పదవీకాలం ముగిసి నాలుగేళ్లు.. కమిషనర్ అంటూ లేక ఏడాదిన్నర..

తమ వినతులు పరిష్కరించేవారు లేక ప్రజల అవస్థలు..

సాక్షి, హైదరాబాద్: అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసురావడానికి కేంద్ర ప్రభుత్వం 2005లో తీసుకొచ్చిన సమాచారహక్కు చట్టం కమిషనర్లు లేక నిర్వీర్యమవుతోంది. ప్రధాన సమాచార కమిషనర్ 2020, ఆగస్టు 24న, చివరి సమాచార కమిషనర్ 2023, ఫిబ్రవరి 24న తన పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. అప్పటి నుంచి ఎవరి నియామకమూ జరగలేదు. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం అడిగినా సకాలంలో ఇచ్చే వారు కరువయ్యారు. దీనిపై కమిషన్‌ను సంప్రదించడానికి.. జిల్లా కమిటీలూ సరిగా లేవు. ఇక అప్పీలు చేద్దామంటే రాష్ట్రస్థాయిలో కమిషనే లేదు.

- ఈ ఏడాది జూన్ 12న ప్రభుత్వం మరోసారి నోటిఫికేషన్ ఇచ్చి.. జూన్ 29వ తేదీని ఆఖరు తేదీగా ప్రకటించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇది జరిగి రెండు నెలలు దాటుతున్నా.. ఇప్పటివరకూ దరఖాస్తుల పరిశీలనే జరగలేదు .

రాష్ట్ర కమిషన్.. సెక్షన్ 15(1) కింద ఈ కమిషన్ ఏర్పాటవుతుంది. దీనికి ఓ ప్రధాన కమిషనర్‌తో పాటు గరిష్ఠంగా 10 కమిషనర్ల వరకు నియమించవచ్చు. ముఖ్యమంత్రి చైర్‌పర్సన్‌గా శాసనసభలో ప్రతిపక్ష నేత, ఓ కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉండే కమిటీ సిఫార్సు మేరకు గవర్నర్ వీరిని నియమిస్తారు. కమిషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది.

- ప్రజాజీవనంలో సుప్రసిద్ధులే ఉండాలి. విశాలమైన విషయ పరిజ్ఞానం, చట్టం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సామాజిక సేవ, జర్నలిజం, ప్రసార మాధ్యమాలు, కార్యనిర్వహణ, పరిపాలనలో అనుభవమున్నవారు ప్రధాన కమిషనర్, కమిషనర్‌గా అర్హులు.
- ప్రధాన కమిషనర్, కమిషనర్లు నియామకమైన నాటి నుంచి ఐదేళ్లు లేదా వయసు 65 ఏళ్లు వచ్చే వరకు బాధ్యతల్లో కొనసాగుతారు. వీరిని తిరిగి నియమించడానికి అవకాశం లేదు. కమిషనర్లకు ప్రధాన కమిషనర్‌గా నియామకం పొందే అర్హత ఉంటుంది. అయితే మొత్తంగా ఐదేళ్లు మించి బాధ్యతల్లో కొనసాగడానికి వీలులేదు.
- వీరిని తొలగించడం గవర్నర్ ఉత్తర్వు ద్వారా మాత్రమే సాధ్యం.

అధికారాలు..

సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు కమిషన్‌కు ఉంటాయి	అవసరమైన డాక్యుమెంట్లు పరిశీలించడం, తనిఖీ చేయడం
వ్యక్తులకు సమన్లు జారీ చేసి హాజరయ్యేట్టు లేదా లిఖిత పూర్వకంగా సాక్ష్యం ఇచ్చేట్టు చేయడం	అఫిడవిట్ల రూపంలో వాంగ్మూలం స్వీకరించడం
	కోర్టు లేదా ప్రభుత్వ కార్యాలయం నుంచి రికార్డులు, కాపీలు తెప్పించడం

- ఏపీఐసీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్
- 2017, సెప్టెంబర్ 9 నుంచి తెలంగాణ కమిషన్ ప్రారంభం. గణాంకాలు ఆ తేదీ నుంచే.
- 2024 అప్పీళ్లు, ఫిర్యాదుల గణాంకాలు ఆగస్టు 24 వరకు..
- 17,792 ఫిర్యాదుల్లో ఒకసారి కమిషన్ ఆదేశాలు జారీ చేసినా సమస్య పరిష్కారం కాలేదంటూ మళ్లీ వచ్చిన కేసులు 3,210

ఎవరు అప్పీల్ చేయవచ్చు

- సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వ అధికారి నిరాకరించినప్పుడు..
- నిర్దేశించిన 30 రోజుల్లో సమాచారం రాకపోయినా..
- సమాచారం కోసం చెల్లించాల్సిన రుసుము సహేతుకంగా లేదని అనిపిస్తే..
- ఒకవేళ అధికారి తప్పుడు లేదా తప్పుదోవ పట్టించేలా సమాచారం ఇచ్చారని భావిస్తే..
- తగిన కారణాలుంటే కమిషన్ నేరుగా విచారణకు కూడా స్వీకరించవచ్చు.

	అప్పీళ్లు	ఫిర్యాదులు	మొత్తం
2017 వరకు(ఏపీసీఐ)	3,991	2,834	6,825
2017 నుంచి 2024	27,713	14,958	42,671
మొత్తం	31,704	17,792	34,884
పరిష్కారం	22,218	12,666	38,884
పెండింగ్	9,486	5,126	14,612
పరిష్కార శాతం	70.07	71.18	70.47

వీలైనంత త్వరగా నియామకం చేయాలి



ప్రభుత్వం నుంచి సమాచారం పొందడం ప్రజల హక్కు. ఆ హక్కుపై చట్టం చేసినా.. కొన్ని కారణాలతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీని పరిరక్షణకు ఏర్పాటు చేసిన సమాచారం కమిషన్ కూడా బాధ్యులు లేక ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా ప్రధాన కమిషనర్, కమిషనర్లను ఏర్పాటు చేయాలి.
-ఎం.పద్మనాభరెడ్డి, ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ అధ్యక్షుడు

మధ్యవర్తిత్వానికి పెరుగుతున్న ప్రాధాన్యం

న్యాయస్థానాలపై భారం తగ్గుతుందన్న జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి

ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన న్యాయమూర్తి

గచ్చిబౌలి (హైదరాబాద్): అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యం పెరుగుతోందని, కక్షిదారులకు సత్వర న్యాయం అందాలంటే ఈ మార్గమే సరైందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సమర్థవంతమైన వివాద పరిష్కార పద్ధతిగా మధ్యవర్తిత్వాన్ని పాశ్చాత్య దేశాలు అవలంబిస్తున్నాయన్నారు. ఇంటర్నేషనల్ అర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ), హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన న్యాయవాదులకు ఐదు రోజుల మధ్యవర్తిత్వ శిక్షణా కార్యక్రమాన్ని జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2023 నుంచి మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యం పెరుగుతోందని, న్యాయవాదులు మధ్యవర్తిత్వంలో నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో దీనికి ఇంకా ఆదరణ పెరిగితే.. కోర్టుపై కొంత భారం తగ్గుతుందన్నారు. ఇది పెండింగ్ వ్యాజ్యాల భారాన్ని తగ్గిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐఏఎంసీ రిజిస్ట్రార్ తారిఖ్‌ఖాన్, హెచ్‌సీఏఏ సెక్రటరీ శాంతి భూషణ్, జాయింట్ సెక్రటరీ నవీన్ వాసిరెడ్డి, సీనియర్ మీడియేటర్ జావద్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి



వరదసాగరం! ఇది కాకినాడ జిల్లా ఉప్పాడ సాగర తీరంలో వరద నీరు సముద్రంలో కలిసే ప్రాంతం. వరద నీరు భారీ ఎత్తున సముద్రంలోకి వెళుతూ ఇలా స్పష్టంగా కనిపిస్తోంది. ఓ వైపు సముద్రం నీలి వర్ణంతో మెరిసిపోతుంటే.. మరోవైపు వరద బురదమయంగా సాగరంలోకి చొచ్చుకుపోతోంది. ఈ సుందర దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు ఈ ప్రాంతానికి క్యూ కడుతున్నారు. – పిఠాపురం

రీల్స్ పిచ్చి.. ప్రాణంపైకి తెచ్చి..

హైటెన్షన్ తీగలు తగిలి యువకుడికి తీవ్రగాయాలు

కాజీపేట రూరల్: ఆగి ఉన్న గూడ్స్ రైలెక్కి ఒక యువకుడు సెల్ఫీలు దిగి.. రీల్స్ చేయబోగా.. హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే జంక్షన్‌లో శనివారం జరిగిన ఈ సంఘటనపై రైల్వే కార్మికులు తెలిపిన వివరాలివి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన రాజు అనే యువకుడు కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సమీపంలో ఆగి ఉన్న గూడ్స్ రైలు ఎక్కి సెల్‌ఫోన్‌తో సెల్ఫీలు దిగి.. రీల్స్ చేశాడు. అదే సమయంలో ప్రమాదవశాత్తు పైన ఉన్న రైల్వే హైటెన్షన్ విద్యుత్ లైన్ తీగలకు తగిలాడు. విద్యుదాఘాతానికి గురవడంతో 70 శాతం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.




యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

పరీక్షలు పెట్టారు.. ఫలితాలేవీ!

- గురుకులాల్లో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల నియామకంపై అయోమయం
- ఏడాది క్రితం పరీక్షలు.. కీ, రెస్పాన్స్ షీట్ విడుదలతో సరిపెట్టిన బోర్డు
- స్తంభించిన నియామక ప్రక్రియతో అభ్యర్థుల్లో గందరగోళం

కేటగిరీ	పోస్టులు
డ్రాయింగ్/ఆర్ట్ టీచర్	134
క్రాఫ్ట్ టీచర్	92
మ్యూజిక్ టీచర్	124



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల నియామకాలపై తీవ్ర గందరగోళం నెలకొంది. అర్హత పరీక్షలు నిర్వహించి ఏడాది దాటినా ఫలితాలు ప్రకటించకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో డ్రాయింగ్/ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేటగిరీల్లో 350 ఉద్యోగాలకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) గతేడాది ఏప్రిల్ 5న మూడు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ నోటిఫికేషన్లతో పాటు మరో ఆరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఆర్ఈఐఆర్‌బీ..వాటి నియామకాల ప్రక్రియను పూర్తి చేసింది. ఇటీవల పోస్టింగ్ ఉత్తర్వులు కూడా జారీ చేయడంతో ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్నారు. కానీ డ్రాయింగ్/ఆర్ట్ , క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేటగిరీలకు సంబంధించి నియామకాల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

పరీక్షలు నిర్వహించి ఏడాది దాటినా..

డ్రాయింగ్/ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి గతేడాది ఆగస్టు నెలలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. ఇందులో క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ పోస్టులకు సంబంధించి ప్రాథమిక కీని ఏడాది తర్వాత విడుదల చేశారు. అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌లను కూడా బోర్డు వెబ్‌సైట్‌లో పెట్టారు. ప్రాథమిక కీ పై అభ్యంతరాలను నిపుణుల కమిటీ ముందుంచి పరిశీలించిన తర్వాత తుది కీ విడుదల చేస్తామని బోర్డు వెల్లడించింది. ఈ ప్రక్రియ ముగిసి రెండు నెలలు కావస్తున్నా బోర్డు నుంచి ఎలాంటి సమాచారం లేదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకేసారి విడుదల చేసిన నోటిఫికేషన్లలో మెజార్టీ పోస్టులు భర్తీ చేసిన అధికారులు.. తక్కువ సంఖ్యలో ఉన్న ఉద్యోగాల భర్తీ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు.

170 కిలోల గంజాయి పట్టివేత

వ్యాన్‌లో ఒడిశా నుంచి తీసుకువస్తుండగా స్వాధీనం

8 మంది ముఠా సభ్యుల అరెస్టు

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గుట్టుచప్పుడు కాకుండా పికప్ వ్యాన్‌లో గంజాయిని తరలించేందుకు ఓ ముఠా చేసిన ప్రయత్నాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వమ్ముచేశారు. ఒడిశా నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో అనుమానిత వాహనాన్ని తనిఖీ చేయగా 170 కిలోల గంజాయి పట్టుబడినట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి వెల్లడించారు. శనివారం ఉదయం ఆబ్కారీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ముఠాలోని 8 మందిని అరెస్టు చేశామన్నారు. ఈ సోదాల్లో పట్టుబడిన గంజాయి విలువ రూ.34 లక్షలు ఉంటుందని, గంజాయితోపాటు ఒక మహీంద్రా పికప్ వ్యాన్, హ్యుందాయ్ కారును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా బోయ్‌పర్ గూడ గ్రామానికి చెందిన ప్రొక్లెయిన్ డ్రైవర్ ఇస్మాయిల్ తురికి ఈ ముఠాలో కీలకమని తెలిపారు. పక్కా సమాచారంతో పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతంలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు బృందం సోదాలు జరపగా, పికప్ వ్యాన్‌లో రహస్యంగా ఏర్పాటు చేసిన అరల్లో దాచి ఉంచిన గంజాయి పట్టుబడినట్టు పేర్కొన్నారు. ఈ వ్యాన్‌ను అనుసరిస్తూ వస్తున్న కారు, మరో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న ఇస్మాయిల్ తురికితోపాటు పుణేకు చెందిన ఆసిఫ్ రంజాన్, శైలేంద్ర కారత్, నిఖత్, కేవల్ వినయ్ మఖరే, మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ బారిక్, ధర్మరాజు, అమర్‌లను అరెస్టు చేసినట్టు జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

సాక్షి ప్లస్
ఆదివారం। 15-9-2024

సింగరేణికి ఓపెన్ చిక్కులు

ఓసీల్లో బొగ్గు ఉత్పత్తిపైనే సంస్థ మనుగడ | **ఓపెన్ కాస్ట్‌లకు భూసేకరణ, అనుమతుల సమస్య** | **పదేళ్లుగా ఓబీ ఎత్తు పెంపుతో నెట్టుకొస్తున్న సింగరేణి** | **ఎత్తు పెంపుతో ఆకస్మిక వరదల ముప్పు**

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఓపెన్ కాస్ట్ బొగ్గు ఉత్పత్తిపైనే మనుగడ సాగించాల్సి రావడంతో సింగరేణి సంస్థ వివిధ సమస్యలతో సతమతమవుతోంది. సింగరేణి సంస్థ ఆరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. సంస్థ పరిధిలో 22 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులున్నాయి. రోజూ రమారమి రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో 1.70 లక్షల టన్నులు ఓపెన్‌కాస్ట్ గనుల నుంచే వస్తోంది. భూమి లోపలి పొరల్లో నిక్షిప్తమైన బొగ్గును బయటకు తీసే క్రమంలో.. ముందుగా భూ ఉపరితలంలో ఉన్న మట్టిని తొలగించాల్సి వస్తుంది. రాష్ట్రంలోని ఓపెన్‌కాస్ట్ గనుల స్వభావాన్ని బట్టి.. టన్ను బొగ్గుకు సగటున ఐదు టన్నుల వరకు మట్టిని తొలగించాల్సి వస్తుంది. ఇలా తొలగించే మట్టిని ఓవర్ బర్డెన్ (ఓబీ)గా పేర్కొంటూ గని వెలుపల పోస్తుంటారు.



ఆరంభంలో 60 మీటర్లు..

ఓపెన్ కాస్ట్ మైనింగ్ 1975 నుంచి అందుబాటులోకి వచ్చింది. ఆరంభంలో ఓబీ మట్టి కుప్పలను భూమి నుంచి 60 మీటర్ల ఎత్తు వరకే పోసేందుకు అనుమతి ఉండేది. బొగ్గు గనుల ప్రారంభం, నిర్వహణలో భూగర్భ గనులకు తక్కువ స్థలం సేకరిస్తే సరిపోతుంది. కానీ ఓపెన్ కాస్ట్ గనులకు వందల ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. మరోవైపు ఇలా సేకరించే స్థలంలో సగానికి పైగా అటవీ శాఖ పరిధిలోనే ఉంటున్నాయి. దీంతో పాత గనులు విస్తరించాలన్నా, కొత్త గనులు ప్రారంభించాలన్నా భూసేకరణతో పాటు పర్యావరణ అనుమతులు సాధించడం చిక్కులతో కూడిన వ్యవహారంగా మారింది.

పరిశీలనలో 150 మీటర్లు..

స్థల సేకరణ, అనుమతుల సాధన, ఓబీ మట్టి రవాణా ఖర్చులు తదితర అంశాల నేపథ్యంలో పదేళ్ల కిందట ఓబీ మట్టి కుప్పల ఎత్తును 60 మీటర్ల నుంచి 90 మీటర్లకు పెంచారు. దీంతో కొంతకాలం వరకు స్థల లభ్యత సమస్యలు అదుపులోకి వచ్చాయి. కానీ ఎక్కువ కాలం గడవకముందే మూడేళ్ల కిందట ఈ ఎత్తును 120 మీటర్లకు పెంచారు. దీంతో ఓపెన్ కాస్ట్ గనులను ప్రారంభించినప్పటి కన్నా.. రెట్టింపు ఎత్తుకు ఓబీ మట్టి గుట్టల ఎత్తు పెరిగింది. ప్రస్తుత అవసరాలకు ఈ ఎత్తు కూడా సరిపోకపోవడంతో 150 మీటర్లకు పెంచితే ఎలా ఉంటుంది..?, పర్యావరణ పరంగా ఎదురయ్యే ఇబ్బందులేమిటి? అనే అంశాలపై సింగరేణి అధ్యయనం ప్రారంభించింది. ఇప్పటికే రామగుండం–2 ఏరియాలో ఓసీపీ 3లో నిపుణుల కమిటీ పరిశీలించి క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించింది. వీటి ఆధారంగా త్వరలో ఓబీ మట్టి గుట్టల ఎత్తు పెంపుపై నిర్ణయం తీసుకోనుంది.

కమిటీ వేశాం

ఓబి డంప్‌యార్డ్ నిర్వహణకు వందల ఎకరాలు అవసరముంది. ప్రస్తుతం భూముల ధరలు ఎక్కువగా ఉన్నందున సంస్థపై భారం తగ్గించేందుకు మరో 30 మీటర్ల ఎత్తు పెంచే అంశంపై యాజమాన్యం పరిశీలిస్తోంది. ఈ మేరకు ఎదురయ్యే పర్యావరణ ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై కమిటీ వేస్తున్నాం.

– జక్కం రమేశ్, జీఎం, సీపీపీ

ప్రమాద ఘంటికలు



ఇటీవలి వర్షాలకు వచ్చిన ఆకస్మిక వరదతో నీట మునిగిన మణుగూరు పట్టణం

పదేళ్లుగా ఓబీ మట్టి కుప్పల ఎత్తు 60 మీటర్ల నుంచి 120 మీటర్ల ఎత్తుకు పెంచడంతో అవి ఎత్తయిన గుట్టలుగా మారాయి. ఈ ఓసీలున్న ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే.. దిగువ భాగంలో ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో 25 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసింది. దీంతో ఓబీ మట్టి గుట్టల మీదుగా వచ్చిన వరద నీరు.. రక్షణ కందకాలను దాటుకుని దిగువనున్న మణుగూరు పట్టణంలోకి ప్రవేశించింది. లోతట్టు ప్రాంతం, నాలాలకు ఇరువైపులా ఉన్న కాలనీలు జలమయమయ్యాయి. మణుగూరు అనుభవం నేపథ్యంలో ఓబీ మట్టి కుప్పల ఎత్తు పెంపు నిర్ణయం తీసుకునేటప్పుడు.. ఆకస్మిక వరదల అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలనే డిమాండ్ పెరుగుతోంది.

జోగుళాంబదేవి సన్నిధిలో సీఎస్



సీఎస్ శాంతికుమారికి అమ్మవారి జ్ఞాపికను ఇస్తున్న ఈఓ పురేంధర్

జోగుళాంబ శక్తిపీఠం: తెలంగాణలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పురేంధర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ఆమె కుటుంబసభ్యులతో కలసి గణపతి, చండీహోమాలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున శాంతికుమారి దంపతులకు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయం అభివృద్ధి, ఇక్కడి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రూ.37 కోట్లతో నిర్మాణం అయ్యే ప్రసాద్ స్కీం భవనం గురించి ఆరా తీశారు. ఆలయాల్లో పనిచేసే అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ నుంచి ఇచ్చే వేతనాలు రెగ్యులర్‌గా ఇవ్వడం లేదని, మూడు నెలలకోసారి మాత్రమే ఇస్తున్నారని అది కూడా ఒక నెల వేతనం వేసి రెండు నెలలు పెండింగ్‌లో పెడుతున్నారని ఆలయ ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌శర్మ సీఎస్ దృష్టికి తెచ్చారు.

ఒకే ఈతలో 13 కుక్కపిల్లలు

బెంగళూరులో ఉంటున్న ఖమ్మం వాసి ఇంట్లో కేన్‌కోర్సో జాతి శునకం



తల్లి వద్ద పాలు తాగుతున్న కూనలు

ఖమ్మం అర్బన్: ఖమ్మంలోని మధురానగర్‌కు చెందిన ఇస్రో శాస్త్రవేత్త వల్లూరి ఉమామహేశ్వరరావు ఇంట్లో పెంపుడు కుక్క 'ఐరా'ఒకే ఈతలో 13 కుక్కపిల్లలకు జన్మనిచ్చింది. ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటున్న ఉమామహేశ్వరరావు ఇటాలియన్ మూలాలు కలిగిన కేన్‌కోర్సో జాతి శునకాన్ని రూ.లక్షతో కొనుగోలు చేసి పెంచుతున్నారు. సాధారణంగా నాలుగు నుంచి ఐదు కుక్కపిల్లలకు మాత్రమే జన్మనిస్తాయని ఆయన తెలిపారు. కానీ ఒకే ఈతలో 13 కుక్కపిల్లలకు జన్మనివ్వడం, అన్నీ ఆరోగ్యంగా ఉండటంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారని చెప్పారు. గతంలో ఇదే జాతిరకం కుక్క ఒకటి 19 కూనలకు జన్మనిచ్చిన రికార్డు నమోదై ఉంది. కాగా, తమ శునకం రికార్డుల్లో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు.

జిల్లా స్థాయిలోనూ

విపత్తు నిర్వహణ ఏజెన్సీ!

- తొలుత పట్టణాభివృద్ధి సంస్థల పరిధికి పరిమితం చేసే ఆలోచన
- విధివిధానాల రూపకల్పన బాధ్యతలు పురపాలక శాఖకు



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో..అదే విధానాన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలకు విస్తరించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. 'హైడ్రా'రంగంలోకి దిగాక..వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వంటి కార్పొరేషన్ల నుంచే గాకుండా స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీలుగా ఉన్న నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మంచిర్యాల, సిద్దిపేటతో పాటు గ్రేడ్–1 మునిసిపాలిటీల నుంచి కూడా చెరువుల ఆక్రమణలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఇటీవల ఖమ్మం వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా స్థాయిలో కూడా 'హైడ్రా' వంటి సంస్థల ఏర్పాటుకు అనుకూల ప్రకటన చేశారు. అంతకు ముందు హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా జిల్లాల్లో 'హైడ్రా'వంటి ఏజెన్సీల ఏర్పాటు ఆవశ్యకత ఉందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 'విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ ఏజెన్సీ'ల ఏర్పాటు తప్పనిసరి అని తేలిపోయింది.

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్‌ను నియమించిన విషయం తెలిసిందే. రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్ తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులందరూ ఈ ఏజెన్సీలో ఉన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్న విపత్తు నిర్వహణ ఏజెన్సీలకు కూడా

ఐపీఎస్ అధికారి నేతృత్వంలో ఏర్పాటు

ఐపీఎస్ అధికారినే ఇన్‌చార్జ్‌గా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఓ మంత్రి తెలిపారు. ఉదాహరణకు కరీంనగర్ పట్టణానికి ఏర్పాటు చేసే ఏజెన్సీకి అక్కడ డీసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జ్‌గా నియమిస్తారని తెలిసింది. పోలీస్ అధికారి బాధ్యులుగా ఉంటేనే కబ్జారాయుళ్లను కంట్రోల్ చేయొచ్చని, అక్రమణలపై ఉక్కుపాదం మోపవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్టు ఆ నేత తెలిపారు.

ముందుగా అక్కడే...

వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట వంటి నగరాల్లో అక్కడున్న పట్టణాభివృద్ధి సంస్థల పరిధిని విపత్తు నిర్వహణ ఏజెన్సీకి అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. ఉదాహరణకు వరంగల్ నగరంలో ఉన్న కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో పలు చెరువులు, కుంటలు కబ్జాల పాలయ్యాయి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో గత పదేళ్లలో భారీగా నిర్మాణాలు సాగడంతో వర్షాకాలంలో నగరంలో వరదలు సర్వసాధారణమయ్యాయి. మంచిర్యాల పట్టణంలో అనేక చెరువులు, వాగు పరీవాహక ప్రాంతాలు కబ్జాల పాలయ్యాయి. ఈ నేపథ్యంలో పట్టణాభివృద్ధి పరిధిని సరిహద్దుగా తీసుకొని విపత్తుల ఏజెన్సీ ద్వారా చర్యలకు ఉపక్రమించాలని ప్రభుత్వం యోచిస్తుంది. నదుల గమనానికి, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధికి అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించడమే లక్ష్యంగా ముందుకు సాగే ఆలోచనతో ప్రభుత్వం ఉందని పురపాలక శాఖ అధికారి ఒకరు తెలిపారు.

చదువులకు ఫీజులు..

వైద్య సాయానికి ఖర్చులు

సేవ.. సాయం., సమస్యలకు పరిష్కారం

- ఇదీ మంత్రి కోమటిరెడ్డి ప్రజా దర్బార్
- నల్లగొండలో ప్రజల నుంచి స్వయంగా ఫిర్యాదుల స్వీకరణ



ప్రజా దర్బార్‌లో వివిధ సమస్యలతో వచ్చిన వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించి పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కనగల్ మండలం జి.ఎడవల్లికి చెందిన కోరె కళ్యాణికి ఇద్దరూ ఆడపిల్లలే. పెద్ద కూతురు శ్రీజ బీటెక్ సెకండియర్ చదువుతుండగా, చిన్న కూతురు భావన ఎన్ఐటీలో సీటు సంపాదించింది. ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో కళ్యాణి.. ప్రజా దర్బార్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి తన బాధను విన్నవించుకుంది. దీంతో స్పందించిన మంత్రి తమ ఫౌండేషన్ ద్వారా ఆ ఇద్దరు అమ్మాయిల చదువులకు రూ.2లక్షల ఫీజు చెల్లించారు.

→ మహాత్మాగాంధీ యూనివర్సిటీలో చదువుకునే బొమ్మపాల ప్రవీణ్‌కు ఇటీవల యాక్సిడెంట్ అయింది. చికిత్సకు దాదాపు రూ.ఏడున్నర లక్షలు ఖర్చయ్యాయి. ఆ అబ్బాయి తల్లిదండ్రులు రూ.4లక్షలు ఆసుపత్రిలో చెల్లించారు. మిగితా డబ్బులు లేకపోవడంతో మంత్రిని కలిసి తమ పరిస్థితి విన్నవించుకున్నారు. దీంతో వెంటనే ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి ఫీజులో ఒక లక్ష తక్కువ చేయించారు. మరో రూ.2 లక్షలు తమ ఫౌండేషన్ ద్వారా చెల్లించారు. రూ.50 వేలు ఆ అబ్బాయి తల్లిదండ్రులు చెల్లించారు.

→ మాడ్గులపల్లికి చెందిన ఓ వ్యాపారి అక్కడి పేదలకు అధిక వడ్డీ ఆశ చూపి వంద మంది నుంచి రూ.2 కోట్లు వసూలు చేశాడు. ఏళ్లు గడిచినా డబ్బులు ఇవ్వకపోగా, పేదలను బెదిరిస్తున్నాడు. దీంతో బాధితులు మంత్రిని ఆశ్రయించారు. వెంటనే ఆయన స్పందించి ఎస్పీతో మాట్లాడి, వారి డబ్బులు వారికి ఇప్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పోలీసులు సదరు వ్యాపారిని తీసుకొచ్చి డబ్బులు ఇప్పించేలా చర్యలు చేపడుతున్నారు.

ఇవీ.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో పరిష్కారమైన కొన్ని సమస్యలు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన అనేక చర్యలు చేపడుతున్నారు. గంటల తరబడి కూర్చొని ప్రజల సమస్యలు వింటున్నారు. ఇంట్లో స్థలం సరిపోవడం లేదని పక్కనున్న పార్కులోనే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అధికారులను పిలిపించుకొని మరీ.. నెలలో ఒకసారి, వీలైతే రెండు మూడుసార్లు నిర్వహిస్తూ ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రధానంగా వైద్యం, చదువుల విషయంలో సహాయం అందిస్తూ ఎలాంటి ఆధారం లేని వారికి భరోసా కల్పిస్తున్నారు.

ఆయన వచ్చారంటే పార్కు నిండిపోవాల్సిందే..

హైదరాబాద్‌లోని ప్రజాభవన్ మాదిరి నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజా దర్బార్‌కు శ్రీకారం చుట్టారు. ఆయన వచ్చారంటే నల్లగొండలో క్యాంపు కార్యాలయం పక్కన పార్కు ప్రజలతో నిండిపోతోంది. ఇప్పటివరకు 12సార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు బారులు తీరిన ప్రజలు (ఫైల్)



శనివారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద గణేశుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం...



గణపతికి హారతి ఇస్తున్న భక్తుడు

కంగనా రనౌత్‌పై కేసు పెట్టకుంటే ధర్నా చేస్తా

మాజీ ఎంపీ వి.హనుమంతరావు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఆరోపణలు చేసిన సినీనటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై తాను ఫిర్యాదు చేశానని, పోలీసులు ఇంతవరకు స్పందించలేదని, ఆమెపై కేసు పెట్టి చర్యలు తీసుకోకపోతే అంబర్‌పేట పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. దేశంలో అమిత్‌షాకి ఒక రూల్, రాహుల్‌గాంధీకి ఒక రూల్ ఉంటుందా? అని శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించారు. రాహుల్‌గాంధీని అవమానించిన కంగనా రనౌత్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విముక్తికి, బీజేపీకి ఏం సంబంధం లేదని, అయినా బీజేపీ నేతలు ఏదో దేశాన్ని ఉద్ధరించినట్టు సభలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. నిజాం నవాబు నుంచి తెలంగాణ విడిపోయి స్వతంత్ర భారతదేశంలో కలిసే నాటికి పుట్టని బీజేపీ ఇప్పుడు హంగామా చేయడం విడ్డూరంగా ఉందని వీహెచ్ వ్యాఖ్యానించారు.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,694 మంది స్వామిని దర్శించుకున్నారు. 27,350 మంది తలనీలాలు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది.

వైభవంగా పవిత్రోత్సవాలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండో రోజు శనివారం పవిత్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. నిత్య పూజల్లో తెలిసో తెలియకో జరిగే దోషాల పరిహార్థం ఈ ఉత్సవాలను జరిపించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆలయంలోని యాగశాలలో శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చారు. విశేషంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్యం కల్యాణం చేపట్టారు.

కన్నుల పండువగా గజవాహన సేవ



తిరుపతి రూరల్: శ్రీపద్మావతి అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడ పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీపద్మావతి దేవికి అత్యంత వేడుకగా గజవాహన సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆస్థాన మండపంకు వేంచేపు చేశారు. గజవాహనంపై నుంచి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

వేడుకగా శ్రీగోవిందుని పవిత్రోత్సవాలు ప్రారంభం



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజు ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి అక్కడ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్ర ప్రతిష్ఠ చేశారు.

వైభవంగా శుద్ధ ఏకాదశి వేడుక



మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం భాద్రపద శుద్ధ ఏకాదశి వేడుక వైభవంగా జరిగింది. ఏకాదశిని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాములోరి సంస్థాన పూజ అట్టహాసంగా నిర్వహించారు. స్వామిజీ తప్త ముద్రణ చేసుకుని ఏకాదశి ప్రాముఖ్యతను చాటారు. అలాగే ఏకాదశి సందర్భంగా భక్తులకు నిజ రూప బృందావన దర్శనం కల్గింది.

నేటి నుంచి కడప రాయుని పవిత్రోత్సవాలు

కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలను ఆదివారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నామని ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో అంకురార్పణం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, రక్షాబంధన్, మృత్సంగ్రహణం, అఖండ దీపారాధన తదితర పూజలు ఉంటాయని తెలిపారు. 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చతుస్థాన ఆరాధన, ద్వారతోరణ, అనంత కళా పూజ, అగ్నిప్రతిష్ఠ, పవిత్రాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు.

శృంగార వల్లభుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి మిలాదున్ నబీ ఉత్సవాలు



కడప కల్చరల్ : మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జన్మదిన మాసం మిలాదున్ నబీ సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మిలాదున్ నబీ కమిటీ అధ్యక్షులు, మాజీ మంత్రి అహ్మదుల్లా తెలిపారు. శనివారం కడప నగరంలోని కమిటీ కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను సంస్థ ఉపాధ్యక్షులు సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, సహాయ కార్యదర్శి షేక్ నయీమ్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నగరంలోని రహమతుల్లా వీధిలో ఉన్న మీలాద్ ఘర్‌లో జష్నే మీలాదున్ నబీ (సల్లెల్లాహు అలైహి వసల్లం) ఆధ్యాత్మిక సభ నిర్వహిస్తున్నామన్నారు.



కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన

కాకినాడ క్రైం: రిలయన్స్ ఇండస్ట్రీస్ స్వేచ్ఛ పేరుతో నిర్వహిస్తున్న సామాజిక సేవలో భాగంగా శనివారం కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈవో రమేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్, గైనకాలజిస్టు డాక్టర్ లావణ్యకుమారి హాజరయ్యారు.

ఇంజినీర్‌గా ఎదగడానికి విశ్లేషణాత్మక ఆలోచన ముఖ్యం

బాలాజీచెరువు(కాకినాడ): ఇంజినీర్‌గా ఉన్నతంగా ఎదగడానికి విశ్లేషణాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యలను పరిష్కరించడంలో నైపుణ్యం, సమష్టి కృషి వంటి అంశాలు ముఖ్యమని ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక జేఎన్‌టీయుకే ప్రాంగణంలో శనివారం అలూమ్ని ఆడిటోరియంలో ఐఐఐటీ డైరెక్టరేట్, ఫైడా గ్రూప్ ఆఫ్ కాలేజీస్ సంయుక్త ఆధ్వర్యంలో 'బేసిక్ ఇంజినీరింగ్ స్కిల్స్' అనే అంశంపై విద్యార్థులకు ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నాన్‌నీట్‌లో యానాం విద్యార్థినికి ప్రథమ ర్యాంక్



యానాం: 2024-25 విద్యాసంవత్సరానికి గాను నాన్‌నీట్ కోర్సుల్లో యానాంకు చెందిన ఇందుగుల తన్మయి పుదుచ్చేరి రాష్ట్రస్థాయిలో జనరల్ కేటగిరిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఈ మేరకు 98.47 స్కోర్‌ను సాధించిన తన్మయి శనివారం సెంటాక్ సంస్థ విడుదల చేసిన జాబితాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమెకు పుదుచ్చేరిలో రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వెటర్నరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కళాశాలలో సీటు లభించింది. ఈ సందర్భంగా తన్మయిని పలువురు అభినందించారు.

'ఉపాధి' పనుల కోసం కూటమి నేతల సిగపట్లు



ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనుల కోసం ఆధిపత్య పోరు

- ఎమ్మెల్యేల చేతికి గ్రామ సభల ఆమోదం జాబితాలు
- ఏ పనులు ఎవరికి అప్పగించాలో తెలియక ఎమ్మెల్యేల మల్లగుల్లాలు
- జిల్లాల్లో నిధులు తక్కువ.. పనుల ప్రతిపాదనలు ఎక్కువ
- నేతలను సంతృప్తి పరిచే దారిలేక కాలయాపన చేస్తున్న ఎమ్మెల్యేలు

మేడిపల్లి కోటిరెడ్డి, సాక్షి ప్రతినిధి సాక్షి, అమరావతి:

ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కేటగిరి నిధులతో చేపట్టే సిమెంట్ (సీసీ)రోడ్లు, సిమెంట్ మురుగు కాల్వల(సీసీ డ్రెయిన్లు)తో పాటు మట్టి, తారు రోడ్ల పనుల కోసం కూటమి నేతలు సిగపట్లు పట్టుకుంటున్నారు. ఏ పనులు ఏ పార్టీ నేతలకు చేపట్టాలి అనే విషయంలో ఆధిపత్య పోరాటం కొనసాగుతోంది. దీంతో 20 రోజులుగా ఎటూ తేలక అనుమతుల కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. జిల్లాల్లో అందుబాటులో ఉన్న నిధులు పదుల కోట్ల రూపాయలు మాత్రమే ఉంటే.. గ్రామాల నుంచి అందిన ప్రతిపాదనలు వందల కోట్ల రూపాయల మేర ఉండటంతో ఎమ్మెల్యేలకు పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో పనుల మంజూరులో మూడు పార్టీల నాయకులను ఎలా సంతృప్తి పరచాలో తెలియక ఎమ్మెల్యేలు పనుల జాబితాలను ఆమోదం కోసం పంపకుండా కాలయాపన చేస్తున్నారు. ఇక బీజేపీ, జనసేన ఎమ్మెల్యేలున్న చోట కూడా పనులన్నీ తమకే కావాలంటూ టీడీపీ నేతలు పట్టుబడుతున్నారు.

ఉపాధి పథకంలో కాంట్రాక్టర్లే ఉండరు

సాధారణంగా ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులకు, ఇతర అభివృద్ధి పనుల మంజూరు ప్రక్రియకు తేడా ఉంటుంది. కేంద్రం నిబంధన ప్రకారం.. 'ఉపాధి' నిధులతో మంజూరు చేస్తే, రోడ్ల పనులైనా కాంట్రాక్టర్ల వ్యవస్థ ఉండదు. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ ద్వారా నిధులు చెల్లిస్తూ ఆయా పనులు చేపట్టాల్సి ఉంటుంది. దీనికి తోడు జిల్లా ప్రాతిపదికన ఆర్థిక సంవత్సరంలో ఆయా జిల్లాల్లో కూలీల ద్వారా జరిగిన ఉపాధి పనుల ఆధారంగా 60-40 నిష్పత్తిన మెటీరియల్ కేటగిరి నిధులను లెక్కగట్టి, ఆ మేరకే మెటీరియల్ నిధులతో పనులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కూలీలతో సంబంధం ఉండని రోడ్ల పనులను సాధారణంగా మెటీరియల్ కేటగిరి నిధుల నుంచి చేపడతారు. ఈ నిబంధనల మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి మొత్తం రూ. 4,500 కోట్ల మేర ఉపాధి మెటీరియల్ నిధులు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే ఖర్చు పెట్టిన నిధులు పోను, ఇంకా రూ. 1,980 కోట్లు అందుబాటులో ఉంటాయన్న అంచనాతో కొత్తగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మట్టి రోడ్ల పనులను గ్రామాల్లో కూటమి నాయకులకు నామినేషన్ పద్ధతిన మంజూరు చేసే కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం గత నెల 23న రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు.

గ్రామసభ ఆమోదం జాబితాలు ఎమ్మెల్యేల చేతికి..

గ్రామసభలో ఆమోదం పొందిన పనుల జాబితాలను ప్రభుత్వ పెద్దల సూచనతో జిల్లాల అధికారులు స్థానిక ఎమ్మెల్యేలకు అందజేశారు. గ్రామసభలో ఆమోదం పొందిన పనులలో ఎన్ని పనులను ఏ గ్రామానికి ఎంత మొత్తం మేర మంజూరు చేయాలి.. గ్రామానికి మంజూరు చేసిన పనులనూ ఏ పనిని గ్రామంలో ఎవరికి అప్పగించాలన్నది తుది ఆమోదం ఆయా ఎమ్మెల్యేలు తెలపనున్నారు.

నిధులు తక్కువ, ప్రతిపాదనలు ఎక్కువ..

కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో విజయనగరం జిల్లాలో ఇంకా కేవలం రూ. 55 కోట్ల మేర మంజూరుకు అవకాశం ఉండగా.. ఆ జిల్లాలో దాదాపు రూ. 1,000 కోట్లకు పైబడి పనులను మంజూరు చేయాలంటూ అధికారులకు ప్రతిపాదించినట్టు సమాచారం. గుంటూరు జిల్లా మొత్తంలోనూ ప్రస్తుత ఏడాది కేవలం రూ. 10 కోట్ల మేర నిధుల వెసులుబాటు ఉంటుందని అధికారులు తేల్చగా.. తన నియోజకవర్గానికి దక్కే నిధులతో చేపట్టే పనులను టీడీపీ, జనసేన నాయకులకు ఎలా పంచాలో తెలియక తెనాలి ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ కాలయాపన చేస్తున్నట్టు సమాచారం. గోదావరి జిల్లాల్లో ఒక్కో జిల్లాకు కేవలం రూ. 15 కోట్ల నుంచి రూ. 50 కోట్ల మధ్య నిధులు అందుబాటులో ఉండగా.. టీడీపీ, జనసేన నేతల పోటీతో ఒక్కో నియోజకవర్గం నుంచే రూ. 20 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మేర పనులకు ప్రతిపాదనలు ఎమ్మెల్యేలకు చేరుతున్నట్టు సమాచారం. ఇక నిడదవోలు నియోజకవర్గంలో రూ. 11 కోట్లు పనులను స్థానిక నేతలకు కాకుండా ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి కందుల దుర్గేష్ తన సొంత రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి చెందిన నేతలకు పనులు అప్పగిస్తున్నట్లు తెలిసింది. అనకాపల్లి జిల్లాలో రూ. 120 కోట్ల వరకు నిధులు అందుబాటులో ఉండగా.. తమ నియోజకవర్గాలకే ఎక్కువ వాటా కావాలంటూ జనసేన, టీడీపీ ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

సీఎంకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు విజ్ఞప్తి



సచివాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణరావు తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సచివాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీపీఎస్సీకి వెంటనే చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2008 డీఎస్సీ మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని, గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62ఏళ్లకు పెంచాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పర్కిరించాలని, మరణించిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు జనరల్ పూల్ నుంచి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

సీనియార్టీ ప్రకారం పదోన్నతుల కల్పించాలి

విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

చిత్తూరు (కార్పొరేషన్): విద్యుత్ ఉద్యోగులకు సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని ఆ శాఖ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరులో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, డిస్కం నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉంటూ డిమాండ్ల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంతో కష్టపడి విద్యుత్ శాఖలో కొలువులు సాధించామని గుర్తు చేశారు. కానీ.. ఓసీ ఉద్యోగులకు పదోన్నతి కలగా మారుతోందన్నారు. సీనియార్టీ ప్రకారం పదోన్నతి లభించడం లేదన్నారు. తమ తర్వాత ఉద్యోగంలో చేరిన ఇతర కేటగిరికు చెందిన ఉద్యోగులు కొందరు ఉన్నత స్థాయికి వెళుతున్నారన్నారు. క్యాచ్ అప్ విధానం అమల్లోకి వస్తే ఓసీ ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు.

కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర, డిస్కం కార్యవర్గాన్ని ఈసందర్భంగా ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీధర్‌వర్మ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పండుదొర, కార్యదర్శులుగా పరిపాలనకు వెంకటేశ్వర్లు, ఆర్థికపరంగా సురేష్‌కుమార్, సమన్వయానికి మురళీకృష్ణను ఎంపిక చేసుకున్నారు. డిస్కం అధ్యక్షుడిగా వాసుదేవరెడ్డి, కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షుడిగా గంటారావు, కోశాధికారిగా వసంతనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వృద్ధ దంపతుల ప్రాణం తీసిన వానరం!

- ఇంటి నుంచి టీ ప్యాకెట్ పట్టుకుపోయి.. మందు గుళికల ప్యాకెట్ తెచ్చి పడేసిన కోతి
- ఆ ప్యాకెట్‌తో టీ కాచుకుని తాగిన వృద్ధులు మృతి





రాజానగరం: ఓ కోతి చేసిన పనికి వృద్ధ దంపతులు కన్నుమూశారు. రాజానగరం మండలంలోని పల్లకడియం గ్రామానికి చెందిన వెలుచూరి గోవిందు (75), అప్పాయమ్మ (70) దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కుమారుడు తన పిల్లల చదువు కోసం కుటుంబంతో సహా రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలు చేశారు. గోవిందు, అప్పాయమ్మ మాత్రమే తమ ఇంట్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గోవిందు, అప్పాయమ్మల ఇంటి నుంచి ఒక టీ పొడి ప్యాకెట్‌ను కోతి ఎత్తుకుపోయింది. మరుసటి రోజు శుక్రవారం ఉదయం వేరొక ఇంటి నుంచి పంటలకు ఉపయోగించే విష గుళికల మందు ప్యాకెట్‌ను తీసుకువచ్చి వీరి ఇంటి పెరటిలో పడేసింది. కళ్లు సరిగా కనిపించని అప్పాయమ్మ పెరటిలో పడి ఉన్న ప్యాకెట్‌ను తన ఇంటి నుంచి కోతి తీసుకువెళ్లిందేనని భావించి దానితో టీ పెట్టింది. ఆ టీని తన భర్తకు ఇచ్చి, తాను కూడా తాగింది. కొద్దిసేపటికే వారిద్దరూ నోటి నుంచి నురుగులు కక్కుతూ పడిపోయారు. ఇరుగు పొరుగువారు చూసి హుటాహుటిన రాజమహేంద్రవరం ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మరణించారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పరిశ్రమల శాఖ తాత్కాలిక కమిషనర్‌గా ఏపీఐఐసీ ఎండీ

సాక్షి, అమరావతి: పరిశ్రమల శాఖ కమిషనర్ శ్రీధర్ చేకూరి వ్యక్తిగత పనులపై సెలవు పెట్టడంతో తాత్కాలిక కమిషనర్‌గా ఏపీఐఐసీ వీసీ ఎండీ అభిషిక్త్ కిషోర్‌కు అప్పగిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 13 నుంచి 16 వరకు పరిశ్రమల శాఖ కమిషనర్‌గా అభిషిక్త్ కిషోర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వలంటీర్లకు రాజేంద్రప్రసాద్ క్షమాపణలు చెప్పాలి

గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: గత ఐదు సంవత్సరాల కాలంలో ప్రజలకు విశేష సేవలందించిన వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతున్న టీడీపీ మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ వెంటనే క్షమాపణ చెప్పాలని గ్రామ వార్డు వలంటీర్ల సంఘం (వివిధ సంఘాల్లో ఒకటి) అధ్యక్షుడు షేక్ హుమాయున్ బాషా ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుట్రతోనే ఇలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. భారతదేశంలోనే సువర్ణ అక్షరాలతో లిఖించాల్సిన వ్యవస్థ ఏదైనా ఉందంటే అది.. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన వలంటీర్ వ్యవస్థేనని పేర్కొన్నారు. సర్పంచుల స్వార్థం కోసం 2,60,000 మంది వలంటీర్ల కడుపు మీద కొడతారా అని ప్రశ్నించారు. తక్షణమే రాజేంద్రప్రసాద్ తన మాటలను వెనక్కు తీసుకుని, క్షమాపణ చెప్పాలని..లేనిపక్షంలో తాము ఉద్యమ బాట పడతామని షేక్ హుమాయున్ బాషా హెచ్చరించారు.

శ్రీశైలం దేవస్థానం పేరుతో ఫేక్ వెబ్‌సైట్లు

వసతి గదుల బుకింగ్‌లో డూప్లి'కేటు గాళ్లు'

- రాజస్థాన్, జైపూర్ నుంచి ఆపరేషన్
- ఏపీ టూరిజం, ప్రైవేట్ రూమ్‌లపైనా టార్గెట్
- నమ్మి మోసపోతున్న భక్తులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న దేవస్థానం అధికారులు




శ్రీశైలం టెంపుల్: శ్రీశైలానికి వచ్చే భక్తులపై సైబర్ నేరగాళ్లు వల వేశారు. ఆన్‌లైన్‌లో గదుల బుకింగ్ కోసం వెతికేవారే టార్గెట్‌గా డూప్లికేట్ వెబ్‌సైట్లు సృష్టించి పెద్ద మొత్తంలో డబ్బులు కొట్టేస్తున్నారు. అచ్చం శ్రీశైలం దేవస్థానం అధికారక వెబ్‌సైట్‌ను పోలి ఉండే ఫేక్ వెబ్‌సైట్ సృష్టించారు. అందులో వివరాలు నింపగానే సంబంధిత భక్తులకు ఫోన్ చేసి.. ×వసతి గది కోసం మీరు చేసుకున్న బుకింగ్ కన్ఫర్మ్ అయింది. మీరు వెంటనే మా ఫోన్ నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ఇతర యూపీఐ పేమెంట్ ఆప్షన్లతో డబ్బు చెల్లించండి. ఆ తర్వాత మీ గది బుకింగ్ డిటెయిల్స్ పంపిస్తాం¥ అంటూ సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగుతారు. పేమెంట్ చేశాక ఫేక్ బుకింగ్ నంబర్లు పంపి మోసం చేస్తున్నారు. వాస్తవానికి వసతి గది కోసం దేవస్థానం కానీ, ఇక్కడి ప్రైవేట్ సత్రాలు, ఏపీ టూరిజం వారు కానీ పేమెంట్ కోసం ఫోన్ చేయరు. పేమెంట్ అంతా ఆన్‌లైన్ గేట్‌వే ద్వారానే జరుగుతుంది. శ్రీశైల క్షేత్రంలో ఆర్జిత సేవ టికెట్లు, వసతి గదుల విషయంలో దళారులు అధికమయ్యారు. వారికి అడ్డుకట్ట వేసేందుకు దేవస్థానం ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ (మల్లన్న స్పర్శ దర్శనం) టికెట్లను వందశాతం ఆన్‌లైన్ చేసింది. అలాగే వసతి గదులను సైతం ఎక్కువ శాతం ఆన్‌లైన్ ద్వారానే కేటాయిస్తున్నారు. ఇదే అసరాగా సైబర్ నేరగాళ్లు భక్తులను మోసగిస్తున్నారు.

అసలైన వెబ్‌సైట్లను గుర్తించండిలా..

- శ్రీశైల దేవస్థానం అధికారికంగా www.srisailadevasthanam.org (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జీ) వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. ఈ వెబ్‌సైట్ ద్వారా ఆర్జితసేవలు, దర్శనం టికెట్లు, వసతి గదులు పొందవచ్చు.
- అలాగే aptemples.ap.gov.in (ఏపీటెంపుల్స్.ఏపీ.జీవోవీ.ఇన్) ద్వారా కూడా లాగిన్ అయి శ్రీశైల దేవస్థానం వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమకు కావాల్సిన సేవలను, వసతి గదులను పొందవచ్చు.
- అలాగే srisailadevasthanam (శ్రీశైలదేవస్థానం) మొబైల్ యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా ఇన్‌స్టాల్ చేసుకుని తద్వారా ఆయా సేవలను పొందవచ్చు.



శ్రీశైలం గంగాసదన్ పేరుతో ఫేక్ఐడీ



శ్రీశైలం మల్లికార్జున సదన్ పేరుతో నకిలీ వెబ్‌సైట్



ఏపీ టూరిజం పేరుతో నకిలీ వెబ్‌సైట్

భక్తులు అప్రమత్తంగా ఉండాలి



శ్రీశైల దేవస్థాన వెబ్‌సైట్లను పోలిన నకిలీ వెబ్‌సైట్ల పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలి. కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉన్నవారు మాత్రమే స్వయంగా వసతి, ఆర్జిత సేవా టికెట్లను పొందాలి. కంప్యూటర్ పరిజ్ఞానం లేనివారు కంప్యూటర్ సెంటర్లను ఆశ్రయించి ఆయా సేవలను పొందితే ఫేక్ ఐడీల బారిన పడకుండా ఉండవచ్చు. – డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

ఏపీ టూరిజంకూ తప్పని బెడద

భక్తుల సౌకర్యార్థం వీఐపీ కాటేజీలు, గణేశ సదన్, మల్లికార్జున సదన్, గంగా-గౌరీ సదన్, కుమార సదన్, పాతాళేశ్వరసదన్ తదితర పేర్లతో వసతి గదులను శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసింది. వీటి బుకింగ్ విషయంలో భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు ఆన్‌లైన్ సదుపాయాన్ని కల్పించింది. సైబర్ నేరగాళ్ల ముఠాగా ఏర్పడి దేవస్థానం వసతి గదుల పేర్లతో సమానంగా నకిలీ వెబ్‌సైట్లు తయారుచేసి వాటి ద్వారా భక్తులను మోసం చేస్తున్నారు. కేవలం దేవస్థానానికి మాత్రమే కాకుండా శ్రీశైలంలో ఉన్న ఏపీ టూరిజం, శ్రీశైలంలోని ప్రైవేట్ సత్రాలకు సైతం ఫేక్ వెబ్‌సైట్ల బెడద తప్పడం లేదు. ఆయా సంస్థల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు తయారు చేసి డబ్బు వసూలు చేస్తున్నారు. ఫేక్ వెబ్‌సైట్లను ఆశ్రయించి డబ్బు చెల్లించిన భక్తులు శ్రీశైలం వచ్చి సదరు సంస్థ రిసెప్షన్‌లో వారికి వచ్చిన మెసేజీను చూపించగా అది ఫేక్ అని తేలిపోతుండటంతో లబోదిబో మంటున్నారు. ఆ తర్వాత గదులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. సైబర్‌క్రైం పోలీసులు నకిలీ ఐడీలపై విచారణ చేయగా రాజస్థాన్, జైపూర్ వాటిని ఆపరేట్ చేస్తున్నట్లుగా గుర్తించారు.



● రామ్‌చరణ్

ఐఫా-2024 ఉత్సవానికి అతిథిగా రామ్‌చరణ్



● సమంత

ఐఫా (ఇంటర్‌నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ) – 2024 ఉత్సవం సందడి మొదలైంది. ఈ నెల 27న ఈ ఉత్సవం దుబాయ్‌లోని అబుదాబిలో జరగనుంది. ఈ నెక్సా 'ఐఫా-2024' ఉత్సవంలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ ఇండస్ట్రీలోని నటీనటులకు అవార్డులను అందిస్తారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా రామ్‌చరణ్ పాల్గొంటారు. తెలుగు నుంచి రానా, తేజా సజ్జా వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తారు. ఈ ఉత్సవంలో 'అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' అవార్డును చిరంజీవికి ప్రదానం చేయనున్నట్లు టాక్. 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డును సమంత అందుకోనున్నట్లు అధికారికంగా వెల్లడైంది.

'మాస్టారు మాస్టారు నా మనసును గెలిచారు...' అంటూ 'సార్' సినిమాలో మాస్టారు (ధనుష్)తో ప్రేమలో పడ్డారు హీరోయిన్ సంయుక్త. ఆ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ప్రేమను పొందారు ఈ మలయాళ బ్యూటీ. ప్రస్తుతం తెలుగులో 'స్వయంభూ', హిందీలో 'మహారాజ్ఞి' తదితర చిత్రాల్లో నటిస్తున్నారామె. ఇక 'సాక్షి'తో సంయుక్త పంచుకున్న విశేషాల్లో కొన్ని ఈ విధంగా...

ఒక్కసారి ఫిక్స్ అయితే ఎంత కష్టపడటానికైనా రెడీ!



● సంయుక్త మీనన్

కేరళ టు హైదరాబాద్ షిఫ్ట్ అయినట్లున్నారు?

ఈ మధ్య వరుసగా తెలుగులో నాలుగైదు సినిమాలు సైన్ చేశాను. ఇక్కడే ఉంటే బాగుంటుందని ముందు సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఉండటం మొదలు పెట్టాను. మా అమ్మగారు కూడా నాతో పాటే ఉండాలనుకున్నారు. మా ఇంట్లో కుక్క పిల్లలు ఉన్నాయి. అమ్మా, నేను, కుక్కపిల్లలు... ఇదే నా ప్రపంచం. వాళ్లను విడిచి ఉండలేను. అందుకే ఇప్పుడు ఒక ఫ్లాట్ తీసుకుని, వాళ్లని కూడా హైదరాబాద్ తీసుకొచ్చేశాను.

* * *

మలయాళంలో చేసిన ఫస్ట్ మూవీ 'పాప్‌కార్న్' (2016) చూసి, మీకు నటించడం రాదని కొందరు అన్నారు... మీకూ అలా అనిపించిందా?

ఇప్పుడైతే ఇంకా బాగా నటించి ఉండేదాన్ని అనిపిస్తుంటుంది. యాక్టింగ్‌ని నా కెరీర్‌గా అనుకోలేదు. సినిమాకి అవకాశం వచ్చింది. 'ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయి.. ఒప్పుకో' అని మా అమ్మగారు అన్నారు. 'సరే' అన్నాను. అప్పుడు నా వయసు 19, 20 ఏళ్లు ఉండి ఉంటాయి. ప్రపంచం గురించి పెద్దగా అవగాహన లేదు. షూటింగ్ లొకేషన్‌కి వెళ్లాక, అక్కడ రెండు కెమెరాలు ఉండటం చూసి రెండు ఎందుకు? ఉన్నాయా అనిపించింది. రెండు సైడ్స్ నుంచి షూట్ చేస్తారనే కనీస అవగాహన కూడా లేదు నాకు. పైగా బాగా బిడియస్తురాల్ని. మా కుటుంబానికి చెందినవాళ్లెవరూ సినిమాల్లో లేరు. షూటింగ్ వాతావరణం మొత్తం చాలా అసౌకర్యంగా అనిపించింది. ఏదో నటించామంటే నటించాం అన్నట్లు చేశాను. 'సినిమాలు మన వల్ల కాదు' అని, చదువుకోవాలని డిసైడ్ అయిపోయాను. కానీ ఆ తర్వాత 'తీవండి, లిల్లీ' అనే సినిమాలకు అవకాశం వస్తే, ఒప్పుకున్నాను. 'లిల్లీ' లేడీ ఓరియంటెడ్ మూవీ కావడంతో సవాల్ అనిపించింది. సినిమా విధానాన్ని నేను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది 'లిల్లీ'తోనే. 'మనం నటించగలం' అనే నమ్మకం కలిగింది కూడా ఆ సినిమాతోనే.

* * *

'సినిమాలు మన వల్ల కాదు' అనుకున్నానని ఇంతకుముందు అన్నారు. లైఫ్‌లో ఏదైనా విషయంలో 'వల్ల కాదు' అంటే అలా సింపుల్‌గా వదిలేస్తారా?

సింపుల్‌గా వదిలేయడం కూడా నా వల్ల కాదు. మనం ఎందుకు చేయలేం అనే ఆలోచన కూడా కలుగుతుంది. అయితే ఫస్ట్ మూవీకి నాకు సినిమా అంటే అర్థం కాలేదు. అర్థం కాని విషయం గురించి ఆలోచించడం ఎందుకని సినిమాలు వదిలేద్దామనుకున్నాను. 'లిల్లీ' చేసేటప్పుడు కాస్త అర్థమైంది. దాంతో కంటిన్యూ అవ్వాలని నిర్ణయించుకున్నాను. ఏదైనా విషయాన్ని సాధించాలని నేను ఒక్కసారి ఫిక్స్ అయితే ఎంత కష్టపడటానికైనా రెడీ అయిపోతా. పైగా ఫస్ట్ మూవీ తర్వాత నేను సినిమాలకు దూరంగా ఉండాలనుకున్నప్పుడు ఇంకోటి ఎందుకు చేయడంలేదు? అని చుట్టూ ఉన్నవాళ్లు అనుకున్నారు. అప్పుడు సినిమా అనేది వర్ల్ పూల్ లాంటిదని అర్థమైంది. ఒక్కసారి వస్తే వెనక్కి వెళ్లలేం. ఫెయిల్యూర్‌గా మిగిలిపోవడం ఇష్టం లేక రెండో సినిమా 'తీవండి' ఒప్పుకున్నాను. ఆ తర్వాత 'లిల్లీ' చేశాను. ఈ సినిమాతో ఇండస్ట్రీలో ఉండాలని ఫిక్స్ అయిపోయాను.

* * *

మొదట్లో అసౌకర్యంగా అనిపించిందని అన్నారు... ఇండస్ట్రీలో కొందరికి ఎదురయ్యే 'క్యాస్టింగ్ కౌచ్'లాంటిది ఏమైనా...

అలా ఏం లేదు. ఆ విషయంలో నేను లక్కీ. సినిమా మేకింగ్ ప్రాసెస్ అర్థం కాకపోవడంవల్లే వెళ్లిపోదామనుకున్నాను. ఒకవేళ క్యాస్టింగ్ కౌచ్‌లాంటి చేదు అనుభవం ఎదురై ఉంటే... అప్పటికప్పుడే అడిగే దాన్ని. ఇంట్లో ఏడ్చేసి, ఆ తర్వాత ఎప్పటికో ఆ విషయాన్ని బయటపెట్టేదాన్ని కాదు. మలయాళంలో నా ఫస్ట్ మూవీ నుంచి తెలుగు, తమిళంలో నాకన్నీ మంచి ప్రొడక్షన్ హౌస్‌లే దొరికాయి.

* * *

'మహారాజ్ఞి'తో హిందీకి కూడా వెళుతున్నారు... భాష తెలియకపోతే నటనకు న్యాయం చేయలేనని తెలుగు నేర్చుకున్నానని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మరి... హిందీ వచ్చా?

స్కూల్‌లో హిందీ ల్యాంగ్వేజ్ ఉండటంతో రాయడం, చదవడం వచ్చు. అయితే అనర్గళంగా మాట్లాడలేను. అందుకే తెలుగుకి ట్యూటర్‌ని పెట్టుకున్నట్లు హిందీకి కూడా పెట్టుకున్నాను. భాష నేర్చుకోవడం అంటే డైలాగ్స్ బట్టీ పట్టి ఆ సినిమా వరకు చెప్పడం వరకే అనుకోను. విడిగా కూడా తెలుగు మాట్లాడాలనుకున్నాను. అందుకే గ్రామర్ కూడా తెలుసుకోవాలని ట్యూటర్ పెట్టుకున్నాను. స్కూల్‌కి వెళ్లేటప్పుడు నోట్ బుక్ ఉంటుంది కదా.. అలాంటి నోట్‌బుక్ పెట్టుకుని, భాషలు నేర్చుకుంటున్నాను. మనం ఒక జాబ్ చేస్తున్నామంటే పూర్తి న్యాయం చేయాలన్నది నా అభిప్రాయం.



● 'కంగువ' పోస్టర్

నవంబరులో కంగువ?

సూర్య హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువ'. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, యోగిబాబు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. శివ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాను దసరా సందర్భంగా అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లుగా చిత్రబృందం ప్రకటించింది. కానీ అదే తేదీకి రజనీకాంత్ 'వేట్టయాన్' సినిమా కూడా రిలీజ్‌కు సిద్ధం అవ్వడంతో, 'కంగువ' రిలీజ్ వాయిదా పడింది. రజనీకాంత్ సినిమాతో బాక్సాఫీస్ పోటీ ఇష్టం లేక, ఆయన మీద గౌరవంతో తన సినిమాను వాయిదా వేస్తున్నట్లుగా సూర్య ఓ సినిమా వేడుకలో చెప్పారు. ఆ తర్వాత మరో సందర్భంలో రజనీకాంత్ ఇందుకు థ్యాంక్స్ కూడా చెప్పారు. మరి... 'కంగువ' ఎప్పుడు రిలీజ్ కానుందనే చర్చ కోలీవుడ్‌లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో నవంబరు 15న ఈ సినిమాను విడుదల చేయడానికి యూనిట్ సన్నాహాలు చేస్తోందనే టాక్ తెర పైకి వచ్చింది. వార్తల్లో ఉన్నట్లు 'కంగువ' విడుదల నవంబరు 15కే ఫిక్సా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక రెండు విభిన్న కాలమానాల్లో ఈ చిత్రం ఉంటుందని, సూర్య ఐదారు గెటప్స్‌లో కనిపిస్తారని, ఈ సినిమాకు రెండో భాగం కూడా ఉందనే టాక్ కోలీవుడ్‌లో ఎప్పట్నుంచో ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే.



● మంజు వారియర్

కమింగ్ సూన్



● 'తుంబాడ్' పోస్టర్

హిందీ హారర్ హిట్ ఫిల్మ్ 'తుంబాడ్' గుర్తుండే ఉంటుంది. 2018లో విడుదలైన ఈ చిత్రం ఆడియన్స్‌ను బాగా ఆకర్షించింది. ఈ నెల 13న ఈ సినిమాను రీ – రిలీజ్ కూడా చేశారు మేకర్స్. అయితే రీ-రిలీజ్ సమయంలో 'తుంబాడ్'కు సీక్వెల్ వస్తుందని వెల్లడించి, ఈ సినిమాను త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. సోహమ్ షా, జ్యోతి మల్ష్, రుద్ర సోనీ, మాధవ్ హరిజోషి, మహమ్మద్ సమద్ (ఈ సినిమాలో చైల్డ్ ఆర్టిస్టు) లు 'తుంబాడ్' సినిమాలో లీడ్ రోల్స్‌లో నటించగా, రాహి అనిల్ భార్వే దర్శకత్వం వహించారు. 'తుంబాడ్' సీక్వెల్‌లో కూడా సోహమ్ షాయే లీడ్ రోల్ చేసే అవకాశం ఉంది. ఇక మహారాష్ట్రలోని తుంబాడ్ అనే గ్రామంలోని ఓ నిధి అన్వేషణతో 'తుంబాడ్' కథ సాగుతుంది. అత్యాశ ఓ మనిషిని ఎలా నాశనం చేస్తుందనే సందేశం కూడా ఈ సినిమాలో కనిపిస్తుంది. మరి... 'తుంబాడ్ 2'లో ఏ అంశాన్ని టచ్ చేస్తారో చూడాలి.

మేం షాక్ అయ్యాం!

– సునీత



● భర్త గోవిందాతో సునీత

అభిమాన నటీనటులను కలవాలని, వారితో మాట్లాడాలని, ఫొటోలు దిగాలని అభిమానులు కోరుకుంటుంటారు. అభిమాన నటీనటులను ఎలాగైనా కలిసేందుకు ఫ్యాన్స్ రకరకాల మార్గాలు వెతుక్కుంటారు. తన అభిమాన హీరో, బాలీవుడ్ నటుడు గోవిందాని కలిసేందుకు ఓ అమ్మాయి ఏకంగా పని మనిషిగా ఆయన ఇంట్లో చేరారట. ఈ విషయాన్ని గోవిందా సతీమణి సునీత తాజాగా బయటపెట్టారు. ''గోవిందాగారి కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడు ఆయనకు ఎంతో మంది అభిమానులు ఉండేవారు. ఆ ఫాలోయింగ్ చూసి సంతోషపడేదాన్ని. ఆయన్ని చూసేందుకు, కలిసేందుకు ఫ్యాన్స్ విచిత్రమైన పనులు చేసేవారు. మా పెళ్లయిన కొత్తలో మా ఇంటికి ఒక అమ్మాయి వచ్చి, పని మనిషిగా చేరింది. దాదాపు 20 రోజులు మాతోనే ఉంది. తనకు పాత్రలు కడగటం, ఇల్లు క్లీన్ చేయడం కూడా సరిగ్గా రాదు. షూటింగ్స్ నుంచి ఆలస్యంగా వచ్చే ఆయన్ని చూడటం కోసం తను నిద్ర మానుకుని ఎదురు చూస్తూ ఉండేది. తన రూపురేఖలు, ప్రవర్తన చూస్తే ఉన్నత కుటుంబానికి చెందిన అమ్మాయిలా అనిపించింది. ఇదే విషయాన్ని మా అత్తయ్యతోనూ చెప్పా. ఇంతకీ నువ్వు ఎవరు? నీ నేపథ్యం ఏంటి? అని కాస్త గట్టిగా అడిగితే.. కన్నీళ్లు పెట్టుకుని నా భర్త గోవిందాకి తను వీరాభిమాని అని అసలు సంగతి బయట పెట్టింది. ఆ తర్వాత తన ఇంట్లో వాళ్లకు సమాచారం ఇచ్చాం. ఆమె తండ్రి నాలుగు ఖరీదైన కార్లలో మా ఇంటికి వచ్చారు. ఆయన ఓ మంత్రి అని తెలిసి షాక్‌కి గురయ్యాం'' అని సునీత పేర్కొన్నారు.



● ఆలియా భట్



● దిల్జీత్

ఎనిమిదేళ్ల తర్వాత...

హీరోయిన్ ఆలియా భట్, నటుడు–గాయకుడు–నిర్మాత దిల్జీత్ సింగ్ ఎనిమిదేళ్ల తర్వాత కలిసి ఓ సినిమా చేస్తున్నారు. ఆలియా భట్ ప్రధాన పాత్రలో వేదంగ్ రైనా మరో లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'జిగ్రా'. వాసన్ బాల దర్శకత్వంలో కరణ్ జోహార్, ఆలియా భట్, అపూర్వ మెహతా, షాహీన్ భట్, సౌమెన్ మిశ్రా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబరు 11న విడుదల కానుంది. కాగా ఈ సినిమాకు దిల్జీత్ సింగ్ వర్క్ చేస్తున్నట్లుగా ఇన్‌స్టా వేదికగా ఆలియా భట్ పేర్కొన్నారు. అయితే దిల్జీత్ సింగ్ ఓ పాట పాడనున్నారా లేక పాటతో పాటు గెస్ట్ రోల్ కూడా చేస్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక 2016లో వచ్చిన 'ఉడ్తా పంజాబ్' సినిమాలో ఆలియా భట్, దిల్జీత్ సింగ్ లీడ్ రోల్స్‌లో నటించగా, షాహిద్ కపూర్ హీరోగా నటించిన విషయం తెలిసిందే.

డబుల్ హ్యాపీ

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'వేట్టయాన్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీని టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు. ఇందులో అమితాబ్ బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, మంజు వారియర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. 'వేట్టయాన్' చిత్రం దసరా సందర్భంగా అక్టోబరు 10న రిలీజ్ కానుంది. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి 'మెరుపై వచ్చాడే' అంటూ సాగే 'మనసిలాయో...' సాంగ్ విడుదలైంది. ఈ పాటకు శ్రోతల నుంచి మంచి స్పందన లభించింది. అంతేకాదు... ఈ పాటలో అదిరిపోయే స్టెప్పులేసి మంజు వారియర్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచారు. ఇక 'వేట్టయాన్' సినిమాలో తన పాత్ర గురించి మంజు వారియర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ– ''మనసిలాయో...' పాటకు శ్రోతల నుంచి మంచి రెస్పాన్స్ వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి సెలబ్రేషన్ సాంగ్‌ను నేను చాలా సినిమాల్లో చూశాను. ఇప్పుడు ఈ తరహా సాంగ్‌లో డ్యాన్స్ చేయడం నాకు చాలా సరదాగా అనిపించింది. అంతమంది డ్యాన్సర్స్ సెట్స్‌లో ఉన్నప్పుడు ఒకే రిథమ్‌లో హుక్ స్టెప్ చేయడం నాకు చాలా బాగా అనిపించింది. అలాగే అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్‌లో నేను చేసిన తొలి పాట కూడా ఇదే. ఇక జ్ఞానవేల్ గారి 'జై భీమ్' సినిమా చూసిన తర్వాత ఆయన దర్శకత్వంలో ఓ సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఆ సమయంలో 'వేట్టయాన్' సినిమాతో ఆయన నన్ను అప్రోచ్ అయ్యారు. పైగా రజనీకాంత్‌గారు కూడా ఉంటారని చెప్పారు. దీంతో డబుల్ హ్యాపీ ఫీలయ్యాను. రజనీగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ఈ చిత్రంలో నేను రజనీగారి భార్య తారగా కనిపిస్తాను. ఇంకా విజయ్ సేతుపతి 'విడుదలై 2', మోహన్‌లాల్ 'ఎల్: ఎంపురాన్' (లూసిఫర్ సీక్వెల్) చిత్రాల్లో నటిస్తున్నాను'' అన్నారు. ఇక అక్టోబరులో 'వేట్టయాన్'తో, డిసెంబరులో 'విడుదలై 2'తో రెండు నెలల గ్యాప్‌తో తెరపై కనిపిస్తారు మంజు.



● రణ్‌బీర్ కపూర్



● విక్కీ కౌశల్

లవ్ అండ్ వార్ వాయిదా

బాలీవుడ్‌లో 'లవ్ అండ్ వార్' వాయిదా పడింది. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ లీడ్ రోల్స్‌లో నటించనున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. 'లవ్ అండ్ వార్' చిత్రాన్ని ఈ ఏడాది జనవరిలో ప్రకటించి, 2025 క్రిస్మస్ సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. కానీ ఈ సినిమా చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభం కానుందని బాలీవుడ్ సమాచారం. కానీ 'లవ్ అండ్ వార్' రిలీజ్‌ను మాత్రం వాయిదా వేశారు. 2026 మార్చి 20న ఈ చిత్రం విడుదల కానుంది. ఇదో పీరియాడికల్ ఫిల్మ్ అని, ముక్కోణపు ప్రేమకథగా ఉంటుందని సమాచారం. అలాగే వివాహం తర్వాత రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ కలిసి నటించనున్న చిత్రం కావడంతో 'లవ్ అండ్ వార్' పై అంచనాలు ఉన్నాయి.

బిజినెస్ రీల్

రీఎంట్రీ ప్రణాళికల్లో ఫోర్డ్

ఎగుమతుల కోసం
చెన్నై ప్లాంటులో కార్ల ఉత్పత్తి యోచన



చెన్నై: రెండేళ్ల క్రితం భారత్ నుంచి నిష్క్రమిస్తున్నట్లుగా ప్రకటించిన అమెరికన్ కార్ల దిగ్గజం ఫోర్డ్ మరోసారి ఎంట్రీకి సిద్ధమవుతోంది. ఎగుమతుల కోసం కార్లను ఉత్పత్తి చేసేందుకు చెన్నైకి దగ్గర్లోని తమ ప్లాంటును ఉపయోగించుకునే యోచనలో ఉంది. దీనికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వానికి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాన్ని సమర్పించింది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించాయని తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తెలిపారు. దాదాపు మూడు దశాబ్దాల కార్యకలాపాల తర్వాత 2021లో ఫోర్డ్ భారత్‌లో తమ కార్ల విక్రయాలను నిలిపివేసింది. చెన్నైలో కంపెనీకి చెందిన గ్లోబల్ బిజినెస్ సెంటర్‌లో ప్రస్తుతం 12,000 మంది ఉద్యోగులు ఉండగా, వచ్చే మూడేళ్లలో దీనికి మరో 2,500–3,000 సిబ్బంది జతకావచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి.

గణేశ ఎకోస్ఫియర్‌తో రేస్ ఎకోచైన్ జట్టు



హైదరాబాద్: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలోని ప్రముఖ కంపెనీ రేస్ ఎకో చైన్ లిమిటెడ్, పెట్ రీసైక్లింగ్ కంపెనీ అయిన గణేశ ఎకోస్ఫియర్ లిమిటెడ్‌తో కలసి 'గణేశ రీసైక్లింగ్ చైన్ ప్రైవేటు లిమిటెడ్' పేరుతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. గణేశ ఎకోస్ఫియర్‌తో జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకునేందుకు బోర్డు సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్టు రేస్ ఎకో చైన్ ప్రకటించింది. జాయింట్ వెంచర్ ఒప్పందం ఇంకా ఖరారు కావాల్సి ఉందని స్పష్టం చేసింది. ఈ జాయింట్ వెంచర్‌లో రేస్ ఎకోచైన్‌కు 51 శాతం, గణేశ ఎకోస్ఫియర్‌కు 49 శాతం చొప్పున వాటాలు ఉంటాయని తెలిపింది. ఏర్పాటైన తర్వాత కంపెనీ సబ్సిడరీగా మారుతుందని పేర్కొంది. పెట్ బాటిళ్లను తిరిగి వినియోగించతగిన ఫ్లేక్స్‌గా మార్చేందుకు పలు వాషింగ్ లైన్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. దేశంలో పెట్ బాటిళ్ల రీసైక్లింగ్‌కు పెరుగుతున్న డిమాండ్ అవసరాలను ఈ జాయింట్ వెంచర్ తీర్చగలదని వివరించింది.

మూన్‌షైన్ టెక్‌లో నజారాకు భారీ వాటా

47.7 శాతం వాటా కొనుగోలుకి రెడీ



న్యూఢిల్లీ: ఈస్పోర్ట్స్ కంపెనీ నజారా టెక్నాలజీస్ తాజాగా మూన్‌షైన్ టెక్నాలజీలో భారీగా ఇన్వెస్ట్ చేయనుంది. రియల్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్ పోకర్‌బాజికి మాతృ సంస్థ ఇది. ఇందుకు మూన్‌షైన్‌తో నజారా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పోకర్‌బాజిలో మొత్తం రూ. 982 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు నజారా పేర్కొంది. తొలుత 47.7 శాతం వాటా కొనుగోలుకి రూ. 831.5 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు రూ. 592.26 కోట్లు నగదు రూపేణా చెల్లించనుంది. షేర్ల మార్పిడి ద్వారా మరో రూ. 239.25 కోట్లు కేటాయించనుంది. ఈ నేపథ్యంలో బాజి గేమ్స్ సీఈవో, వ్యవస్థాపకుడు నవ్‌కిరణ్ సింగ్‌కు నజారా టెక్నాలజీస్‌లో 3.17 శాతం వాటా లభించనుంది. మరోవైపు ఒప్పందంలో భాగంగా పూర్తిస్థాయిలో ఈక్విటీగా మార్పిడికి లోనయ్యే సెక్యూరిటీలలో నజారా రూ. 150 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. వెరసి ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ పోకర్‌బాజిపై నజారా రూ. 982 కోట్లు వెచ్చించనుంది.

వాటా కొనుగోలు వార్తలతో నజారా టెక్ షేరు బీఎస్ఈలో శుక్రవారం 4.3 శాతం జంప్‌చేసి రూ. 1,050 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-9-2024	
విశాఖ	535–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

బయోఎకానమీ విలువ జూమ్



- 2023 చివరకు 151 బిలియన్ డాలర్లు
- జీడీపీలో 4.25 శాతం
- 2014లో కేవలం 10 బిలియన్ డాలర్లు

దేశీయంగా బయోఎకానమీ గతకొన్నేళ్లలో భారీగా పురోగమించినట్లు బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బైరాక్) తాజా నివేదిక పేర్కొంది. దీంతో 2023 చివరికల్లా దేశీ బయోఎకానమీ విలువ 151 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 12,66,900 కోట్లు)కు చేరుకున్నట్లు తెలియజేసింది. జాతీయ పురోభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు ప్రస్తావిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థ(జీడీపీ)లో4.25 శాతం వాటా సమకూర్చుతున్నట్లు వివరించింది. దీంతో ప్రపంచంలోని టాప్–5 బయోఎకానమీలలో భారత్ ఒకటిగా అవతరించినట్లు నివేదిక పేర్కొంది. బయోటెక్నాలజీ ఆధారిత ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(ఏబీఎల్ఈ) సహకారంతో బైరాక్(బీఐఆర్ఏసీ) రూపొందించిన నివేదికను గ్లోబల్ బయోఇండియా 2024 సదస్సు(4వ ఎడిషన్)లో విడుదల చేసింది. నివేదిక వివరాలు చూద్దాం..

వృద్ధికి దన్నుఇలా

బయోఎకానమీ వృద్ధికి బయోటెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇన్నొవేషన్, హెల్త్‌కేర్, బయోమ్యాన్యుఫాక్చరింగ్ తదితరాలలో ఆధునిక పరివర్తన వంటి అంశాలు తోడ్పాటునిచ్చాయి. ఈ నేపథ్యంలో 2014కల్లా 10 బిలియన్ డాలర్ల విలువను నమోదు చేసిన దేశీ బయోఎకానమీ 2023 చివరికల్లా 151 బిలియన్ డాలర్లకు ఎగసింది. ఈ పురోగతి జాతీయాభివృద్ధిలో కీలకపాత్రను పోషించింది. దేశ జీడీపీలో 4.25 శాతం వాటాను సమకూరుస్తోంది. గ్లోబల్ బయోఎకానమీల టాప్–5 జాబితాలో భారత్‌కు చోటు కల్పించింది. బయోఈ3(ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, ఉద్యోగితలకు బయోటెక్నాలజీ) పాలసీ ప్రధానంగా ఇందుకు తోడ్పాటునిచ్చింది. బయో ఆధారిత రసాయనాలు, ప్రెసిషన్ బయోథెరప్యూటిక్స్, వాతావరణానుకూల వ్యవసాయం, సముద్రం, అంతరిక్ష సాంకేతికతలలో



ఆధునిక పరిశోధనలపై ప్రధానంగా పాలసీ దృష్టిపెట్టింది. వ్యాక్సిన్లు, బయోఫార్మాస్యూటికల్స్‌కు పెరుగుతున్న డిమాండ్ దేశీ బయోఎకానమీ వృద్ధిని ప్రతిబింబిస్తున్నట్లు డీబీటీ సెక్రటరీ, బైరాక్ చైర్మన్, డీజీ–బ్రిక్ రాజేష్ ఎస్.గోఖలే పేర్కొన్నారు. కొత్త బయోఈ3 పాలసీ ద్వారా ఈ పరిస్థితులకు మరింత ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు తెలియజేశారు. వెరసి 2030కల్లా దేశీ బయోఎకానమీ విలువ 300 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. బయోమ్యాన్యుఫాక్చరింగ్‌లో ఏఐ వినియోగాన్ని బలపరచడంతోపాటు.. బయో ఏఐ కేంద్రాల ఏర్పాటుకు తెరతీయవలసి ఉన్నట్లు తాజా నివేదిక అభిప్రాయపడింది. నివేదిక ప్రకారం..

ఉపాధి అవకాశాలు

ఏఐ వినియోగం, ఆధునిక తయారీ తదితరాల ద్వారా బయోఎకానమీని మరింత పరుగు పెట్టించడంతో ఉద్యోగ అవకాశాలు ఊపందుకుంటాయి. వివిధ పరిశ్రమలలలో బయోటెక్నాలజీని మిళితం చేయడం ద్వారా ప్రధానంగా టైర్–2, టైర్–3 నగరాలలో ఉపాధికి ఊతం లభిస్తుంది. బయోఇండస్ట్రియల్ రంగం దేశీ బయోఎకానమీలో అతిపెద్ద పాత్ర పోషిస్తోంది. మొత్తం మార్కెట్ విలువలో 48 శాతం అంటే దాదాపు 73 బిలియన్ డాలర్ల విలువను ఆక్రమిస్తోంది. బయోఇంధనాలు, బయోప్లాస్టిక్స్‌సహా.. టెక్స్‌టైల్స్, డిటర్జెంట్స్ పరిశ్రమలలో వినియోగించే ఎంజైమాటిక్ అప్లికేషన్లు ఈ విభాగంలోకి చేరతాయి. వీటిలో బయోఇంధనాలు భారీ వృద్ధిని సాధిస్తున్నాయి. 2023కల్లా ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 13.8 బిలియన్ లీటర్లకు చేరింది. దీంతో భారత్ ప్రపంచంలోనే ఇథనాల్ తయారీకి మూడో పెద్ద దేశంగా ఆవిర్భవించింది. ఇక బయోఫార్మా రంగం సైతం బయోఎకానమీలో 36 శాతం వాటాను ఆక్రమిస్తోంది. విలువ దాదాపు 54 బిలియన్ డాలర్లుకాగా.. దేశీయంగా వ్యాక్సిన్ల తయారీ సామర్థ్యం ప్రపంచంలోనే నాయకత్వస్థాయిలో కొనసాగుతోంది.



తెలుగు రాష్ట్రాల్లో క్లెయిమ్స్ సరళతరం: ఐసీఐసీఐ ప్రు లైఫ్



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు సంబంధించి క్లెయిమ్స్ ప్రక్రియను సరళతరం చేసినట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. క్లెయిమ్ సెటిల్మెంట్ కోసం మూడు ప్రాథమిక డాక్యుమెంట్లను సమర్పిస్తే సరిపోతుందని వివరించింది. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఉన్న బ్యాంకు అకౌంటు నంబరు లేదా క్యాన్సిల్ చేసిన చెక్ కాపీ, డెత్ సరిఫికెట్ లేదా ఆస్పత్రులు, పోలీసులు, ప్రభుత్వాధికారులు జారీ చేసిన మృతుల జాబితా, ఆధార్ వంటి ధృవీకరణ పత్రాలను ఇవ్వొచ్చని పేర్కొంది. మొబైల్ యాప్ ద్వారా లేదా ఎస్ఎంఎస్ ద్వారా క్లెయిమ్‌ను రైజ్ చేయొచ్చని వివరించింది. ఇరవై నాలుగ్గంటలూ పని చేసే టోల్ ఫ్రీ క్లెయిమ్‌కేర్ హెల్ప్‌లైన్ 1800–2660ని ప్రారంభించినట్లు సంస్థ పేర్కొంది.

జీఎస్టీ ఎగవేతలు రూ.2 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: జీఎస్టీ ఎగవేతల విలువ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.01 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందుకు సంబంధించి 6,084 కేసులను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) గుర్తించింది. ఆన్‌లైన్ గేమింగ్, బీఎఫ్ఎస్ఐ, ఇనుము, రాగి, స్క్రాప్ విభాగాల్లో అత్యధిక ఎగవేతలు నమోదయ్యాయని డైరెక్టరేట్ వెల్లడించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 4,872 కేసులు నమోదు కాగా, ఎగవేతల విలువ రూ.1.01 లక్షల కోట్లుగా ఉంది. డీజీజీఐ వార్షిక నివేదిక ప్రకారం.. పన్ను చెల్లించకపోవడానికి సంబంధించిన ఎగవేత కేసుల్లో 46 శాతం రహస్యంగా సరఫరా, తక్కువ మూల్యాంకనం, 20 శాతం నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు (ఐటీసీ) సంబంధించినవి కాగా 19 శాతం ఐటీసీని తప్పుగా పొందడం /రివర్సల్ చేయకపోవడం వంటివి ఉన్నాయి. 2023–24లో ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో 78 కేసుల్లో గరిష్ఠంగా రూ.81,875 కోట్ల ఎగవేత జరిగింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగం 171 కేసుల్లో రూ.18,961 కోట్ల ఎగవేతలను నమోదు చేసింది.

టైటన్ హీలియోస్‌కు కొత్త బ్రాండ్స్





న్యూఢిల్లీ: లగ్జరీ వాచ్‌ల విక్రయంలో ఉన్న టైటన్ హీలియోస్ మరిన్ని విదేశీ బ్రాండ్స్‌ను జోడిస్తోంది. 12–18 నెలల్లో కొత్తగా 10 బ్రాండ్స్‌ను పరిచయం చేయనుంది. ప్రస్తుతం హీలియోస్ స్టోర్లలో టామీ హిల్‌ఫిగర్, టిస్సో, స్వరోస్కీ, ఫాజిల్ వంటి 45 బ్రాండ్ల వాచ్‌లు కొలువుదీరాయి. వీటి ధరలు రూ.5,000 మొదలుకుని రూ.1,00,000 వరకు ఉన్నాయి. మరోవైపు హీలియోస్ స్టోర్ల సంఖ్యను కంపెనీ గణనీయంగా పెంచుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 50 ఔట్‌లెట్లు రానున్నాయని టైటన్ వాచెస్, వేరబుల్స్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ శుక్లా వెల్లడించారు. 'మొత్తం వ్యాపారంలో హీలియోస్ నుంచి 10 శాతం ఆదాయం సమకూరుతోంది. ఈ విభాగం ఆదాయం 45 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నాం. హీలియోస్ టర్నోవర్‌లో 20 శాతం కొత్త కలెక్షన్, లిమిటెడ్ ఎడిషన్స్ నుంచి అందుకోవాలని దృష్టిపెట్టాం. పండుగల సీజన్ ప్రమోషన్స్ కారణంగా కస్టమర్ల రాక, ఆన్‌లైన్ సేల్స్ 20–25 శాతం అధికం అవుతాయని భావిస్తున్నాం. అన్ని బ్రాండ్స్‌లో కలిపి ఏటా 150 దాకా కేంద్రాలను జోడిస్తున్నాం' అని వివరించారు. టైటన్‌కు దేశవ్యాప్తంగా 95 నగరాలు, పట్టణాల్లో 240 హీలియోస్ స్టోర్లు ఉన్నాయి. హీలియోస్‌తోపాటు టైటన్ వరల్డ్, ఫాస్ట్‌ట్రాక్, రాగా, జూప్, ఎస్ఎఫ్ బ్రాండ్లలో 1,110కిపైగా కేంద్రాలు ఉన్నాయి.

భారత్‌లో సాగు ఆధునీకరణ చర్యలు బాగున్నాయి

బేయర్ దక్షిణాసియా హెడ్ సైమన్



పానిపట్: భారత్‌లో సాగు రంగాన్ని ఆధునీకరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జర్మన్ కెమికల్స్ దిగ్గజం బేయర్ దక్షిణాసియా ప్రెసిడెంట్ సైమన్ వీబుష్ ప్రశంసించారు. వెనుకబడిన వ్యవసాయ రంగంతో భారత్ నిర్దేశించుకున్నట్లుగా 2047 నాటికి అగ్రరాజ్యంగా అవతరించడం సాధ్యపడదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న పలు చర్యలు వ్యవసాయాన్ని ఆధునీకరించడమే లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోందని సైమన్ చెప్పారు. భారత్ వినూత్న ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తూ, రెగ్యులేటరీ ప్రక్రియలను మరింతగా డిజిటలీకరిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో కూలీల కొరత నెలకొన్న నేపథ్యంలో తాము కలుపు మందులపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. క్రిమిసంహారకాల కన్నా అధికంగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వివరించారు. వరి, గోధుమలు, చెరకు వంటి కీలక పంటల కోసం కలుపు మందులను అభివృద్ధి చేస్తున్నామని సైమన్ చెప్పారు. అంతర్జాతీయంగా తాము నిర్వహిస్తున్న 'ఫార్వర్డ్‌ఫామ్స్' కార్యక్రమం ద్వారా భారత్‌లో కూడా వ్యవసాయ ఉత్పాదకతను, ఆగ్రో–కెమికల్స్‌ను మెరుగుపరిచే కొత్త ఆవిష్కరణలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

ఆగస్టులో నెమ్మదించిన ప్యాసింజర్ వాహన విక్రయాలు

సియాం నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ప్యాసింజర్ వాహనాల టోకు అమ్మకాలు ఈ ఏడాది ఆగస్టులో 2% తగ్గినట్లు వాహన తయారీదార్ల సమాఖ్య సియామ్ వెల్లడించింది. మార్కెట్లో డిమాండ్ తగ్గిపోవడం, కంపెనీలు డీలర్లకు తమ డిస్పాచ్‌లను తగ్గించడం ఇందుకు కారణమని తెలిపింది. ఈ ఆగస్టులో కంపెనీల నుంచి డీలర్లకు 3,52,921 ప్యాసింజర్ వాహనాలు చేరాయి. గతేడాది (2023) ఆగస్టులో ఇవి 3,59,228గా నమోదయ్యాయి.

- ద్వి చక్ర వాహన టోకు అమ్మకాలు 9% పెరిగి 15,66,594 యూనిట్ల నుంచి 17,11,662 యూనిట్లకు చేరాయి. స్కూటర్ల విక్రయాలు 6,06,250 యూనిట్ల నుంచి 5,49,290 యూనిట్లకు పెరిగాయి. మోటార్ సైకిల్ డెలివరీలు 9,80,809 యూనిట్ల నుండి 8% పెరిగి 10,60,866 యూనిట్లకు చేరుకున్నాయి.
- త్రి చక్ర వాహనాల అమ్మకాలు 64,944 యూనిట్ల నుంచి 69,962 యూనిట్లకు పెరిగాయి.

''ఈ పండుగ సీజన్‌లో వాహనాలకు డిమాండ్ పెరుగుతుంది. కేంద్రం ఇటీవల ప్రకటించిన పీఎం ఈ–డ్రైవ్, పీఎం ఈ–బస్ సేవా పథకాలతో వాహన వినియోగం మరింత పుంజుకుంటుంది'' అని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ తెలిపారు.

గోధుమ ధరల పెరుగుదలకు చెక్!



న్యూఢిల్లీ: గోధుమల ధరల పెరుగుదలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. ట్రేడర్లు, హోల్‌సేల్ వర్తకులు, బడా రిటైల్ మాల్స్ నిర్వాహకులకు గోధుల నిల్వలపై పరిమితులను కఠినతరం చేసింది. జూన్ 24న విధించిన నిల్వ పరిమితులను సవరించింది. ట్రేడర్లు, టోకు వర్తకులు 2,000 టన్నుల వరకే నిల్వ చేసుకోగలరు. ఇప్పటి వరకు ఇది 3,000 టన్నులుగా ఉంది. బడా రిటైల్ చైన్‌లు ప్రతి ఔట్‌లెట్ (స్టోర్)లో 10 మెట్రిక్ టన్నుల వరకే గోధుమల నిల్వలకు పరిమితం కావాల్సి ఉంటుంది. డిపోలో స్టోర్ సంఖ్యకు 10 రెట్లకు మించి ఉండరాదు. గతంలో స్టోర్‌వారీ పరిమితుల్లేవు. అదే గోధుమ ప్రాసెసర్లు అయితే నెలవారీ స్థాపిత సామర్థ్యంలో ఇప్పటి వరకు 70 శాతం వరకు నిల్వలు కలిగి ఉండేందుకు అవకాశం ఉంటే, దీనిని 60 శాతానికి తగ్గించింది. విడిగా రిటైల్ స్టోర్లు అయితే 10 టన్నుల గోధుమలు నిల్వ చేసుకోవచ్చు. 2025 మార్చి 31 వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని కేంద్రం ప్రకటించింది.

నిల్వ పరిమితులపై కఠిన ఆంక్షలు

ఉల్లిగడ్డలు, బాస్మతీ ఎగుమతులపై ఆంక్షల తొలగింపు

ఉల్లిగడ్డలు, బాస్మతీ బియ్యం ఎగుమతులకు సంబంధించి కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)లను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. కీలకమైన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల ముందు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మహారాష్ట్ర రైతులు ఎక్కువగా ఉల్లిని ఎగుమతి చేస్తుంటారు. హర్యానా, పంజాబ్‌లో బాస్మతీ సాగు ఎక్కువగా జరుగుతుంటుంది. బాస్మతీ బియ్యం ఎగుమతికి టన్నుకు కనీసం 950 డాలర్ల ధర పరిమితిని తొలగించింది. అలాగే, టన్ను ఉల్లిగడ్డలపై 550 డాలర్లుగా ఉన్న కనీస ఎగుమతి ధరను కూడా తొలగించినట్టు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారీన్ ట్రేడ్ ప్రకటించింది. ఈ నిర్ణయం ఎగుమతుల వృద్ధికి, రైతుల ఆదాయం మెరుగుపడేందుకు దారితీస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

తిలక్ వర్మ, ప్రథమ్ సెంచరీలు

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 380/3 డిక్లేర్డ్

భారత్ 'డి' విజయలక్ష్యం 488


తిలక్ వర్మ

సాక్షి, అనంతపురం: ఓపెనర్ ప్రథమ్ సింగ్ (189 బంతుల్లో 122; 12 ఫోర్లు, 1 సిక్స్), వన్‌డౌన్ బ్యాటర్ ఠాకూర్ తిలక్‌వర్మ (193 బంతుల్లో 111 నాటౌట్; 9 ఫోర్లు) సెంచరీలతో కదంతొక్కడంతో దులీప్ ట్రోఫీలో భారత్ 'ఎ' ప్రత్యర్థి ముందు భారీలక్ష్యాన్ని నిర్దేశించింది. భారత్ 'డి'తో ఇక్కడ జరుగుతోన్న ఈ మ్యాచ్‌లో 115/1 ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు ఆటకొనసాగించిన భారత్ 'ఎ' 98 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 380 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. క్రితం రోజు బ్యాటర్ ప్రథమ్ సింగ్ తన అర్ధసెంచరీని సెంచరీగా మలుచుకున్నాడు. ముందు రోజు మయాంక్‌తో రెండో ఇన్నింగ్స్‌కు గట్టిపునాది వేసిన ప్రథమ్... శనివారం మూడోస్థానంలో బ్యాటింగ్‌కు దిగిన తిలక్‌వర్మతో కలిసి మరో భారీ భాగస్వామ్యానికి బాటలు వేశాడు. ఇద్దరు క్రీజులో పాతుకుపోవడంతో భారత్ 'డి' జట్టు బౌలర్లకు కష్టాలు తప్పలేదు. కెప్టెన్ శ్రేయస్ వర్మ స్వయంగా తాను బౌలింగ్‌కు దిగడంతో పాటు ఏకంగా ఏడుగురు బౌలర్లను ప్రయోగించినా ఫలితం లేకపోయింది. మొదట ఇద్దరు అనవసర షాట్ల జోలికి వెళ్లకుండా ఇన్నింగ్స్‌ను సాఫీగా నడిపించారు. వీలుచిక్కిన బంతినల్లా బౌండరీలకు తరలిస్తూ స్కోరు పెంచారు. ఈ క్రమంలో ఓపెనర్ ప్రథమ్ 149 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకోగా... జట్టు స్కోరు 200 పరుగులు దాటింది. కాసేపటికి 32 ఏళ్ల రైల్వేస్ బ్యాటర్ ప్రథమ్ సింగ్‌ను లెఫ్టార్మ్ స్పిన్నర్ సౌరభ్ కుమార్‌ను అవుట్ చేసి తొలి సెషన్‌ను ముగించాడు. దీంతో రెండో వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన రియాన్ పరాగ్ (20; 2 సిక్స్‌లు) రెండు భారీసిక్సర్లతో అలరించాడు. తిలక్ వర్మ అర్ధ సెంచరీని పూర్తి చేసుకోగా... కాసేపటికే పరాగ్‌ను కూడా సౌరభే పెవిలియన్ చేర్చడంతో 264 పరుగుల వద్ద మూడో వికెట్ పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన శాశ్వత్ రావత్ (88 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను తిలక్ వర్మ తన భుజాన వేసుకొన్నాడు. ఈ జోడీ కూడా ప్రత్యర్థి బౌలర్లను బాగా ఇబ్బంది పెట్టింది. ఈ క్రమంలో తిలక్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఐదో సెంచరీని 177 బంతులో పూర్తిచేశాడు. మరోవైపు వేగంగా బ్యాటింగ్ చేసిన శాశ్వత్ ఫిఫ్టీ సాధించాడు. ఈ జోడీని విడగొట్టేందుకు శ్రేయస్ అయ్యర్ సేన విశ్వప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. చివరకు 380/3 స్కోరు వద్ద భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 107 పరుగులు కలుపుకొని ప్రత్యర్థి ముందు 488 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. దీన్ని ఛేదించేందుకు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 'డి' జట్టు మూడో రోజు ఆట నిలిచే సమయానికి 19 ఓవర్లలో వికెట్ నష్టానికి 62 పరుగులు చేసింది. అథర్వ తైడ్ (0)ను ఖలీల్ అహ్మద్ డకౌట్ చేయగా, మరో ఓపెనర్ యశ్ దుబే (15 బ్యాటింగ్), రికీ భుయ్ (52 బంతుల్లో 44 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర బ్యాటర్ రికీ భుయ్ వన్డేను తలపించేలా దూకుడుగా ఆడాడు. ప్రస్తుతం 'డి' జట్టు లక్ష్యం ఛేదించాలంటే 426 పరుగులు చేయాల్సి ఉండగా, చేతిలో 9 వికెట్లున్నాయి.

స్కోరు వివరాలు

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: 290; భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: 183; భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్: ప్రథమ్ సింగ్ (సి) శ్రేయస్ అయ్యర్ (బి) సౌరభ్ కుమార్ 122; మయాంక్ అగర్వాల్ (సి అండ్ బి) శ్రేయస్ అయ్యర్ 56; తిలక్ వర్మ (నాటౌట్) 111; రియాన్ పరాగ్ (సి) ఆదిత్య ఠాకరే (సబ్) (బి) సౌరభ్ కుమార్ 20; శాశ్వత్ రావత్ (నాటౌట్) 64; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (98 ఓవర్లలో 3 వికెట్లకు డిక్లేర్డ్) 380. వికెట్ల పతనం: 1-115, 2-219, 3-264. బౌలింగ్: హర్షిత్ రాణా 7-0-30-0, విద్వత్ కావేరప్ప 9-1-43-0, సౌరభ్ కుమార్ 26-2-110-2, అర్‌‌ష్‌దీప్ సింగ్ 12-0-44-0; సారాంశ్ జైన్ 36-5-108-0, శ్రేయస్ అయ్యర్ 4-0-22-1, అథర్వ 4-0-17-0.

భారత్ 'డి' రెండో ఇన్నింగ్స్: యశ్ దూబే (బ్యాటింగ్) 15; అథర్వ (సి) ఆఖీబ్ ఖాన్ (బి) ఖలీల్ అహ్మద్ 0; రికీ భుయ్ (బ్యాటింగ్) 44; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (19 ఓవర్లలో వికెట్ నష్టానికి) 62. వికెట్ల పతనం: 1-2, బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-2-17-1, ప్రసిధ్ కృష్ణ 5-3-13-0, షమ్స్ ములానీ 5-2-14-0, ఆఖీబ్ ఖాన్ 3-1-10-0, తనుశ్ కొటియాన్ 2-0-8-0.

లివింగ్‌స్టోన్ 'షో'

- 47 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 87
- రెండో టి20లో ఆసీస్‌పై ఇంగ్లండ్ గెలుపు


లివింగ్‌స్టోన్

కార్డిఫ్: సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ అదరగొట్టింది. లివింగ్‌స్టోన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కారణంగా... ఆ్రస్టేలియాతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ మూడు వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో నిలిచింది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ప్రస్తుతం రెండు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. నేడు మాంచెస్టర్‌లో ఇరుజట్ల మధ్య ఆఖరి టి20 మ్యాచ్ జరుగుతుంది. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన రెండో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆ్రస్టేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (14 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మాథ్యూ షార్ట్ (24 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 4.2 ఓవర్లలో 52 పరుగులు జోడించారు. వీళ్లిద్దరు అవుటయ్యాక జేక్ ఫ్రేజర్ (31 బంతుల్లో 50; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోష్ ఇంగ్లిస్ (26 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్) దంచేయడంతో ఆ్రస్టేలియా భారీ స్కోరు చేసింది. లివింగ్‌స్టోన్, బ్రిడన్ కార్స్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 79 పరుగులకే కీలకమైన 3 వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ ఫిల్ సాల్ట్ (23 బంతుల్లో 39; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), జాక్స్ (12), జోర్డాన్ కాక్స్ (0) అవుటయ్యారు. ఈ దశలో లివింగ్‌స్టోన్ (47 బంతుల్లో 87; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), జాకబ్ బెథెల్ (24 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆట ఆడేశారు. 10 ఓవర్లలో 104 పరుగులు చేయాల్సి ఉండగా లివింగ్‌స్టోన్ 27 బంతుల్లో బాదిన మెరుపు ఫిఫ్టీ ఇంగ్లండ్ లక్ష్యఛేదనకు చక్కని బాట వేసింది. ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 47 బంతుల్లోనే 90 పరుగులు జోడించడంతో అనూహ్యంగా లక్ష్యంవైపు దూసుకెళ్లింది. మధ్యలో మాథ్యూ షార్ట్ (5/22) ఇబ్బందిపెట్టినా... లివింగ్‌స్టోన్ భారీ సిక్సర్లతో ఇంగ్లండ్ విజయం సాధించింది.

సాయికార్తీక్ ఖాతాలో ఏడో డబుల్స్ టైటిల్



సాక్షి, హైదరాబాద్: ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఏకంగా ఐదు టోర్నమెంట్‌లలో ఫైనల్ చేరి... రన్నరప్ ట్రోఫీలతోనే సరిపెట్టుకున్న హైదరాబాద్ యువ టెన్నిస్ ప్లేయర్ గంటా సాయికార్తీక్ రెడ్డి ఎట్టకేలకు ఆరో ప్రయత్నంలో విజయవంతమయ్యాడు. ఈ ఏడాది తన ఖాతాలో తొలి అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబుల్స్ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. ఇండోనేసియా ఆధీనంలోని బాలి ద్వీపంలో జరిగిన ఐటీఎఫ్ ఎం25 టోర్నీలో సాయికార్తీక్ రెడ్డి (భారత్)-బొగ్దాన్ బొబ్రోవ్ (రష్యా) జోడీ డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. ఫైనల్లో సాయికార్తీక్-బొగ్దాన్ ద్వయం 6-2, 6-4తో మాథ్యూ స్కాగ్లియా (ఫ్రాన్స్)-జాకుబ్ వోచిక్ (అమెరికా) జంటపై గెలిచింది. సాయికార్తీక్-బొగ్దాన్ జోడీకి 1,550 డాలర్ల (రూ. 1 లక్ష 30 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. ఓవరాల్‌గా సాయికార్తీక్ కెరీర్‌లో ఇది ఏడో డబుల్స్ టైటిల్‌కాగా, ఈ ఏడాది తొలి డబుల్స్ టైటిల్. 24 ఏళ్ల సాయికార్తీక్ 2023లో నాలుగు డబుల్స్ టైటిల్స్‌ను, 2022లో రెండు డబుల్స్ టైటిల్స్‌ను సాధించాడు. ఈ ఏడాది సాయికార్తీక్ మొత్తం 22 ఐటీఎఫ్ టోర్నీలలో పాల్గొన్నాడు. ఐదు టోర్నీల్లో డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచి, ఒక టోర్నీలో టైటిల్ గెలిచాడు.

అభిమన్యు వీరోచిత పోరాటం

- భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్‌లో 309/7
- 'డ్రా' దిశగా భారత్ 'సి'తో మ్యాచ్


అభిమన్యు

సాక్షి, అనంతపురం: భారత్ 'బి' జట్టు కెప్టెన్, ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (262 బంతుల్లో 143 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీతో జట్టును నడిపిస్తున్నాడు. దీంతో మూడు రోజులైనా తొలి ఇన్నింగ్స్ ఆటే సాగుతుండటంతో దులీప్ ట్రోఫీలో 'సి' జట్టుతో జరుగుతున్న ఈ మ్యాచ్ 'డ్రా' దిశగా పయనిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 124/0తో శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 'బి' జట్టు ఆట నిలిచే సమయానికి 101 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. ఫాలోఆన్‌ను తప్పించుకునేందుకు ఇంకో 16 పరుగుల దూరంలో ఉంది. మూడో రోజు ఆట మొదలవగానే ఓపెనర్లలో నారాయణ్ జగదీశన్ (137 బంతుల్లో 70; 8 ఫోర్లు) తన క్రితం రోజు స్కోరుకు కేవలం 3 పరుగులు జతచేసి అన్షుల్ కాంబోజ్ ఓవర్లో నిష్క్రమించాడు. స్వల్ప వ్యవధిలో అన్షుల్ టాపార్డర్ బ్యాటర్ ముషీర్ ఖాన్ (1) వికెట్ పడగొట్టాడు. 133 పరుగుల వద్ద రెండు వికెట్లు కోల్పోగా... ఈ దశలో కెప్టెన్ అభిమన్యు, సర్ఫరాజ్ ఖాన్ (55 బంతుల్లో 16; 1 ఫోర్) ప్రత్యర్థి బౌలర్లకు అవకాశమివ్వకుండా జాగ్రత్తగా ఆడారు. మూడో వికెట్‌కు 42 పరుగులు జోడించాక సర్ఫరాజ్‌ను అన్షుల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. కాసేపటికే 23 ఏళ్ల హరియాణా పేసర్ అన్షుల్ కాంబోజ్... హిట్టర్లు రింకూ సింగ్ (6), నితీశ్ కుమార్ రెడ్డి (2)లను అవుట్ చేసి జట్టును కష్టాల్లో పడేశాడు. 194 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన భారత్ 'బి' జట్టుకు ఇక ఫాలోఆన్ ఖాయమనిపించింది. కానీ అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు వాషింగ్టన్ సుందర్ (13), సాయికిశోర్ (44 బంతుల్లో 21; 3 ఫోర్లు), రాహుల్ చహర్ (31 బంతుల్లో 18 బ్యాటింగ్; 1 ఫోర్, 1 సిక్స్) అండతో జట్టు స్కోరును 300 పరుగులు దాటించాడు. ఈ క్రమంలో అతను ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 24వ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు రాహుల్‌తో కలిసి 26 పరుగులు జోడించాడు. అన్షుల్ 5 వికెట్లు పడగొట్టగా, విజయ్ కుమార్ వైశాక్, మయాంక్ మార్కండేలకు చెరో వికెట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 'సి' 525 పరుగుల భారీ స్కోరు చేసింది.

స్కోరు వివరాలు

భారత్ 'సి' తొలి ఇన్నింగ్స్: 525; భారత్ 'బి' తొలి ఇన్నింగ్స్: అభిమన్యు ఈశ్వరన్ (బ్యాటింగ్) 143; నారాయణ్ జగదీశన్ (సి) అభిషేక్ (బి) అన్షుల్ 70; ముషీర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అన్షుల్ 1; సర్ఫరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అన్షుల్ 16; రింకూ సింగ్ (సి) ఇషాన్ (బి) అన్షుల్ 6; నితీశ్ కుమార్ రెడ్డి (బి) అన్షుల్ 2; వాషింగ్టన్ సుందర్ (సి) సుదర్శన్ (బి) విజయ్ 13; సాయికిశోర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మార్కండే 21; రాహుల్ చహర్ (బ్యాటింగ్) 18; ఎక్స్‌ట్రాలు 19; మొత్తం (101 ఓవర్లలో 7 వికెట్లకు) 309. వికెట్ల పతనం: 1-129, 2-133, 3-175, 4-190, 5-194, 6-237, 7-283. బౌలింగ్: సందీప్ వారియర్ 1.1-0-8-0, విజయ్ కుమార్ వైశాక్ 23-5-67-1, అన్షుల్ కాంబోజ్ 23.5-7-66-5, మయాంక్ మార్కండే 18-0-59-1, మానవ్ సుతార్ 33-4-85-0, ఇషాన్ కిషన్ 1-0-7-0, సాయి సుదర్శన్ 1-0-3-0.

మళ్లీ లెక్‌లెర్క్‌కే 'పోల్'


లెక్‌లెర్క్



క్వాలిఫయింగ్ సెషన్‌లో లెక్‌లెర్క్

- అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో వరుసగా నాలుగో ఏడాది ఘనత
- క్వాలిఫయింగ్‌లో మెరిసిన ఫెరారీ జట్టు డ్రైవర్
- నేడు సీజన్‌లోని 17వ రేసుకు సర్వం సిద్ధం

బాకు (అజర్‌బైజాన్): క్వాలిఫయింగ్‌లో తనకెంతో కలిసొచ్చిన అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో ఫెరారీ జట్టు డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ వరుసగా నాలుగో ఏడాది రాణించాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో లెక్‌లెర్క్ అందరికంటే వేగంగా ల్యాప్‌ను ఒక నిమిషం 41.365 సెకన్లలో ముగించాడు. తద్వారా వరుసగా నాలుగో ఏడాది అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో 'పోల్ పొజిషన్' సాధించాడు. నేడు జరిగే ప్రధాన రేసును లెక్‌లెర్క్ తొలి స్థానం నుంచి మొదలుపెడతాడు. అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో గత మూడేళ్లు 'పోల్ పొజిషన్'తో రేసు ఆరంభించినా లెక్‌లెర్క్‌కు మాత్రం టాప్ ర్యాంక్ లభించలేదు. నాలుగో ప్రయత్నంలో లెక్‌లెర్క్‌కు అదృష్టం కలిసొస్తుందో లేదో వేచి చూడాలి. మెక్‌లారెన్ జట్టుకు చెందిన ఆస్కార్ పియాస్ట్రి రెండో స్థానం నుంచి... ఫెరారీకి చెందిన కార్లోస్ సెయింజ్ మూడో స్థానం నుంచి రేసును మొదలుపెడతారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 16 రేసులు జరగ్గా... రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఏడు రేసుల్లో గెలుపొందాడు. లెక్‌లెర్క్, లాండో నోరిస్, లూయిస్ హామిల్టన్ రెండేసి రేసుల్లో విజేతగా నిలువగా... కార్లోస్ సెయింజ్, జార్జి రసెల్, ఆస్కార్ పియాస్ట్రి ఒక్కో రేసులో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు.

అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి గ్రిడ్ పొజిషన్స్: 1. చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ), 2. ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్), 3. కార్లోస్ సెయింజ్ (ఫెరారీ), 4. సెర్జియోపెరెజ్ (రెడ్‌బుల్), 5. జార్జి రసెల్ (మెర్సిడెస్), 6. మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్), 7. లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్), 8. ఫెర్నాండో అలోన్సో (ఆస్టన్ మార్టిన్), 9. ఫ్రాంకో కొలాపింటో (విలియమ్స్), 10. అలెగ్జాండర్ అల్బోన్ (విలియమ్స్), 11. ఒలివెర్ బియర్మన్ (మనీగ్రామ్), 12. యుకీ సునోడా (వీసా క్యాష్), 13. పియరీ గ్యాస్లీ (అల్పైన్), 14. నికో హుల్కెన్‌బర్గ్ (మనీగ్రామ్), 15. లాన్స్ స్ట్రోల్ (ఆస్టన్ మార్టిన్), 16. డానియల్ రికార్డో (వీసా క్యాష్), 17. లాండో నోరిస్ (మెక్‌లారెన్), 18. వాల్తెరి బొటాస్ (స్టేక్ ఎఫ్1), 19. గ్వాన్యు జూ (స్టేక్ ఎఫ్1), 20. ఎస్టెబన్ ఒకాన్ (అల్పైన్).

అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి వివరాలు

ల్యాప్‌ల సంఖ్య: 51
ల్యాప్ దూరం: 6.003 కి.మీ.
మొత్తం రేసు దూరం: 3-6.049 కి.మీ
2023 విజేత: సెర్జియోపెరెజ్ (రెడ్‌బుల్)
బెస్ట్ ల్యాప్ రికార్డు: లెక్‌లెర్క్ (1ని:43.009 సెకన్లు; 2019లో)

జాతీయ హాకీ శిబిరానికి జ్యోతి రెడ్డి



బెంగళూరు: ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్ సన్నాహాల కోసం హాకీ ఇండియా 33 మంది సభ్యులతో కూడిన ప్రాబబుల్స్‌ను ప్రకటించింది. ఈ జాబితాలో హైదరాబాద్‌కు చెందిన ఈదుల జ్యోతి రెడ్డికి స్థానం లభించింది. గతంలో జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో జ్యోతి రెడ్డి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. సీనియర్ జట్టులోనూ స్థానమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతోంది. వైఎస్సార్ కడప జిల్లాలోని పగిడాల గ్రామానికి చెందిన జ్యోతి రెడ్డి కుటుంబం చాలా ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడింది. 33 మంది సభ్యులతో కూడిన ప్రాబబుల్స్‌కు నేటి నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కేంద్రంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. నవంబర్ 11 నుంచి 20వ తేదీ వరకు బిహార్‌లోని రాజ్‌గిర్ స్టేడియంలో ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది.

భారత మహిళల హాకీ ప్రాబబుల్స్: సవితా పూనియా, బిచ్చూదేవి ఖరిబమ్, బన్సారి సోలంకి, మాధురి కిండో (గోల్‌కీపర్లు). నిక్కీ ప్రధాన్, ఉదిత, ఇషికా చౌధరీ, మోనిక, రోప్నీ కుమారి, మహిమా చౌదరీ, జ్యోతి ఛత్రి, ప్రీతి (డిఫెండర్లు). సలీమా టెటె, మరీనా లాల్‌రమ్‌ఘాకి, వైష్ణవి ఫాల్కే, నేహా, జ్యోతి, ఈదుల జ్యోతి రెడ్డి, బల్జీత్ కౌర్, మనీషా చౌహాన్, అక్షత అబాసో, అజ్మీనా కుజుర్ (మిడ్‌ఫీల్డర్లు). సునెలితా టొప్పో, ముంతాజ్ ఖాన్, లాల్‌రెమ్‌సియామి, సంగీతా కుమారి, దీపిక, షర్మిలా దేవి, నవ్‌నీత్ కౌర్, దీపిక సోరెంగ్, ప్రీతి దూబే, వందన కటారియా, రుతుజా (ఫార్వర్డ్‌లు).

ప్రాక్టీస్‌లో టీమిండియా

చెన్నై: ఈ సీజన్‌లో శుభారంభం చేసేందుకు భారత క్రికెట్ జట్టు ప్రాక్టీస్‌లో చెమటోడ్చుతోంది. బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల ముఖాముఖి సిరీస్‌లో పాల్గొనేందుకు రోహిత్ శర్మ బృందం సిద్ధమవుతోంది. బంగ్లాదేశ్‌లోని కీలక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు టీమిండియా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా బంగ్లా స్పీడ్‌స్టర్ నహిద్ రాణా శైలిని పోలిన పంజాబ్ పేసర్ గుర్నూర్ బ్రార్‌ను నెట్‌బౌలర్‌గా వినియోగించుకుంటుంది. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నహిద్ పాక్ గడ్డపై చెలరేగాడు. బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్‌లో కీలకభూమిక పోషించాడు. ఈ నేపథ్యంలో 6 అడుగుల 4.5 అంగుళాల పొడగరి పేసర్ గుర్నూర్ బంతుల్ని రోహిత్, కోహ్లి తదితర బ్యాటర్లు అదేపనిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వెటరన్ బౌలర్ అశ్విన్‌లాగే స్పిన్ వేయగల తమిళనాడు లెఫ్టార్మ్ స్పిన్నర్ అజిత్‌రామ్ కూడా నెట్స్‌లో బ్యాటర్లకు అందుబాటులో ఉన్నాడు. చెన్నై పిచ్ ఇటు పేసర్లు, అటు స్పిన్నర్లకు సమాన అవకాశాలు కల్పించనుండటంతో జట్టు మేనేజ్‌మెంట్ తుదిజట్టు కూర్పుపై త్వరలోనే కసరత్తు పూర్తిచేయనుంది. మరోవైపు బంగ్లాదేశ్ ఆదివారం ఢాకా నుంచి నేరుగా చెన్నైకి చేరుకోనుంది.

యుద్ధఖైదీల మార్పిడి

- 103 మంది చొప్పున పరస్పరం మార్చుకున్న రష్యా, ఉక్రెయిన్

మాస్కో/కీవ్: రష్యా, ఉక్రెయిన్‌లు శనివారం 103 మంది చొప్పున యుద్ధఖైదీలను పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దీనికి మధ్యవర్తిత్వం వహించింది. 'మావాళ్లు స్వదేశానికి చేరుకున్నారు. రష్యా చెర నుంచి 103 మంది యోధులను విజయవంతంగా ఉక్రెయిన్‌కు తీసుకొచ్చాం'అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. యుద్ధఖైదీల మార్పిడిలో భాగంగా ఉక్రెయిన్‌కు చేరిన వారిలో 82 సాధారణ పౌరులు, 21 మంది సైనిక సిబ్బంది ఉన్నారు. 'కర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ బందీలుగా పట్టుకున్న 103 సైనిక సిబ్బంది కీవ్ ఆధీనంలోని భూభాగం నుంచి విముక్తులయ్యారు. బదులుగా 103 యుద్ధఖైదీలను ఉక్రెయిన్‌కు అప్పగించాం'అని రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఉక్రెయిన్ చెర వీడిన రష్యా యుద్ధఖైదీలు ప్రస్తుతం బెలారస్‌లో ఉన్నారు. వారికి అవసరమైన వైద్య, మానసిక సహాయాన్ని అందిస్తున్నట్లు రష్యా తెలిపింది. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దండెత్తిన తర్వాత యూఏఈ మధ్యవర్తిత్వంలో జరిగిన ఎనిమిదో యుద్ధఖైదీల మార్పిడి ఇది. మొత్తం ఇప్పటిదాకా 1,994 మంది ఖైదీలకు తమ చొరవతో చెరవీడిందని యూఏఈ తెలిపింది.

రష్యాలోని సుదూర లక్ష్యాల పైకి దాడికి అనుమతించండి

రష్యాలోని సుదూర లక్ష్యాల పైకి దాడి చేయడానికి తమను అనుమతించాలని ఉక్రెయిన్ పునరుద్ఘాటించింది. పశ్చిమదేశాలు ఉక్రెయిన్‌కు సుదూరశ్రేణి క్షిపణులను సరఫరా చేసినప్పటికీ.. వాటి వాడకానికి అనుమతివ్వడం లేదు. 'రష్యా ఉగ్రవాదం వారి ఆయుధాగారాలు, సైనిక విమానాశ్రయాలు, సైనిక స్థావరాల వద్ద మొదలవుతుంది. రష్యా లోపలి ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులకు అనుమతి లభిస్తే.. పరిష్కారం వేగమంతమవుతుంది'అని ఉక్రెయిన్ అధ్యక్షుడి సలహాదారు ఆండ్రీ యెర్మాక్ శనివారం వివరించారు.



చమురు ట్యాంకర్‌కు మంటలు

ఎర్ర సముద్రంలో యెమెన్ హౌతీ తిరుగుబాటుదారుల దాడులకు గురైన 'సోయూనియన్' అనే 900 అడుగుల భారీ చమురు ట్యాంకర్ ఇది. ఆగస్ట్ 21వ తేదీన ట్యాంకర్‌కు అంటుకున్న మంటలు ఇప్పటికీ చల్లారలేదు. ఇందులోని 10 లక్షల బ్యారెళ్ల ముడి చమురు లీకైతే మునుపెన్నడూ లేనంతగా సముద్ర పర్యావరణానికి హాని కలుగుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అందుకే, సాధ్యమైనంత మేర ట్యాంకర్‌లోని చమురును తరలించే అత్యంత క్లిష్టమైన ప్రక్రియను మొదలుపెట్టనున్నారు. గ్రీస్‌కు చెందిన ఈ నౌక యాజమాన్యం ఈ విషయంలో సౌదీ అరేబియా సాయం కోరింది. అప్పటి వరకు మరిన్ని దాడులు జరగకుండా గ్రీస్, ఫ్రాన్సు నౌకలు 'సోయూనియన్'కు కాపలాగా ఉన్నాయి.



గ్రేస్సీ గెథిన్

4 రోజుల నిరసనకు 4 ఏళ్ల శిక్ష

యూకేలో చమురు తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని ఆందోళన

- రింగ్ రోడ్డుపై శాంతియుతంగా నిరసన చేపట్టిన సామాజిక కార్యకర్తలు
- వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిందని, ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లిందని పోలీసుల అభియోగాలు
- ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ లండన్ కోర్టు తీర్పు

భూమిపై వాతావరణ మార్పులు, కాలుష్యానికి కారణమవుతున్న శిలాజ ఇంధనాల తవ్వకానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ నాలుగు రోజులపాటు శాంతియుతంగా నిరసన తెలిపిన నలుగురు సామాజిక కార్యకర్తలకు నాలుగేళ్ల చొప్పున జైలుశిక్ష పడింది. మరో కార్యకర్తకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. పురాతన ప్రజాస్వామ్య దేశమని చెప్పుకొనే యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో జరిగిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. కోర్టు తీర్పును ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు తప్పుపడుతున్నారు. యూకేలోని ఉత్తర సముద్రంలో చమురు తవ్వకాలకు 2022లో అప్పటి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. లైసెన్స్‌లు ఇచ్చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2022 నవంబర్‌లో 'జస్ట్ స్టాప్ ఆయిల్'అనే నినాదంతో సామాజిక కార్యకర్తలు నిరసన బాటపట్టారు. అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాలను 22 ఏళ్ల గ్రేస్సీ గెథిన్ అనే యువతి ముందుండి నడిపించింది. ఈ ఉద్యమం పలువురిని ఆకర్షించడంతో వారు ఇందులో భాగస్వాములయ్యారు. భూగోళాన్ని కలుషితం చేసే చమురు తవ్వకాలు వద్దంటూ నినదించారు. లండన్ చుట్టూ ఉన్న మేజర్ రింగ్ రోడ్డుపై నాలుగు రోజులపాటు నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించారు. చెట్లు, భవనాలపైకి ఎక్కి బిగ్గరగా నినాదాలు చేశారు. ఇదంతా పూర్తిగా శాంతియుతంగానే సాగింది. హింస అనే మాటే లేదు. ఆస్తులకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

లక్షల డాలర్ల నష్టం వాటిల్లిందట!

రింగ్ రోడ్డుపై బైఠాయింపులు, నిరసనలతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపిస్తూ గ్రేస్సీ గెథిన్‌తోపాటు పలువురు సామాజిక కార్యకర్తలపై పోలీసులు అభియోగాలు మోపారు. దాదాపు రెండేళ్లపాటు లండన్ కోర్టులో విచారణ జరిగింది. 'జస్ట్ స్టాప్ ఆయిల్'నిరసనల వల్ల నాలుగు రోజులపాటు రింగ్ రోడ్డుపై 7 లక్షలకుపైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిందని పోలీసుల తరఫున ప్రాసిక్యూటర్లు వాదించారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు 9.80 లక్షల డాలర్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. రోడ్డుపై పరిస్థితిని చక్కదిద్దడానికి పోలీసులు 1.3 మిలియన్ డాలర్లు ఖర్చు చేయాల్సి వచ్చిందని తెలిపారు. నిరసనకారులు కుట్రపూరితంగానే ప్రజలకు ఇక్కట్లు కలుగజేశారని ఆరోపించారు. ప్రాసిక్యూటర్ల వాదనతో లండన్ కోర్టు ఏకీభవించింది. గ్రేస్సీ గెథిన్‌తోపాటు లూయిసీ లాంకాస్టర్, డేనియల్ షా, లూసియాకు నాలుగేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ ఈ ఏడాది జూలైలో తీర్పు వెలువరించింది. 'జస్ట్ స్టాప్ ఆయిల్'సహ వ్యవస్థాపకుడు రోజర్ హల్లామ్ ఐదేళ్లపాటు జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం దోషులంతా జైలులో ఉన్నారు. వారి విడుదల కోసం సామాజిక కార్యకర్తలు పోరాడుతున్నారు. న్యాయం పోరాటం కొనసాగిస్తున్నారు. అహింసాయుతంగా జరిగిన నిరసనలకు నాలుగేళ్ల చొప్పున జైలుశిక్ష విధించడం యూకే చరిత్రలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. శాంతియుత నిరసనలకు సైతం జైలుశిక్ష విధించేలా యూకేలో రెండు వివాదాస్పద చట్టాలు అమల్లో ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



2022లో పోలీసులు గ్రేస్సీని అరెస్ట్ చేస్తున్నప్పటి దృశ్యం

కేజ్రీవాల్ నివాసం వద్ద టపాసులు కాల్చినందుకు కేసు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ నివాసం ఎదుట టపాసులు కాల్చినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. తీహార్ జైలు నుంచి కేజ్రీవాల్ విడుదలైన వేళ ఆప్ కార్యకర్తలు సివిల్ లైన్స్‌లోని ఆయన నివాసం వద్ద శుక్రవారం బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అయితే, దేశ రాజధాని ప్రాంతంలో గాలి కాలుష్యాన్ని అరికట్టేందుకు కేజ్రీవాల్ ప్రభుత్వం సోమవారమే బాణసంచా తయారీ, వాడకంపై నిషేధం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించినందుకు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

కోల్‌కతాలో పేలుడు చెత్త ఏరుకునే వ్యక్తికి గాయాలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న పేలుడులో చెత్త ఏరుకునే వ్యక్తి(58) ఒకరు గాయపడ్డారు. బ్లోచ్‌మన్ వీధి, ఎస్ఎన్ బెనర్జీ కూడలిలో ఘటన చోటుచేసుకుంది. కుడిచేతి మణికట్టుకు గాయంతో బాధితుడు బాపి దాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. అతడు కోలుకున్నాక వాంగ్మూలం నమోదు చేస్తామని చెప్పారు. పెద్ద శబ్దంతో పేలుడు చోటుచేసుకోవడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఆ మార్గాన్ని కొద్దిసేపు మూసివేశారు. బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్ ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లేవని నిర్ధారించాక, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

డీఎంకే కార్యక్రమంలో బిర్యానీ చిన్నారులు సహా 100 మందికి అస్వస్థత

విల్లూరు: తమిళనాడులోని మధురై జిల్లా తిరుమంగళంలో శుక్రవారం అధికార డీఎంకే నిర్వహించిన కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కార్యకర్తలకు అందజేసిన బిర్యానీ తిన్న చిన్నారులు సహా 100 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. ప్రభుత్వ పథకాల కింద వస్తువుల పంపిణీ కోసం డీఎంకే ఈ కార్యక్రమాన్ని ఏర్పా టు చేసింది. హాజరైన వారికి బిర్యానీ పొట్లాలు అందజేశారు. అ నంతరం లబ్ధిదారులు వాటిని ఇళ్లకు తీసుకెళ్లి కుటుంబసభ్యులతో కలిసి తిన్నారు. కొద్దిసేపటికే పలువురికి వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు మొదలయ్యాయి. సుమారు 40 మంది చిన్నారులు సహా 100 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు.

రికార్డు స్థాయి వానలు ఢిల్లీలో స్వచ్ఛమైన గాలి

న్యూఢిల్లీ: సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైన తర్వాత ఢిల్లీ వాసులు ఈ ఏడాదిలోనే అత్యంత పరిశుభ్రమైన గాలిని పీల్చగలుగుతున్నారు. దేశ రాజధాని ప్రాంతంలో వా యు నాణ్యతా సూచి(ఏక్యూఐ) 52గా నమోదైందని, దీనిని సంతృప్తికరస్థాయిగా వాతావరణ విభాగం తెలిపింది. 'ఢిల్లీలో సెప్టెంబర్ మొదట్లోనే వెయ్యి మిల్లీమీటర్లకు పైగా వా నలు కురిశాయి. వరదలతో కాలుష్య కా రకాలు కొట్టుకుపోయాయి. అదేవిధంగా, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలుల తాకిడికి పేరుకుపోయిన కలుషితాలు చెల్లాచెదురుగా అయిపోయాయి'అని అధికారులు వివరించారు. ఫరీదాబాద్‌లో 24 గంటల సరాసరి ఏక్యూఐ 24 కాగా, ఘాజియాబాద్‌లో ఇది 34, నోయిడాల్లో 46గా ఉందన్నారు. ఢిల్లీలో ఈ నెలలో ఇప్పటికే సరాసరిని మించి 125.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే ఇది 55 శాతం ఎక్కువ.

జ్యూస్‌లో మూత్రం కలిపిన దుకాణదారుకు దేహశుద్ధి

ఘాజియాబాద్(యూపీ): జ్యూస్ దుకాణం నిర్వాహకుడొకరు నీచమైన పనికి పాల్పడ్డాడు. వినియోగదారులకు పండ్ల జ్యూస్‌లో మూత్రం కలిపి ఇస్తూ అడ్డంగా బుక్కయ్యాడు. ఈ ఘటన యూపీలోని ఘాజియాబాద్‌లో చోటుచేసుకుంది. అమిర్ ఖాన్ అనే వ్యక్తి ఖుషీ జ్యూస్ కార్నర్ నడుపుతున్నాడు. శుక్రవారం కొందరు వినియోగదారులు తమకిచ్చిన పండ్ల జ్యూస్ గ్లాసుల్లో అతడు పచ్చని ద్రావకం కలపడం గమనించారు. అనుమానం వచ్చి పరిశీలనగా చూడగా మూత్రం వాసన వస్తోంది. దీంతో, ఆగ్రహంతో అతడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. దుకాణంలో తనిఖీ చేయగా మూత్రం నింపిన ప్లాస్టిక్ క్యాన్ ఒకటి దొరికింది.

అండర్‌పాస్ వరదలో వాహనం బ్యాంక్ మేనేజర్, క్యాషియర్ మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీ–దేశ రాజధాని ప్రాంతంలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో ఫరీదాబాద్ అండర్ పాస్‌లో వరద నీరు నిలిచింది. అండర్ పాస్ గుండా వెళ్లేందుకు ప్రయత్నించిన ఎస్‌యూవీ వరదలోనే నిలిచిపోయింది. అందులో ఉన్న బ్యాంక్ మేనేజర్, క్యాషియర్ ప్రాణాలు కోల్పోయారు. పాత ఫరీదాబాద్ అండర్ పాస్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఘటన చోటుచేసుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ గురుగ్రామ్ శాఖ మేనేజర్, క్యాషియర్ శుక్రవారం రాత్రి ఇళ్లకు బయలుదేరారు. అయితే, భారీ వర్షం కారణంగా వారు వెళ్లే మార్గంలోని అండర్‌పాస్‌లో భారీగా వరద చేరింది. ఎలాగైనా వెళ్లాలనే తొందరలో వారు వాహనాన్ని ముందుకే నడిపారు. మధ్యలోకెళ్లాక ఎస్‌యూవీ నిలిచిపోయింది. డోర్లు పనిచేయకపోవడంతో ఊపిరాడక ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు.

ఆర్ఎస్ఎస్ నేత హత్య కేసు పీఎఫ్ఐ కార్యకర్తకు హైకోర్టు బెయిల్

తిరువనంతపురం: ఆర్ఎస్ఎస్ నేత హత్య కేసులో నిందితుడిగా ఉన్న నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కార్యకర్త పి.షిహాబ్‌కు కేరళ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. 2022 ఏప్రిల్‌లో పాలక్కాడ్‌కు చెందిన ఆర్ఎస్ఎస్ నేత ఎస్‌కే శ్రీనివాసన్ హత్యకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి పి.షిహాబ్‌కు పీఎఫ్ఐ ఆయుధ శిక్షణ ఇచ్చిందని, ఆ సంస్థ సమావేశాలకు హాజరయ్యాడని ఎన్ఐఏ చార్జిషీటులో పేర్కొంది. నిందితుల బెయిల్ పిటిషన్లపై శనివారం జస్టిస్ ఏకే జయశంకరన్ నంబియార్, జస్టిస్ శ్యాంకుమార్ వీఎంల ధర్మాసనం విచారణ చేపట్టింది. షిహాబ్‌పై చేసిన ఆరోపణలకు ఎటువంటి ఆధారాలు లేవని పేర్కొంటూ ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది.

కాంట్రాక్టర్‌ను బెదిరించిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే అరెస్ట్

బెంగళూరు: కాంట్రాక్టర్‌ను కులం పేరుతో దూషించి, బెదిరింపులకు గురిచేసిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నను పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరులోని రాజరాజేశ్వరి నగర్ ఎమ్మెల్యే మునిరత్నపై కాంట్రాక్టర్ చెల్వరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. లంచం ఇవ్వాలంటూ తనను మునిరత్న బెదిరించారని చెల్వరాజు ఆరోపించారు. మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన ఒక వీడియోను కూడా చెల్వరాజు ప్రదర్శించారు. అదేవిధంగా, చంపుతామంటూ మునిరత్నతోపాటు ఆయన సహాయకుడు వీజీ కుమార్, భద్రతా సిబ్బంది అభిషేక్, వసంత్ కుమార్ బెదిరించారంటూ మునిరత్న ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైంది. కులం పేరుతో దూషించినందుకు మరో కేసు నమోదైంది.

మధ్యప్రదేశ్ ప్రభుత్వ సోయా ఎంఎస్‌పీ ప్రతిపాదనకు కేంద్రం ఓకే

న్యూఢిల్లీ: సోయాబీన్ కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) క్వింటాల్ రూ.4,892కు పెంచాలనే మధ్య ప్రభుత్వం ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించింది. కేంద్రం వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ విషయం తెలిపారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమకు ఈ మేరకు ప్రతిపాదన అందిందని, దానిపై ఆమోద ముద్ర వేశామని వివరించారు. సోయా రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న సమయంలో కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. 'మధ్యప్రదేశ్ సోయా రైతులు ఆందోళన చెందవద్దు. ఎంఎస్‌పీ ధరలకే సోయాబీన్స్ కొంటాం. రైతు కష్టానికి తగు ప్రతిఫలం లభిస్తుంది'అని మంత్రి చౌహాన్ అన్నారు. సోయా సేకరణ ధరను త్వరలోనే ఖరారు చేస్తామన్నారు. ఈ సీజన్‌లో సోయా దిగుబడులు బాగానే ఉన్నా రైతులు మార్కెట్‌లో క్వింటాకు రూ.4 వేలు మాత్రమే పొందుతున్నారని మధ్యప్రదేశ్‌కే చెందిన కేంద్ర మంత్రి కైలాస్ విజయ్ వర్గీయ సైతం ఇటీవల పేర్కొనడం గమనార్హం.

ఇరాన్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

టెహ్రాన్: ఇరాన్ చేపట్టిన ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఇరాన్ పారామిలటరీ రివల్యూషనరీ గార్డ్స్ రూపొందించిన 'ఖయిమ్–100'రాకెట్‌తో శనివారం ఈ ప్రయోగాన్ని చేపట్టడం గమనార్హం. ఇలాంటి రాకెట్‌తో ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం ఇది రెండోసారి. ఇప్పటికే ఇరాన్–పశ్చిమ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇరాన్ చేపడుతున్న ఉపగ్రహ ప్రయోగాలపై పశ్చిమ దేశాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఉపగ్రహాల ముసుగులో బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగాలను ఇరాన్ వేగవంతం చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో ఇరాన్ హమాస్‌కు అండగా నిలుస్తోంది. ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్ భూభాగంపై పలు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది.

మరో 14 మంది పాలస్తీనియన్లు మృత్యువాత

డెయిర్ అల్–బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు యథా ప్రకారం కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి వేర్వేరు ప్రాంతాలపై జరిపిన దాడుల్లో 14 మంది చనిపోయారు. గాజా నగరంలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలో ముగ్గురు మహిళలు, నలుగురు చిన్నారులు సహా 11 మంది ప్రాణాలు కోల్పోగా ఖాన్‌యూనిస్‌లోని ఓ టెంటుపై జరిగిన దాడిలో మరో నలుగురు మృతి చెందారని గాజా పౌర రక్షణ విభాగం తెలిపింది. ఇలా ఉండగా, గాజా ప్రాంతంలో చేపట్టిన పోలియో వ్యాక్సినేషన్ మొదటి విడత డ్రైవ్‌లో 10 ఏళ్లలోపున్న సుమారు 5.60 లక్షల మంది చిన్నారులకు టీకా వేసినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. త్వరలోనే రెండో విడత వ్యాక్సినేషన్ మొదలవుతుందని వెల్లడించింది.

చేతబడి నెపంతో మూకదాడి.. ఇద్దరు మహిళలు మృతి

సూరి(పశ్చిమబెంగాల్): చేతబడి చేస్తున్నారనే అనుమానంతో ఇరుగుపొరుగు వారు కలిసి ఇద్దరు మహిళలను దారుణంగా కొట్టి చంపారు. ఈ ఘటన పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలో చోటుచేసుకుంది. మయూరేశ్వర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిసరాహ్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు కొందరు లొగ్గి కిస్కు, డాలీ సోరెన్ అనే మధ్యవయస్కులైన మహిళలను బయటకు పిలిపించి, వారిని తాళ్లతో కట్టేశారు. వెంత తెచ్చుకున్న కర్రలతో వారిని విపరీతంగా కొట్టడంతో ప్రాణాలు కోల్పోయారు. అనంతరం మృతదేహాలను గ్రామం వెలుపల కాల్వలో పడేశారు. ఈ మేరకు మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో ఓ వీడియో క్లిప్ ఆధారంగా పోలీసులు 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఒక మృతురాలి బంధువు సహా నలుగురికి ఐదు రోజులు, మిగతా వారికి 14 రోజుల కస్టడీ విధించిందని పోలీసులు తెలిపారు. ఘటన వెనుక అసలు కారణాలను తెలుసుకునేందుకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



బల్లేరినా డిప్రిన్స్ హఠాన్మరణం

వాషింగ్టన్: చిన్న వయస్సులోనే అంతర్జాతీయంగా కీర్తిప్రతిష్టలు సంపాదించుకున్న బ్యాలె నృత్య కళాకారిణి మిఖెలా మబింటీ డి ప్రిన్స్ హఠాన్మరణం చెందారు. ఈమె వయస్సు 29 ఏళ్లు. ఈ విషాద వార్తను ఆమె ప్రతినిధి డిప్రిన్స్ ఇన్‌స్టా పేజీలో ప్రకటించారు. తనను గురించి తెలిసిన, విన్న అందరికీ ఒక మర్చిపోలేని స్ఫూర్తిని మిగిల్చిన డిప్రిన్స్ ఇక లేరని ఆమె కుటుంబం తెలిపింది. కారణాలను మాత్రం వెల్లడించలేదు. 1995లో ఆఫ్రికాలోని సంక్షుభిత సియోర్రా లియోన్‌లో జన్మించిన డిప్రిన్స్ తల్లిదండ్రులు అంతర్యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. నాలుగేళ్ల పసి ప్రాయంలోనే అనాథాశ్రమంలో చేరాల్సి వచ్చింది. అక్కడి వారంతా తల్లిదండ్రులు లేని, విటిలిగో అనే చర్మ వ్యాధితో బాధపడుతున్న తనను 'దెయ్యం బిడ్డ'గా పిలుస్తుండేవారని చిన్ననాటి రోజులను గుర్తుకు తెచ్చుకునేవారు. అమెరికాలోని న్యూజెర్సీకి చెందిన జంట దత్తత తీసుకున్నాక ఆమె జీవితమే మారిపోయింది. వారు ఆమె ప్రతిభను గుర్తించి, బ్యాలెట్ క్లాసులకు పంపించారు. హార్లెంలోని డ్యాన్స్ స్కూల్‌లో అతిచిన్న వయస్సులోనే ప్రధాన డ్యాన్సర్‌గా ఎదిగి ఆమె చరిత్ర సృష్టించారు. ప్రతిష్టాత్మక బోస్టన్ బ్యాలెలో 2021లో చేరారు. 17 ఏళ్లకే డ్యాన్సింగ్ విత్ ది స్టార్స్ అనే టీవీ షోలో ప్రదర్శన ఇచ్చారు. గాయని బియోన్స్ 'లెమొనేడ్'ఆల్బంలోనూ డిప్రిన్స్ ఉన్నారు.

నవతరం నాయకురాలిని

- టీవీ ఇంటర్వ్యూలో కమలా హారిస్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే తాను భిన్నమైన నేతనని, 'నవతరం నాయకత్వాన్ని'అందిస్తానని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అన్నారు. మార్పుకు ప్రతినిధిగా అమెరికన్ల ముందు తనను తాను ఆవిష్కరించుకుంటున్న డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ నవంబరు 5న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో తలపడుతున్న విషయం తెలిసిందే. ఫిలడెల్ఫియాలో శుక్రవారం హారిస్ ఒక టీవీకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ట్రంప్ విద్వేష, విభజన రాజకీయాలతో అమెరికన్లు విసిగిపోయారన్నారు. తనకు తుపాకీ ఉందని, ఎవరి తుపాకీ హక్కులను తాను హరించాలనుకోవడం లేదని తెలిపారు. అసల్ట్ స్టైల్ ఆయుధాలపైనే నిషేధం తప్పనిసరని తాను భావిస్తున్నారు. బైడెన్‌కు మీరెలా భిన్నమో చెప్పాలని యాంకర్ బ్రియాన్ టాఫ్ అడగ్గా.. 'నైతే జో బైడెన్‌ను కాను. నవతరం నాయకత్వాన్ని అందిస్తా'అని కమలా హారిస్ స్పందించారు. గతంలో ఆ నడిచిపోతుందిలే అని తేలికగా తీసుకున్న అంశాలను ఇకపై ఎవరూ నిర్లక్ష్యం చేయలేరన్నారు. పిల్లల సంరక్షణ కోసం తల్లిదండ్రులకు ఇచ్చే చైల్డ్ ట్యాక్స్ క్రెడిట్‌ను 6 వేల డాలర్లకు పెంచుతానన్నారు. ఒకరినొకరు వేలెత్తి చూపుకునేలా ప్రోత్సహిస్తున్న నాయకుడిలా (ట్రంప్‌లా) కాకుండా అమెరికన్లను ఏకతాటిపై నడిపే నాయకత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తనకు తెలుసన్నారు.

బీజేపీ హ్యాట్రిక్ ఖాయం: మోదీ

కురుక్షేత్ర: బీజేపీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని హరియాణా నిర్ణయించుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అక్టోబరు 5న జరిగే హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు మోదీ శనివారం కురుక్షేత్ర నుంచి తన ప్రచారాన్ని ప్రారంభించారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి (మోదీ 3.0) ఇంకా 100 రోజులు కాకముందే రూ.15 లక్షల కోట్ల విలువైన పనులను మొదలుపెట్టామన్నారు. హరియాణాలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలను విమర్శిస్తూ.. 'కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పనులకు కేటాయించే నిధులు ఒక్క జిల్లాకే పరిమితమైన రోజులను చూశాం. బీజేపీ మాత్రం సమదృష్టితో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసింది'అని మోదీ పేర్కొన్నారు. దేశంలో అరాజకత్వం, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడానికే కాంగ్రెస్ రాజకీయాలు పరిమితమయ్యాయని ధ్వజమెత్తారు. అర్బన్ నక్సల్‌కు కాంగ్రెస్ కొత్త రూపుగా మారిందని, నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడుతోందని అన్నారు. కనీస మద్దతు ధరపై కాంగ్రెస్ గగ్గోలు పెట్టిందని.. కర్ణాటక, తెలంగాణలలో మీరెన్ని పంటలను కనీస మద్దతు ధరకు కొంటున్నారో చెప్పాలని నిలదీశారు.

డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్‌తో బహుళ ప్రయోజనాలు..



బయోటెక్నాలజీ

జీవులు, వాటి కణాలు, కణజాలాలు, జన్యువులను మానవాళి సంక్షేమానికి వినియోగించే శాస్త్ర సాంకేతిక రంగమే జీవసాంకేతిక విజ్ఞానం (బయోటెక్నాలజీ). ఈ విజ్ఞాన రంగం మానవ శ్రేయస్సు కోసం మొక్కలు, జంతువులు, సూక్ష్మజీవులను ఉపయోగిస్తుంది. ప్రాచీన కాలం నుంచి బయోటెక్నాలజీ వినియోగంలో ఉంది. జీవులను మచ్చిక చేసుకోవడం మొదలు.. అత్యాధునిక జన్యుథెరపీ వరకు బయోటెక్నాలజీలో ఎన్నో విభాగాలున్నాయి.

కిణ్వనం, పంట విజ్ఞానం, జన్యు ఇంజినీరింగ్, రీకాంబినెంట్, డీఎన్‌ఏ టెక్నాలజీ, కణజాల వర్ధనం, ట్రాన్స్‌జెనిక్స్, డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్, క్లోనింగ్, బయోఇన్ఫర్మేటిక్స్, జన్యుథెరపీ మొదలైనవి బయోటెక్నాలజీలోని ముఖ్య విభాగాలు.

కిణ్వనం

అతి ప్రాచీన జీవసాంకేతిక విజ్ఞాన రంగం కిణ్వనం. క్రీ.పూ.8000 నాటికే నైలునది తీరంలో నివసించిన ప్రజలు కిణ్వన పద్ధతిలో మత్తు పానీయాలు తయారు చేశారు. కిణ్వన ప్రక్రియలోని మౌలిక సూత్రాలపై అవగాహన లేకుండానే వీరు ఈ ప్రక్రియను ఉపయోగించారు. వైదిక కాలంనాటి సోమ, సుర అనేవి కూడా కిణ్వన పానీయాలే. 1850లలో ఫ్రాన్స్‌కు చెందిన లూయీ పాశ్చర్ తొలుత కిణ్వన ప్రక్రియకు సంబంధించిన మౌలిక సూత్రాలను తెలిపాడు. లాటిన్ భాషలోని 'ఫెవిర' అనే పదం నుంచి కిణ్వనం (ఫర్మెంటేషన్) అనే పదం వచ్చింది. పదార్థం పులిసి నురుగుతో పాటు పొంగడాన్ని ఫెవిర అంటారు. కిణ్వన ప్రక్రియ సూక్ష్మజీవుల ద్వారా జరుగుతుందని లూయి పాశ్చర్ తొలిసారిగా నిరూపించాడు. నాణ్యమైన వైన్ తయారీ విధానంలో భాగంగా పాశ్చర్ ఈ విషయాన్ని కనుగొన్నాడు.

'సూక్ష్మజీవుల స్థూల వర్ధనం ద్వారా మానవాళికి ఉపయోగపడే పదార్థాలను పారిశ్రామికంగా ఉత్పత్తి చేయడమే కిణ్వనం'. ఈ పద్ధతిలో ప్రస్తుతం యాంటీబయోటిక్‌లు, ఫార్మిక్ ఆమ్లం, ఎసిటిక్ ఆమ్లం లాంటి కర్బన ఆమ్లాలతోపాటు విటమిన్లను; మిథనాల్, ఇథనాల్, బ్యూటనాల్ లాంటి ఆల్కహాల్ పదార్థాలను; ఆల్డిహైడ్స్, అమైనో ఆమ్లాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, వైద్యం, పాలిమర్, ప్లాస్టిక్, వస్త్ర, డిస్టిలరీస్ పరిశ్రమల్లో ఈ ఉత్పత్తుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. జన్యు ఇంజనీరింగ్‌ను కిణ్వనానికి జోడించడం ద్వారా ఈస్ట్, ఈ-కొలి లాంటి సూక్ష్మజీవుల్లో.. ఇన్సులిన్, పెరుగుదల హార్మోను, ఇంటర్‌ఫెరాన్, రక్తస్కంధన కారకాల్లాంటి ప్రొటీన్లను అధిక మోతాదులో ఉత్పత్తి చేయవచ్చు.

కణజాల వర్ధనం

కృత్రిమ పోషకయానకంపై పరస్థానీయ వాతావరణంలో కణాలు, కణజాలాలను అభివృద్ధి చేసే జీవ సాంకేతిక పరిజ్ఞానమే టిష్యూకల్చర్ లేదా కణజాల వర్ధనం. వృక్ష కణజాల వర్ధనం ద్వారా స్వల్పవ్యవధిలోనే అధిక సంఖ్యలో పిల్లమొక్కలను పెంచడం సాధ్యమవుతుంది.

కృత్రిమ విత్తనాల తయారీ, వైరస్ రహిత పిల్ల మొక్కల అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ, క్రిమి నిరోధక పంటల అభివృద్ధి, విత్తన వర్ధనం మొదలైనవి వృక్ష కణజాల వర్ధనం ద్వారా సాధ్యమవుతాయి. క్యాన్సర్ కణాల అధ్యయనం, క్యాన్సర్ కారకాల గుర్తింపు, పిండాభివృద్ధిలో తలెత్తే వైపరీత్యాల అధ్యయనం, కొత్త మందుల తయారీలో జంతు కణజాల వర్ధనం ఉపయోగపడుతుంది.

ట్రాన్స్‌జెనిక్స్

ఒక జీవి జన్యువులను మరో జీవిలోకి ప్రవేశపెట్టే సాంకేతిక విజ్ఞానమే ట్రాన్స్‌జెనిక్స్. ఇలా ప్రవేశపెట్టే అన్య జన్యువులైన ట్రాన్స్‌జీన్స్ ఫలితంగా గ్రహీత జీవుల్లో జన్యుమార్పిడి జరుగుతుంది. ఈ జీవులు జన్యుమార్పిడి మొక్కలు లేదా జన్యుమార్పిడి జంతువులు కావచ్చు. అధిక పోషక విలువలున్న ఆహార పంటల అభివృద్ధి(ఉదా: అధిక బీటాకెరోటిన్ ఉన్న గోల్డెన్ రైస్), క్రిమినిరోధక పంటల(బీటీ పత్తి) అభివృద్ధి, శుష్కనిరోధక, లవణీయత నిరోధక జన్యుమార్పిడి పంటల అభివృద్ధిలో ట్రాన్స్‌జెనిక్స్ ఉపయోగపడుతుంది. పాలు లేదా రక్తంలో మానవ ప్రొటీన్లను ఉత్పత్తి చేయగల జన్యుమార్పిడి జంతువులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. తక్కువ దాణాతో వేగంగా పెరిగే జన్యుమార్పిడి చేపలను మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సృష్టించారు. తక్కువ కొవ్వు ఉన్న పాలను ఉత్పత్తి చేసే పశువులు, లాక్టోజ్ రహిత పాలను ఉత్పత్తి చేసే పశువులను ట్రాన్స్‌జెనిక్స్ విజ్ఞానం ద్వారా అమెరికా, యూరప్ దేశాల శాస్త్రవేత్తలు సృష్టించారు. ట్రాన్స్‌జెనిక్స్ ద్వారా పెంపుడు జంతువుల అలంకరణ లక్షణాలను పెంపొందించవచ్చు. ఉదా: మదురై కామరాజ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు జెల్లి ఫిష్‌లోని ఫ్లోరెసెంట్ జన్యువు ఆధారంగా ఫ్లొరెసెంట్ అక్వేరియం చేపలను సృష్టించారు.

డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్

డీఎన్‌ఏలో కొన్ని భాగాలు వేర్వేరు వ్యక్తులకు వేర్వేరుగా ఉంటాయి. ఈ భాగాల ఆధారంగా వ్యక్తి గుర్తింపును నిర్ధారించే ప్రక్రియే డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్. ఈ ప్రక్రియను అలెక్ జెఫ్రిస్ అనే శాస్త్రవేత్త అభివృద్ధి చేశాడు. డీఎన్‌ఏలోని మినీ శాటిలైట్స్, షార్ట్ టాండెమ్ రిపీట్స్, వేరియబుల్ నంబర్ టాండెమ్ రిపీట్స్ లాంటి డీఎన్‌ఏ భాగాలు ఒక్కో వ్యక్తికి ప్రత్యేకంగా ఉంటాయి. ఈ ప్రక్రియలో ఎలక్ట్రోఫోరిసిస్, పాలిమరేజ్ చెయిన్ రియాక్షన్ లాంటి పద్ధతులను వినియోగిస్తారు.

వ్యక్తి గుర్తింపును నిర్ధారించడానికి ఉపయోగిస్తారు కాబట్టి ఫోరెన్సిక్ రంగంలో డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ వల్ల అనేక ఉపయోగాలున్నాయి. మాతృత్వ, పితృత్వ వివాదాల పరిష్కారంలో, తప్పిపోయి చాలా కాలం తర్వాత తిరిగొచ్చిన వారి గుర్తింపును నిర్ధారించడంలో, అత్యాచారం, హత్యకేసుల్లో నిందితుల నిర్ధారణకు, గుర్తుపట్టలేని విధంగా కాలిన లేదా మారిన శవాల గుర్తింపును నిర్ధారించడంలో డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ ఉపయోగపడుతుంది. వన్యజీవుల సంరక్షణకు దీన్ని ఉపయోగిస్తారు. ఒక్కో వ్యక్తికి ప్రత్యేకంగా డీఎన్‌ఏ ప్రొఫైల్ ఉన్నప్పటికీ, ఒక వ్యక్తి ప్రొఫైల్ తన తల్లిదండ్రుల ఆధారంగా ఉండటమే కాక తోబుట్టువులను పోలి ఉంటుంది.

బయోఇన్ఫర్మేటిక్

జీవశాస్త్ర సమాచారాన్ని కంప్యూటర్ల సహాయంతో పొందుపరిచి విశ్లేషించే ఆధునిక సాంకేతిక విజ్ఞానమే బయోఇన్ఫర్మేటిక్. ఇది బయోటెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల కలయిక. బయోఇన్ఫర్మేటిక్‌లో రెండు ప్రధాన విభాగాలు ఉన్నాయి. ఒకటి జీనోమిక్స్, రెండోది ప్రొటియోమిక్స్. ఒక జీవి పూర్తి జన్యుపటాన్ని జినోం అంటారు. దీని విశ్లేషణను జీనోమిక్స్ అంటారు. దీని ద్వారా సమాజాల మధ్య జన్యు సారుప్యతను అర్థం చేసుకోవచ్చు. మానవ ఆవిర్భావం మరింత స్పష్టంగా అర్థమవుతుంది. జినోమిక్స్‌ను ఉపయోగించి భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్లు, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపీడనం తదితర వ్యాధులపై సమాచారాన్ని ముందుగానే పొందవచ్చు. ఒక జీవిలో భిన్న ప్రొటీన్లను అన్నింటిని కలిపి ప్రొటియోం అంటారు. దీని కంప్యూటర్ విశ్లేషణను ప్రొటియోమిక్స్ అంటారు. డ్రగ్ డిజైనింగ్‌లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

మూలకణాల చికిత్స

ప్రస్తుత కాలంలో మూలకణాల ఆధారంగా చికిత్స బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. వివిధ రకాల కణాల్లోకి మారే సామర్థ్యమున్న పూర్వ కణాలను మూలకణాలంటారు. సాధారణంగా మూలకణాలు రెండు రకాలు. అవి.. పిండస్థ మూలకణాలు, ప్రౌఢమూల కణాలు. బ్లాస్టోసిస్ట్ అనే పూర్వ పిండదశలోని లోపలి కణాలు పిండస్థ మూల కణాలు. ఇవి ప్రౌఢ శరీరంలోని 250 భిన్న రకాల కణాల్లోకి మారగల ఫ్లూరీ పొటెన్సీ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి. ప్రౌఢ మానవుడి శరీరంలోని మూలకణాలను ప్రౌఢ మూలకణాలంటారు. ఇవి కొన్ని రకాల కణాల్లోకి మారే మల్టిపొటెన్సీ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి. టైప్-1 డయాబెటిస్, అల్జీమర్స్, పార్కిన్సన్, కొన్ని రకాల క్యాన్సర్లు, థలసేమియా లాంటి వ్యాధుల చికిత్సలో మూలకణాలను ఉపయోగించవచ్చు. శిశువు జన్మించినప్పుడు, బొడ్డుతాడు రక్తాన్ని భద్రపరిచి భవిష్యత్తులో ఉపయోగించుకోగల కార్డ్ బ్లడ్ బ్యాంకింగ్ విధానం నేడు భారత్‌లో వాడుకలోకి వచ్చింది. గుండెపోటు, బట్టతల, క్రాన్‌వ్యాధి, మస్క్యులార్ డిస్ట్రోఫి లాంటి సమస్యల పరిష్కారంలో కూడా మూలకణాల పరిశోధన ఊపందుకుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఏ ఇద్దరి మధ్య ఒకే రకమైన డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ ఉంటుంది?
   ఎ) అన్నదమ్ముల మధ్య
   బి) అన్ని రకాల కవలల మధ్య
   సి) సమరూప కవలల మధ్య
   డి) అక్కాచెల్లెల మధ్య
2. కింద ఇచ్చిన ఏ రంగంలో లాక్టిక్ ఆమ్లం ఉపయోగపడుతుంది?
   ఎ) ఫార్మా బి) ప్లాస్టిక్
   సి) వస్త్ర డి) పైవన్నీ
3. దేశంలో మొట్టమొదటి స్టెమ్ సెల్ బ్యాంక్ ఎక్కడ ఏర్పాటైంది?
   ఎ) హైదరాబాద్ బి) చెన్నై
   సి) న్యూఢిల్లీ డి) కోల్‌కతా
4. 'సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్'(సీడీఎఫ్‌డీ) ఎక్కడ ఉంది?
   ఎ) బెంగుళూరు బి) పుణే
   సి) లక్నో డి) హైదరాబాద్
5. క్లోనింగ్ పద్ధతిని ఉపయోగించి ప్రపంచంలో తొలిసారిగా సృష్టించిన గేదె పేరు?
   ఎ) గరీమ బి) ప్రొమీటియ
   సి) సంరూప డి) హాలీ
6. మూలకణాల చికిత్సలో శిక్షణ కోసం ఉద్దేశించిన 'ఇన్‌స్టెమ్' అనే సంస్థ ఎక్కడ ఏర్పాటైంది?
   ఎ) బెంగుళూరు బి) చెన్నై
   సి) కాన్పూర్ డి) విశాఖపట్నం
7. క్లోనింగ్ పద్ధతిలో సంరూప, గరిమ అనే గేదెలను సృష్టించింది?
   ఎ) నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   బి) ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   సి) సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ
   డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్
8. మూలకణాల పరిశోధనలో రీప్రోగ్రామింగ్ పద్ధతిని అభివృద్ధి చేసి, 2012లో నోబెల్ బహుమతి పొందినవారు?
   ఎ) జాన్ గర్డన్, రోజర్ కార్న్‌బెర్గ్
   బి) ఎడ్వర్డ్ మోసర్, మేబ్రిట్ మోసర్
   సి) జాన్ గర్డన్, షిన్య యమనక
   డి) షిన్య యమనక, మే బ్రిట్ మోసర్
9. కృత్రిమ గర్భధారణ(ఆర్టిఫీషియల్ ఇన్‌సెమినేషన్) పద్ధతిలో స్పాటీ అనే మచ్చల జింకను, బ్లాకీ అనే నల్లజింకను సృష్టించింది?
   ఎ) నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్
   బి) సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ
   సి) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్
   డి) ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
10. భారత్‌లో క్లోనింగ్ ద్వారా సృష్టించిన 'నూరీ' అనేది?
   ఎ) గొర్రె బి) మేక
   సి) గాడిద డి) కోతి
11. క్లోనింగ్ ద్వారా సృష్టించిన గుర్రం?
   ఎ) లాంగీ బి) ప్రొమిటియ
   సి) ఇంజాజ్ డి) మాలీ
12. క్లోనింగ్ ప్రక్రియ ఏ పద్ధతిపై ఆధారపడుతుంది?
   ఎ) అలైంగిక ప్రత్యుత్పత్తి
   బి) లైంగిక ప్రత్యుత్పత్తి
   సి) శాఖీయ ప్రత్యుత్పత్తి
   డి) పైవన్నీ
13. భారత్‌లో తొలిసారిగా దతుర (ఉమ్మెత్త) పరాగ రేణువుల వర్ధనాన్ని నిర్వహించింది?
   ఎ) పి. మహేశ్వరి బి) సుభాష్ కశ్యప్
   సి) ఎం.ఒ.పి. అయ్యంగార్
   డి) ఎవరూ కాదు
14. మొదటి రేబీస్ టీకాను అభివృద్ధి చేసింది?
   ఎ) లూయి పాశ్చర్ బి) సాక్‌మ్యాన్
   సి) ఎడ్వర్డ్ జెన్నర్ డి) ఎవరూ కాదు
15. జన్యు ఇంజనీరింగ్ పద్ధతిలో ఉత్పత్తి అవుతున్న మానవ ప్రొటీన్లు?
   ఎ) ఇన్సులిన్
   బి) పెరుగుదల హార్మోన్
   సి) ఇంటర్ ఫెరాన్ డి) పైవన్నీ
16. తొలిసారిగా గోల్డెన్ రైస్‌ను అభివృద్ధి చేసింది?
   ఎ) ఇంగో పాట్రికస్
   బి) పాల్ హాగెవెగ్ సి) ఇయాన్ విల్మట్
   డి) ఫ్రాన్సిస్ క్రిక్

సమాధానాలు

1) సి; 2) డి; 3) బి; 4) డి; 5) సి; 6) ఎ; 7) ఎ; 8) సి; 9) బి; 10) బి; 11) బి; 12) ఎ; 13) ఎ; 14) ఎ; 15) డి; 16) ఎ.

'తెలుగు, కన్నడ ఒకే తల్లికి పుట్టిన కవల పిల్లలు'

తెలుగు భాషా సాహిత్యంపై ఇతర భాషల సాహిత్య ప్రభావం

మాదిరి ప్రశ్నలు

1. సంస్కృతం ఏ భాషా కుటుంబానికి చెందింది?
   1) సినో టిబెటన్ 2) ఇండో ఆర్యన్
   3) టిబెటో బర్మన్ 4) ఇండో జర్మన్
2. మనదేశంలో లిఖిత పూర్వకంగా లభించిన తొలి గ్రంథం?
   1) రుగ్వేదం 2) యజుర్వేదం
   3) సామవేదం 4) యాస్కుని నిరుక్తం
3. 'మానవ మేధాశక్తికి మహత్తర గోపురం పాణిని వ్యాకరణం' అని ప్రశంసించిన వారెవరు?
   1) రైబర్న్ 2) సి.పి. బ్రౌన్
   3) బ్లూమ్ ఫీల్డ్ 4) కాల్డ్వెల్
4. కింది వాటిలో మహాకవి కాళిదాసు నాటకం కానిది ఏది?
   1) అభిజ్ఞాన శాకుంతలం
   2) మృచ్ఛ కటికం
   3) మాళవికాగ్ని మిత్రం
   4) విక్రమోర్వశీయం
5. 'జనని సంస్కృతంబు సకల భాషలకును.. దేశ భాషలందు తెలుగు లెస్స' అని పలికిన కవి?
   1) శ్రీకృష్ణ దేవరాయలు 2) కేతన
   3) నాచన సోమన 4) శ్రీనాథుడు
6. తెలుగు.. సంస్కృత జన్యమని ప్రబలంగా వాదించిన పండితుడు ఎవరు?
   1) వేటూరి ప్రభాకరశాస్త్రి
   2) చిలుకూరి నారాయణ రావు
   3) రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ
   4) విశ్వనాథ సత్యనారాయణ
7. నన్నయ భారతాంధ్రీకరణంలో తత్సమ పదాల శాతం ఎంత?
   1) 50 2) 60 3) 70 4) 80
8. కింది వాటిలో సంస్కృత సమాస భూయిష్ఠమైన నారికేళ పాకంలో లేని కావ్యం ఏది?
   1) శృంగార నైషధం 2) మనుచరిత్ర
   3) ఆముక్తమాల్యద 4) వసుచరిత్ర
9. తెలుగుకు విజాతీయ భాష ఏది?
   1) సంస్కృతం 2) ఇంగ్లిష్
   3) ఉర్దూ 4) పైవన్నీ
10. తెలుగుకు సజాతీయ భాష ఏది?
   1) తమిళం 2) మలయాళం
   3) కన్నడ 4) పైవన్నీ
11. సంస్కృతం తర్వాత తెలుగు సాహిత్యాన్ని అత్యధికంగా ప్రభావితం చేసిన భాష ఏది?
   1) ఇంగ్లిష్ 2) ఉర్దూ
   3) పారశీక 4) తమిళం
12. ఇంగ్లిష్ సాహిత్య ప్రభావంతో తెలుగులో నవల, ప్రహసనం, స్వీయచరిత్ర, జీవిత చరిత్ర లాంటి ప్రక్రియలను రచించిన వారు?
   1) గురజాడ 2) వీరేశలింగం
   3) చిలకమర్తి 4) పానుగంటి
13. పాశ్చాత్య సంస్కరణ దృక్పథానికి ప్రభావితుడై బాల్య వివాహాలు, కన్యాశుల్కాన్ని నిరసిస్తూ 'కన్యాశుల్కం' నాటకం రాసిన రచయిత?
   1) వీరేశలింగం
   2) కవికొండల వెంకటరావు
   3) గురజాడ 4) దేవులపల్లి కృష్ణశాస్త్రి
14. ఇంగ్లిష్‌లోని రొమాంటిక్ ఉద్యమ ప్రభావంతో తెలుగులో వచ్చిన కవితా ఉద్యమం?
   1) అభ్యుదయ కవిత్వం
   2) భావ కవిత్వం 3) సంస్కరణ కవిత్వం
   4) విప్లవ కవిత్వం
15. తెలుగు భాషా వ్యవహర్తల నిత్య జీవిత వ్యవహారంలో మిళితమైన రోడ్డు, రైలు, బస్సు, పేపరు, గన్ను, పెన్ను లాంటి పదాలను నవీన తత్సమాలుగా పేర్కొన్న పండితులు?
   1) సి.పి. బ్రౌన్
   2) కొత్తపల్లి వీరభద్రరావు
   3) బొడ్డుపల్లి పురుషోత్తం 4) టి.అక్కిరెడ్డి
16. 'తెలుగు సాహిత్యంపై ఇంగ్లిష్ ప్రభావం' గ్రంథకర్త ఎవరు?
   1) జి.వి. సుబ్రహ్మణ్యం
   2) కొత్తపల్లి వీరభద్రరావు
   3) టి.అక్కిరెడ్డి 4) యల్. చక్రధర రావు
17. ఔత్తరాహ (ఉత్తరాది) భాషల్లో హిందీ తర్వాత ప్రముఖమైంది?
   1) గుజరాతీ 2) మరాఠీ
   3) ఉర్దూ 4) పంజాబీ
18. ముస్లిం ప్రభువుల పాలనా శిబిరాల్లో పుట్టిన భాష ఏది?
   1) అరబ్బీ 2) ఉర్దూ
   3) హిందీ 4) హిందూస్తానీ
19. 1835లో ఉర్దూను 'రాజభాష'గా ప్రకటించిన పాలకులెవరు?
   1) ఫ్రెంచివారు 2) పోర్చుగీసు వారు
   3) బ్రిటిషర్లు 4) మహమ్మదీయులు
20. ఏ భాషా సాహిత్యాన్ని 'దఖానీ' అని పిలుస్తారు?
   1) హిందీ 2) ఉర్దూ
   3) పారశీక 4) అరబ్బీ
21. తెలుగు భాషలో మిళితమైన నవాబు, నౌకరు, తహసీల్దార్, కుర్తా, లంగా, సలాం నమాజు, లాంటి పదాలు ఏ భాషకు చెందినవి?
   1) హిందీ 2) పారశీక
   3) ఉర్దూ 4) అరబ్బీ
22. 'నా కవిత్వంబు నిజము కర్ణాట భాష' అని చెప్పిన ప్రముఖ ప్రాచీన కవి?
   1) పోతన 2) నాచన సోమన
   3) శ్రీనాథుడు 4) నంది తిమ్మన
23. గజల్స్, రుబాయి లాంటి ఆధునిక కవితా రూపాలు ఏ భాషా సాహిత్య ప్రభావంతో తెలుగులో ప్రవేశించాయి?
   1) అరబ్బీ 2) ఒరియా
   3) ఉర్దూ 4) పారశీక
24. కింది వాటిలో ఇంగ్లిష్ ప్రభావం లేని సాహిత్య ప్రక్రియ ఏది?
   1) వ్యాసం 2) నవల
   3) విమర్శ 4) యక్షగానం
25. కింది వాటిలో తెలుగు నుంచి ఇంగ్లిష్‌లోకి ప్రవేశించిన పదం ఏది?
   1) ఎలిఫెంట్ 2) కా 3) క్రో
   4) బాండికూట్ (పందికొక్కు)
26. పర్షియన్ భాష నుంచి దువ్వూరి రామిరెడ్డి అనువదించిన 'గులిస్తాన్' మూల రచయిత ఎవరు?
   1) హఫీజ్ 2) ఉమర్ ఖయామ్
   3) సాదీ 4) జలాలుద్దీన్
27. ఉర్దూ ప్రభావంతో దాశరథి అనువదించిన గ్రంథాలు ఏవి?
   1) గాలిబ్ గీతాలు 2) మీర్జాఫర్ కవితలు 3) రుబాయీలు 4) పైవన్నీ
28. ఉర్దూ ప్రభావంతో సి. నారాయణ రెడ్డి చేపట్టిన ప్రక్రియ ఏది?
   1) గజల్స్ 2) రుబాయీలు
   3) ఖవాలీలు 4) పైవన్నీ
29. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న ప్రముఖ ఉర్దూ ప్రజాకవి?
   1) కిషన్ చంద్ 2) అబ్బాస్
   3) మగ్దూం మొహియుద్దీన్
   4) సాదీక్ హసన్
30. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన 'స్వరలయలు' గ్రంథకర్త ఎవరు?
   1) సామల సదాశివ
   2) దేవులపల్లి రామానుజరావు
   3) దాశరథి రంగాచార్యులు
   4) సి. నారాయణ రెడ్డి
31. ప్రేమ్‌చంద్ ఉర్దూ కథలను అనువదించిన తెలుగు రచయిత?
   1) సామల సదాశివ
   2) మాడపాటి హనుమంతరావు
   3) దాశరథి కృష్ణమాచార్యులు 4) కాళోజీ
32. కింది వారిలో ప్రముఖ ఉర్దూ రచయిత ఎవరు?
   1) ప్రేమ్‌చంద్ 2) ఇక్బాల్ చంద్
   3) రాజేందర్‌సింగ్ బేడీ
   4) పైవారందరూ
33. 'తెలుగుపై ఉర్దూ, పారశీకుల ప్రభావం' గ్రంథ రచయిత?
   1) డాక్టర్ టి. స్వరాజ్య లక్ష్మి
   2) ఆచార్య షేక్ మస్తాన్
   3) ఆచార్య కె. గోపాల కృష్ణారావు
   4) ఆచార్య కె.రుక్నుద్దీన్
34. భారతంలో తిక్కన ప్రయోగించిన పారశీక పదం?
   1) శిస్తు 2) త్రాసు
   3) బందూక 4) ఫిర్కా
35. ప్రాచీన తెలుగు కావ్యాల్లో 900 అన్య దేశ్య పదాలు ఉన్నట్లు భాషావేత్తల అభిప్రాయం. వాటిలో ఏ భాషా పదాలు ఎక్కువగా ఉన్నాయి?
   1) సంస్కృతం 2) ఇంగ్లిష్
   3) అరబిక్, పారశీక 4) కన్నడ
36. గసగసాలు, ఖరీదు, కిస్‌మిస్, సిపాయి, బందూక, ఫిరాయించు లాంటి పదాలు ఏ భాషకు చెందినవి?
   1) ఉర్దూ 2) పారశీక
   3) అరబిక్ 4) మరాఠీ
37. సమానార్థాలు లేకుండా తెలుగులో మిళితమైన పారశీక పదాలు?
   1) ఫిర్కా, కౌలు, కుష్కీ
   2) నకలు, నకాబత్, దివాను
   3) జలతారు, జంబుఖానా, కలంకారీ, దుకాణం
   4) పైవన్నీ
38. రుబాయీలను ఉమర్ ఖయామ్ ఏ భాషలో రచించాడు?
   1) ఉర్దూ 2) అరబ్బీ
   3) పారశీక 4) హిందీ
39. ఒరియా భాష ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో ఎక్కువగా ఉంది?
   1) శ్రీకాకుళం 2) విశాఖపట్టణం
   3) విజయనగరం 4) పైవన్నీ
40. కింది వాటిలో ఒరియా భాషలోకి సరళదాస్ అనువదించిన గ్రంథం ఏది?
   1) రామాయణం 2) మహాభారతం
   3) పురాణాలు 4) పైవన్నీ
41. కింది వారిలో ఒరియా భాషలో అభ్యుదయ కవి ఎవరు?
   1) శేత్రాయ్ 2) సచిన్ రౌత్రాయ్
   3) గోపీనాథ్ మహంతి
   4) పైవారందరూ
42. ఒరియాలో జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన 'శ్రీశ్రీ' లాంటి అభ్యుదయ కవి?
   1) శేత్రాయ్ 2) సచిన్ రౌత్రాయ్
   3) షకీర్ మోహన్ 4) సేనాపతి
43. కింది వారిలో ఒరియా భాషలో ప్రముఖ నవలా రచయిత ఎవరు?
   1) గోపీనాథ్ మహంతి
   2) షకీర్ మోహన్ 3) సేనాపతి
   4) పై వారందరూ
44. ఒరియా నుంచి ప్రసిద్ధమైన గ్రంథాలను తెలుగులోకి అనువదించిన రచయిత?
   1) చాగంటి సోమయాజులు
   2) పురిపండ అప్పలస్వామి
   3) కాళీపట్నం రామారావు
   4) అట్టాడ అప్పలనాయుడు
45. మరాఠీ భాష ప్రభావం తెలంగాణలో ఏయే జిల్లాల్లో ఉంది?
   1) ఆదిలాబాద్ 2) నిజామాబాద్
   3) మెదక్ 4) పైవన్నీ
46. తెలుగులో సమానార్థాలు లేకుండా మిళితమైన మరాఠీ పదాలు ఏవి?
   1) దమ్మిడీ, తపేల 2) పీట, లోట,
   3) డేరా 4) పైవన్నీ
47. పటేలు, పట్వారీ, రాహుతు లాంటి పదాలు ఏ భాషకు సంబంధించినవి?
   1) ఒరియా 2) ఉర్దూ
   3) మరాఠీ 4) కన్నడ
48. తెలుగులో నామవాచక అనుబంధాలుగా పేరుకు చివర రావు, పంతులు లాంటి పదాలు ఏ భాషా ప్రభావంతో చేరాయి?
   1) ఒరియా 2) మరాఠీ
   3) పారశీక 4) ఉర్దూ
49. తెనాలి రామకృష్ణుడు ఏ భాషా సాహిత్యం ప్రేరణతో 'పాండురంగ మహాత్మ్యం' గ్రంథం రాశాడు?
   1) ఒరియా 2) సంస్కృతం
   3) మరాఠీ 4) పారశీక
50. 'తెలుగు, కన్నడ భాషలు ఒకే తల్లికి పుట్టిన కవల పిల్లలు' అని వర్ణించిన ప్రముఖ పండితుడు ఎవరు?
   1) రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ
   2) నిడదవోలు వెంకట్రావు
   3) సి.ఆర్. రెడ్డి
   4) ఆర్.వి.ఎస్. సుందరం
51. సానె గురూజీ మరాఠీ గీతాలను తెలుగులోకి అనువదించిన రచయిత?
   1) దాశరథి 2) కాళోజీ
   3) పి.వి. నరసింహారావు
   4) చెర్విరాల భాగయ్య
52. కింది వాటిలో తమిళభాషకు పర్యాయ పదం ఏది?
   1) ద్రావిడం 2) తమిబ
   3) అరవం 4) పైవన్నీ
53. తెలుగు భాషను 'సుందర తెలుంగు' అని ప్రశంసించిన కవి?
   1) పంప 2) రన్న
   3) సుబ్రహ్మణ్య భారతి 4) కేశవ నాయర్
54. 'కన్నడ రత్నత్రయం'గా ప్రసిద్ధి చెందిన కవులు?
   1) పంప - పొన్న - విజయ
   2) పొన్న - రన్న - విజయ
   3) పంప - పొన్న - రన్న
   4) పంప - రన్న - విజయ
55. పి.వి. నరసింహారావు 'అబల జీవితం' అనే మరాఠీ నవలను తెలుగులోకి అనువదించారు. దాని మూల రచయిత ఎవరు?
   1) గంగాధర గాడ్గిల్
   2) హరినారాయణ ఆప్టే
   3) వసుంధర పట్వారీ
   4) గుండేరావు హర్కారే

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఇంగ్లిష్ ప్రభావంతో తెలుగులో భాగమైన ఫ్యాషన్, డాన్స్, సినిమా, ఫ్యాన్స్ తదితర పదాలు..? (L.P.-2015)
   1) వ్యాపార సంబంధమైనవి
   2) సాంస్కృతిక సంబంధమైనవి
   3) రాజకీయ సంబంధమైనవి
   4) విద్యాసంబంధమైనవి
2. మరహమత్/మర్హమత్ అనే పర్షియన్ పదానికి అర్థం? (L.P.-2015)
   1) మార్చడం 2) మతిమరుపు
   3) దయ కలిగి ఉండటం
   4) కఠినంగా ఉండటం
3. 'ఎకిమీడు' అనే పదాన్ని తెలుగుకు అందించిన భాష? (L.P.-2015)
   1) హిందీ 2) పర్షియన్
   3) ఇంగ్లిష్ 4) కన్నడ
4. 'చాకిరి' అనేది ఏ భాషాపదం? (L.P.-2012)
   1) ఉర్దూ 2) తమిళం
   3) కన్నడ 4) మలయాళం
5. 100 సంఖ్యను సూచించే తెలుగు శబ్దాల్లో ప్రాఙ్నన్నయ యుగ శాసనభాషలో కనిపించని శబ్దం? (L.P.-2012)
   1) వంద 2) నూఱు
   3) శతం 4) నూట
6. 'జమిలి' శబ్దానికి మూలరూపమైన 'యమల' అనేది ఏ భాషాపదం? (L.P.-2012)
   1) సంస్కృతం 2) తమిళం
   3) మలయాళం 4) కన్నడ
7. దువ్వూరి రామిరెడ్డి రచించిన 'పండ్లతోట'కు మూలకావ్యం ఏది? (S.A.-2015)
   1) షానామా 2) గులిస్తాన్
   3) బోస్తాన్ 4) బహారిస్తాన్
8. తెలుగులో ప్రస్తుతం వాడుకలో ఉన్న లైట్, స్విచ్, కాఫీ, అనే ఇంగ్లిష్ పదాలు..? (S.A.-2012)
   1) సాంస్కృతిక సంబంధమైనవి
   2) వ్యాపార సంబంధమైనవి
   3) నిత్యావసర సంబంధమైనవి
   4) రాజకీయ సంబంధమైనవి

సమాధానాలు

1) 2 2) 1 3) 2 4) 1 5) 1 6) 1 7) 2 8) 3

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

సమాధానాలు

1) 2	2) 4	3) 3	4) 2	5) 4
6) 2	7) 4	8) 2	9) 4	10) 4
11) 1	12) 2	13) 3	14) 2	15) 3
16) 2	17) 3	18) 2	19) 3	20) 2
21) 3	22) 3	23) 3	24) 4	25) 4
26) 2	27) 4	28) 4	29) 3	30) 1
31) 2	32) 4	33) 3	34) 2	35) 3
36) 2	37) 4	38) 3	39) 4	40) 4
41) 4	42) 2	43) 4	44) 2	45) 4
46) 4	47) 3	48) 2	49) 3	50) 2
51) 2	52) 4	53) 3	54) 3	55) 2

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
ఆదివారం । 15-9-2024

మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

క్యాలెండర్ చాప్టర్ నుంచి ప్రతి పోటీ పరీక్షలో 2 - 5 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక: ఈ చాప్టర్‌లోని ప్రశ్నలు సాధించాలంటే బేసి రోజులను గుర్తించడం తెలిస్తే చాలు.

బేసి దినాలు గుర్తించడం

క్యాలెండర్‌లో రెండు రకాల సంవత్సరాలుంటాయి.

- సాధారణ సంవత్సరంలో 365 రోజులు అంటే 52 వారాలు + 1 రోజు. ఆ మిగిలిన ఒక రోజునే 'బేసిదినం' అంటాం.

గమనిక: ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు రోజులు ఉంటాయి. కాబట్టి ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చిన శేషాన్ని 'బేసి దినాలు'గా గుర్తించాలి.

- లీపు సంవత్సరంలో 366 రోజులు అంటే 52 వారాలు + 2 బేసి దినాలు ఉంటాయి.
గమనిక: లీపు సంవత్సరంలో ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.

లీపు సంవత్సరాన్ని గుర్తించడం

- ఇచ్చిన ఏడాదిలోని చివరి రెండు అంకెల(అంటే ఒకట్లు, పదుల స్థానం)ను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లేకపోతే సాధారణ సంవత్సరం.

శతాబ్దంలోని లీపు సంవత్సరం గుర్తించడం

- శతాబ్దాలన్నీ లీపు సంవత్సరాలు కావు. ఏదైనా ఒక శతాబ్దాన్ని 400 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం.
ఉదా: 400, 800, 1200, 1600, 2000 లీపు సంవత్సరాలు. కానీ 500, 600, 1100, 1500, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కావు.

శతాబ్దం చివరి రోజు వచ్చే వారాలను కనుక్కోవడం

- వంద సంవత్సరాల్లో ఐదు బేసిదినాలు ఉంటాయి. అంటే 76 సాధారణ సంవత్సరాలు + 24 లీపు సంవత్సరాలు ఉంటాయి.
76×1 బేసిదినం + 24×2 బేసిదినాలు
= 76+48 = 124 రోజులు.
124 రోజులను 7తో భాగిస్తే 5 శేషం వస్తుంది. కాబట్టి 100 ఏళ్లలో ఐదు బేసి దినాలు ఉంటాయి. అంటే ఆ రోజు శుక్రవారం.
200 ఏళ్లలో 5×2 = 10ని 7తో భాగిస్తే 3 బేసి దినాలు అంటే బుధవారం.
300 సంవత్సరాల్లో 5×3=15ను 7తో భాగిస్తే 1 బేసిదినం అంటే సోమవారం. 400 సంవత్సరాల్లో 0 బేసిదినాలు అంటే ఆదివారం.

శతాబ్దం చివరి రోజున శుక్రవారం, బుధవారం, సోమవారం, ఆదివారం వస్తాయి.

లీపు సంవత్సరంలో జనవరి, జూలై..

సాధారణ సంవత్సరంలో జనవరి అక్టోబర్ నెలలకు ఒకే విధమైన క్యాలెండర్ ఉంటుంది.

కింద ఇచ్చిన కోడ్స్ సహాయంతో క్యాలెండర్ సమస్యలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

శతాబ్దం - కోడ్

1600-1699→6	2000-2099→6
1700-1799→4	2100-2199→4
1800-1899→2	2200-2299→2
1900-1999→0	2300-2399→0

వారం - కోడ్

ఆదివారం - 0	గురువారం - 4
సోమవారం - 1	శుక్రవారం - 5
మంగళవారం - 2	శనివారం - 6
బుధవారం - 3	

నెల - కోడ్

జనవరి - 0	జూలై - 6
ఫిబ్రవరి - 3	ఆగస్టు - 2
మార్చి - 3	సెప్టెంబర్ - 5
ఏప్రిల్ - 6	అక్టోబర్ - 0
మే - 1	నవంబర్ - 3
జూన్ - 4	డిసెంబర్ - 5

గమనిక: బేసి దినాలను కోడ్స్‌గా రాశాం.

వీటిని జ్ఞాపకం ఉంచుకోవడానికి టిప్స్

- శతాబ్దపు కోడ్‌లను గమనిస్తే 6, 4, 2, 0 పునరావృతం అవుతున్నాయి.
- నెలకోడ్‌లను 12 అంకెల మొబైల్ నెంబర్‌గా గుర్తుపెట్టుకోవాలి.
అది 033 614, 625 035

ఒక తేదీ ఇచ్చి అది ఏ వారమో గుర్తించడానికి కోడ్

తేది + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్

ఉదా: 22-04-1984 ఏ వారం అవుతుంది?

సాధన: పైన ఇచ్చిన కోడ్ ప్రకారం అన్నింటిని కూడాలి.
22 + 6 + 84 + 21 + 0 = 133
133ను 7తో భాగిస్తే శేషం సున్నా.
అంటే కోడ్ ప్రకారం ఆదివారం అవుతుంది.
తేది = 22, ఏప్రిల్ నెలకోడ్ = 6,
సంవత్సరం = 84,
లీపు సంవత్సరాలు 84/4 = 21
శతాబ్దం కోడ్ = 0
అన్నింటిని కూడితే 133 వస్తుంది.

పై విధంగా ప్రాక్టీస్ చేస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించగలం.

సమానమైన క్యాలెండర్‌ను గుర్తించడం

ఉదా:

1. **2003 లాంటి క్యాలెండర్ మళ్లీ ఏ సంవత్సరంలో పునరావృతం అవుతుంది?** (ఎస్ఐ-2012)
ఎ) 2006 బి) 2013
సి) 2012 డి) 2014
జవాబు (డి)

సాధన: ఇచ్చిన సంవత్సరం నుంచి బేసి దినాలను లెక్కిస్తూ పోతే ఎక్కడైతే బేసి దినాల మొత్తం 7 అవుతుందో అది సమానమైన క్యాలెండర్ అవుతుంది. ఒకవేళ బేసిదినాల మొత్తం 7 కాకపోతే 14 వరకు లెక్కించాలి.
2003-1, 2004-2 (లీపు సంవత్సరం)
2005-1, 2006-1
2007-1, 2008-2 (లీపు సంవత్సరం)
2007 వరకు బేసిదినాల మొత్తం = 6
2008 వరకు = 8
కాబట్టి 14 వచ్చే వరకు చూద్దాం.
2009-1 2010-1 2011-1
2012-2 2013-1
2013 వరకు బేసి దినాల మొత్తం = 14
కాబట్టి 2014 జవాబు అవుతుంది.
అంటే 2003 లాంటి క్యాలెండర్ 2014లో వస్తుంది.

తేలిక పద్ధతి:

కోడ్: 6 11 11

స్టెప్1: ముందుగా ఇచ్చిన సంవత్సరానికి ముందు, వెనుక లీపు సంవత్సరాలను గుర్తించాలి.

2000 2001 2002 2003 2004
+ + +
6 11 11
....
2014
....

స్టెప్ 2: వాటికి మధ్య ఉన్న సంవత్సరాలకు 6, 11, 11లను కలిపితే వాటికి సమాన క్యాలెండర్ వస్తుంది.

స్టెప్ 3: మన ప్రశ్నలోని 2003కు 11ను కలిపితే 2014 సమాధానం వచ్చింది.

గమనిక: అడిగిన ప్రశ్నలోని సంవత్సరం లీపు సంవత్సరం అయితే + 28తో కూడాలి.

ఉదా: 2000 లాంటి లీపు సంవత్సరం 2028లో వస్తుంది.

క్యాలెండర్ చాప్టర్ నుంచి ముఖ్యంగా అడిగే ప్రశ్నలు

- ఒక సంవత్సరం ఇచ్చినప్పుడు దానికి సమానమైన సంవత్సరం మళ్లీ ఎప్పుడు పునరావృతమవుతుంది.
- తేదీని ఇస్తే వారాన్ని, వారాన్ని ఇస్తే తేదీని కనుక్కోవడం.
- ఒక లీపు సంవత్సరం ఇచ్చినప్పుడు అలాంటి లీపు సంవత్సరం మళ్లీ ఎప్పుడొస్తుందో గుర్తించడం.
- ఒక సంవత్సరం, తేదీ, వారం ఇచ్చినప్పుడు, మరో ఏడాదిలో అదే తేదీ లేదా వారం ఎప్పుడొస్తుందో కనుక్కోవడం.



మాదిరి ప్రశ్నలు

1. **12 ఫిబ్రవరి, 1991 ఏ వారం అవుతుంది?**
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: తేది + నెలకోడ్ + సం. + లీపు సం. + శతాబ్దం కోడ్‌ను ఉపయోగించాలి.
12 + 3 + 91 + 22 + 0 = 128
(91/4 = 22 లీపు సంవత్సరాలు)
128ను 7తో భాగిస్తే శేషం 2.
కాబట్టి మంగళవారం అవుతుంది.

2. **కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?**
ఎ) 1500 బి) 1700
సి) 1800 డి) 1600
సాధన: ఇచ్చినవన్నీ శతాబ్దాలు కాబట్టి శతాబ్దాన్ని 400తో భాగించాలి. అప్పుడు శేషం సున్నా వస్తే అది లీపు సంవత్సరం అవుతుంది.
400)1600(4
1600

0
శేషం సున్నా
కాబట్టి 1600 మాత్రమే లీపు సంవత్సరం.

3. **1992లో మొదటిరోజు ఏ వారం?**
ఎ) మంగళవారం బి) బుధవారం
సి) గురువారం డి) నిర్ణయించలేం
సాధన: 1992లో మొదటిరోజు అంటే జనవరి 1
కోడ్ ప్రకారం
1 + 0 + 92 + 23 + 0 = 116
116ను 7 తో భాగిస్తే శేషం 4.
అంటే గురువారం అవుతుంది.

4. **మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?**
ఎ) మంగళవారం బి) సోమవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: క్యాలెండర్‌లోని మొత్తం సమస్యలు, కోడ్‌లు వీటన్నింటినీ 1 - జనవరి - 01 సంవత్సరం సోమవారం నుంచి మొదలైనట్లుగానే తీసుకున్నారు.
గమనిక: క్యాలెండర్‌లో మొదటి ఆదివారం 7వ తేది అవుతుంది.
కాబట్టి 1 - జనవరి - 01న సోమవారం అవుతుంది.
కోడ్ ప్రకారం తేదీ + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్
1 + 0 + 1 + 0 + 6 = 8
8ను 7తో భాగిస్తే శేషం 1.
అంటే సోమవారం అవుతుంది.

5. **ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు సమాన క్యాలెండర్ కలిగి ఉంటాయి?**
ఎ) జనవరి, జూన్ బి) జనవరి, ఏప్రిల్
సి) జనవరి, మార్చి డి) నిర్ణయించలేం
సాధన: జవాబు నిర్ణయించలేం (డి)
ఎందుకంటే ఒక సంవత్సరం అని అడిగారు. కానీ అది సాధారణ సంవత్సరమా లీపు సంవత్సరమా ఇవ్వలేదు.

6. **11 - జనవరి - 1996 రోజు ఏ వారం అవుతుంది?**
ఎ) బుధవారం బి) గురువారం
సి) శుక్రవారం డి) శనివారం
సాధన:
కోడ్ ప్రకారం
11 + 0 + 96 + 24 + 0 = 131
131ను 7తో భాగిస్తే శేషం 5 అంటే శుక్రవారం.
కానీ ఇచ్చిన ప్రశ్నలో 1996 లీపు సంవత్సరం. 1996లో జనవరి నెలలోని తేది అడిగారు. ఇది మార్చి నెలకు ముందు కాబట్టి 131-1 = 130ను 7తో భాగించాలి.
అప్పుడు శేషం = 4 అంటే గురువారం అవుతుంది.
శుక్రవారం అనేది తప్పు జవాబు.
గమనిక: ఇచ్చిన ప్రశ్న లీపు సంవత్సరంలోని జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటే బేసిదినాల నుంచి 1ని తీసివేసి మిగిలిన దినాలను 7తో భాగించాలి.

7. **1 మార్చి 1996 రోజు ఏ వారం?**
సాధన:
1 + 3 + 96 + 24 + 0 = 124
124ను 7తో భాగిస్తే 5 శేషం అంటే శుక్రవారం 1996 లీపు సంవత్సరం అయినప్పటికీ బేసి దినాల నుంచి '1' తీసివేయలేదు. ఎందుకంటే కనుక్కోవాల్సింది మార్చి నెలలోని తేది.
ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. కాబట్టి జనవరి, ఫిబ్రవరిలో అడిగిన ప్రశ్నకు బేసి దినాల నుంచి '1' తీసివేయాలి.

8. **2001 జనవరి 1 సోమవారం అయితే ఈ సంవత్సరంలో చివరిరోజు ఏ వారం?**
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన:
2001 సాధారణ సంవత్సరం
= 52 వారాలు + 1 బేసి దినం కాబట్టి సోమవారమే అవుతుంది.

9. **మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?**
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) మంగళవారం
సాధన: మన మొదటి రిపబ్లిక్ డే
26 జనవరి 1950
కోడ్ ప్రకారం
26 + 0 + 50 + 12 + 0 = 88
88ను 7తో భాగిస్తే శేషం 4 వస్తుంది.
అంటే గురువారం అవుతుంది.

What is the code for 'powerful'?

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Study the following information carefully to answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: 43 movement avoidance 85 65 forces radar 24 78 28 position submit 10 severe

Step 1: submit 43 movement avoidance 65 forces radar 24 78 28 position 10 severe 85

Step II: severe submit 43 movement avoidance 65 forces radar 24 28 position 10 85 78

Step III: radar severe submit 43 movement avoidance forces 24 28 position 10 85 78 65

Step IV: position radar severe submit movement avoidance forces 24 28 10 85 78 65 43

Step V: movement position radar severe submit avoidance forces 24 10 85 78 65 43 28

Step VI: forces movement position radar severe submit avoidance 10 85 78 65 43 28 24

Step VII: avoidance forces movement position radar severe submit 85 78 65 43 28 24 10

Step VII is the last step of the above input. As per the rules followed in the above steps, find out in each of the following questions, the appropriate step for the given input.

Input: 38 known disregard 95 62 fact with 14 68 29 variance zone

1. Which step number is the following output:
9 variance with zone 38 known disregard 14 fact 29 95 68 62
1) Step IV 2) Step V
3) Step VI 4) Step III
5) There is no such step

2. Which of the following represents the position of 'disregard' in the fourth step?
1) Eighth from the left
2) Fifth from the right
3) Eighth from the right
4) Seventh from the left
5) None of these

3. Which word/number would be at 6th position from the right in Step II?
1) 14 2) 38 3) variance
4) fact 5) None of these

4. How many elements (words or numbers) are there between 'known' and '38' as they appear in the last step?
1) Three 2) One 3) Four
4) Five 5) Six

5. How many steps would be required to get the final output?
1) Five 2) Six
3) Four 4) Seven
5) None of these

Directions (Q.No. 6 -10): In these questions, the relationship between different elements is shown in the statements. Give answer
(1) If only conclusion I follows.
(2) If only conclusion II follows
(3) If either conclusion I or II follows.
(4) If neither conclusion I nor II follows.
(5) If both conclusions I and II follow.

6. **Statements:** D<M>P, S≤D,X≤P
Conclusion: **I.** X<S **II.** X=S

7. **Statements:** H>M≥P≤S, Q<P, M<L
Conclusion: **I.** L>H **II.** M>Q

8. **Statements:** X=P ≥C < M, K > X
Conclusion: **I.** K > C **II.** K < M

9. **Statements:** A > Y≥Z, P=A, P≤L
Conclusion: **I.** L > Z **II.** Z < A

10. **Statements:** R≤ L<D, R≥N, P=N
Conclusion: **I.** R=P **II.** D < N



Directions (Q. No. 11-15): Study the following information carefully and answer the given

In a certain code language, 'cricket is interesting game' is written as 'la ni ki chu', 'cricket team have eleven players' is written as 'tic ra la dha da', 'team India play fair game' is written as 'su tic va yi chu', and 'India eleven is powerful' is written as 'ju ki su da'.

11. What is the code for 'powerful'?
1) ju 2) ki 3) su
4) da 5) None of these

12. Which of the following may be the code for 'this game have eleven players'?
1) chu va mic ra dha
2) dha ra yi chu zo
3) pit chu da dha ra
4) ra si nic dha chu
5) None of these

13. What is the code for 'play'?
1) yi 2) su
3) va 4) tic
5) Cannot be determined

14. What does 'chu' stand for?
1) team 2) game
3) India 4) is
5) None of these

15. Which of the following is the code for 'cricket India play fair interesting'?
1) sa la ju ni va
2) ni va ju la yi
3) la ni tic su yi
4) yi su la va ni
5) None of these

SOLUTIONS:

(1-5):

In step I, the word that comes last in alphabetical order takes the first position; the largest number takes the last position. In step II the word that comes second from last alphabetically takes the first position; the second largest number goes to the last and so on.

Input: 38 known disregard 95 62 fact with 14 68 29 variance zone

Step I. zone 38 known disregard 62 fact with 14 68 29 variance 95

Step II. with zone 38 known disregard 62 fact 14 29 variance 95 68

Step III. variance with zone 38 known disregard fact 14 29 95 68 62

Step IV. known variance with zone disregard fact 14 29 95 68 62 38

Step V. fact known variance with zone disregard 14 95 68 62 38 29

Step VI. disregard fact known variance with zone 95 68 62 38 29 14

1. 5 **2.** 3 **3.** 4 **4.** 5 **5.** 2

6. 4
S≤D<M>P≥X
X and S cannot be compared. Hence, neither I nor II follows.

7. 2
H > M < L
Hence, H and L cannot be compared. M ≥ P > Q
M>Q. Hence, Conclusion II is true

8. 1
K > X = P ≥ C < M
Hence, K > C. So, conclusion I is true. K and M cannot be compared. So, conclusion II is not true.

9. 5
L ≥ P = A > Y ≥ Z
Hence, L > Z. Conclusion I is true. Hence, A>Z. Conclusion II is also true.

10. 4
R ≥ N = P
Hence, conclusion I is not true.
D > L ≥ R ≥ N
Hence, conclusion II is not true.

(11-15):
- cricket is interesting game → la ni ki chu ...(i)
- cricket team have eleven players → tic ra la dha da ...(ii)
- team India play fair game → su tic va yi chu...(iii)
- India eleven is powerful → ju ki su da ...(iv)

From (i) and (ii), cricket → la
From (i) and (iii), game → chu
From (ii) and (iv), eleven → da
From (iii) and (iv), India → su
From (i) and (iv), is → ki
Now, from (iv), powerful → ju
From (i), interesting → ni
From (ii) and (iii), team → tic
So, from (iii), play fair → va yi
From (ii), have player → ra dha

11. 1 **12.** 3 **13.** 5 **14.** 2 **15.** 4

ఉద్యోగాలు

ఎన్‌హెచ్ఏఐ ఢిల్లీలో అడ్వైజర్ పోస్టులు

ఢిల్లీలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ).. ఒప్పంద ప్రాతిపదికన అడ్వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **పోస్టుల వివరాలు:** జాయింట్ అడ్వైజర్-03, అసిస్టెంట్ అడ్వైజర్-02.
- **విభాగాలు:** ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, జీఐఎస్, సొల్యూషన్ ఆర్కిటెక్చర్, ట్రైనింగ్ అండ్ సపోర్ట్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** జాయింట్ అడ్వైజర్ పోస్టుకు 48 ఏళ్లు, అసిస్టెంట్ అడ్వైజర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు జాయింట్ అడ్వైజర్ పోస్టుకు రూ.1,50,000 నుంచి రూ.1,81,000, అసిస్టెంట్ అడ్వైజర్ పోస్టుకు రూ.1,10,000 నుంచి రూ.1,32,000.

ముఖ్య సమాచారం:
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2024.
- **వెబ్‌సైట్:** https://nhai.gov.in/

ఎన్ఐఈపీఎండీ, చెన్నైలో 13 టీచింగ్ పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ).. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్(కన్సల్టెంట్)-05, అసోసియేట్ ప్రొఫెసర్ (కన్సల్టెంట్)-08.
- **విభాగాలు:** ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, మెడికల్ సైన్స్-మెటీరియల్ అండ్ డెవలప్‌మెంట్, స్పెషల్ ఎడ్యుకేషన్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 56 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం:
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు వెలువడిన తేది:** 29.08.2024.
- **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** https://www.niepmd.tn.nic.in/